

ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 5-2-2019 మంగళవారం సిటీ సంపుటి 45 సంచిక 176

రూ. 6-50. పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



కుదిపేసిన దీదీ దీక్ష

దేశమంతటా బెంగాల్ ప్రకంపనలు

- సంఘీభావం ప్రకటించిన పలు పార్టీలు
- విపక్షాల్ని ఏకం చేసిన మమతా బెనర్జీ
- పార్లమెంటులోనూ కోల్‌కతా ఘర్షణ ప్రభావం
- సీబీఐ పిటిషన్‌పై నేడు సుప్రీంకోర్టు విచారణ

కోల్‌కతా, దిల్లీ

కోల్‌కతా వేడి దేశమంతటికీ తాకింది. సీబీఐ అధికారులు, పశ్చిమ బెంగాల్ పోలీసుల మధ్య తలెత్తిన ఘర్షణ రాజకీయ రగడగా రూపు సంతరించుకుంది. దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. పార్లమెంటును కుదిపేసింది. సీబీఐ తీరుకు నిరసనగా ధర్నాకు కూర్చున్న సీఎం మమతా బెనర్జీ పట్టు వీడలేదు. మెట్టు దిగలేదు. రాత్రంతా కునుకు తీయకుండా ఆమె నిరసన కొనసాగించారు. పలు రాజకీయ పార్టీలు ఆమెకు సంఘీభావం ప్రకటించాయి. ప్రజాస్వామ్యాన్ని ప్రభుత్వం ఖూనీ చేస్తోందంటూ ధ్వజమెత్తాయి. దీంతో ఎన్డీయే వ్యతిరేక పక్షాలు ఏకమయ్యేందుకు ఇదొక వేదికలా మారినట్లు కనిపిస్తోంది.

తాజా వ్యవహారంపై కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రంగానే స్పందించారు. పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభం తలెత్తిందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఎక్కడైనా సరే సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకునే అధికారం కేంద్రానికి ఉందంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్ర గవర్నర్ నుంచి ఆయన ప్రత్యేకంగా నివేదిక తెప్పించుకున్నారు. విపక్షాల విమర్శలను భాజపా దీటుగా తిప్పికొట్టింది. అవినీతి కేసుల్లో ఒకరినొకరు రక్షించుకునేందుకే ప్రతిపక్ష నేతలు మమతకు మద్దతు పలుకుతున్నారంటూ ఎద్దేవా చేసింది. దిల్లీ, కోల్‌కతాల్లో న్యాయస్థానాల్లోనూ సీబీఐ వర్సెస్ పశ్చిమ బెంగాల్ పోలీసుల ఘర్షణ ప్రతిధ్వనించింది. కోల్‌కతా ఎపిసోడ్‌పై సోమవారం విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. మరోవైపు సీబీఐ, కోల్‌కతా పోలీసుల మధ్య ఘర్షణ మరింత ముదురుతోంది. ఇద్దరు సీబీఐ అధికారులకు కోల్‌కతా పోలీసులు సోమవారం తాఖీదులు జారీ చేశారు.

...మిగతా 2లో

కేదస రాజేసిన కుంపటి!

సంపాదకీయం 4లో



కోల్‌కతాలో సోమవారం నిరసన ప్రాంగణంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

యావద్దేశం

యాదాద్రి రావాలె

దేశంలోని ప్రతి ఒక్కరూ ఒక్కసారైనా ఈ క్షేత్రం సందర్శించేలా ఉత్సుకత కల్పించాలి

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని సుమనోహరంగా తీర్చిదిద్దాలి
- 302 ఎకరాల్లో దేవాలయ ప్రాంగణం
- 11 రోజులపాటు సహస్రాష్టక మహాయాగం
- రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖులకు ఆహ్వానం
- అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశం
- 10 గంటల పాటు విస్తృతంగా సమీక్ష

ఈనాడు, హైదరాబాద్: యాదాద్రిని అబ్బురమనిపించేలా.. అద్భుత కళానైపుణ్యంతో తీర్చిదిద్దాలని, ఆధ్యాత్మికత, ఆలయ ప్రాశస్త్యం ఉట్టి పడాలని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు. పునరుద్ధరణ పనులు అత్యంత వైభవంగా, పటిష్ఠంగా, నాణ్యంగా జరగాలని, ప్రతీ అంగుళంపైనా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

...మిగతా 2లో



3లో

కోనరావుపేట మండలం మల్కంపేటలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

మాల్యా అప్పగింతకు అంగీకారం

- అధికారిక పత్రాలపై సంతకాలు చేసిన బ్రిటన్ హోంమంత్రి
- హైకోర్టును ఆశ్రయించడానికి మాల్యాకు గడువు

2లో



ఉపాధ్యాయ ఏకీకృత నిబంధనలు... హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే

- పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల హర్షం


11లో



అన్నీ తెలుసుకొనే అమెరికాలో అడుగుపెట్టండి

చదువుల కోసం అమెరికాలోకి ప్రవేశించి వీసాల నిబంధనలను ఉల్లంఘించారని మన విద్యార్థుల్లో కొందరిని అక్కడి ప్రభుత్వం అరెస్టు చేసింది. ఈ నేపథ్యంలో అమెరికాలో విద్య కోసం యూనివర్సిటీలను ఎంచుకునే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణుల సూచనలు...

నేటి చదువు పేజీలో



50% వీవీప్యాట్‌లను లెక్కించాలి



ప్రధాన ఎన్నికల కమిషనర్‌తో సోమవారం భేటీ అనంతరం దిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బీఎస్పీ నాయకుడు సతీశ్‌చంద్ర మిశ్ర, సీనియర్ కాంగ్రెస్ నేత గులాం నబీ ఆజాద్, సీపీఎం నేత టీకే రంగరాజన్, ఎస్పీ నాయకుడు రామ్‌గోపాల్ యాదవ్ తదితరులు

16లో

ఈవీఎంలతో వాటిని సరిపోల్చాలి

- ఓట్ల ఆధిక్యం 5% కంటే తక్కువైతే అన్నింటినీ లెక్కించాలి
- తేడా వస్తే వీవీప్యాట్‌ల సంఖ్యనే పరిగణనలో తీసుకోవాలి
- కేంద్ర ఎన్నికల సంఘానికి 23 రాజకీయ పార్టీల డిమాండ్
- సాధ్యాసాధ్యాలు ఆధారంగా నిర్ణయిస్తామన్న ఈసీ



రహదారులపై నిరంతర నిఘా

- జాతీయ, రాష్ట్ర మార్గాల్లో ప్రతి 800 కిలోమీటర్లకు ఒక బృందం
- ప్రతి బృందంలో రహదారులు-భవనాలు.. రవాణా, పోలీసు, వైద్య విభాగ అధికారులు
- తొలిదశలో 15 నుంచి 20 బృందాలు

3లో

కుటుంబమే యూనిట్

భార్య, భర్త, ఇద్దరు పిల్లలకు కలిపి అయిదెకరాల లోపు ఉంటేనే పీఎం-కిసాన్‌కు అర్హత

ఫిబ్రవరి 1 లోగా భూ యాజమాన్య హక్కులున్న వారికే లబ్ధి

ఈనాడు-అమరావతి, దిల్లీ

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) మంజూరుకు రైతు కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోనున్నారు. 2018 డిసెంబరు 1 నుంచి వర్తింప చేయనున్న ఈ పథకానికి ఈ ఏడాది ఫిబ్రవరి 1 నాటికి ఉన్న భూ దస్త్రాలనే పరిగణనలోకి తీసుకుంటారు. పథకం అమలుకు సంబంధించి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాసింది. అర్హులైన రైతుల గుర్తింపు ప్రక్రియను వేగంగా పూర్తి చేసి త్వరగా లబ్ధి కలిగేలా చూడాలని సూచించింది. దీనిపై విడతల వారీగా సమావేశాలు నిర్వహించి ఎప్పటికప్పుడు విధివిధానాలు తెలియజేస్తామని స్పష్టంచేసింది. ఇందులో ప్రధానాంశాలు..

- ఒక్కో రైతు కుటుంబానికి ఏడాదికి రూ. 6000 మొత్తాన్ని మూడు విడతలుగా (నాలుగు నెలలకోసారి రూ. 2 వేల చొప్పున) అందిస్తారు.



1. 12. 2018 నుంచి 31. 3. 2019 కాలానికి ఒక విడత మొత్తాన్ని మార్చి నెలాఖరు నాటికి రూ. 2 వేలు ఇస్తారు.

- కుటుంబం అంటే భర్త, భార్య, ఇద్దరు పిల్లలు (18 ఏళ్లలోపు). వీరందరికీ కలిపి అయిదెకరాల లోపు సొంత సాగుభూమి ఉండాలి. అలాగైతేనే అర్హులు.
- లబ్ధిదారుల ఎంపికకు రాష్ట్రాల్లో ఉండే భూ దస్త్రాల నమోదు విధానాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు.

...మిగతా 2లో

ఇదీ సంగతి!



రైతుల వివరాలివ్వండి

- ఈ నెల ఒకటి నాటికి ఆన్‌లైన్‌లో నమోదైన అన్నదాతల వివరాలు సమర్పించండి
- రెవెన్యూశాఖకు రాష్ట్ర వ్యవసాయశాఖ లేఖ
- రైతు ఖాతాలో రూ.6 వేల పథకానికి కసరత్తు

2లో

TG

కుదిపేసిన దీదీ దీక్ష

(మొదటి పేజీ తరువాయి)

దీదీ(మమత)కి మద్దతుగా పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసనలు చేపట్టారు.

దీదీ.. రాత్రంతా మేల్కొనే..

సీబీఐ అధికారుల తీరుకు నిరసనగా ఆదివారం రాత్రి 8:30కి ధర్నా ప్రారంభించిన మమత.. కొంత మంది మంత్రులు, పార్టీ నేతలతో కలిసి రాత్రంతా మేల్కొనే ఉన్నారు. రాత్రి భోజనం కూడా చేయలేదు. ధర్నా వేదిక వద్ద "విపత్తు నుంచి రాజ్యాంగాన్ని రక్షించండి, సమాఖ్య నిర్మాణాన్ని కాపాడండి, పోలీసు బలగాలను రక్షించండి, ఐఏఎస్ సహా అన్ని హోదాల్లోని సివిల్ సర్వీసు అధికారులను కాపాడండి" అని రాసి ఉన్న బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం కూడా మమత ధర్నా వేదిక వద్దే ఉన్నారు. పరిపాలనా వ్యవహారాలనూ అక్కడి నుంచే చూసుకున్నారు. ధర్నా వేదికకు దాదాపు కిలోమీటరు దూరంలో రాష్ట్రస్థాయి రైతు సదస్సు జరగగా.. ఫోన్‌లోనే మమత ప్రసంగించారు. పోలీసులకు వార్షిక అవార్డుల ప్రదానోత్సవాన్ని ధర్నా వద్దే నిర్వహించారు. వాస్తవానికి ఈ కార్యక్రమం అలీపూర్‌లో జరగాల్సింది. కార్ల కర్మాగారం ఏర్పాటుకోసం గత వామపక్ష ప్రభుత్వం సింగూరులో తలపెట్టిన భూసేకరణకు నిరసనగా 2006 డిసెంబరులో తాను 26 రోజులపాటు నిరాహార దీక్ష చేపట్టిన వేదిక వద్దే(స్థానిక 'మెట్రో సినిమా'కు ఎదురుగా) మమతా బెనర్జీ ఇప్పుడు ధర్నాకు కూర్చోవడం గమనార్హం.

ఆ సాక్ష్యాధారాలను పునరుద్ధరించొచ్చు: సుప్రీంకోర్టు

కోల్‌కతా సంఘటనపై అత్యవసరంగా విచారణ చేపట్టాలని కోరుతూ సీబీఐ సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ మేరకు రెండు పిటిషన్లను సమర్పించింది. అవేంటంటే..

1. తక్షణమే లొంగిపోవాలని పోలీసు కమిషనర్‌ను ఆదేశించాలి. ఏ ఆధారాన్ని ధ్వంసం చేయకూడదు, మార్పు చేయకూడదంటూ తక్షణమే ఉత్తర్వులు ఇవ్వాలి.
2. దర్యాప్తు జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించగా దానికి సహకరించకుండా పోలీసు కమిషనర్ కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్నారు. ఈ విషయమై ఆయనపై చర్యలు తీసుకోవాలి.

ఈ పిటిషన్లపై సోమవారం భోజన విరామం అనంతరమే విచారణ జరపాలని కోరగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి, జస్టిస్ సంజీవ్ ఖన్నాలతో కూడిన ధర్మాసనం అందుకు తిరస్కరించింది. మంగళవారం ఉదయం విచారణ చేపడతామని వెల్లడించింది.

అంతకుముందు, సీబీఐ తరఫున పిటిషన్లు సమర్పించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ "యూనిఫారం ధరించిన వ్యక్తులు రాజకీయ పార్టీతో ధర్నాలో కూర్చొని అర్ధరాత్రి 2 గంటల సమయంలో సమస్యను విన్నారు. దీనిని గమనించండి. సాక్ష్యాధారాలు ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్నాయి. వీటిని ధ్వంసం చేయవచ్చు" అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ "సాక్ష్యాధారాలు ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటే వాటిని ధ్వంసం చేసినా తిరిగి పునరుద్ధరించవచ్చు. ఒకవేళ పోలీసు కమిషనర్ ఆధారాలను నాశనం చేయడానికి 'ఏ చిన్న ప్రయత్నం' చేసినా ఆయన పశ్చాత్తాపపడేలా కఠినంగా వ్యవహరిస్తాం" అని పేర్కొంది.

సీబీఐ సిబ్బందిని పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారని, సీజీవో కాంప్లెక్స్‌లోని వారి నివాస గృహాలను చుట్టుముట్టారని మెహతా తెలిపారు. జాయింట్ డైరెక్టర్ పంకజ్ శ్రీవాత్సవ టెలి కాన్ఫరెన్స్ ద్వారా మీడియాతో మాట్లాడుతూ ఆయన ఇంటిని చుట్టుముట్టి, కుటుంబాన్ని నిర్బంధంలో ఉంచారంటూ చెప్పారని వివరించారు. తాజా పరిస్థితి ఏమిటని ధర్మాసనం ప్రశ్నించగా వారందర్నీ విడుదల చేశారని తెలిపారు. సీబీఐ అధికారులపై రోజువారీ ప్రక్రియ కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని చెప్పారు. అంటే సీబీఐ అధికారులు ఎవరూ అరెస్టులో లేనట్టేనని ధర్మాసనం అభిప్రాయపడింది.



కోల్‌కతాలో సోమవారం ధర్నా చేపడుతున్న ప్రాంగణంలో పశ్చిమ బెంగాల్ మంత్రి వర్గంతో సంభాషిస్తున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

ఆధారాల ధ్వంసంపై సాక్ష్యాలు ఉన్నాయా?

ఆధారాలు ధ్వంసం చేశారనడానికి సాక్ష్యాలు ఉంటే ప్రమాణ పత్రం రూపంలో సమర్పించాలని ధర్మాసనం ఆదేశించింది. "గందరగోళం నెలకొన్న సమయంలో పశ్చిమ బెంగాల్ అధికారులుగానీ, పోలీసులుగానీ ఈ కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలు ధ్వసం చేయాలన్న ప్రణాళిక వేశారనడానికిగానీ, నాశనం చేయాలని ప్రయత్నించారనడానికిగానీ సాక్ష్యాలు ఉంటే సొలిసిటర్ జనరల్‌గానీ, ఇతరులుగానీ సమర్పించవచ్చు" అని పేర్కొంది.

కోర్టు ధిక్కార పిటిషన్‌లో ఏమీ లేదు

కోల్‌కతా పోలీసు కమిషనర్‌పై వేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌లో ఏమీ లేదని ధర్మాసనం అభిప్రాయపడింది. దాన్ని పరిశీలించడం వల్లనే అయిదు నిమిషాల ఆలస్యంగా కోర్టు కార్యకలాపాలు ప్రారంభించాల్సి వచ్చిందని చెప్పింది. ఆదివారం ఆ పిటిషన్‌ను రాశామని, ఆ సమయంలో దస్త్రాలు తమకు అందుబాటులో లేవని మెహతా తెలిపారు. పోలీసుల వద్ద ఉన్న దస్త్రాలు సోమవారమే తమ వద్దకు చేరాయని చెప్పారు. ఈ సమయంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరఫున హాజరైన అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే ఇదంతా జరుగుతోందని తెలిపారు. పోలీసు కమిషనర్‌కు అనుకూలంగా కలకత్తా హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. విచారణను మంగళవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

అరెస్టు చేసే అధికారం ఉంది

సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఈ కేసులపై దర్యాప్తు జరుగుతోందని, రాజీవ్ కుమార్‌కు వ్యతిరేకంగా బలమైన సాక్ష్యాలు ఉన్నాయని సీబీఐ తెలిపింది. వారెంటు లేకుండా అరెస్టు చేసే అధికారం తనకు ఉందని పేర్కొంది. దేశ చట్టాలను పోలీసు కమిషనర్ అమలు చేసి తీరాల్సిందేనని తెలిపింది. కేసు దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం, దాని విభాగాలు సహకరించడం లేదని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ సహాయ నిరాకరణపై 2015, 2017ల్లో కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు చేసిన సంగతిని గుర్తు చేసింది. రాజీవ్ కుమార్ సహాయ నిరాకరణపై డీజీపీ దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోలేదని తెలిపింది. ఆదివారం జరిగిన సంఘటనలను వివరిస్తూ విధులు నిర్వహణలో భాగంగానే రాజీవ్ కుమార్ ఇంటికి 25 మంది అధికారులు వెళ్లారని పేర్కొంది. వారి ఫోన్లను రాష్ట్ర పోలీసులు లాక్కొన్నారని వివరించింది. మరోవైపు, కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు ప్రయత్నించడాన్ని వ్యతిరేకిస్తూ కోల్‌కతా హైకోర్టును పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం ఆశ్రయించింది. తమ పిటిషన్‌పై తక్షణ విచారణ చేపట్టాలని కోరింది. అయితే, కోర్టు అందుకు నిరాకరించింది.

రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

మమతకు మద్దతుగా తృణమూల్ కార్యకర్తలు సోమవారం పశ్చిమ బెంగాల్‌వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. హుగ్లీ, హావ్‌డా, బంకురా, బుర్ద్వాన్ తూర్పు, పురులియా, బీర్‌భూమ్, ఉత్తర 24 పరగణాలు తదితర జిల్లాల్లో మోదీ, అమిత్ షాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. హావ్‌డా, హుగ్లీ జిల్లాల్లో రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. బంకురా జిల్లాలో జాతీయ రహదారిపై రాకపోకలను కొంతసేపు నిలిపివేశారు. శాంతియుతంగా నిరసన ప్రదర్శనలు చేపట్టాలని పార్టీ కార్యకర్తలకు మమత సూచించారు.

ఆదివారం రాత్రే పిటిషన్ వేయాలని అనుకున్నా...

'అసాధారణ పరిస్థితి' నెలకొన్న దృష్ట్యా ఆదివారం రాత్రే సుప్రీంకోర్టును ఆశ్రయించాలని సీబీఐ వర్గాలు భావించాయి. కానీ, తగిన పత్రాలు అందుబాటులో లేకపోవడం, ఇతర కారణాల వల్ల ముందుకుసాగలేకపోయింది. అమరావతి పర్యటనకు వెళ్లిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి రాత్రి పది గంటల తరువాత దిల్లీకి తిరిగి రావడం కూడా ఇంకొక కారణం.

ఐపీఎస్‌ల పాత్రపై పరిశీలన

దేశంలోని అందరు ఇండియన్ పోలీసు సర్వీసు(ఐపీఎస్) అధికారులపై కేంద్ర హోంశాఖకే పర్యవేక్షణ అధికారం ఉంటుంది. దాన్ని ఆధారంగా చేసుకొని.. కోల్‌కతా సంఘటనలో ఐపీఎస్ అధికారులు ఎలా వ్యవహరించారన్నదానిపై హోంశాఖ ఆరా తీస్తోంది. కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించకుండా వారేమైనా అడ్డుతగిలారా? తద్వారా ఉద్యోగ నిబంధనలను ఉల్లంఘించారా? అన్నదానిపై వివరాలు సేకరిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

రాజ్‌నాథ్‌కు గవర్నర్ నివేదిక

పశ్చిమ బెంగాల్ గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠి సోమవారం ఉదయం కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదిక పంపించి ఆయనతో ఫోనులో సంభాషించారు. అయితే ఈ నివేదికలోని వివరాలు ఏమిటన్నది తెలియరాలేదు. అంతకుముందు రాజ్‌నాథ్ సింగ్ గవర్నర్‌కు ఫోను చేసి వాస్తవాలను తెలుసుకున్నారని అధికారవర్గాలు వెల్లడించాయి. "సీబీఐ అధికారులపై దాడి చేయడం, వారిని అదుపులోకి తీసుకోవడం, భయపెట్టడం, అడ్డుకోవడం దురదృష్టకరమైన సంఘటన. గతంలో ఎన్నడూ ఇలాంటిది జరగలేదు. దానిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు" అని పేర్కొన్నాయి. ఆదివారం రాత్రి సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ కార్యదర్శులు తనకు సమర్పించిన నివేదికలు ఆధారంగా గవర్నర్ నివేదికను రూపొందించారు. గవర్నర్ త్రిపాఠి ఆదివారం రాత్రే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్), డీజీపీలను పిలిపించి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితిని కేంద్ర హోం శాఖ 'నిశితంగా' గమనిస్తోంది. సీబీఐ అధికారుల నివాస గృహాల వద్ద కేంద్ర బలగాలను రక్షణగా పెట్టింది. వివిధ వర్గాల నుంచి నివేదికలను తెప్పించుకొంది.

మాల్యా అప్పగింతకు అంగీకారం

లండన్: భారత్‌లో బ్యాంకులకు రుణాలు ఎగవేసి లండన్‌లో తలదాచుకుంటున్న మద్యం వ్యాపారి విజయ్‌మాల్యా(63)కు సోమవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన్ను భారత్‌కు అప్పగించడానికి అనుమతిస్తూ బ్రిటన్ హోంమంత్రి సాజిద్ జావిద్ ఆదివారం అధికారిక పత్రాలపై సంతకాలు చేశారు. మోసం చేసేందుకు మాల్యా కుట్ర పన్నినట్లు, అక్రమ నగదు లావాదేవీలు జరిపినట్లు తగిన ఆధారాలున్నాయని విశ్వసించిన మీదట జావిద్ ఆయనను భారత్‌కు అప్పగించేందుకు అంగీకరించారని బ్రిటన్ హోంమంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు.

రప్పించడానికి మరో ఏడెనిమిది నెలలు

మాల్యా మోసానికి పాల్పడ్డారన్న భారత్ వాదనలో నిజముందని, ప్రాథమిక సాక్ష్యాధారాలు ఉన్నాయని లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టు గతంలోనే చెప్పింది. ఆయన్ను భారత్‌కు అప్పగించాలని డిసెంబరు 10, 2018న మేజిస్ట్రేట్ ఎమ్మా అర్బుత్నోట్ ఆదేశించారు. బ్రిటన్ చట్టం ప్రకారం తమ దేశంలో తలదాచుకుంటున్న ఒక వ్యక్తిని మరో దేశానికి అధికారికంగా అప్పగించాలంటే హోంమంత్రి అనుమతించాలి. అది కూడా కోర్టు తీర్పు వెలువరించిన రెండు నెలల్లోపు సంతకాలు చేయాల్సి ఉంటుంది. దీనిప్రకారం ఫిబ్రవరి 3న జావిద్ సంతకం చేశారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించడానికి మాల్యాకు ఫిబ్రవరి 4 నుంచి 14 రోజుల గడువు ఉంది. అక్కడా కిందికోర్టు తీర్పే వెలువడితే, సుప్రీంకోర్టుకు వెళ్లవచ్చు. అక్కడ కేసు విచారణకు రావడానికి కనీసం ఆరువారాలు పడుతుంది. విచారణ పూర్తి అయి తీర్పు రావడానికి కొన్ని నెలలు పడుతుంది. మాల్యా తనకు గల అన్ని చట్టపరమైన అవకాశాలను వాడుకుంటే భారత్‌కు రప్పించడానికి కనీసం ఏడెనిమిది నెలలు పట్టవచ్చని న్యాయనిపుణులు చెబుతున్నారు. మాల్యా అప్పగింతకు బ్రిటన్ హోంమంత్రి సంతకాలు చేయడాన్ని భారత్ స్వాగతించింది. చట్టపరమైన ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేసి, మాల్యాను అప్పగించాలని కోరింది.

దక్షిణ మధ్య రైల్వే జీఎంగా జి.మల్య

ఈనాడు, దిల్లీ: దక్షిణ మధ్య (ద.మ.) రైల్వే జనరల్ మేనేజర్‌గా జి.మల్య నియమితులయ్యారు. ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ మెకానికల్ ఇంజినీర్స్‌కు చెందిన మల్యను సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న ద.మ. రైల్వే జనరల్ మేనేజర్‌గా నియమిస్తూ కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇది వరకు అక్కడ పనిచేసిన వినోద్‌కుమార్ యాదవ్ పదోన్నతిపై రైల్వే బోర్డు ఛైర్మన్ కావడంతో ఈ నియామకం అవసరమైంది. ద.మ.రైల్వేతో పాటు మరో మూడు జోన్లకు జనరల్ మేనేజర్లు నియమితులయ్యారు. ఉత్తర రైల్వే జోన్‌కు టీపీ సింగ్, వాయవ్య జోన్‌కు రాజేష్‌తివారీ, ఈస్ట్‌కోస్ట్ జోన్‌కు వి.భూషణ్ బాధ్యతలు చేపట్టనున్నారు. పెరంబూర్‌లోని కోచ్‌ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌గా ఆర్.జైన్ నియమితులయ్యారు.

యావద్దేశం యాదాద్రి రావాలె

(మొదటి పేజీ తరువాయి)

దేశంలోని ప్రతీ ఒక్కరికీ ఒక్కసారైనా యాదాద్రిని సందర్శించాలనే ఉత్సుకత కలిగేలా దేవాలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని చెప్పారు. ఒకదాని తర్వాత ఒకటి కాకుండా నిర్మాణ పనులన్నీ సమాంతరంగా సాగాలని, దీని కోసం ఏ పనికి ఆ పనిగా ప్రణాళిక సిద్ధం చేసుకుని చేయాలన్నారు. యాదాద్రి పనులకు అవసరమైన నిధులు అందుబాటులో ఉంటాయని, ఈసారి బడ్జెట్లో కూడా కావాల్సినన్ని కేటాయిస్తామని చెప్పారు. పనులన్నీ పూర్తయిన తర్వాత పరిపూర్ణ ఉపాసకులు.. సహస్రాష్టక (1,008) కుండాలతో 11 రోజులపాటు మహాయాగం నిర్వహిస్తామని, దీనికి రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులు, వివిధ రాష్ట్రాల సీఎంలు, గవర్నర్లను ఆహ్వానిస్తామన్నారు. ఆదివారం యాదాద్రి పునరుద్ధరణ పనులను పరిశీలించి వచ్చిన సీఎం సోమవారం ప్రగతిభవన్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు 10 గంటల పాటు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్ శర్మ, రోడ్లు భవనాల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు గణపతిరెడ్డి, రవీందర్‌రావు, ఇ.ఇ. వసంతనాయక్, ఎస్.ఇ. లింగారెడ్డి, యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రత్యేకాధికారి కిషన్‌రావు, ఈవో గీత, ఆలయ నిర్మాణ నిపుణుడు ఆనంద్‌సాయి, కట్టడాల ఇంజినీర్ వెంకటేశ్వర్లు, ఆర్కిటెక్ట్‌లు మధుసూదన్, వాసుకి, సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ఏ నిర్మాణం ఎక్కడ రావాలనే దానిపై తుది నిర్ణయం తీసుకున్నారు. దానిప్రకారం నిర్మాణాలు జరగాలని అధికారులను ఆదేశించారు.

కలకాలం ఉండేలా..

"యాదాద్రి పునరుద్ధరణ పనులు చరిత్ర సృష్టించాలి. ప్రపంచమంతా అబ్బురమని పొగడాలి. వందల ఏళ్ల పాటు ఆలయం ఉంటుంది. వెల్లూరు, తంజావూరు, అక్షరధామ్ లాంటి ప్రసిద్ధ దేవాలయాలను సందర్శించి అధికారులు అధ్యయనం చేసి రావాలి. పునర్నిర్మాణం తర్వాత యాదాద్రికి భక్తుల సంఖ్య ఎన్నో రెట్లు పెరుగుతుంది. దానికి అనుగుణంగా ఏర్పాట్లు జరగాలి. శివరాత్రి ఉత్సవాలు, తెప్పోత్సవం నిర్వహించడానికి, వ్రతాలు చేసుకోడానికి, తలనీలాల సమర్పణకు, మండల దీక్ష భక్తులు ప్రత్యేక పూజలు చేసుకోడానికి శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలి.

302 ఎకరాల్లో దేవాలయ ప్రాంగణం

మొత్తం 302 ఎకరాల విస్తీర్ణంలో దేవాలయ ప్రాంగణం ఉండాలి. మాడ వీధులు, ప్రాకారాలు కలుపుకుని 4.5 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన దేవాలయం నిర్మించాలి. గుట్ట పైభాగంలో ప్రధాన దేవాలయంతో పాటు గోపురాలు, ప్రాకారాలు, మాడ వీధులు, శివాలయం, ఆంజనేయ స్వామి విగ్రహం, ఈవో కార్యాలయం, ప్రముఖుల అతిథిగృహం (ప్రెసిడెన్షియల్ సూట్), అర్చక నిలయం, నైవేద్య మందిరం, వంటశాల, ప్రసాద మంటపం, రథశాల, వ్రత మండపం, స్వామి పుష్కరిణి, క్యూ కాంప్లెక్స్, మెట్ల దారి, బస్‌స్టాప్, పోలీస్ ఔట్ పోస్టు, ఆరోగ్య కేంద్రాలు ఉండాలి. గుట్ట కింది భాగంలో గండి చెరువును తెప్పోత్సవం నిర్వహించడానికి అనువుగా తీర్చిదిద్దాలి. గండి చెరువుకు అనుబంధంగా కోనేరు, కల్యాణకట్ట నిర్మించాలి. గుట్ట కింద భాగంలోనే ఆలయ బస్టాండ్ నిర్మించాలి. అక్కడి నుంచి భక్తులను దేవాలయ వాహనాల ద్వారా గుట్టపైకి తీసుకురావాలి. గుట్టపైకి వెళ్లి, రావడానికి వేర్వేరు దారులు ఉపయోగించాలి. మండల దీక్ష చేపట్టిన భక్తులకు గుట్టకింద ఆశ్రమం నిర్మించాలి. యాదాద్రి ఆలయం చుట్టూ రింగురోడ్డు నిర్మించాలి. దానికి అనుబంధంగా రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలి. యాదాద్రి నుంచి తుర్కపల్లికి నాలుగు వరసల రోడ్లు వేయాలి. ఆలయ నగరం (టెంపుల్ సిటీ)లో ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా, ఆహ్లాదం వెల్లివిరిసేలా ఉద్యానవనాలు, ఫౌంటెయిన్లు నిర్మించాలి.



యాదాద్రి పునరుద్ధరణ పనులపై సోమవారం ప్రగతి భవన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బాహ్యావలయ రహదారి నిర్మాణంపై యాడా ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

యాగం నిర్వహణకు కమిటీ

'లక్షలాదిమంది భక్తులు పాల్గొనే సహస్రాష్టక యాగం కోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేయడానికి ఓ కమిటీని నియమిస్తున్నాం. భక్తులు బస చేయడానికి వీలుగా ఆలయ నగరంలో 340 క్వార్టర్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలి. రోడ్లు, మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ లాంటి కనీస వసతులు కల్పించాల'ని సీఎం అధికారులకు సూచించారు. యాదాద్రిలోని ప్రతీ బ్లాకుకు దేవుళ్లు, దేవతల పేర్లు పెడతామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

రైతుల వివరాలివ్వండి

ఈనాడు - హైదరాబాద్

ఐదెకరాలలోపు భూమి ఉన్న రైతు కుటుంబానికి రూ.6 వేల చొప్పున ఇచ్చే 'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన'(పీఎంకేఎస్ఎన్‌వై) పథకం కోసం అన్నదాతల వివరాలను తెలంగాణ వ్యవసాయశాఖ సిద్ధం చేస్తోంది. మంగళవారం అన్ని రాష్ట్రాల వ్యవసాయ, రెవెన్యూశాఖల ముఖ్య కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్(వీసీ) నిర్వహిస్తామని కేంద్ర వ్యవసాయశాఖ సోమవారం సమాచారం ఇచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని భూముల, రైతుల వివరాలతో సిద్ధంగా ఉండాలని సూచించింది. దీంతో ఈ నెల ఒకటో తేదీ నాటికి ఆన్‌లైన్‌లో నమోదైన(డిజిటలైజ్) భూ యజమానుల వివరాలను వెంటనే అందజేయాలని రెవెన్యూశాఖకు రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి సోమవారం లేఖ రాశారు. రెవెన్యూశాఖ ఇచ్చిన వివరాలనే ఆన్‌లైన్‌లో కేంద్రానికి పంపాలని రాష్ట్ర వ్యవసాయశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో 52 లక్షల మంది రైతులు రైతుబంధు పథకం కింద ఎకరానికి రూ.4 వేలు అందుకోవడానికి అర్హులని గత నవంబరులో రాష్ట్ర వ్యవసాయశాఖ తేల్చింది. వీరిలో ఐదెకరాలలోపు ఉన్నవారు 47 లక్షలమంది అని గుర్తించింది. వీరు మాత్రమే రూ.6 వేల చొప్పున కేంద్రం నుంచి అందుకోవడానికి అర్హులు. కేంద్రం ఈ పథకంపై ఇచ్చిన మార్గదర్శకాల్లో రైతు కుటుంబానికి ఐదెకరాలలోపు ఉండాలి అని తెలిపింది. ప్రస్తుతం తెలంగాణలో ఒక్కో వ్యక్తి పేరుతో ఉన్న భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉన్నాయి. కానీ రైతు, అతని భార్య, పిల్లల పేరుతో కలిపి ఐదెకరాలలోపు ఉన్న కుటుంబాలను లెక్కించాలంటే మళ్లీ మొదటి నుంచి సర్వే చేయాల్సి వస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ భావిస్తోంది. ఈ నిబంధన అమలు చేస్తే ఐదెకరాల్లోపు ఉండే రైతుల సంఖ్య 47 లక్షలకన్నా కొంత తగ్గుతుందని అంచనా.



డిజిటల్ సంతకం అయితే చాలు...

రైతుబంధు పథకం అమలుకు కొత్త పాసుపుస్తకం అందుకున్న రైతులే అర్హులని ప్రస్తుత రబీలో వ్యవసాయశాఖ నిబంధన విధించింది. కానీ పీఎంకేఎస్ఎన్‌వైలో ఈ నిబంధన కాకుండా డిజిటలైజ్ అయిన రైతుల వివరాలన్నీ కేంద్రానికివ్వాలని యోచిస్తోంది. కొత్త పాసుపుస్తకం రావాలంటే తహసీల్దార్ రైతు భూముల వివరాలను ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్‌లో నమోదు చేసి ఆయన వేలిముద్రతో డిజిటల్ సంతకం చేయాలి. ఇలా సంతకం అయిన తర్వాత సదరు రైతు వివరాలతో కొత్త పాసుపుస్తకం ముద్రణకు వెళుతుంది. డిజిటల్ సంతకం అయి ఇంకా పాసుపుస్తకం ముద్రణ కాని రైతులున్నారు. గత నవంబరులో డిజిటల్ సంతకం అయిన రైతులకు కూడా ఇంతవరకు పాసుపుస్తకం రాలేదని సంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ తహసీల్దార్ 'ఈనాడు'తో పేర్కొన్నారు. వీరే కాకుండా గతంలో పాత పాసుపుస్తకం ఉన్నా వారి భూముల సర్వే సంఖ్యలు, వారి పట్టా వివరాలు గానీ ధరణి పోర్టల్‌లో నమోదు కాని వారు లక్షల్లో ఉన్నారు. వీరంతా కొత్త పాసుపుస్తకాల కోసం, తమ భూముల వివరాలు ధరణి పోర్టల్‌లో ఎప్పుడు కనిపిస్తాయని అడుగుతూ వ్యవసాయ, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కానీ వారికి సరైన సమాధానం చెప్పేవారే లేరు. ఇప్పుడు వ్యవసాయశాఖ ఈ నెల ఒకటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల వివరాలనే అడిగినందున, ఇలా కాళ్లరిగేలా తిరుగుతున్న వారికి పీఎంకేఎస్ఎన్‌వై పథకం కింద రూ.6 వేలు ఇచ్చే అవకాశాలు లేనట్లు అర్థమవుతోంది. క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల వీరు ఇటు రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుబంధు సాయాన్ని, అటు కేంద్రం అమలు చేసే పీఎంకేఎస్ఎన్‌వై పథకాన్ని పొందలేక నష్టపోయే పరిస్థితి వచ్చింది.

కుటుంబమే యూనిట్

(మొదటి పేజీ తరువాయి)

- 2019 ఫిబ్రవరిలోగా భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉన్న వారినే అర్హులుగా గుర్తిస్తారు. ఒక రైతు కుటుంబానికి వివిధ గ్రామాలు/రెవెన్యూ గ్రామాల్లో ఉన్నవన్నీ పరిగణనలో తీసుకుంటారు. ఫిబ్రవరి తర్వాత కొత్తగా భూమి యాజమాన్య హక్కులు వచ్చే వాటిని అయిదేళ్ల దాకా పరిగణనలో తీసుకోరు. అప్పటికే పథకం వర్తించే ఖాతాలకు సంబంధించిన భూముల యాజమాన్య హక్కులను వారసులకు బదిలీ చేస్తే ప్రయోజనం వర్తింపజేస్తారు.
- కొన్ని రాష్ట్రాల్లో కౌలురైతులు పీఎం-కిసాన్ ప్రయోజనాలకు దూరమయ్యే పరిస్థితులున్నాయి. ఆయారాష్ట్రాలు కేంద్రం అమలు చేస్తున్న నమూనా కౌలుదారు చట్టాన్ని అనుసరిస్తుండటమే కారణంగా తెలుస్తోంది.

నగదు బదిలీకి ఆధార్

అర్హులైన చిన్న, సన్నకారు రైతుల వివరాలతో సమగ్ర సమాచార నిధి ఏర్పాటు చేయాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. ఇందులో భాగంగా పేరు, కులం, ఆధార్ సంఖ్య, బ్యాంకు ఖాతా, మొబైల్ నంబరు సేకరించాలి. మొదటి వాయిదాను రైతుల ఖాతాకు బదిలీ చేయటానికి ఆధార్ లేకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధ్రువీకరించిన డ్రైవింగ్ లైసెన్సు, ఓటరు కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు తదితర పత్రాలను తీసుకోవచ్చు. తదుపరి వాయిదాలు చెల్లించాలంటే ఆధార్ తప్పనిసరిగా ఇవ్వాలి. అర్హులైన రైతులెవరూ రెండు చోట్ల పథకం లబ్ధి పొందకుండా చూడాలని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది.

పీఎం-కిసాన్ పోర్టల్‌లో వివరాలు

ఉపాధి నిధుల తరహాలోనే పీఎం-కిసాన్ సొమ్మును రాష్ట్ర నోషనల్ ఖాతా ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేస్తారు. దీనికి సంబంధించి జిల్లాల వారీగా లబ్ధిదారుల వివరాలను ధ్రువీకరించి పీఎం-కిసాన్ పోర్టల్‌లో నమోదు చేయాలి. అనంతరం లబ్ధిదారుల ఖాతాలకు బదిలీ చేస్తారు. చెల్లింపుల అనంతరం ఇచ్చే రశీదుల ఆధారంగా కేంద్రం నిధులు విడుదల చేస్తుంది. పథకం అమల్లో సమస్యలు, అర్జీల పరిష్కారానికి జిల్లాల వారీగా ఫిర్యాదు పరిష్కార కమిటీలు ఏర్పాటు చేయాలని పేర్కొంది.

కేంద్ర స్థాయిలో పర్యవేక్షక సంస్థ

పీఎం-కిసాన్ పథకం తీరుపై పర్యవేక్షణ కోసం కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిట్‌ను ఏర్పాటు చేసి ముఖ్య కార్యనిర్వహణాధికారిని నియమిస్తారు. పథకానికి ప్రచారం కల్పించే బాధ్యతను ఈ విభాగం చూస్తుంది. రాష్ట్రాలు కూడా నోడల్ వ్యవస్థను ఏర్పాటు చేసి అమలు బాధ్యతలను అప్పగించాలి. లబ్ధిదారుల గుర్తింపు, వివరాల అప్‌లోడ్ ప్రక్రియను వెంటనే అందజేసి కేంద్రం నుంచి లబ్ధిదారుల ఖాతాలకు నిధులు బదిలీ చేసేలా రాష్ట్రాలు బాధ్యత తీసుకోవాలని కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కోరింది.

అసమానత కాదు!

చీమకంటే ఏనుగుకు ఆహారం వేల రెట్లు ఎక్కువ అవసరం. అంతమాత్రాన దాన్ని అసమానతకు చిహ్నంగా చూడటానికి లేదు! దేని ప్రాధాన్యమూ తగ్గిపోదు!!

– మహాత్మా గాంధీ

గ్రహం అనుగ్రహం

5-2-2019 మంగళవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; మాఘ మాసం; శుక్ల పక్షం
పాడ్యమి: రా. 3.36 తదుపరి విదియ
ధనిష్ఠ నక్షత్రం: పూర్తి
అమృత ఘడియలు: రా. 8.19 నుంచి 10.06 వరకు
వర్జ్యం: ఉ. 9.40 నుంచి 11.26 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.52 నుంచి 9.37 తిరిగి రా. 10.59 నుంచి 11.50
రాహుకాలం: మ. 3.00 నుంచి 4.30 వరకు
సూర్యోదయం: ఉ.6-36; సూర్యాస్తమయం: సా.5.54

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	12.5	31.3
మెదక్	15.1	34.6
రామగుండం	15.2	31.6
తాడేపల్లిగూడెం	15.4	29.5
కరీంనగర్	16.0	29.0
గుంటూరు	16.4	31.9
శ్రీకాకుళం	17.0	27.0
హన్మకొండ	17.0	31.0
నిజామాబాద్	17.4	31.5
విశాఖపట్నం	17.6	31.4
హైదరాబాద్	18.1	29.9
నల్గొండ	18.4	31.0
మహబూబ్‌నగర్	19.5	32.0
విజయవాడ	19.6	31.0
సూర్యాపేట	20.0	28.5
ఖమ్మం	21.0	32.0
తిరుపతి	21.5	31.5

కాళేశ్వరంతో సిరిసిల్ల సస్యశ్యామలం

- సారంగం, సర్జిపుల్, రిజర్వాయర్ పనులు 90 శాతం పూర్తి
- సెప్టెంబరు చివరికి నీటి విడుదలకు సిద్ధం
- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



కోనరావుపేట మండలం ధర్మారంలో సారంగం, సర్జిపుల్ పంపు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్

కోనరావుపేట, న్యూస్‌టుడే: కాళేశ్వరం ఎత్తిపోతల పథకం 9వ ప్యాకేజి రిజర్వాయర్ నిర్మాణం రాజన్న సిరిసిల్ల జిల్లాకే తలమానికమని సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలోని సారంగం, సర్జిపుల్, మల్కపేటలో జరుగుతున్న రిజర్వాయర్ నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. పనుల ప్రగతి, పంట కాలువల నిర్మాణం, భూ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి రంగానికి ప్రాధాన్యమిచ్చి బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లను కేటాయించటం జరిగిందన్నారు. గోదావరి జలాలను తరలించటానికి నాడు రూపొందించిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును 11 టీఎంసీల నుంచి 141 టీఎంసీలకు పెంచినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకం చేపట్టి స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు రాత్రింబవళ్లు పనిచేయడంతో 90 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. వచ్చే సెప్టెంబరు నాటికి నీటి విడుదలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. రిజర్వాయరు నిర్మాణానికి రైతులు సహకరించి భూములు ఇచ్చారని, అదే ధోరణితో పంట కాలువల నిర్మాణానికి భూములు అందజేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి చెరువులు, కుంటలను నింపడానికి అధికారులు ప్రణాళికలను రూపొందించాలన్నారు. దీంతో భూగర్భ జలాలు పెంపొంది ఏడాదికి మూడు పంటలు పండించుకోవడంతో భూములు సస్యశ్యామలంగా మారతాయన్నారు. తత్ఫలితంగా రైతులు ఆర్థిక స్వయం సమృద్ధి సాధిస్తారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ యాస్మిన్ బాషా, ఆర్డీవో శ్రీనివాసరావు, ఈఎన్‌సీ హరేరాం, ప్రాజెక్టు ఇన్‌ఛార్జి బుచ్చిరెడ్డి, టెస్కాబ్ అధ్యక్షుడు రవీందర్‌రావు, జడ్పీటీసీ సభ్యుడు ఆగయ్య పాల్గొన్నారు.



త్వరలో డిగ్రీలోనూ ఆన్‌లైన్ కోర్సులు

- ఆసక్తిని బట్టి నచ్చినవి చదువుకోవచ్చు
- కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: నాలుగో పారిశ్రామిక విప్లవం(4.0) తరహాలోనే విద్యా రంగంలోనూ 4.0 విప్లవం వస్తోందని, దానివల్ల ఆసక్తిని బట్టి నచ్చిన కోర్సులను ఎంచుకుని చదువుకోవచ్చని కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ తెలిపారు. ఆన్‌లైన్ కోర్సుల వల్ల ఇది సాకారమవుతుందన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల సహకారంతో ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహణలో ఉన్నత విద్య- మానవ వనరులపై రెండు రోజుల సదస్సు సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా నవీన్ మిత్తల్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. "ఇప్పటివరకు తరగతి గదిలో ఉన్న విద్యార్థులందరికీ ఉపాధ్యాయుడి బోధన ద్వారా ఒకే తరహా సమాచారం అందేది. ఆన్‌లైన్ కోర్సులు, ఆధునిక సాంకేతికత వల్ల ఎవరికి ఆసక్తి ఉన్న సబ్జెక్టులు, కోర్సులను వారు చదువుకొనే అవకాశం ఇప్పుడు దొరుకుతోంది. మ్యాసివ్ ఓపెన్ కోర్సుల (మూక్స్)తో ప్రపంచ ప్రసిద్ధ స్టాన్‌ఫర్డ్, ఎంఐటీ తదితర విశ్వవిద్యాలయాలు అందించే కోర్సులనూ మనం ఉన్నచోట నుంచే చదువుకునే అవకాశం లభించింది" అని తెలిపారు. మన దేశంలో ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులకూ యూజీసీ అనుమతి ఇచ్చిందని, అవి రెగ్యులర్ కోర్సులతో సమానమేనని స్పష్టం చేసిందని చెప్పారు. డిగ్రీలోనూ ఆన్‌లైన్ కోర్సులను అందించే దిశగా కళాశాల విద్యాశాఖ కసరత్తు చేస్తోందని నవీన్ మిత్తల్ వెల్లడించారు. సదస్సులో తెలంగాణ ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడు ఆచార్య లింబాద్రి, ఇంటర్‌బోర్డు కార్యదర్శి అశోక్, ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉపకులపతి మహేందర్‌రెడ్డి, అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఉప సంచాలకురాలు నీతూ భగత్, అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా డైరెక్టర్ అక్కినేని అమల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుసుముల ఆన్‌లైన్ చెల్లింపులపై ఎస్ బ్యాంకుతో సాంకేతిక విద్యాశాఖ ఎంఓయూ కుదుర్చుకుంది.

నిజామాబాద్-బోధన్ మధ్య మూడు నెలల పాటు రైళ్ల రద్దు

ఈనాడు, హైదరాబాద్: రైల్వే మరమ్మతులతోపాటు అభివృద్ధి పనుల కారణంగా మార్చి 10నుంచి జూన్ 9 వరకు నిజామాబాద్-బోధన్-నిజామాబాద్ మధ్య 57501/57502 నంబర్లతో నడిచే పాసింజర్ రైళ్లను రద్దు చేశారు. మిర్జాపలి-బోధన్-మిర్జాపలి మధ్య 57503/57504 నంబర్లతో నడిచే పాసింజర్ రైళ్లనూ మార్చి 10నుంచి జూన్ 9 వరకు రద్దు చేశారు.

అత్యంత అనారోగ్యంగా పారికర్!

గోవా డిప్యూటీ స్పీకర్ లోబో

పనాజీ: గోవా సీఎం పారికర్ అత్యంత అనారోగ్యంగా ఉన్నారని ఆరాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ మైఖెల్ లోబో పేర్కొన్నారు. ఏదైనా కారణం చేత పారికర్ సీఎం పదవి నుంచి వైదొలగినా, ఆయనకు ఏదైనా జరిగినా గోవా రాజకీయ సంక్షోభంలో కూరుకుపోతుందన్నారు.

నిష్పాక్షిక న్యాయవ్యవస్థతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్



ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు నిష్పాక్షిక న్యాయవ్యవస్థ అవసరమని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. ఖమ్మం బార్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆయన అసోసియేషన్ హాలులో న్యాయవాదులనుద్దేశించి సోమవారం ప్రసంగించారు. రాజ్యాంగ పరిరక్షణలో కీలక పాత్ర పోషించే న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్య పరిరక్షణలోనూ కీలకమైనదన్నారు. న్యాయవ్యవస్థ బలహీన పడే పరిస్థితి వస్తే అది తీవ్ర ప్రజాస్వామ్య సంక్షోభానికి దారి తీస్తుందని చెప్పారు. న్యాయవ్యవస్థపై పట్టు కోసం పాలకులు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐను పరికరంగా వాడేందుకు కూడా వెనుకాడటం లేదన్నారు. న్యాయవాదులంతా ఈ విషయాన్ని గుర్తెరిగి తమ పరిధిలోని న్యాయపర అంశాలకు సంబంధించి నిత్యం చైతన్యవంతులుగా ఉండాలని సూచించారు. హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత తమదని న్యాయవాదులు గుర్తించాలన్నారు. 50 ఏళ్ల కిందట న్యాయవాదులంటే ఎంతో గౌరవం ఉందని.. నేడు ఆ పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు.

రహదారులపై నిరంతర నిఘా

- జాతీయ, రాష్ట్ర మార్గాల్లో ప్రతి 800 కిలోమీటర్లకు ఒక బృందం

ఈనాడు, హైదరాబాద్: రహదారులపై ఇక నిఘా పెరగనుంది. ప్రమాద ప్రాంతాలకు నిమిషాల వ్యవధిలో రక్షణ వ్యవస్థ చేరుకునేలా వివిధ శాఖల సమన్వయంతో బృందాలు ఏర్పాటు కానున్నాయి. రహదారులపై పెచ్చుమీరుతున్న ప్రమాదాల నియంత్రణతో పాటు బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు నూతన విధానాన్ని తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ, రాష్ట్ర రహదారులతో పాటు అన్ని మార్గాల్లోనూ కలిపి తొలి దశలో 15 నుంచి 20 బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి రోజూ ఈ బృందాలు 15 వేల నుంచి 20 వేల కిలోమీటర్ల మేరకు రహదారులను పర్యవేక్షిస్తాయి. రహదారి భద్రత గస్తీ బృందం పేరుతో ఈ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి బృందంలో రవాణా, పోలీసు, రహదారులు-భవనాలు, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రమాదాలను నియంత్రించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సుప్రీంకోర్టు నియమించిన ఉన్నత స్థాయి కమిటీ సిఫార్సుల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ గస్తీ బృందాలను ఏర్పాటు చేయనుంది.

బృందాలు ఏమి చేస్తాయంటే..

వేగ నియంత్రణతోపాటు ప్రమాదకర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు దిద్దుబాటు చర్యలు తీసుకోవటం ఈ బృందం బాధ్యత. వాహనాలు నిలిచిపోయిన సందర్భాల్లో వాటిని తొలగించేందుకు అవసరమైన సామాగ్రినీ ప్రభుత్వం సమకూర్చుతుంది.

800 నుంచి వెయ్యి కిలోమీటర్లకో బృందం

రహదార్లపై ప్రతి 800 కిలోమీటర్ల నుంచి వెయ్యి కిలోమీటర్లకు ఒక బృందం చొప్పున నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. నిర్దేశించిన మార్గాల్లో నిత్యం ఆ బృందాలు పర్యటించాలి. ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ఈ బృందాల వల్ల కలిగే ప్రయోజనాలు, ఫలితాలను ఆరు నెలల పాటు ప్రభుత్వం అధ్యయనం చేస్తుంది. ఉపయోగకరమేనని భావిస్తే దశల వారీగా బృందాల సంఖ్యను పెంచుతారు.

త్వరలో చట్టభద్రత

తెలంగాణ రాష్ట్ర రహదారి భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ఇప్పటికే అధికారులు సిద్ధం చేసిన ముసాయిదా చట్టాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు త్వరలో నివేదించనున్నారు. ముఖ్యమంత్రి ఆమోదం తరవాత అసెంబ్లీలో ప్రవేశపెడతారు.

ఘనంగా నాగోబా జాతర ప్రారంభం

తరలివచ్చిన గిరిజనం



జాతర సందర్భంగా కేస్లాపూర్ గ్రామం నుంచి నాగోబా విగ్రహం, నైవేద్యాలతో ఆలయానికి వస్తున్న మెస్రం వంశస్థులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లో నాగోబా జాతరను సోమవారం రాత్రి ఆదివాసీ గిరిజనులు మహా పూజలతో వైభవంగా ప్రారంభించారు. తెలంగాణలో మేడారం సమ్మక్క,సారలమ్మ జాతర తర్వాత ఇదే పెద్ద జాతర. మెస్రం వంశ పెద్దలు, పూజారులు ఆలయాన్ని శుద్ధిచేసిన అనంతరం నాగోబా దేవతను గర్భగుడి నుంచి బయటకు తీసుకువచ్చి గంగాజలంతో అభిషేకం నిర్వహించారు. తర్వాత మెస్రం వంశీయుల్లో ఏడుగురు దేవతను తిరిగి గర్భగుడిలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలకు మెస్రం వంశంలోని ఏడుగురు పెద్దలను తప్ప ఇతరులను అనుమతించలేదు. సోమవారం ఉదయం గిరిజన వాయిద్యాలతో నాగోబా విగ్రహాన్ని గ్రామంలోని మందిరం నుంచి ఆలయ ప్రాంగణానికి తీసుకొచ్చారు. మహిళలు గంగాజలాన్ని కుండల్లో తీసుకువచ్చి మట్టితో పుట్టలు తయారు చేశారు. దేవాలయ పునరుద్ధరణ పనుల కోసం పాత ఆలయాన్ని కూల్చి వేయడంతో మూలవిరాట్టు చుట్టూ ఫెన్సింగ్‌తోపాటు పరదాలు కట్టి పూజలు చేశారు. రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ల నుంచి గిరిజనులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

పీజీ కోర్సుల ఎంపికలో జాగ్రత్త

వైద్య విద్యార్థులకు ఎంసీఐ సూచన

ఈనాడు, హైదరాబాద్: ఎంబీబీఎస్ అనంతరం పీజీ డిప్లొమా, పీజీ డిగ్రీ కోర్సుల్లో చేరాలనుకునే విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) సూచించింది. ఎండీ/ ఎంఎస్/ డీఎం/ ఎంసీహెచ్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు తొందరపడి కళాశాలల్ని ఎంచుకోవద్దని, ఆయా కోర్సులకు, కళాశాలలకు ఎంసీఐ గుర్తింపు ఉందో లేదో తప్పనిసరిగా తెలుసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు తాజాగా ఎంసీఐ లేఖ విడుదల చేసింది. కొన్ని వైద్యకళాశాలల్లో ఆధునిక వైద్యం (మోడ్రన్ మెడిసిన్) వంటి ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నట్లు ఎంసీఐ దృష్టికి వచ్చింది. కొత్త కోర్సుల పేరు చెప్పి అడ్డగోలుగా రుసుములు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు అందాయి. దీంతో ఎంసీఐ స్పందించింది. దేశవ్యాప్తంగా ఏయే వైద్యకళాశాలలకు ఏయే కోర్సులకు అనుమతులిచ్చిందీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, పీజీ కోర్సు చేయాలనుకునే విద్యార్థులు ముందుగా ఆ సమాచారాన్ని తెలుసుకోవాలని ఎంసీఐ సూచించింది. తమ గుర్తింపు లేకుండా కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలలపై ఫిర్యాదు చేయాలని కోరింది. అలాంటి కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎంసీఐ అనుమతి లేని కోర్సులు చేసిన వైద్యులకు రాష్ట్ర వైద్య మండలిలో నమోదు ప్రక్రియ నిలిచిపోతుందని, ఆ కోర్సును అర్హతగా పరిగణించరని పేర్కొంది. బూటకపు ప్రచారాన్ని నమ్మి డబ్బును, విలువైన కాలాన్ని వృథా చేసుకోవద్దని విద్యార్థులకు సూచించింది.

సరళతరంగా ఇంజినీరింగ్ ఇంటర్న్‌షిప్

- 10 కొత్త సబ్జెక్టులపై దృష్టి
- పీహెచ్‌డీని ప్రోత్సహించేందుకు ఫెలోషిప్‌లు
- ఏఐసీటీఈ ఉప సంచాలకురాలు నీతూభగత్

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఏటా ఇంజినీరింగ్ పూర్తిచేస్తున్న 8 లక్షల మందికి ఇంటర్న్‌షిప్ కల్పించేందుకు వీలుగా ఆ విధానం అమలు సరళతరంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అఖిలభారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) ఉప సంచాలకురాలు నీతూభగత్ వెల్లడించారు. కేవలం పరిశ్రమలకు వెళితేనే ఇంటర్న్‌షిప్ చేసినట్లు కాదని, స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థలతో కలిసి పనిచేసినా ఇంటర్న్‌షిప్ చేసినట్లుగా పరిగణిస్తామని ఆమె చెప్పారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఉన్నతవిద్య సదస్సుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా కొద్దిసేపు విలేకరులతో మాట్లాడారు. ఇంజినీరింగ్ విద్యలో నాణ్యత పెంచేందుకు 10 చర్యలు తీసుకోవాలని 2017 మే నెలలోనే ఏఐసీటీఈ నిర్ణయించిందని, అందులో ఒకటి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ తప్పనిసరి చేయడమని అన్నారు. దానికి బీటెక్‌లో 20 క్రెడిట్లు ఇస్తున్నామన్నారు. ఇంటర్న్‌షిప్ విధానాన్ని అమలు చేసేందుకు ఇప్పటికే 'ఇంటర్న్‌శాల' లాంటి పలు సంస్థలతో ఏఐసీటీఈ ఒప్పందం కుదుర్చుకుందని గుర్తుచేశారు. ఇంటర్న్‌షిప్ విధానం అమలుపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సదస్సులకు హాజరవుతున్నామని చెప్పారు. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ పాలకమండలి ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి బీటెక్‌లో కృత్రిమ మేధ లాంటి కోర్సులను ప్రవేశపెట్టాలని సిఫార్సు చేశారని.. దీనిపై సాంకేతిక విద్యామండలి ఏం చర్యలు తీసుకుంటుందన్న ప్రశ్నకు కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, ఇంటర్‌నెట్ ఆఫ్ థింక్స్, రోబోటిక్స్ లాంటి 10 సబ్జెక్టులపై ఏఐసీటీఈ దృష్టి సారించిందని చెప్పారు. దానిపై స్పష్టమైన విధానంతో ముందుకు వస్తామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకనుగుణంగా ఆదర్శ పాఠ్య ప్రణాళికను గత ఏడాది రూపొందించామన్నారు. ఇటీవల అనుమతుల మార్గదర్శకాల్లో ప్రతి కళాశాల అయిదు ఎంఓయూలు కుదుర్చుకోవాలని నిబంధన విధించామని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో పీహెచ్‌డీ విద్యార్హత కలిగిన అధ్యాపకుల కొరతను దృష్టిలో పెట్టుకొని, విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏఐసీటీఈ నేషనల్ డాక్టోరల్ ఫెలోషిప్(ఎన్‌డీఎఫ్) పేరిట గత ఏడాది కొత్త పథకానికి శ్రీకారం చుట్టామన్నారు. గేట్ ర్యాంకుల ద్వారా పీహెచ్‌డీ చేసే వారికి నెలకు రూ.28 వేల చొప్పున మూడేళ్లపాటు ఉపకార వేతనం అందిస్తున్నామన్నారు. ఏఐసీటీఈ ఆమోదం ఉన్న విద్యాసంస్థల్లో పీహెచ్‌డీ చేసే వారికి ఏడాదికి 150 మందికి ఫెలోషిప్ అందిస్తున్నామని తెలిపారు.

మా కళాశాలలు మూసివేస్తాం!

జేఎన్‌టీయూహెచ్‌కు 8 దరఖాస్తులు

ఈనాడు, హైదరాబాద్: ఇంజినీరింగ్ కళాశాలలను మూసివేస్తామని, అందుకు నిరభ్యంతర ధ్రువపత్రాలు ఇవ్వాలని 8 కాలేజీల యాజమాన్యాలు జేఎన్‌టీయూహెచ్‌కు దరఖాస్తు చేశాయి. కళాశాలల మూసివేతతోపాటు కోర్సులు, సీట్లు తగ్గించుకునేందుకు దరఖాస్తు గడువు ఈనెల 8వ తేదీ వరకు ఉంది. ఇప్పటివరకు 8 అభ్యర్థనలు అందాయని రిజిస్ట్రార్ ఆచార్య యాదయ్య తెలిపిన నేపథ్యంలో, ఆ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సీట్లు భర్తీ కాకపోవడం వల్లనే కళాశాలల మూసివేతకు యాజమాన్యాలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో 2018-19 విద్యాసంవత్సరానికి 17 ప్రభుత్వ, 188 ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు అనుమతి దక్కింది. ప్రైవేట్ ఓయూ పరిధిలో 10, కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో 5 కళాశాలలుండగా మిగిలినవి జేఎన్‌టీయూహెచ్‌కు అనుబంధంగా ఉన్నాయి. ఈసారి వాటి సంఖ్య మరింత తగ్గుతుందని, ఇంజినీరింగ్ సీట్లు కొంతమేరకు తగ్గుతాయని భావిస్తున్నారు. ఇదే విద్యాసంవత్సరానికి 96,518 బీటెక్ సీట్లు అందుబాటులో ఉండగా, 68,296 సీట్లు భర్తీ అయ్యాయి.

అంతరిక్షం.. ప్రపంచ ఉమ్మడి ఆస్తి

- ఇన్‌కాయిస్ వ్యవస్థాపక దినోత్సవంలో ఇస్రో మాజీ ఛైర్మన్ రాధాకృష్ణన్




ఇన్‌కాయిస్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్, ఇన్‌కాయిస్ డైరెక్టర్ సతీష్ సి.షెనాయ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అంతరిక్షం.. ప్రపంచ దేశాల ఉమ్మడి ఆస్తి అని, మానవ సంక్షేమం కోసం అన్ని దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని ఇస్రో మాజీ ఛైర్మన్ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని భారత జాతీయ మహాసముద్ర సమాచార సేవాకేంద్రం (ఇన్‌కాయిస్) 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. "భారతదేశం అంతరిక్ష ప్రయోగాల్లో సాధించిన విజయాలతో ప్రపంచ దేశాల సరసన నిలిచింది. ప్రజాధనంతో నిర్మితమవుతున్న పరిశోధనా సంస్థలు ప్రజలకు, దేశానికి సేవలందించాలి. ఇలాంటి సేవల విషయంలో ఇన్‌కాయిస్ ముందు వరుసలో ఉంది. గగన్‌యాన్ ద్వారా ముగ్గురిని అంతరిక్షంలోకి పంపించి వారం రోజుల పాటు అక్కడే ఉంచి తిరిగి క్షేమంగా భూమిపైకి తీసుకురావడానికి ఇస్రో పరిశోధనలు చేస్తోంది. చంద్రయాన్-2లో రోవర్‌ను చంద్రుడిపై దింపనున్నాం. ప్రయోగానికి కొన్ని నిమిషాల ముందు కూడా వైఫల్యాలను గుర్తించే బలమైన వ్యవస్థ ఉండాలి. మార్స్‌పైకి మానవ సహిత అంతరిక్ష యాత్ర చేపట్టాలంటే వ్యోమగాములకు 1000 రోజులకు మించి అంతరిక్షంలో గడపగలిగే శక్తి ఉండాలి. కానీ, ఇప్పటి వరకు ఉన్న రికార్డుల ప్రకారం గరిష్ఠంగా 365 రోజులు మాత్రమే అంతరిక్షంలో గడిపారు. మార్స్‌పై మనుషులు ఉండాలంటే మాడ్యూల్, కంటైనర్లలో గడపాలి. వాటిని అక్కడికి ఎలా తరలించాలనేది సమస్య. ఇవన్నీ రానున్న రోజుల్లో సాధ్యం కావచ్చు. కలలు కనడంలో తప్పులేదుగా.." అని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సముద్ర అన్వేషణ' అనే అంశంపై 7, 8, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌కాయిస్ డైరెక్టర్ సతీష్ షెనోయ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు శిరస్త్రాణం తప్పనిసరి

ఈ నిబంధన అతిక్రమించి జరిమానాకు గురయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు: జగిత్యాల జిల్లా కలెక్టర్

జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులు విధిగా శిరస్త్రాణం ధరించాలని జిల్లా కలెక్టర్ శరత్ ఆదేశించారు. భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం అన్ని శాఖల అధిపతులకు ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయాలకు వచ్చినా, ఇతర పనులపై వెళ్లినా శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించాలని, ఎవరైనా ఉద్యోగులు ఈ నిబంధనను అతిక్రమించి ఈ చలాన్ పద్ధతిలో జరిమానా చెల్లించాల్సి వస్తే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణికి, కార్యాలయాలకు పనుల కోసం వచ్చే ప్రజలు హెల్మెట్‌తో వస్తే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ద్విచక్ర వాహనాలపై పాఠశాలలకు వచ్చే ఉపాధ్యాయులందరూ విధిగా శిరస్త్రాణం ధరించే రావాలని కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో డీఈవో ఎస్.వెంకటేశ్వర్లు ఉత్తర్వులిచ్చారు.



ఈనాడు

కేదస రాజేసిన కుంపటి!

అతి చేస్తే గతి చెడుతుందన్న సత్యం స్వానుభవ పూర్వకంగా తెలిసివచ్చినా, దాని నుంచి గుణపాఠాలు నేర్వని కేదస (సీబీఐ) దుందుడుకుతనం కోల్‌కతాలో కొత్తగా రాజకీయ అగ్గి రాజేసింది. సామాన్య మదుపరుల సొమ్ము వేలకోట్ల రూపాయల్ని స్వాహా చేసిన శారద, రోజ్‌వ్యాలీ పోంజీ కుంభకోణాల దర్యాప్తును నీరు గార్చేందుకు ప్రయత్నించారంటూ కోల్‌కతా పోలీస్ కమిషనర్ రాజీవ్ కుమార్‌పై అభియోగాలు మోపిన కేదస ఆయన పరారీలో ఉన్నారంటూనే- ఉన్నపళంగా 40మంది అధికారులతో రాజీవ్ విచారణకు దిగబడటం ఉద్రిక్తతల్ని పెంచింది. రాజీవ్‌ను కేదస నిర్బంధించే అవకాశమూ ఉందన్న అంచనాల నేపథ్యంలో మమత ప్రభుత్వం ఆయనకు రక్షణగా నిలవడంతో- కనీవినీ ఎరుగని విధంగా పోలీసులు, పారామిలిటరీ బలగాల మోహరింపులతో కోల్‌కతా రాజకీయ కాక దిల్లీకి పాకింది. కేదసను అడ్డంపెట్టుకొని కేంద్రం విపక్ష పాలిత రాష్ట్ర ప్రభుత్వంపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ మమతా దీదీ చేపట్టిన సత్యాగ్రహ దీక్ష పార్లమెంటులోనూ ప్రతిధ్వనించింది. మరోవంక, రాజీవ్ కుమార్ దర్యాప్తునకు సహకరించేలా ఆదేశించాలని కోరడంతో పాటు మమత ప్రభుత్వం, పశ్చిమ్ బంగ పోలీసులపైనా కోర్టు ధిక్కార ఫిర్యాదును కేదస సుప్రీంకోర్టుకు సమర్పించింది. సాక్ష్యాలను నాశనం చేసేందుకు పోలీస్ కమిషనర్ ప్రయత్నించారనడానికి ఆధారాలు సమర్పించాలని కేదసను ఆదేశించిన న్యాయపాలిక- అది నిజమని రుజువైన పక్షంలో అతగాడు పశ్చాత్తాపపడే స్థాయిలో తమ స్పందన ఉంటుందంటూ విచారణను నేటికి వాయిదా వేసింది. సుప్రీం స్పందన ఇంత సూటిగా, స్ఫుటంగా, రాజ్యాంగబద్ధంగా ఉన్నప్పుడు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వ్యవహార సరళి రాజ్యాంగ విహితంగా ఉండనక్కర్లేదా అన్నది ఆలోచనాపరుల్ని కలచివేస్తున్న ప్రశ్న. కేంద్ర రాష్ట్ర సంబంధాల్లోని సున్నితత్వాన్ని, సమాఖ్య స్ఫూర్తిని మన్నిస్తూ ముందుచూపుతో మర్యాద పూర్వకంగా అందరూ నడుచుకోవాల్సి ఉండగా- ఈ తరహా దుర్రాజకీయ రగడ జాతి సమగ్రతకు చెరుపు చెయ్యదా?

రాజీవ్ కుమార్‌తో పాటు మరో ముగ్గురు పోలీసు అధికారుల్ని తాము ప్రశ్నించాలనుకొంటున్నట్లు కేదస నిరుడు పశ్చిమ్ బంగ డీజీపీకి లేఖ రాసింది. 2013లో రాజీవ్ సారథ్యంలో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)లో సభ్యులైన వీరంతా శారదా కుంభకోణంలో లబ్ధి పొందిన పెద్ద తలకాయల్ని రక్షించేందుకు సాక్ష్యాల్ని నిర్మూలించడానికో, తారుమారు చెయ్యడానికో పాల్పడ్డారని కేదస భావిస్తోంది. కేదస ప్రత్యేక సంచాలకుడిగా రాకేశ్ అస్థానా ఆధ్వర్యంలో ఈ కుంభకోణాల దర్యాప్తు సాగగా, కోల్‌కతా పోలీసుల వెంట ఎందుకు పడుతున్నారని సంచాలకుడిగా ఆలోక్‌వర్మ అతగాణ్ని ప్రశ్నించినట్లు గతంలో వార్తా కథనాలు వెలువడ్డాయి. కీలకమైన కేసుల్లో ఇద్దరి మధ్య విభేదాలే ఇరువురి కొంప ముంచేసిన నేపథ్యంలో- కొత్త సంచాలకుడి పదవీ స్వీకారానికి ముందునాడే రాజకీయ మందుపాతర పేలింది! యూపీఏ ప్రభుత్వం కేదసను మోదీ, అమిత్ షాలను వేధించేందుకు ఉసిగొలుపుతోందని 2014 ఎన్నికలకు ముందు అరుణ్ జైట్లీ విరుచుకుపడ్డట్లుగానే, నేడు విపక్ష శిబిరం అదే తరహా అభియోగాలతో విమర్శలు గుప్పిస్తోంది. 2015 డిసెంబరులో కేదస దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ కార్యాలయంపై దాడిచెయ్యడం సంచలనం సృష్టించింది. ముఖ్య కార్యదర్శి రాజేందర్ కుమార్‌ను లక్షించే దాడి చేశామని కేదస చెప్పినా, ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్న అంతస్తునంతా 'సీజ్' చెయ్యడం ఆ సంస్థ మొండి, బండతనాన్నే కళ్లకు కట్టింది. కేంద్ర సర్కారుతో సఖ్యత చెడిన మరుక్షణం పాత కేసుల కోలాటాన్ని కేదస తెరపైకి తేవడంతో ఆంధ్రప్రదేశ్, పశ్చిమ్ బంగ, ఛత్తీస్‌గఢ్ వంటివన్నీ దర్యాప్తు సంస్థకు (కేసుల దర్యాప్తునకు) గతంలో ఇచ్చిన సాధారణ అనుమతిని రద్దు చేశాయి. కేదస, ఈడీ వంటి వ్యవస్థల్ని రాజకీయ పనిముట్టుగా దిగజారుస్తున్న పోకడల వల్లే- సామరస్య పూర్వకంగా ఉండాల్సిన కేంద్ర రాష్ట్ర సంబంధాలు రాజకీయ రణఘోషలతో కదలబారుతున్నాయి!

'ఇప్పుడంతా డాగీ (మచ్చపడిన) నాయకులే, బాగీ (విప్లవ) నేతలు ఎవరున్నారు?' అని ప్రధానమంత్రిగా వాజ్‌పేయీ లోగడ వాపోయారు. దాదాపు రూ.10 వేలకోట్ల ప్రజాధనాన్ని కైంకర్యం చేసిన శారదా కుంభకోణంపై జరుగుతున్న కేదస దర్యాప్తును సుప్రీంకోర్టు పర్యవేక్షించాలంటూ అభ్యర్థించింది మమతా దీదీయే. ఇప్పటికే ఎంపీలు కొందర్ని నిర్బంధించిన కేదస ద్వారా తమ పార్టీకే ఉచ్చు బిగించాలని కేంద్రం కుట్ర పన్నుతోందని మమత భావిస్తున్నారు. యోగి ఆదిత్యనాథ్, అమిత్ షాల పర్యటనల సందర్భంగా హెలికాప్టర్లు దిగడానికి అనుమతి నిరాకరణలతో విభేదాల్ని రాజకీయ వైరాలుగా ముదరబెట్టడంలో తిలాపాపం తలా పిడికెడు! రాజ్యాంగంలోని ఏడో షెడ్యూలు 256, 257 అధికరణల అనుసారం- కేంద్ర దర్యాప్తు అధికారులకు వ్యతిరేకంగా రాష్ట్ర అధికారులు పని చెయ్యడానికి వీల్లేదని రాజ్యాంగ నిపుణులు సుభాష్ కశ్యప్ చెబుతున్నారు. యుద్ధసమయంలోనే కాదు, సాధారణ పరిస్థితుల్లోనూ దేశాన్ని కలిసికట్టుగా ఉంచగలిగేటంత పటిష్ఠమైనది భారత రాజ్యాంగమని అంబేడ్కర్ మహాశయుడే తీర్మానించినా, దాని స్ఫూర్తిని నిలబెట్టలేని పెడపోకడలతోనే పెచ్చరిల్లుతున్నాయి ప్రమాదకర పేచీలు! కేంద్ర రాష్ట్ర సంబంధాల్లో అత్యంత కీలకమైనది 'రాజ్యాంగ నైతికత' అని ప్రకటించిన సుప్రీంకోర్టు- 'రాజ్యాంగ హేతుబద్ధత' మరో దారిదీపమని నిరుడు జులైలో స్పష్టీకరించింది. రాజ్యాంగబద్ధ పాలనకు కట్టుబడతామని ప్రమాణం చేస్తున్న ప్రభుత్వాలు, సంకుచిత రాజకీయ సులోచనాల్ని పక్కన పెట్టనంత కాలం కేంద్ర రాష్ట్ర సంబంధాలు ఇలా ప్రమాదకర ఆటుపోట్లకు లోనవుతూనే ఉంటాయి!

ముక్తాయింపుగా కంటితుడుపు



డాక్టర్ ఎస్.అనంత్

ఓటాన్ అకౌంట్ అనేది తాత్కాలిక బడ్జెట్ మాత్రమే. కానీ, ఎన్డీయే సర్కారు 2019-20 సంవత్సరానికి సమర్పించిన తాత్కాలిక బడ్జెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ అన్నట్టు హడావుడి చేసింది. రైతాంగ సంక్షోభాన్ని పరిష్కరించాలంటే రుణమాఫీ కన్నా కొంత ఆదాయాన్ని అందించడం మేలంటూ బడ్జెట్లో ఆ మేరకు కేటాయింపులు జరిపి ప్రచార ఆర్భాటానికి దిగింది. ఇప్పటికి అయిదు బడ్జెట్లు, ఒక తాత్కాలిక బడ్జెట్‌ను సమర్పించిన ఎన్డీయే ప్రభుత్వం వ్యవసాయానికి ఇంతవరకు ఒరగబెట్టిందేమీ లేదు. ఇన్నేళ్ల పాలనలో వ్యవసాయం పట్ల దాని విధానం పూర్తిగా విఫలమైంది. అసలు వ్యవసాయంలో సంక్షోభమే లేదంటూ చెబుతూ వచ్చిన సర్కారు ఎట్టకేలకు రైతులు కడగండ్ల పాలవుతున్నారని గుర్తించడం గుడ్డిలో మెల్ల. నరేంద్ర మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతూనే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా రైతులకు అండగా నిలవడానికి ప్రభుత్వం వద్ద దీర్ఘకాలిక వ్యూహం లేకుండా పోయింది. అధికారంలోకి వచ్చిన వెంటనే పటిష్ఠ వ్యూహం చేపట్టి అమలు చేయాల్సింది పోయి వ్యవహారాన్ని నానబెడుతూ వచ్చింది. తాత్కాలిక బడ్జెట్లో ఆర్భాటమెక్కువ, విషయం తక్కువ. అరకొర పరిష్కారాలతో ముందుకు సాగే ధోరణే బడ్జెట్లో కనిపించింది. రైతు కుటుంబాలకు దీనివల్ల ఒరిగిందేమీ లేదు. 2015 వరకు రోజుకు సగటున 34 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారు. తరవాత ఈ ఆత్మహత్యల గణాంకాల సంకలనం, ప్రచురణలను ప్రభుత్వం నిలిపేసింది. దాదాపు 60 శాతం రైతు ఆత్మహత్యలకు ప్రధాన కారణం- మోయలేని రుణ భారమే!

ప్రయోజనం పరిమితం

తాత్కాలిక బడ్జెట్లో వ్యవసాయం, గ్రామీణ జీవనానికి సంబంధించి రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. మొదటిది- ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 2018 డిసెంబరు నుంచి సంవత్సర కాలంలో మూడు వాయిదాల్లో మొత్తం ఆరువేల రూపాయలను రైతుకు చెల్లించడం. రెండు హెక్టార్ల (అయిదు ఎకరాల) లోపు పొలం ఉన్న ప్రతి రైతుకు 2019-20 సంవత్సరంలో ఈ సొమ్ము చెల్లిస్తారు. బడ్జెట్లో దీనికి రూ.75,000 కోట్లు కేటాయించారు. రెండో ముఖ్యాంశం- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ.60,000 కోట్లు కేటాయించడం. ప్రకృతి వైపరీత్యాలకు గురైన రైతులకు రెండు శాతం వడ్డీ రాయితీ, అటువంటి గడ్డుస్థితిలోనూ సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు అదనంగా మూడు శాతం వడ్డీ రాయితీ ఇవ్వాలని బడ్జెట్ ప్రతిపాదించింది. పాడి కోసం కిసాన్ క్రెడిట్ కార్డుల మీద తీసుకున్న రుణాలకూ రెండు శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. మొత్తం మీద బడ్జెట్లో వ్యవసాయానికి రూ.1.40 లక్షల కోట్లు కేటాయించారు. గత ఏడాదికన్నా ఇది రూ.57,600 కోట్లు ఎక్కువ. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతుకు రూ.6,000 చొప్పున చెల్లించడానికి కేటాయించిన రూ.75,000 కోట్లు ఈ పద్దులోనే ఇమిడి ఉన్నాయి.

చిన్న రైతులకు ఆరు వేల రూపాయలు చెల్లిస్తామనే హామీ గురించి ఎన్డీయే సర్కారు హడావుడి చేస్తోంది. రైతుల్లో 86.21 శాతం ఈ హామీ వల్ల లబ్ధి పొందుతారు. దేశంలోని 14.70 కోట్ల వ్యవసాయ కమతాల్లో 92 శాతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా మొత్తం 14 రాష్ట్రాల్లో ఉన్నాయి. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 12 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతారు. స్థూల దేశీయోత్పత్తిలో 0.50 శాతం ఈ పథకానికి ఖర్చవుతుంది. రూ.6,000 నగదును నేరుగా రైతుల ఖాతాలోనే జమ చేస్తారు. అయితే వ్యవసాయ కూలీలు, కౌలు రైతులకు ఒరిగేది సున్న. రుణ భారం కింద నలిగిపోతున్న రైతులను ఈ కంటి తుడుపు చర్య ఉద్ధరించదు! ఆగ్రహావేదనలతో రగిలిపోతున్న రైతులను ఆదుకోవడానికి ఏదో చేశామని చెప్పుకోవడానికి సర్కారు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చినట్లు కనబడుతోంది. ఇటీవల రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ ఓటమికి ప్రధాన కారణం రైతుల ఆగ్రహమేనని గుర్తించిన కేంద్ర సర్కారు, ఈ ఉపశమన చర్య చేపట్టింది. కాంగ్రెస్ హామీ ఇచ్చిన రైతు రుణమాఫీ కన్నా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకమే మిన్న అని చెప్పుకొంటోంది. నిజానికి



అయిదేళ్లుగా రైతుల కడగండ్లపై ఉదాసీన వైఖరి

కేంద్రం ఇవ్వబోతున్న అరకొర మొత్తం కన్నా రైతు రుణమాఫీయే ఉత్తమ పరిష్కారం. దీనివల్ల రైతులకు గుక్కతిప్పుకొనే వీలు కలిగి తదుపరి సీజనులో సేద్యంపై దృష్టి కేంద్రీకరించగలుగుతారు. రైతుల బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తుంది కాబట్టి బ్యాంకులూ తేరుకుంటాయి. వాటి నిరర్థక ఆస్తులు అదుపు తప్పిపోవు. 2015-16లో దేశంలో సాగైన సగటు వ్యవసాయ కమతం విస్తీర్ణం 1.08 హెక్టార్లు (2.66 ఎకరాలు) అని వ్యవసాయ గణన తేల్చింది. ఈ లెక్కన ప్రతి రైతు సగటున ఎకరాకు రూ.2,255 నగదు సహాయం పొందుతాడు. అదీ మూడు వాయిదాల్లో విడతకు రూ.751 చొప్పున లభిస్తుంది. అదే అయిదు ఎకరాలున్న రైతు ఎకరాకు ప్రతి వాయిదా కింద రూ.400 మాత్రమే పొందుతాడు. ఎకరా విస్తీర్ణంలో వరి పండించడానికి రూ.20,000 ఖర్చవుతుంది. వాణిజ్య పంటలకైతే ఇంకా ఎక్కువ ఖర్చు చేయాల్సి వస్తుంది. అసలు వరి నాట్లకే రైతు ఎకరాకు రూ.2,000 చొప్పున ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద వ్యవసాయదారులకు అందే రూ.6,000 ఏ మూలకూ సరిపోదని వ్యవసాయరంగ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వాన్ని మాత్రం ఈ పథకం వార్తల్లోకి ఎక్కిస్తుంది.

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతుల రుణ భారాన్ని తగ్గించడానికి ఏ మాత్రం తోడ్పడదు. 2015 ఫిబ్రవరి నాటికి వ్యవసాయం, అనుబంధ కార్యకలాపాలకు రుణాల కింద రూ.7.58 లక్షల కోట్లు అందజేశారని రిజర్వ్‌బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. 2018 అక్టోబరుకల్లా ఈ మొత్తం రూ.10.53 లక్షల కోట్లకు పెరిగింది. గ్రామీణ, పట్టణ, మహానగర ప్రాంతాల్లో నేరుగా వ్యవసాయం పేరిట తీసుకున్న రుణాలు రూ.8.90 లక్షల కోట్లు. కిసాన్ క్రెడిట్ కార్డుల కింద పంపిణీ అయిన రుణాలు రూ.3.92 లక్షల కోట్లు. 2018 మార్చి నాటికి రూ.41,980 కోట్ల మేరకు షరతులతో కూడిన రుణాలను అందించారు. బ్యాంకుల నుంచి అందే రుణాలు వ్యవసాయ పెట్టుబడులకు ఏ మాత్రం సరిపోవనేది కఠిన వాస్తవం.

సమస్యలపై అవగాహనా లోపం

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పటి నుంచి వ్యవసాయ ధరలు పడిపోవడం అన్నింటికన్నా పెద్ద సమస్య. రైతులకు గిట్టుబాటు ధరలు లభించనిదే ఈ సమస్య నివృత్తి కాదు. ప్రధానమంత్రి మొదలు ఇతర విధానకర్తలకు వ్యవసాయం గురించి అవగాహన లేకపోవడం వల్ల పరిస్థితి మరింత తీవ్రమైంది. ఉదాహరణకు పప్పు గింజల కొరతను అధిగమించడానికి ఆ పంటలను అధికంగా పండించాలని ప్రధాని మోదీ 2015లో రైతులకు పిలుపిచ్చారు. రైతులు ఆ పని చేయడంతో పప్పుల ఉత్పత్తి పెరిగి ధరలు పడిపోయాయి. పప్పు గింజల ఉత్పత్తిలో స్వావలంబన సాధించాలనడం బాగానే ఉన్నా, పెరిగిన ఉత్పత్తిని ఉపయోగించుకొనేట్లు విపణిని విస్తరించి రైతులకు మంచి ధర వచ్చేట్లు జాగ్రత్త తీసుకోవాలన్న ఆలోచన విధానకర్తలకు లేకపోయింది.

ప్రభుత్వం పలు రాయితీలను ఉపసంహరించడమూ ధరలు పెరగడానికి కారణమైంది. ఉదాహరణకు 2014 జీడీపీలో 0.9 శాతంగా ఉన్న ఎరువుల రాయితీలు, 2019-20 వచ్చేసరికి 0.4 శాతానికి తగ్గిపోయాయి. మరోవైపు పెట్రోలు, డీజిల్ రాయితీలనూ తొలగించారు. సాగు వ్యయం పెరిగిపోయి, పంట ధరలు పడిపోయిన సమయంలో పెట్రో రాయితీలను తొలగించడం రైతుకు గోరుచుట్టుపై రోకటి పోటైంది. వ్యవసాయ యాంత్రీకరణకు, మోటార్లతో భూగర్భ జలాల తోడివేతకు డీజిల్ వినియోగం పెరిగిపోతున్న సందర్భంలో రాయితీల తొలగింపు సాగువ్యయాన్ని పెంచేసింది. వ్యవసాయ కుటుంబాల ఆదాయంలో 55 శాతం వ్యవసాయేతర కార్యకలాపాల నుంచి వస్తోందని నాబార్డ్ అధ్యయనం తేల్చింది. ఈ తరహా ఆదాయాన్ని పెంచడానికి బడ్జెట్ ఎటువంటి ప్రతిపాదన చేయకపోవడం గమనార్హం.


ప్రభుత్వం తన ఆకస్మిక నిర్ణయాలతో రైతుల పుట్టి ముంచుతోంది. కొన్ని పంటల ఎగుమతిపై ఉన్నట్టుండి పరిమితులను ఎత్తివేయడం, మరి కొన్ని పంటల దిగుమతికి హఠాత్తుగా అనుమతించడం వంటి చర్యలు మార్కెట్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. చీటికిమాటికి పంటల ఎగుమతి విధానాన్ని మారుస్తూ ఉంటే విదేశాల్లో మన ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ ఏర్పడదు. దీని వల్ల విదేశీ దిగుమతిదారులు వేరే ఖాతాదారులను చూసుకునే పరిస్థితి ఏర్పడుతుంది. భారత వ్యవసాయ రంగం నేడు ఎదుర్కొంటున్న సమస్యల్లో అనేకం స్వయంకృతాపరాధాలే. పాలక పార్టీలు సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్నాయి. అంతిమంగా రైతులకు గిట్టుబాటు ధర లభించనంతవరకు బడ్జెట్లో ఎన్ని వరాలిచ్చినా ఉపయోగం ఉండదు!

(రచయిత- ఆర్థిక రంగ విశ్లేషకులు)

ఆచరణలో అనేక కష్టాలు

దేశంలో చాలావరకు కమతాలు ఒక్కరికన్నా ఎక్కువమంది పేర్ల మీదే ఉంటాయి. ఉమ్మడి కమతాల సంఖ్య 1.726 కోట్లని గణాంకాలు సూచిస్తున్నాయి. అలాంటి కమతాలకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద ఎలా నగదు సహాయం అందిస్తారో స్పష్టత లేదు. ఈ నిధి కింద వచ్చే నగదు కుటుంబ సభ్యుల మధ్య పొరపొచ్చాలకు, జగడాలకు కారణం కాబోదని ఆశిద్దాం.

ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) కింద ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం సొమ్మును నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయవచ్చని అంటున్నారు. కానీ, అది అనుకున్నంత తేలిక కాదు. గ్రామాల్లో బ్యాంకు శాఖలు, ఏటీఎంలు, బ్యాంకుల వ్యాపార ప్రతినిధుల (బిజినెస్ కరస్పాండెంట్లు) సంఖ్య మునుపటికన్నా తగ్గిపోయింది. ఏటీఎమ్‌ల నుంచి డబ్బు తీసుకోవాలంటే దూరంలోని పట్టణాలకు, మండల కేంద్రాలకు వెళ్లాల్సిందే. అందుకు ఒక వ్యక్తికి రూ.50 నుంచి రూ.200 వరకు ఖర్చవుతుంది. డీబీటీ ఈ వ్యయప్రయాసలను లెక్కలోకి తీసుకోదు. కేవలం ప్రభుత్వ సౌలభ్యం గురించే ఆలోచిస్తోంది.



ప్రకృతి హితమే పరమార్థం

పోలండ్‌లోని కొటావిష్ నగరంలో ప్రపంచ పర్యావరణ సదస్సును ఉద్దేశించి పదిహేనేళ్ల స్వీడన్ బాలిక గ్రేటా వాతావరణ మార్పులపై చేసిన ప్రసంగం యావత్ ప్రపంచాన్ని ఆలోచింపజేసింది. 'పర్యావరణ విధ్వంసం కారణంగా మానవాళి మనుగడ సమీప భవిష్యత్తులో ప్రశ్నార్థకం కానుంది. మీరు గత పాతికేళ్లుగా సమావేశాలు నిర్వహిస్తున్నా, సమస్యకు పరిష్కారం కనుగొనడంలో విఫలమయ్యారు. మీరు మాకిచ్చే (పిల్లలకు) పృథ్వి పరిస్థితిని చూస్తే నిరాశ కలుగుతోంది' అంటూ ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. మూడేళ్ల క్రితం పారిస్‌లో 195 దేశాల ప్రతినిధులు పాల్గొన్న పర్యావరణ సదస్సు వాతావరణంలోకి విడుదలవుతున్న విషవాయువుల్ని (కర్బన ఉద్గారాలు) నియంత్రించాలని, తద్వారా ఉష్ణోగ్రతల పెరుగుదలను రెండు డిగ్రీలకు తగ్గించి భూతాపాన్ని కట్టడి చేయాలని నిర్ణయించింది. దురదృష్టవశాత్తు స్వీడన్ బాలిక గ్రేటా పేర్కొన్నట్లు ఈ సదస్సు భూతాప తీవ్రతను గుర్తించడంలో, సభ్యదేశాలకు స్పష్టమైన విధి విధానాలను నిర్దేశించడంలో విఫలమైందని చెప్పక తప్పదు. కర్బన ముద్రలను (కార్బన్ ఫుట్ ప్రింట్స్) తగ్గించుకొనే దిశలో దిద్దుబాటు చర్యలను చేపట్టడానికి కావల్సిన పరిజ్ఞానాన్ని, ఆర్థిక సహాయాన్ని తరుణ దేశాలకు ధనిక దేశాల నుంచి ఇప్పించడంలోనూ విజయవంతం కాలేకపోయింది.

గత ఒకటిన్నర శతాబ్ద కాలంలో పెరిగిన మోటారు వాహనాలు, పారిశ్రామికీకరణ, రసాయన, ప్లాస్టిక్ వినియోగం, భూగర్భంలోని చమురు, బొగ్గు విపరీతంగా వెలికి తీయడం వల్ల పర్యావరణంలో సమతుల్యత లోపించింది. కార్బన్ డయాక్సైడ్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్ వంటి విషవాయువులు అధిక మోతాదులో వాతావరణంలోకి విడుదలవుతున్నాయి. ఇవి భూమిపై వేడిని పీల్చుకుంటాయి. కానీ భూమి నుంచి బయటకు విడుదల కానివ్వవు. అదే సమయంలో వాతావరణంలోని కార్బన్ వాయువుల్ని పీల్చుకొనే సముద్రాలు తమ సామర్థ్యాన్ని మించి ఆమ్లత్వం చెందుతున్నాయి. ఫలితంగా భూతాపం పెరుగుతోంది. ఈ విషవాయువుల పరిమాణాన్ని కర్బన ముద్రల (కార్బన్ ఫుట్‌ప్రింట్స్) రూపంలో కొలుస్తారు. ప్రత్యామ్నాయ ఇంధనాలైన సౌర, వాయు ఆధారిత ఇంధనాల వినియోగం, అడవులను పెంచడం ద్వారా కర్బను ముద్రల పరిమాణాన్ని తగ్గించుకొని, భూతాపాన్ని కట్టడి చేయవచ్చునని అంతర్జాతీయ వాతావరణ అధ్యయన సంస్థ (ఐపీసీసీ) పేర్కొంది.

చమురు, బొగ్గు విచ్చలవిడిగా వినియోగించే ఆటోమొబైల్, రసాయన, ప్లాస్టిక్, రవాణా, విద్యుత్ ఉత్పాదనచేసే పరిశ్రమలే ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణాలు. బహుళజాతి సంస్థలు మితిమీరిన వస్తూత్పత్తి కోసం అడవులు, గనులు, నదులు అతిగా వినియోగిస్తూ పర్యావరణాన్ని విధ్వంసం చేస్తున్నాయి. పరిస్థితి ఏ స్థాయికి చేరిందంటే ప్రకృతితో సహజంగా మమేకం కావాల్సిన ప్రజానీకం కనీసం పీల్చేందుకు స్వచ్ఛమైన గాలిని, తాగేందుకు శుద్ధజలాలనూ పొందలేకపోతోంది. పోలండ్ సదస్సు



స్వీడన్ బాలిక గ్రేటా



ప్రమాదంలో పర్యావరణం

భూతాపాన్ని గుర్తించడంలో, దాని నివారణకు నిర్దిష్టమైన చర్యలు సూచించడంలో విఫలం కావడానికి అమెరికా, సౌదీ అరేబియా, రష్యా ఒత్తిళ్లే ప్రధాన కారణం. కర్బన ముద్రల పరిమాణాన్ని తగ్గించుకుని భూతాపాన్ని కొంతవరకైనా నియంత్రించడంలో భాగంగా సభ్యదేశాలు పారిశ్రామికీకరణలో, రవాణా, వ్యవసాయం, గృహనిర్మాణ రంగాల్లో చమురు, బొగ్గుకు ప్రత్యామ్నాయంగా సౌర, వాయు ఇంధన వనరులను ఉపయోగించాలి. అడవులను అధికంగా పెంచాలి. ఇందుకు ధనిక దేశాలు అభివృద్ధి చెందుతున్న ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికాలోని తరుణ దేశాలకు ఉదారంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆర్థిక సహాయాన్ని అందజేయాలని గతంలో పారిస్ సదస్సు నిర్ణయించింది. ప్రస్తుతం వాతావరణంలోకి 28.8 శాతం ఉద్గారాలు అమెరికా నుంచే వెలువడుతున్నాయి. ఈ కాలుష్యం అమెజాన్ అడవుల నుంచి, ఆఫ్రికా, హిమాలయాల వరకు విస్తరిస్తోంది. అమెరికా జనాభా ప్రపంచంలో అయిదు శాతమే. అయితే భూతాపం పెరగడానికి ఆ దేశమే ప్రధాన కారణం. ప్రపంచంలోని మిగిలిన ప్రజానీకం ఈ దుష్ఫలితాలను భరించాల్సి వస్తుంది. జరిగిన పాపానికి ప్రస్తుత సదస్సులో అన్ని సభ్యదేశాలను సమానంగా బాధ్యులను చేయడం ఆమోదయోగ్యం కాదు.

ఐరాస రూపొందించిన శతాబ్ది అభివృద్ధి ఆశయాలను నెరవేర్చి, తరుణ దేశాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే విద్య, ఉద్యోగ, వైద్య సదుపాయాలు మెరుగు కావాలి. ఇందుకు పారిశ్రామికీకరణ, వస్తూత్పత్తి తప్పనిసరి. ప్రత్యామ్నాయ విధానాల్లో ప్రకృతి సహజ శక్తి వనరుల సహాయంతో అభివృద్ధి సాధించడానికి, బొగ్గు వినియోగాన్ని త్యజించి సౌర, వాయు ఇంధనాల ఉత్పత్తిని 175 గిగావాట్లకు 2030 నాటికి పెంచుకోవడానికి భారత్ ముందుకు సాగుతోంది. అమెరికా విడుదల చేసే ఉద్గారాల కంటే భారత్ విడుదల చేసే కాలుష్య వాయువుల పరిమాణం ఏడు రెట్లు తక్కువ. అయినప్పటికీ సమస్య పరిష్కారానికయ్యే ఆర్థిక భారాన్ని ధనిక దేశాలతో సమానంగా భారత్ వంటి తరుణ దేశాలు సమానంగా భరించాలని పోలండ్ సదస్సులో రూపొందించిన నియామావళి పేర్కొనడం సమంజసం కాదు. పారిశ్రామికవేత్తలకు అధిక లాభాలు తప్ప ప్రకృతి సంరక్షణ, ప్రజావసరాలు ఏ మాత్రం పట్టవని కారల్ మార్క్స్ ఏనాడో హెచ్చరించారు. మహాత్మాగాంధీ సూచించిన స్వయం పోషక గ్రామాలు సాధించడానికి, పర్యావరణ హిత ఉత్పత్తిని చేపట్టాలి. ఇందుకోసం వీలైనంత వరకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి. స్థానిక వనరులతో వస్తూత్పత్తి చేపట్టాలి. ప్రకృతి వనరులకు నానో, బయోటెక్నాలజీలను జోడించి కర్బన ప్రత్యామ్నాయ ఇంధనాలతో ఉత్పత్తులు చేయవచ్చునని ఇటీవల జర్మనీ, జపాన్‌లోని వివిధ ప్రయోగాత్మక ప్రాజెక్టులు నిరూపించాయి. ఈ దిశగా భారత్‌లోనూ అడుగులు పడాలి!

- డాక్టర్ సోమసుందర్ మర్ల

(రచయిత- న్యూదిల్లీలోని ఐసీఏఆర్ బయోటెక్నాలజీ విభాగంలో ప్రధాన శాస్త్రవేత్త)

ఈనాడు లేఖలు

సర్పంచులకు సదవకాశం

రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. సర్పంచులు గ్రామాల్లో కొలువుతీరారు. పదేళ్ల క్రితం నాటికన్నా భిన్నమైన పరిస్థితులు గ్రామాల్లో నేడు నెలకొని ఉన్నాయి. ప్రపంచంలో ఎవరెక్కడ ఉన్నా సాంకేతిక పరిజ్ఞానం పుణ్యమా అని నిత్యం గ్రామంతో అనుబంధం పెంచుకోగలుగుతున్న రోజులివి. ఈ అవకాశాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకోవాలి. గ్రామంలో పుట్టి పెరిగి ఉన్నత స్థానాలకు ఎదిగినవారిని గుర్తించి వారి సహకారం తీసుకోవాలి. విద్య, వైద్యం వంటి విషయాల్లో వారి పాత్ర పెంచాలి. గ్రామాభివృద్ధే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా, చక్కటి ప్రణాళికలతో, స్వార్థరహితంగా పల్లెల మేలుకోసం సర్పంచులు పాటుపడాలి. కేంద్ర, రాష్ట్ర పథకాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా గ్రామాలకు మరిన్ని నిధులు రాబట్టుకోవాలి. పారిశుధ్య సమస్యలను అధిగమించి, పల్లెలను అందంగా తీర్చిదిద్దుకుని గ్రామస్వరాజ్య దీక్షతో పనిచేయాలి.

- సరికొండ వెంకట నర్సరాజు, మిర్యాలగూడ, నల్గొండజిల్లా

కోహ్లీసేన ముందున్న లక్ష్యాలు

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ పర్యటనలను భారత క్రికెట్ జట్టు ఘన విజయాలతో ముగించింది. ఇక వన్డే, టీ20 ప్రపంచకప్పు పోటీల్లో టీమిండియా సత్తా చూపాల్సి ఉంది. తాజా విజయాలు కోహ్లీసేనపై విపరీతమైన అంచనాలకు కారణమవుతున్నాయి. ఈ తరహా ఒత్తిళ్లు ఉన్నప్పుడు అవేవీ జట్టు సభ్యులపై ప్రభావం చూపకుండా చూసుకోవడం ఎంతో అవసరం. మరోవైపు ప్రచార కార్యక్రమాల్లో ఆటగాళ్లు ఎంతో హుందాగా పాల్గొనాలి. ఇటీవల ఒక టీవీ కార్యక్రమంలో హార్దిక పాండ్య, కె.ఎల్. రాహుల్ చేసిన వ్యాఖ్యానాలు తీవ్ర వివాదానికి దారితీశాయి. అలాంటి వివాదాలకు దూరంగా ఉంటూ టీమిండియా బృందం తమ ప్రతిభకు నిరంతరం సాన పెట్టుకోగలిగితే ప్రపంచ విజేతగా భారత్ మరోసారి నిలుస్తుందనడంలో సందేహం లేదు.

- వి.సాయిరాజ్, వివేకానందనగర్, హైదరాబాద్

యోగ చికిత్సలు

ప్రతి మనిషి జీవితంలో యోగ వియోగాలు తప్పనిసరి. అన్నీ అనుకూలంగా ఉంటే యోగం బావుందంటారు. వ్యవహారంలో- ధనయోగం, అధికార యోగం వంటి మాటల్ని కలిసిరావడమనే అర్థంలో ఉపయోగిస్తుంటారు.

భారతీయ జీవన విధానంలోనే యోగం ఒక భాగం. ఆదియోగి శివుడు. ఆదిశేషువు అవతారమైన పతంజలి తొలియోగ గురువంటారు. మహర్షులందరూ మహాయోగులే. సాధారణ స్థాయి నుంచి మహాయోగ స్థాయికి ఎదగడమే యోగసాధన.

యోగం అంటే దైవంతో అనుబంధమనే అర్థం చెబుతారు. ఎవరు మనకు సర్వస్వమో, ఆ దైవంతో అనుబంధంకన్నా కోరదగింది మరేముంటుంది?

తల్లి, తండ్రి, గురువు కనిపించే దైవాలు. వీరందరిలో కొలువుండే 'అంతర్యామి' కనిపించని దేవుడు. కనిపించడు కనుక లేడని నాస్తికులు పిడివాదం చేస్తారు. గాలి, పరిమళం కనిపించవు. అంతమాత్రాన వాటిని లేవనలేం కదా? అవి మన అనుభూతికి తెలుస్తాయి. అలాగే, అంతర్యామినీ అనుభూతి ద్వారా తెలుసుకోగలగాలి. అందుకు నిరంతర సాధన చెయ్యాలి.

సాధనలో అన్నీ కలిసి ఉంటాయి. పూజలు, జపాలు, వ్రతాలు, దేవాలయ దర్శనాలు, సత్సంగాలు, సద్గ్రంథాల అధ్యయనం... ఇలా వివిధ విధానాల్లో అంతర్యామి మందిరానికి దారులు ఉంటాయి.


మన చేతిలో జిజ్ఞాస అనే దీపం, ప్రేమ అనే వెలుతురుతో ఉండాలి. అప్పుడు అజ్ఞానం అనే అంధకారాన్ని చీల్చుకుంటూ ముందుకు సాగుతాం.

యోగం ప్రధానంగా రెండు పద్ధతుల్లో ఉంటుంది. ఒకటి భౌతికం. రెండోది ఆధ్యాత్మికం. భౌతిక యోగంలో శరీరం మనసు అదుపులోకి వస్తుంది. వయసు ప్రభావం పడకుండా దేహాన్ని చురుగ్గా శక్తిమంతంగా ఉంచుతుంది కనుక ఇది శరీరం వరకే పరిమితం.

ఆధ్యాత్మిక యోగంలో మనోనిశ్చలత ప్రాథమిక దశ. మనలోకి మనం ప్రయాణించడమే రెండో దశ.

శరీరం ఎప్పటికప్పుడు తనలోని మలినాలను విసర్జిస్తూ, తనను తాను రక్షించుకుంటుంది. ఇది శరీర సహజ ధర్మం. ఆహార నియమాలు పాటిస్తే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. అనారోగ్యానికీ మన చర్యలే కారణమవుతాయి. నిగ్రహం లేనప్పుడు జిహ్వకు బానిసలైపోతాం. అప్పుడు శరీరం నియంత్రణ కోల్పోతుంది.

చిన్నపిల్లలు చేతిలోని బొమ్మ పగలకొట్టి ఏడ్చినట్లు, చేజేతులా ఆరోగ్యాన్ని పాడు చేసుకుని వైద్యుల దగ్గరకు పరుగులు పెడతాం. ఇది కేవలం స్వయంకృతం.



అంతర్యామి

ప్రపంచానికి మనమే యోగ, ఆధ్యాత్మిక గురువులం. హిమాలయాల్లో ఎందరో యోగులు ధ్యానశక్తితో మృత్యుంజయులుగా ఉన్నట్లు చెబుతారు. వారిలో మహా అవతార్ బాబా ప్రముఖులు. 'ఒక యోగి ఆత్మకథ'లో మనం ఎందరో యోగుల అద్భుత చరిత్రలు తెలుసుకోవచ్చు.

యోగ ప్రపంచంలోకి ప్రవేశించగలిగితే చాలు. మన ఆత్మతో జీవించడం ఆరంభమవుతుంది. శరీర చికిత్సలన్నీ ఓషధులు, మూలికలకు సంబంధించినవి. యోగ చికిత్సలన్నీ ఆత్మను పరిశుద్ధం చేసుకోవడానికి అనుసరించే ఆధ్యాత్మిక ప్రక్రియలు.

జరుగుతున్నదేమిటంటే- భౌతికయోగంలో శరీరశుద్ధి మాత్రమే జరుగుతోంది. జరగవలసింది ఆత్మశుద్ధి కూడా. అలా జరగాలంటే, ముందుగా మనలోని కల్మషాలను బయటకు నెట్టివేసే ప్రక్రియలు పాటించాలి. ఆధ్యాత్మిక క్రమశిక్షణతోనే ప్రక్రియలు ఫలవంతమవుతాయి.

శరీరంలో కల్మషాలు నిల్వఉన్న కొద్దీ విషాలుగా మారి ఆరోగ్యానికి చేటు కలిగిస్తాయి. మానసిక కాలుష్యాలు మన నడవడిక మీద దుష్ప్రభావాలు చూపిస్తాయి. అవి విషంకన్నా ప్రమాదం. కాబట్టి, మనం ఆధ్యాత్మిక యోగ చికిత్సలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. అందరిపట్ల ఆత్మీయత, అందరి క్షేమం కోరడం, మధురంగా సంభాషించడం, మంచిని ప్రోత్సహించడం, ఆర్తులను ఆదుకోవడం ఆధ్యాత్మిక యోగ చికిత్సల్లో కీలకమైనవిగా గ్రహించాలి.

- కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

ఏప్రిల్ నాటికి భద్రాద్రి వెలుగులు

- శరవేగంగా విద్యుత్కేంద్రం ప్లాంట్ల నిర్మాణం
- అధునాతన యంత్రాలతో కాలుష్యానికి కళ్లెం

ఈనాడు - హైదరాబాద్

భద్రాద్రి విద్యుత్కేంద్రంలో రెండు ప్లాంట్లను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు జెన్‌కో కసరత్తు చేస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బయ్యారం వద్ద నిర్మిస్తున్న ఈ కేంద్రంలో మొదటి యూనిట్ నుంచి వచ్చే ఏప్రిల్ నెలాఖరులోగా ప్రయోగాత్మకంగా విద్యుదుత్పత్తి చేయాలని తెలంగాణ జెన్‌కో గడువు నిర్ణయించింది. ఒక్కొక్కటి 270 మెగావాట్ల చొప్పున మొత్తం 4 యూనిట్లను 1080 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. వీటిలో రెండు యూనిట్లను వేగంగా పూర్తి చేస్తున్నారు. వీటిలో



బయ్యారం వద్ద నిర్మాణంలో ఉన్న భద్రాద్రి విద్యుత్కేంద్రం

విద్యుదుత్పత్తి ప్రారంభమయ్యాక మిగతా వాటిని 2020 మార్చి నాటికి పూర్తి చేయాలనేది లక్ష్యం. తెలంగాణ ఏర్పడ్డాక నిర్మాణం ప్రారంభించిన రెండో విద్యుత్కేంద్రం ఇదే. ఇంతకుముందు కొత్తగూడెంలో 800 మెగావాట్ల ప్లాంట్లు 48 నెలలకు గాను రికార్డు సమయంలో 41 నెలల్లోనే పూర్తి చేశారు. కాబట్టి భద్రాద్రిని సైతం అదే స్ఫూర్తితో వేగంగా పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

పెరిగిన నిర్మాణ అంచనా వ్యయం

భద్రాద్రి విద్యుత్కేంద్రాన్ని సబ్ క్రిటికల్ పరిజ్ఞానంతో నిర్మిస్తున్నారు. ఈ పరిజ్ఞానంతో నిర్మించే కొత్త విద్యుత్కేంద్రం దేశంలో ఇదే ఆఖరిది. దీని తర్వాత నిర్మించే వాటిని అధునాతన సూపర్ క్రిటికల్ పరిజ్ఞానంతో చేపడితేనే కేంద్ర పర్యావరణ శాఖ అనుమతిస్తుంది. సబ్ క్రిటికల్ పరిజ్ఞానంతో నిర్మించే వాటిలో కాలుష్యం ఎక్కువగా విడుదలవకుండా కొత్త ప్రమాణాలను పాటించేందుకు ఆధునిక యంత్రాలను ఏర్పాటు చేయాలని కేంద్ర విద్యుత్‌శాఖ నిబంధనలు పెట్టింది. వీటిని తెలంగాణలో తొలిసారి భద్రాద్రి కేంద్రంలో అన్ని ప్లాంట్లకు జెన్‌కో ఏర్పాటు చేస్తోంది. దీనివల్ల కేంద్రం నిర్మాణ అంచనా వ్యయం రూ.7,290 కోట్ల నుంచి 8,536 కోట్ల రూపాయలకు పెరిగింది. తొలుత ప్రణాళిక తయారు చేసినప్పుడు ఈ కేంద్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్‌కు మెగావాట్‌కు రూ.6.75 కోట్లు అవుతుందని అంచనా వేశారు. కొత్త ప్రమాణాల ప్రకారం మెగావాట్ వ్యయం రూ.7.90 కోట్లకు పెరిగింది. దీనివల్ల ఇక్కడ ఉత్పత్తయ్యే కరెంటు యూనిట్ ధర రూ.4.84 నుంచి రూ.5.40 వరకూ పెరుగుతుందని అంచనా. దీనివల్ల అదనంగా యూనిట్ కరెంటు ఉత్పత్తి వ్యయం మరో 56 పైసలు పెరగనుందని తేలింది. కొత్త ప్రమాణాల ప్రకారం అధునాతన యంత్రాలను వాడటం వల్ల భద్రాద్రి కేంద్రం నుంచి కాలుష్యం తక్కువగా వెలువడుతుందని అంచనా. ఇందుకోసం బాయిలర్ల నిర్మాణ నమూనాలు మారుస్తున్నారు. రికార్డు స్థాయిలో ఈ ప్లాంటు నిర్మాణం పూర్తి చేసి విద్యుదుత్పత్తి చేస్తామని జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు 'ఈనాడు'కు చెప్పారు. దీనివల్ల రాష్ట్రానికి అదనంగా 1080 మెగావాట్ల విద్యుత్ రానున్న ఏడాదిలో అదనంగా సమకూరుతుందని వివరించారు.

మంత్రివర్గ విస్తరణపై వీడని ఉత్కంఠ

6వ తేదీకి బదులు 8, 9 తేదీల పరిశీలన?

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర మంత్రివర్గ విస్తరణపై ఉత్కంఠ కొనసాగుతోంది. ముందుగా ఈ నెల ఆరో తేదీన విస్తరణ ఉంటుందని అంతా భావించినా.. ఆ రోజు జరపడం లేదని వెల్లడైంది. ఆ రోజున ప్రగతిభవన్‌లో కొత్త పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన సమావేశం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. ఈ సమావేశం సోమవారం జరగాల్సి ఉన్నా దానిని ఆరో తేదీకి వాయిదా వేయడంతో మంత్రివర్గ విస్తరణ లేనట్టేనని తేలిపోయింది. ఈ నెల 7న విస్తరణపై ఊహాగానాలున్నా... సోమవారం వరకు ఎలాంటి ఏర్పాట్లూ జరగలేదు. సంఖ్యాశాస్త్ర పరంగా చూస్తే ఏడో తేదీన విస్తరణ జరిగేది అనుమానమేనని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నెల 8, 9 తేదీల్లో విస్తరణ అంశాన్ని సీఎం పరిశీలిస్తున్నట్లు సమాచారం. 8వ తేదీన 8 మందితో విస్తరణకు అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. అలా కాని పక్షంలో తొమ్మిదో తేదీన మంచి ముహూర్తం ఉన్నందున ఈ రోజునూ పరిగణనలోనికి తీసుకోవచ్చంటున్నారు. పదో తేదీ వసంత పంచమి అయినా ఈ తేదీ అచ్చిరాదనే భావన తెరాస వర్గాల్లో ఉంది.

తెలంగాణ కాంగ్రెస్ నేతలతో నేడు రాహుల్ భేటీ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలకు ఆ పార్టీ అధిష్ఠానం దిశానిర్దేశం చేయనుంది. శాసనసభ ఎన్నికల ఫలితాలు, రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ మంగళవారం రాష్ట్ర పార్టీప్రముఖులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని ముందుకు తీసుకెళ్లడంపై చర్చిస్తారు. దిల్లీలో మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క, వర్కింగ్ ప్రెసిడెంట్లు పొన్నం ప్రభాకర్, ఎ.రేవంత్‌రెడ్డి, జె.కుసుమకుమార్, అజారుద్దీన్, 17మంది శాసనసభ్యులతో రాహుల్ సమావేశమవుతారు. పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు సోమవారమే దిల్లీకి చేరుకున్నారు. శాసనసభకు ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తొలిసారిగా ఆయనతో భేటీ సందర్భంగా, పార్టీకి సంబంధించి వివిధ అంశాలు చర్చించనున్నారు. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, డీసీసీ అధ్యక్షుల నియామకం వంటి అనేక విషయాలు చర్చకు వస్తాయని భావిస్తున్నారు.

పట్టు ఉత్పత్తిలో తెలంగాణ భేష్

- ఉత్తమ రాష్ట్రంగా జాతీయ పురస్కారానికి ఎంపిక
- ఉద్యానశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: మేలైన (బైవోల్టిన్ రకం) పట్టు ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉందని.. ఇందుకు ఉత్తమ రాష్ట్రంగా జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు ఉద్యానశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, ఉద్యాన సంచాలకుడు వెంకట్రాంరెడ్డి సోమవారం విలేకరులకు వెల్లడించారు. ఈ రకం పట్టుకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి ధర ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు ఇక్కడ పట్టు ఉత్పత్తి పెద్దగా లేదు. కానీ పట్టు పరిశ్రమ శాఖ ద్వారా చేపట్టిన పనులు, ప్రోత్సాహకాలతో గతేడాది 2,807 టన్నుల పట్టుగూళ్ల ఉత్పత్తి జరిగింది. ఇందులో 1106 టన్నుల గూళ్ల నుంచి 158 టన్నుల పట్టుదారం తీసినట్లు పార్థసారథి చెప్పారు. మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో బైవోల్టిన్ పట్టు ఉత్పత్తి కాలేదని ఆయన పేర్కొన్నారు. కిలో పట్టుగూళ్లకు రూ.75, కిలో పట్టుదారంపై రూ.105 చొప్పున రాష్ట్ర ఉద్యానశాఖ ప్రోత్సాహకాన్నిస్తోందన్నారు. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న పట్టును పోచంపల్లి, నారాయణపేట, కొత్తకోటలోని మగ్గాల వారికి అందజేస్తున్నట్లు వివరించారు. ప్రైవేటురంగంలో ఇప్పటికే 10 రీలింగ్ పరిశ్రమలున్నట్లు తెలిపారు. చైనా వ్యాపారులు గద్వాల ప్రాంతంలో అతిపెద్ద రీలింగ్ పరిశ్రమను ఏర్పాటుచేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ నెల 9న దిల్లీలోని విజ్ఞానభవన్‌లో 'సర్జింగ్ సిల్క్' పేరుతో ప్రదర్శన, సదస్సు ఏర్పాటుచేస్తున్నట్లు కేంద్ర సిల్క్ మండలి సమాచారం ఇచ్చిందన్నారు. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర పట్టుశాఖకు జాతీయ పురస్కారాన్ని అందజేస్తారని పార్థసారథి వివరించారు.

హరితహారం ఇతర రాష్ట్రాలకు దిక్సూచి

- యూపీ అధికారుల ప్రశంస
- అరణ్య భవన్‌లో సుదీర్ఘ సమావేశం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అడవుల రక్షణ, పచ్చదనం పెంపునకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న హరితహారం పథకం ఇతర రాష్ట్రాలకు ఆదర్శమని ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్ర అధికారుల బృందం అభినందించింది. గ్రీన్ ప్రాజెక్టు పేరుతో ఈ ఏడాది వర్షాకాలంలో ఉత్తర్‌ప్రదేశ్‌లో ప్రజలతో 22 కోట్ల మొక్కలు నాటించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిర్ణయించారు. ఈ నేపథ్యంలో హరితహారం పథకాన్ని పరిశీలించేందుకు ఆ రాష్ట్రం నుంచి 10 మంది అధికారుల బృందం సోమవారం తెలంగాణకు వచ్చింది. హైదరాబాద్ అరణ్యభవన్‌లో తెలంగాణ అటవీ శాఖ అధికారులతో సమావేశమైన బృందం ఐదేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమంపై అధ్యయనం చేసింది. కోట్లాది మొక్కలు



హరితహారం కార్యక్రమంపై సోమవారం అరణ్యభవన్‌లో సమావేశమైన తెలంగాణ, యూపీ అధికారులు

నాటాలనే ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం అత్యంత ధైర్యంతో కూడినదని యూపీ గ్రీన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివాస్ రంజన్ ప్రశంసించారు. హరితహారాన్ని చూసేందుకు యోగి ఆదిత్యనాథ్‌ను తెలంగాణలో పర్యటించాలని కోరతామన్నారు. నూతన పంచాయతీ రాజ్ చట్టంలో గ్రామ అభివృద్ధిలో పచ్చదనాన్ని తప్పనిసరి చేయడం గొప్ప విషయమని తెలిపారు. అడవుల పరిరక్షణతో పాటు కొత్తగా మొక్కలు పెంచాలనే స్పృహను ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యమంగా ప్రజల్లోకి తీసుకెళ్లారని, అందుకే విజయవంతం అవుతున్నామని ప్రధాన అటవీ సంరక్షణ అధికారి(పీసీసీఎఫ్) పీకే ఝా వివరించారు. అటవీ రక్షణ, స్మగ్లింగ్ నిరోధ చర్యలు, అటవీ పునరుజ్జీవన పనులు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల ఏర్పాటు, రెవెన్యూ రికార్డుల్లో అటవీ భూములను చేర్చడం, సరిహద్దుల గుర్తింపు, అక్రమాల నిరోధానికి కంచె, కందకాల ఏర్పాటు మొదలైన అంశాలపై అదనపు పీసీసీఎఫ్ ఆర్.ఎం డోబ్రియల్, పీసీసీఎఫ్‌లు రఘువీర్, లోకేశ్ జైస్వాల్, స్వర్గం శ్రీనివాస్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా యూపీ బృందం మంగళవారం గజ్వేల్, సిద్దిపేట, మెదక్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనుంది. యూపీ అధికారులు విష్ణుసింగ్, పంకజ్ మిశ్రా, లలిత్‌వర్మ, జీఎన్‌మూర్తి, ఓపీ సింగ్, హేమంత్‌కుమార్, అరవింద్ గుప్తా, ప్రభాకర్ దూబే, సునీల్ చౌదరి, ప్రవీణ్‌రావు సమావేశంలో పాల్గొన్నారు.

పశుగణనలో రాష్ట్రానిది మూడో స్థానం

ఈ నెల 15 నాటికి 90 శాతం పూర్తి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జాతీయ పశుగణన వివరాల సేకరణలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. తాజా గణాంకాల ప్రకారం సుమారు 70 శాతం లెక్కల సేకరణ పూర్తయ్యింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 83,03,612 నివాసాలు ఉండగా.. 56,92,797 ఇళ్లలో సమాచారం సేకరించారు. ఈ నెల 15వ తేదీ నాటికి పశుగణనను పూర్తి చేయాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఊపందుకున్నప్పటికీ ఆ గడువు నాటికి 90శాతం పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కేంద్రం మార్చి 31వ తేదీ వరకు గడువు ఇచ్చినప్పటికీ ముందుగానే పూర్తి చేయాలని పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సమాచార సేకరణ పూర్తయ్యాక రెండు నెలల పాటు వాటిని సరిచూసుకొని, మే నెల చివరి వారంలో కేంద్రానికి నివేదిక పంపిస్తామని చెబుతున్నారు. రాష్ట్రాల వారీగా చూసినప్పుడు తమిళనాడు, కర్ణాటక తర్వాత తెలంగాణ మూడో స్థానంలో ఉండగా, ఆంధ్రప్రదేశ్ నాలుగో స్థానంలో కొనసాగుతోంది. గతేడాది డిసెంబరు 31 నాటికే ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయాల్సి ఉన్నప్పటికీ శాసనసభ, పంచాయతీ ఎన్నికల వల్ల ఆలస్యమైంది. పశుగణనకు పూర్తిస్థాయిలో ట్యాబ్‌లు లేకపోవడం, యాప్‌ను మూడు, నాలుగు సార్లు మార్చడంతో ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది. కొన్ని రాష్ట్రాల్లో అయితే ఇటీవలే గణన మొదలైంది. దీంతో జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల నుంచి కేంద్రానికి ఒకేసారి సమాచారం చేరడం సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. రాష్ట్రంలో సాధ్యమైనంత త్వరగా గణన పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకుడు ఎస్.రాంచందర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన దూరదృశ్య సమీక్షలో పశుగణన వేగంగా సాగుతుండటంపై కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పశుసంవర్ధక శాఖను ప్రశంసించినట్లు చెప్పారు.

ఉనికి కోసమే హరీశ్‌రావు నన్ను జైలుకు పంపించారు

కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: రాజకీయ ఉనికి కోసమే మాజీ మంత్రి హరీశ్‌రావు ఎన్నికల ముందు తనను జైల్లో పెట్టించారని కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్, కేటీఆర్‌ల పాత్ర లేదని పేర్కొన్నారు. హరీశ్‌రావు రాజకీయ బ్లాక్‌మెయిలర్ అని తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అంటే తనకు ఎనలేని అభిమానమని.. అందుకే కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. సోమవారమిక్కడ ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌లతో తనకెలాంటి వైరం లేదన్నారు. భాజపాలో రాజకీయంగా అణచివేతకుగురైన సమయంలో కేసీఆర్ తెరాసలోకి ఆహ్వానించి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని. . తానెప్పుడూ కేసీఆర్‌పై రాజకీయ విమర్శలు చేయలేదని జగ్గారెడ్డి చెప్పారు. సంగారెడ్డి అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా కేసీఆర్, కేటీఆర్‌లను కలుస్తానని.. హరీశ్‌రావు కంటే కేటీఆర్ పారదర్శక నాయకుడని అభిప్రాయపడ్డారు. 2008లో రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌లో చేరేందుకు కేవీపీ రామచంద్రరావు ద్వారా హరీశ్‌రావు మంతనాలు జరిపారని ఆరోపించారు.

హామీల అమల్లో కేసీఆర్, మోదీ విఫలం

అత్యధిక లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం: విజయశాంతి



హైదరాబాద్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి డీకే అరుణ. పక్కన మాజీ ఎంపీ విజయశాంతి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని పీసీసీ ఎన్నికల ప్రచార కమిటీ ఛైర్‌పర్సన్ విజయశాంతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించినందుకు విజయశాంతి ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మాజీ మంత్రి, పీసీసీ ప్రచార కమిటీ కో ఛైర్‌పర్సన్ డి.కె.అరుణ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్‌లతో కలసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో తెరాస కుట్రలు, కుతంత్రాలతో గెలిచిందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో న్యాయం గెలుస్తుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ ఇద్దరూ విఫలమయ్యారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థులను ఈ నెలలోనే ప్రకటించే అవకాశం ఉందన్నారు. బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు.

దొడ్డిదారిన అధికారంలోకి తెరాస: డి.కె.అరుణ

అధికారంలో ఉన్నాం కదా ఏదైనా చేసి గెలుస్తామనే ధీమాతోనే.. 16 లోక్‌సభ స్థానాలు గెలుస్తామని సీఎం కేసీఆర్ అంటున్నారని డి.కె.అరుణ విమర్శించారు. గత ఎన్నికల్లో తెరాస దొడ్డిదారిలో అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ ఎంపీ స్థానాలు గెలిచి.. తెలంగాణ ప్రజలు ఆకాంక్షను నెరవేర్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుంటామని చెప్పారు. విభజన చట్టంలోని హామీలను సాధించడంలో తెరాస విఫలమైందని దుయ్యబట్టారు. తాను లోక్‌సభకు పోటీ చేయడంపై అధిష్ఠానానిదే తుది నిర్ణయమన్నారు.

ఆ 'అనర్హత' ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధం

హైకోర్టులో మాజీ ఎమ్మెల్సీ పిటిషన్

ఈనాడు, హైదరాబాద్: తనపై అనర్హత వేటు వేస్తూ శాసనమండలి ఛైర్మన్ జనవరి 16న వెలువరించిన ఉత్తర్వు రాజ్యాంగ విరుద్ధమంటూ మాజీ ఎమ్మెల్సీ కె.యాదవరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా, దురుద్దేశంతో ఆ ఉత్తర్వులు జారీచేశారని అందులో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరానంటూ తెలంగాణ రాష్ట్ర సమితికి చెందినవారు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. తాను కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోలేదని.. మేడ్చల్ సభకు వెళ్లిన మాట వాస్తవమే అయినా, అది తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారి వచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతలు చెప్పడానికేనని వివరించారు. దీన్ని మీడియా తప్పుగా అర్థంచేసుకుని వార్తలు ప్రచురించిందని, వాటి ఆధారంగా ఫిర్యాదు చేయడం సరికాదని పేర్కొన్నారు. తెరాస పార్టీ నుంచి గత నవంబరు 22న సస్పెండ్ చేసినట్లు తెలిసిందని, తనకు మాత్రం ఆ సమాచారాన్ని పంపలేదని, కేవలం వార్తల ద్వారానే తెలిసిందని అన్నారు. అన్ని అంశాలపై సమగ్రంగా వివరణ పంపానని, పట్టించుకోకుండానే ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. తన సభ్యత్వాన్ని రద్దు పరుస్తూ శాసనమండలి ఛైర్మన్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలని, సభ్యత్వాన్ని పునరుద్ధరించాలని ఆయన కోరారు. వేతనాల చెల్లింపు కొనసాగించేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. ఈ పిటిషన్‌పై విచారణ ముగిసేదాకా.. తన స్థానంలో ఏర్పడిన ఖాళీ భర్తీకి ఎన్నిక నిమిత్తం ఎలాంటి ప్రక్రియనూ చేపట్టరాదన్నారు. ఆ మేరకు కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అభ్యర్థించారు. పిటిషన్‌లో ప్రతివాదులుగా శాసనమండలి ఛైర్మన్, మండలి కార్యదర్శి, కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, పే అండ్ అకౌంట్స్ కార్యాలయంతో పాటు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు పేర్లను యాదవరెడ్డి పేర్కొన్నారు.

ఉద్రిక్తతకు దారితీసిన రాస్తారోకో

- కోయిలకొండ మండలాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉంచాలంటూ ఆందోళన

కోయిలకొండ, న్యూస్‌టుడే: కోయిలకొండ మండలాన్ని మహబూబ్‌నగర్ జిల్లాలోనే ఉంచాలంటూ సోమవారం కోయిలకొండ మండలం దమాయపల్లి వద్ద నిర్వహించిన రాస్తారోకో ఉద్రిక్తంగా మారింది. గుంపులో నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి రాయి విసరడంతో భూత్పూర్ సీఐ పాండురంగారెడ్డి తలకు తీవ్ర గాయమైంది. దీంతో పోలీసులు నిరసనకారులుపై లాఠీఛార్జి చేశారు. కోయిలకొండ మండలాన్ని కొత్తగా ఏర్పాటైన నారాయణపేట జిల్లాలో కలపొద్దని అఖిలపక్షం ఆధ్వర్యంలో వారం రోజుల నుంచి ఆందోళనలు కొనసాగుతున్నాయి. దమాయపల్లి వద్ద సోమవారం ఉదయం నుంచే మండల ప్రజలు, నాయకులు రాస్తారోకో చేపట్టారు. రోడ్డుపైనే వంటావార్పు చేపట్టి భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఓ అంబులెన్స్‌కు దారి ఇచ్చేందుకు పక్కకు తప్పుకోవాలని భూత్పూర్ సీఐ పాండురంగారెడ్డి నిరసకారులను కోరారు. ఈ క్రమంలో అంబులెన్స్ వెంట మరికొన్ని వాహనాలు వెళ్లడానికి ప్రయత్నించడంతో వాటిని అడ్డుకోవడానికి నిరసకారులు నినాదాలు చేశారు. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రాయి విసరడంతో అది సీఐ తలకు తగిలి గాయమైంది. రాస్తారోకోకు సహరిస్తున్న మాపైనే రాళ్లు విసురుతారా అంటూ పోలీసులు జనంపై లాఠీఛార్జీ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రాంతంలో ఉన్న వాహనాలను ట్రాక్టర్లలో ఎక్కించి కోయిలకొండ పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.



వంటావార్పు నిరసనలో భాగంగా కోయిలకొండ మండలం దమాయపల్లి రోడ్డుపై భోజనాలు చేస్తున్న ప్రజలు.. అంతర చిత్రంలో గాయపడ్డ సీఐ పాండురంగారెడ్డి

స్నేహం కోసం.. యువతుల సాహసం

- ఒకరినొకరు విడిచి ఉండలేక ఇంట్లోంచి పారిపోయిన విద్యార్థినులు
- వెతికిపట్టుకున్న పోలీసులు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: వారిద్దరూ స్నేహితులు.. ఒకరి నుంచి మరొకరు దూరం కావడాన్ని తట్టుకోలేకపోయారు. చనిపోతున్నట్లు లేఖ రాసిపెట్టి ఇంట్లోంచి వెళ్లిపోయారు. ఎటువెళ్లారో.. ఏమైపోయారో తెలీదు. ఇటు తల్లిదండ్రులు, అటు పోలీసుల్లో కంగారు. చివరకు పోలీసు దర్యాప్తు ఫలించడంతో వారిద్దరూ తల్లిదండ్రుల వద్దకు చేరారు. యాదాద్రి భువనగిరి జిల్లా చిన్నకొండూరుకు చెందిన శ్రావణి (17), రంగారెడ్డి జిల్లా ఆమనగల్‌కు చెందిన రేష్మా(18).. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో గతేడాది ఇంటర్ చదివారు. తర్వాత రేష్మాను ఆమె తల్లిదండ్రులు నల్గొండలోని డీఈడీ కళాశాలలో చేర్పించారు. దీంతో ఆ యువతులిద్దరూ ఒకరిని విడిచి ఒకరు ఉండలేకపోయారు. గతనెల 31న ఆరోగ్యం బాగోక బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు నోటు రాసిపెట్టి ఇంట్లోంచి వెళ్లిపోయిన శ్రావణి.. రేష్మా వద్దకు చేరింది. ఇద్దరూ కలిసి పానగల్‌లోని ఉదయసముద్రం జలాశయానికి చేరారు. అనారోగ్య కారణంగా బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు రేష్మా సైతం లేఖ రాసిపెట్టింది. దానితోపాటు బ్యాగు, చెప్పులు, దుస్తులు జలాశయం వద్దే వదిలి రైల్వేస్టేషన్‌కు చేరుకుని గుంటూరు వైపు వెళ్లారు. తర్వాత విజయవాడకు.. అక్కడినుంచి చెన్నైకి, తర్వాత ముంబయికి, ఆపై గుజరాత్‌లోని వడోదరాకు వెళ్లారు. ఎక్కడా వసతి దొరక్కపోవడంతో సోమవారం తిరిగి విజయవాడ చేరుకున్నారు. ఉదయసముద్రం జలాశయంలో ఎంత వెతికినా రేష్మా ఆచూకీ లభించకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు ఆమెతోపాటే వసతిగృహంలో ఉంటున్న మరో విద్యార్థినిని విచారించారు. రేష్మా ఆమెకు ఫోన్ చేయడంతో వివరాలు తెలుసుకున్న పోలీసులు విజయవాడలో యువతులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు ఒకరినొకరు విడిచి ఉండలేక ఇలా చేశారని సీఐ మహబూబ్ బాషా తెలిపారు.

కేంద్ర సామాజిక పింఛను రూ.600కు పెంపు?

- రాష్ట్రాల అభిప్రాయాల్ని కోరిన కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: సామాజిక పింఛన్ల రూపేణా నెలవారీ ఇస్తున్న రూ.200ను రూ.600 వరకు పెంచాలని కేంద్రం యోచిస్తోంది. సామాజిక, ఆర్థిక గణన (2011) సందర్భంలో రూపొందించిన డేటాను అర్హుల గుర్తింపునకు ప్రాతిపదిక చేయాలని భావిస్తోంది. దివ్యాంగుల నూతన చట్టాన్ని అనుసరించి.. వైకల్యం 40 శాతం ఉన్నవారికీ పింఛను ఇవ్వాలనే అంశాన్నీ పరిశీలిస్తోంది. ఇటువంటి ప్రతిపాదనలపై అభిప్రాయాలను తెలపాల్సిందిగా తాజాగా రాష్ట్రాలను కోరింది. వృద్ధులకు సామాజిక పింఛన్ల కింద నెలవారీ ఇస్తున్న సాయాన్ని పెంచాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో పింఛను మొత్తాన్ని పెంచుతూనే కొత్త విధానం తేవాలని కేంద్రం భావిస్తోంది.

ప్రస్తుతం ఇలా...

ఎన్ఎస్ఏపీ ద్వారా కేంద్రం వృద్ధులకు.. 79 ఏళ్ల లోపు ఉంటే నెలకు రూ.200, 80 ఏళ్లు దాటితే రూ.500 చొప్పున అందజేస్తోంది. వితంతు, వికలాంగ పింఛన్లను.. 79 ఏళ్ల లోపు వారికి రూ.300, వయస్సు 80ఏళ్లు దాటిన వారికి రూ.500 ఇస్తోంది. ఇలా తెలంగాణలో 9.45 లక్షల మంది లబ్ధిదారులకు ఏటా రూ.274 కోట్ల మేర నిధులను సమకూరుస్తోంది.

కొత్త విధానం..

కేంద్రం ప్రతిపాదనల ప్రకారం.. నెలవారీ కనీస పింఛను ప్రతి రాష్ట్రంలోను ఇక రూ.1000 చొప్పున ఉండాలి. దీనికి గాను కేంద్రం 50 శాతం లేదా 60 శాతం వాటాను సమకూరుస్తుంది. మిగతా వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాలి. అంటే కేంద్రం రూ.600 ఇస్తే మిగతా రూ.400ను రాష్ట్రం తన వాటాగా అందజేయాలి.

దేశమంతటా ఒకే విధానం

అర్హుల గుర్తింపునకు ఒక్కో రాష్ట్రం ఒక్కో పద్ధతిని అనుసరించటం కాకుండా అన్నీ ఒకే విధానాన్ని అమలు చేయాల్సిన అవసరమూ ఉన్నట్లు కేంద్రం భావిస్తోంది. సామాజిక ఆర్థిక గణన డేటాలోని పేదలంతా సామాజిక పింఛన్లకు అర్హత పొందేలా ఏర్పాట్లు చేయాలని, ఇటువంటి డేటాకు బయట ఉండిపోయిన వారినీ ఎంపిక చేసేందుకు ఒక విధానం చేపట్టాలని ప్రతిపాదించింది.

తెలంగాణకు కొంత వెసులుబాటు

సామాజిక పింఛను కేటాయింపులను కేంద్రం కనుక పెంచితే తెలంగాణకు పింఛన్ల ఆర్థిక భారం కొంత మేర తగ్గే అవకాశం ఉంది. ఆసరా పేరుతో రాష్ట్ర సర్కారు ప్రస్తుతం 40లక్షల మందికి ఏటా రూ.5,500 కోట్ల మేర ఖర్చుపెడుతుండగా.. అందులో అయిదు శాతం (రూ.272 కోట్లు) మాత్రమే కేంద్రం నుంచి లభిస్తోంది. మొత్తం 40లక్షల మంది లబ్ధిదారుల్లో 9.45 లక్షల మందినే కేంద్రం గుర్తిస్తోంది. కేంద్రం ఇచ్చే పింఛను మొత్తం పెరుగుతున్నందున తెలంగాణ రాష్ట్రానికి ఈ రూపంలో అందే సాయం రూ.1,000 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా.

అమెరికాలో విమాన ప్రమాదం

ఐదుగురు మృత్యువాత

యోర్బాలిండా: అమెరికాలో చిన్న విమానం ఓ ఇంటిపై కుప్పకూలి పైలట్‌తోపాటు ఇంటిలోని నలుగురు మృత్యువాతపడ్డారు. దక్షిణ కాలిఫోర్నియాలోని యోర్బాలిండాలో ఈ ఘటన జరిగింది. సెస్నా 414ఏ తరగతికి చెందిన ఈ విమానం ఫోర్టైన్ నుంచి బయలుదేరింది. గాలిలో ఉండగానే ఇది ముక్కలు ముక్కలయింది. దీనిలోని ఇంజిన్ ఢీకొనడంతో భవనంలో మంటలు చెలరేగి నలుగురు మరణించారు.

కేరళలో వర్సిటీల విద్యార్థుల సదస్సు

ఎంపీ కవితకు ఆహ్వానం

ఈనాడు, హైదరాబాద్: కేరళ శాసనసభ వజ్రోత్సవాలు పురస్కరించుకొని ఆ రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో విశ్వవిద్యాలయాల విద్యార్థులతో నిర్వహించనున్న జాతీయస్థాయి సదస్సుకు హాజరు కావాల్సిందిగా నిజామాబాద్ ఎంపీ కవితకు ఆహ్వానం అందింది. ఈ మేరకు కేరళ సభాపతి పి.శ్రీరామకృష్ణన్ సోమవారం ఆమెకు లేఖ రాశారు. యువతలో ప్రజాస్వామిక విలువలు, జీవన విధానం, ఆలోచనా విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో ఎంఐటీ- ప్రపంచ శాంతి విశ్వవిద్యాలయం (పుణె) సహకారంతో ఈ నెల 23 నుంచి 25 వరకు సదస్సు నిర్వహించనున్నారు. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 23న సదస్సును ప్రారంభిస్తారు. అదే రోజు మధ్యాహ్నం జరిగే సమావేశంలో 'కులం, దానిపై అసంతృప్తులు' అనే అంశంపై ఎంపీ కవిత ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి కేరళ సీఎంతో పాటు వివిధ రాష్ట్రాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రెండువేల మంది విద్యార్థులు హాజరవుతారు.

జీపీఎఫ్‌పై 8 శాతం వడ్డీ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ భవిష్యనిధి (జీపీఎఫ్)పై వడ్డీరేట్లను నిర్ణయిస్తూ సోమవారం ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకూ 8 శాతం వడ్డీరేటు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అధికారులకు ఆదర్శప్రాయుడు ఏపీవీఎన్ శర్మ: గవర్నర్ నరసింహన్

ఈనాడు, హైదరాబాద్: విశ్రాంత ఐఏఎస్ అధికారి, తమ సలహాదారు ఏపీవీఎన్ శర్మ అధికారులకు ఆదర్శ ప్రాయుడని గవర్నర్ నరసింహన్ పేర్కొన్నారు. పనిచేసిన ప్రతి చోటా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని, ప్రజా సేవ, బాధ్యతల నిర్వహణలో తమ సమర్థతను నిరూపించుకున్నారని తెలిపారు. 'నరుని సేవలో నారాయణుడు' పేరిట ఏపీవీఎన్ శర్మ ఆత్మకథను సోమవారం రాజ్‌భవన్ దర్బార్ హాలులో గవర్నర్ నరసింహన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవీఎన్ శర్మతో పాటు గవర్నర్ సతీమణి విమలా నరసింహన్, శర్మ ఆత్మకథ రచయిత డాక్టర్ అనంత పద్మనాభరావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ.. వినయం, దయ, సంపూర్ణ వ్యక్తిత్వానికి ఏపీవీఎన్ శర్మ మారుపేరని తెలిపారు. ఆయన నౌకాయాన శాఖలో అదనపు కార్యదర్శిగా అందరి ప్రశంసలు పొందారని, సింగరేణి నష్టాల్లో ఉన్న సమయంలో సీఎండీగా నియమితులై ఆ సంస్థ పునరుద్ధరణకు, కార్మికుల సంక్షేమానికి విశేష కృషి చేశారని కొనియాడారు. మూడు జిల్లాల కలెక్టర్‌గా వరదల సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు వేగంగా పునరావాస పనులు చేపట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవోగా ఉత్తమ సేవలందించారని, ఆయన హయాంలోనే శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం, శ్రీవెంకటేశ్వర భక్తి ఛానల్ ఏర్పాటయ్యాయన్నారు. తమ సలహాదారుగా అమూల్య సేవలందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీవీఎన్ శర్మను, ఆత్మకథ రచయిత పద్మనాభరావును గవర్నర్ సత్కరించారు.

ప్రేమను కాదన్నందుకు గొంతు కోశాడు!



దాడికి దిగిన తర్వాత ఆత్మహత్యకు యత్నించి, ప్రస్తుతం వైద్యశాలలో ఉన్న నిందితుడు అనుదీప్

మహబూబ్‌నగర్ (నేరవిభాగం), న్యూస్‌టుడే: తన ప్రేమను నిరాకరిస్తోందంటూ విద్యార్థినిపై ఒక యువకుడు దాడికి దిగి, ఆ తర్వాత ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్ఐ భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఇక్కడి ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న అనుదీప్ రోజూ జడ్చర్ల నుంచి వచ్చివెళ్లేవాడు. అదే తరగతికి చెందిన యువతిని ప్రేమించడంతో, ఆమె నిరాకరిస్తూ వచ్చింది. తల్లికి విషయం చెప్పడంతో, రెండు నెలల క్రితం ఫిర్యాదుచేశారు. కళాశాల యాజమాన్యం ఇద్దరినీ పిలిచి మాట్లాడింది. కేసు నమోదుచేస్తే భవిష్యత్తులో ఇబ్బంది తప్పదని ఊరుకున్నారు. ఆ యువకుడు రాత్రివేళ ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి ప్రవేశించాడు. బ్లేడ్‌తో గొంతు కోయడానికి ప్రయత్నించడంతో, ప్రాణభయంతో బిగ్గరగా అరిచింది. చుట్టుపక్కలవారు గుమికూడి, అతడిని పట్టుకొని ఆ ఇంట్లోనే నిర్బంధించారు. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లారు. భయపడిన అనుదీప్ ఇంటి గదిలో ఉన్న స్టౌ వెలిగించి కాల్చుకోవడంతో పాటు, బ్లేడుతో గాయాలు చేసుకున్నాడు. సమాచారమందుకున్న పోలీసులు వెళ్లి అతడిని జనరల్ వైద్యశాలకు తరలించారు. విద్యార్థినిని మెరుగైన చికిత్స కోసం మరో ఆస్పత్రికి చేర్చారు. ఎస్పీ రాజేశ్వరి ఆస్పత్రికి వెళ్లి బాధితురాలి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

యువతిపై సామూహిక అత్యాచారం

ప్రియుడితో ఉండగా లాక్కెళ్లి మరీ అఘాయిత్యం

నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో ఘటన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: ప్రేమికులపై దాడి చేసిన కొందరు ప్రియుడు చూస్తుండగానే యువతిని లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. నెల్లూరు జిల్లా సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన ఘటన సోమవారం వెలుగు చూసింది. కాకినాడకు చెందిన యువకుడు శ్రీసిటీలోని ఓ మొబైల్ కంపెనీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. గతంలో అక్కడ పనిచేసి, ప్రస్తుతం మరో కంపెనీలో పనిచేస్తున్న విజయనగరం జిల్లాకు చెందిన యువతి, అతను ప్రేమించుకుంటున్నారు. ఇద్దరూ తరచూ కలుసుకునేవారు. ఆదివారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్‌కు కాస్త దూరంలో కూర్చొని ఉండగా నలుగురు యువకులు వారిని చుట్టుముట్టారు. యువకుడిపై దాడిచేసి, యువతిని బలవంతంగా లాక్కెళ్లారు. బాధిత యువకుడు ఏడుస్తూ అక్కడే ఉండిపోయాడు. రాత్రి 10.25 గంటల సమయంలో ఎస్సై విశ్వనాథరెడ్డి, సిబ్బందితో కలిసి గస్తీ తిరుగుతూ యువకుణ్ని ఆరా తీశారు. అతనిచ్చిన సమాచారం మేరకు అప్రమత్తమై యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది.

బలాత్కరించి.. రైలెక్కించారు: యువతిని లాక్కెళ్లిన యువకులు ఆమెను వాహనంలో తడ వైపు తీసుకెళ్లారు. తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్ సమీపంలో వాహనం ఆపి, ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో యువతిని అక్కంపేట రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చి సూళ్లూరుపేట వైపు వెళ్లే రైలు ఎక్కించారు. సూళ్లూరుపేట స్టేషన్లో దిగిన యువతి నేరుగా తాను ఉంటున్న గదికి వెళ్లింది. స్నేహితురాలి ఫోన్‌తో ప్రేమికుడితో మాట్లాడింది. అతను ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు యువతిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై నిర్భయ కేసు నమోదు చేశామని, త్వరలో వారిని పట్టుకుంటామని గూడూరు డీఎస్పీ బాబూ ప్రసాద్ తెలిపారు. సోమవారం రాత్రి నిందితుల్లో ముగ్గుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

పంచాయతీల విలీనంపై ముగిసిన వాదనలు

తీర్పును వాయిదా వేసిన హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: మున్సిపాలిటీల్లో పంచాయతీలను విలీనం చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో దాఖలైన పలు పిటిషన్లపై సోమవారం వాదనలు ముగిశాయి. పంచాయతీరాజ్, మున్సిపాలిటీ చట్టం సెక్షన్ 3(ఎ)ను సవాల్ చేస్తూ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, మెదక్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాల నుంచి 120కిపైగా పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై సోమవారం జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వాయిదా వేసింది.

డిజిటల్ లావాదేవీలకు ఆర్‌బీఐ రక్ష

- అంబుడ్స్‌మన్ వ్యవస్థకు శ్రీకారం
- మానసిక వేదనకు రూ.లక్ష వరకు పరిహారం

దిల్లీ, ముంబయి: డిజిటల్ లావాదేవీలకు భరోసా కల్పిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) అంబుడ్స్‌మన్ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ లావాదేవీలు జరిగినప్పుడు వినియోగదారుడికి ఎలాంటి ఇబ్బంది కలిగినా సమస్య వీలైనంత వేగంగా పరిష్కారమయ్యేందుకు ఈ వ్యవస్థ సహకరించనుంది. బ్యాంకులతో పాటు బ్యాంకేతర సంస్థల ద్వారా జరిపే డిజిటల్ లావాదేవీలకూ ఇది వర్తిస్తుంది. జనవరి 31, 2019 నుంచి అమల్లోకి తెస్తూ ఆర్‌బీఐ తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది.

ఎందుకీ వ్యవస్థ?

ఉదాహరణకు ఆన్‌లైన్ ద్వారా మీరు కొంత నగదును బదిలీ చేశారనుకుందాం. డబ్బు మీ బ్యాంకు ఖాతా నుంచి కట్ అయిపోతుంది. నగదు మాత్రం మీరు బదిలీ చేయాలనుకున్న మరో ఖాతాకు బదిలీ కాదు. ఒకే బ్యాంకు అయితే సంబంధిత బ్రాంచికి వెళ్తే 15రోజుల్లోపు సమస్య పరిష్కారమవుతుంది. అదే వేరే బ్యాంకు అయితే రెండు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఒక్కోసారి బాధ్యత మాది కాదంటే, మాది కాదంటూ బ్యాంకులు వినియోగదారుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ఇలాంటి సమస్యలు బ్యాంకులకే పరిమితం కాలేదు. బ్యాంకింగేతర ఆర్థిక కార్పొరేషన్లు(ఎన్‌బీఎఫ్‌సీలు), పేటీఎం, ఫోన్‌పే తదితర వ్యాలెట్లు, ఇ-కామర్స్ వెబ్‌సైట్ల విషయంలోనూ ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిపై వినియోగదారుల నుంచి ఆర్‌బీఐకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా గల 21 ఆర్‌బీఐ కార్యాలయాల్లో డిజిటల్ లావాదేవీల ఫిర్యాదుల పరిష్కారానికి కొత్తగా అంబుడ్స్‌మన్లను ఏర్పాటు చేస్తూ ఆర్‌బీఐ నిర్ణయం తీసుకుంది. ఇక్కడ పనిచేసే జనరల్ మేనేజర్ లేదా చీఫ్ జనరల్ మేనేజరు అంబుడ్స్‌మన్‌గా వ్యవహరిస్తారు.

ఎలా ఫిర్యాదు చేయాలంటే..

అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయడానికి ఎలాంటి రుసుములు చెల్లించనవసరం లేదు. తెల్లకాగితం ఫిర్యాదును రాసి అంబుడ్స్‌మన్‌కు పోస్ట్ చేయవచ్చు. ఈమెయిల్, ఫ్యాక్స్ కూడా అనుమతిస్తారు. ఆర్‌బీఐ అధికారిక వెబ్‌సైట్‌లో ఉన్న దరఖాస్తుఫారాన్ని నింపినా సరిపోతుంది. మీకు బదులు మీ ప్రతినిధి.(ఉదాహరణకు స్నేహితుడు, బంధువు) కూడా ఫిర్యాదు చేయవచ్చు. ప్రతినిధిగా న్యాయవాదిని మాత్రం అనుమతించరు.



అవసరమైతే ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నరు వద్దకూ..

సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో అక్కడే సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాలి. 30రోజుల్లో పరిష్కారం కాకపోతే సంబంధిత రాష్ట్ర అంబుడ్స్‌మన్ పరిధిని ఆశ్రయించవచ్చు. అక్కడ పరిష్కారం లభించకపోయినా, సంతృప్తి లేకపోయినా ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించవచ్చు. డిజిటల్ లావాదేవీలకు సంబంధించిన డిప్యూటీ గవర్నరు దృష్టికి సమస్యను తీసుకెళ్లవచ్చు. ఇక్కడా పరిష్కారం లభించలేదని భావిస్తే, న్యాయస్థానాన్నీ ఆశ్రయించవచ్చు.

రూ.20 లక్షల వరకు పరిహారం

డిజిటల్ లావాదేవీల సందర్భంగా వినియోగదారుడికి కలిగే ఆర్థికనష్టాన్ని అంబుడ్స్‌మన్ ఇప్పిస్తుంది. దీన్ని గరిష్ఠంగా రూ.20 లక్షలకు పరిమితం చేశారు. అంతకుమించితే ఆ మేరకు వినియోగదారుడు నష్టపోయినట్లే. వినియోగదారుడు పడిన మానసిక వేదనకు, కోల్పోయిన విలువైన సమయానికి గాను గరిష్ఠంగా రూ.లక్ష వరకు నష్టపరిహారం లభిస్తుంది.

ఏయే సందర్భాల్లో సంప్రదించవచ్చంటే!

- వాలెట్లు, డెబిట్-క్రెడిట్ కార్డుల్లో నగదు జమ కాకపోయినా..
- విఫలమైన, రద్దు అయిన లావాదేవీలకు సంబంధించిన నగదు నిర్దేశిత సమయానికి మీ ఖాతాల్లోకి తిరిగి జమ కాకపోయినా..
- ఆన్‌లైన్ చెల్లింపులు, నగదు బదిలీ సందర్భంగా సర్వర్ నుంచి కాలయాపన జరిగి లావాదేవీ విఫలమైనా..
- వినియోగదారుడి ఖాతా నుంచి నగదు కట్ అయి, నిర్దేశిత సమయంలో ఆ నగదు జమ కాకపోయినా..
- ప్రభుత్వ పథకాలకు సంబంధించిన నగదు లబ్ధిదారుడి ఖాతాలో జమ కాకపోయినా..
- పొరపాటున తెలియని వ్యక్తి ఖాతాలో పడిన నగదు మళ్లీ మీ ఖాతాకు నిర్దేశిత సమయంలోపు జమ కాకపోయినా..

పిడిగుద్దులతోనే చంపేశారు!

- జయరాం హత్య ఆధారాల మాయంలో తెలంగాణ ఏసీపీ, సీఐ సలహాలు
- కాల్ డేటాతో వెలుగులోకి
- రాకేశ్‌రెడ్డి, మరో నలుగురు నిందితులు
- కేసు చిక్కుముడి వీడినట్లే!

ఈనాడు, హైదరాబాద్, అమరావతి, న్యూస్‌టుడే బృందం: పారిశ్రామికవేత్త, కోస్టల్ బ్యాంకు డైరెక్టర్ చిగురుపాటి జయరాం హత్య కేసులో చిక్కుముడి దాదాపుగా వీడింది. హైదరాబాద్‌లో హత్యచేసి శవాన్ని కృష్ణా జిల్లాకు తరలించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నాలు జరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. జయరాం హత్యకు ఆర్థిక లావాదేవీలు కారణమని పోలీసులు చెబుతుండగా, తమ బంధువుల ప్రమేయం ఉందని ఆయన భార్య పద్మశ్రీ సోమవారం హైదరాబాద్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం. జయరాం హత్య తర్వాత ఆధారాలను మాయం చేయడంలో తెలంగాణకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులు సహకరించినట్లు విచారణలో తేలింది. నిందితుడు రాకేశ్‌రెడ్డి కాల్‌డేటాలో వీరి నెంబర్లు లభించాయి. వారి సలహా ప్రకారం శవాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తరలించి రహదారి ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించినట్లు చెబుతున్నారు. ప్రవాసాంధ్రుడైన జయరాం జనవరి 31న హత్యకు గురైన విషయం తెలిసిందే. దీనిలో రాకేశ్‌రెడ్డిని ప్రధాన నిందితుడిగా భావిస్తున్నారు. హత్యలో జయరాం మేనకోడలు శిఖాచౌదరి ప్రమేయం లేదని, అయితే జయరాంతో రాకేశ్‌రెడ్డి పరిచయానికి ఆమె కారణమని గుర్తించారు. హత్యకు రాకేశ్‌రెడ్డితో పాటు మరో నలుగురు సహకరించినట్లు భావించి పోలీసులు విచారిస్తున్నారు. మరోవైపు మాదాపూర్, జూబ్లీహిల్స్ ఠాణాల పోలీసులు సోమవారం జయరాం ఇంటికి వెళ్లి, ఆయన భార్య పద్మశ్రీతో మాట్లాడారు. బంధువులతో ప్రాణహాని ఉన్నట్టు జయరాం తనకు ఫోన్‌లో పలుమార్లు చెప్పారని, ఇంత దుర్మార్గంగా హత్యచేసిన హంతకులను శిక్షించాలంటూ ఆమె పోలీసులను అభ్యర్థించారు.

కర్మాగారం గొడవతో పరిచయం

జయరాంకు హైదరాబాద్‌కు చెందిన రాకేశ్‌రెడ్డితో పరిచయం కర్మాగారంలో ఓ వివాదం నేపథ్యంగా జరిగింది. బొంతపల్లిలోని టెట్రాపాలిమర్స్ కంపెనీలో యాజమాన్యానికి కార్మికులకు మధ్య వేతనాల విషయంలో తలెత్తిన వివాదంలో రాకేశ్‌రెడ్డి జోక్యం చేసుకుని పరిష్కరించాడు. కంపెనీ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శిఖాచౌదరితో పరిచయం పెంచుకున్నాడు.



నందిగామలోని బార్ నుంచి బీరుసీసాలు తీసుకెళ్తున్న రాకేశ్‌రెడ్డి, ఇన్‌సెట్లో రాకేశ్‌రెడ్డి పాత చిత్రం

రూ.4.50 కోట్ల వివాదమే ప్రాణాలు తీసిందా?

జయరాంకు తానిచ్చిన రూ.4.50 కోట్లను వసూలు చేసుకునేందుకు రాకేశ్‌రెడ్డి ఒక అమ్మాయి ఫొటోను ప్రొఫైల్ చిత్రంగా ఉంచి కొద్దిరోజులుగా వాట్సాప్ ద్వారా జయరాంతో ఛాట్ చేస్తున్నాడు. అలా గతనెల 30న రాకేశ్‌రెడ్డి తెలివిగా జయరాంను పిలిపించాడు. అక్కడ రూ.6కోట్లు అడగ్గా కేవలం రూ.6లక్షలు ఇచ్చారని చెప్పడంతో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాకేశ్‌రెడ్డి జయరాంపై ముష్టిఘాతాలకు దిగాడు. గుండెజబ్బున్న జయరాంకు ఇప్పటికే మూడు స్టెంట్లు వేశారు. పిడిగుద్దులు కురిపించటం, ఊపిరి ఆడకుండా చేయడంతో ఆయన వెంటనే మృతిచెందారని చెబుతున్నారు. తర్వాత శవాన్ని మాయం చేసేందుకు రాచకొండ కమిషనరేట్‌కు చెందిన ఒక ఏసీపీని, ఇన్‌స్పెక్టర్‌ను రాకేశ్ చరవాణిలో సంప్రదించినట్లు వెలుగులోకి వచ్చింది. వారి సలహా మేరకు హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. కోస్టల్ బ్యాంకు పేరిట ఉన్న జయరాం సొంత వాహనంలో తరలించారు. దీనికి మరో నలుగురు సహకరించారని తెలిసింది. వాస్తవానికి జయరాంకు రూ.4.5కోట్లు అప్పిచ్చే స్థోమత రాకేశ్‌రెడ్డికి ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ పార్టీల నాయకులతో చెట్టపట్టాలు..

జయరాం హత్య కేసులో ప్రధాన నిందితుడు కౌకుంట్ల రాకేశ్ రెడ్డి కుత్బుల్లాపూర్ పట్టణంలోని సంజయ్‌గాంధీనగర్ నివాసి. అతని సోదరుడు, సోదరి అమెరికాలో ఉన్నారు. పదోతరగతి వరకూ చదివిన రాకేశ్‌రెడ్డి తెదేపాలో సాధారణ కార్యకర్తగా చేరి అనతి కాలంలోనే ప్రధాన నాయకులకు చేరువయ్యాడు. వారి పేర్లు చెప్పుకొని అక్రమ వసూళ్లకు పాల్పడేవాడు. ఓ ప్రజాప్రతినిధి పేరుచెప్పి ఓ హోటల్ యజమానిని బెదిరించడంతో అప్పట్లో కూకట్‌పల్లి ఠాణాలో అతనిపై కేసు నమోదైంది. సంబంధిత నాయకుడిపై కక్ష పెంచుకున్న రాకేశ్‌రెడ్డి 2014 ఎన్నికల్లో, ఆ తర్వాతా అతన్ని ఓడించడానికి విశ్వప్రయత్నాలు చేసినట్లు సమాచారం. జూబ్లీహిల్స్‌లో ఖరీదైన మూడంతస్తుల మేడను అద్దెకు తీసుకుని అక్కడే ఉంటూ ఇవన్నీ చక్కబెట్టేవాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ రాజకీయ పార్టీకి చెందిన ముఖ్యనేత, ప్రధాన నేతలతో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయి. ఈ నేపథ్యంలోనే జయరాంను హత్యచేశాక ఆ నేతల సహాయంతో కేసు నుంచి సునాయాసంగా బయటపడవచ్చని శవాన్ని నందిగామ వద్ద వదిలేసి వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. మరోవంక.. రాకేశ్‌రెడ్డి తమతో ఐదేళ్ల నుంచి సంబంధాలు తగ్గించుకున్నాడని అతని తండ్రి శ్రీనివాసరెడ్డి చెప్పారు. శిఖా మాయలో పడి తిరుగుతున్నాడన్నారు.

విషప్రభావం లేదు..

జయరాం హత్యకు వీధికుక్కలను చంపేందుకు వాడే ఇంజెక్షన్లు ఇచ్చారనడంలో వాస్తవం లేదని దర్యాప్తు అధికారులు చెప్పారు. ముక్కు మూసి పిడిగుద్దులు కురిపించడంతో చనిపోయారని, ఈ క్రమంలో రక్తం స్రవించిందని చెబుతున్నారు. చేతులు నల్లగా మారిన దానికి కారణం తెలియరాలేదు. ఊపిరి ఆడకే చనిపోయాడని ప్రాథమిక నివేదికలో వైద్యులు పేర్కొన్నారు. తాజాగా నందిగామలో నిందితులు ఒక మద్యం దుకాణంలో బీర్లు కొనుగోలు చేసినట్లు సీసీ టీవీ ఫుటేజీలో లభ్యమైంది. అప్పటికే జయరాం శవం కారులో ఉండటం గమనార్హం.

ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు..

రాకేశ్‌రెడ్డి కాల్‌డేటాలో ఇద్దరు పోలీస్ అధికారుల పేర్లుండడంతో ప్రాథమిక విచారణ చేసిన ఉన్నతాధికారులు హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్‌పై బదిలీ వేటు వేశారు. ఏసీపీపై మరింత లోతుగా విచారించాక చర్యలు చేపట్టే అవకాశాలున్నాయని తెలిపారు.

వేసవికి 108 ప్రత్యేక రైళ్లు

ఈనాడు, హైదరాబాద్: వేసవిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని 108 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. తిరుపతి-నాగర్‌సోల్, హెచ్.ఎస్.నాందేడ్-తిరుపతి, తిరుపతి-కాకినాడ టౌన్- రేణిగుంట, కాచిగూడ- కాకినాడ పోర్టు మధ్య ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. మార్చి నెల ఆరంభం నుంచి మే నెలాఖరు వరకూ ఇవి ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి.

- తిరుపతి-నాగర్‌సోల్-తిరుపతి మధ్య మొత్తం 28 ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. తిరుపతి నుంచి ప్రతి శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరే ప్రత్యేక రైలు మరుసటి రోజు ఉదయం 11.45 గంటలకు నాగర్‌సోల్ చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు ప్రతి శనివారం నాగర్‌సోల్‌లో రాత్రి 10 గంటలకు బయలుదేరుతుంది.
- హెచ్.ఎస్.నాందేడ్-తిరుపతి-హెచ్ ఎస్ నాందేడ్ మధ్య మొత్తం 26 ప్రత్యేక రైళ్లు తిరుగుతాయి. ప్రతి మంగళవారం హెచ్ఎస్ నాందేడ్‌లో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. ప్రతి బుధవారం తిరిగి ఇదే రైలు తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు హెచ్.ఎస్.నాందేడ్‌కు చేరుకుంటుంది.
- తిరుపతి-కాకినాడ టౌన్-రేణిగుంట మధ్య మొత్తం 26 జనసాధారణ ప్రత్యేక రైళ్లు నడుపుతారు. ప్రతి ఆదివారం తిరుపతిలో సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.30 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు ప్రతి సోమవారం కాకినాడలో సాయంత్రం 7 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రేణిగుంట స్టేషన్‌కు ఉదయం 6 గంటలకు చేరుతుంది.
- కాచిగూడ- కాకినాడపోర్టు-కాచిగూడ మధ్య మొత్తం 28 ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ప్రతి శుక్రవారం కాచిగూడలో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి.. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు కాకినాడ చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు శనివారం సాయంత్రం 5.50 గంటలకు కాకినాడ పోర్టు నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5.10 గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది.

అండగా ఉంటాం.. ఆందోళన వద్దు

- అమెరికాలో అరెస్టయిన విద్యార్థులకు న్యాయసహాయం అందిస్తాం



'న్యూస్‌టుడే'తో ఆటా కొత్త అధ్యక్షుడు భీంరెడ్డి పరమేశ్

న్యూస్‌టుడే, తిమ్మాజీపేట: అమెరికాలో ఇమిగ్రేషన్, భద్రతా విభాగం అధికారులు నిర్వహించిన రహస్య ఆపరేషన్‌లో చిక్కుకున్న విద్యార్థుల కుటుంబ సభ్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అమెరికా తెలుగు సంఘం (ఆటా) అధ్యక్షుడు భీంరెడ్డి పరమేశ్ అన్నారు. ఇప్పటికే ఈ దిశగా తమ వంతు ప్రయత్నం కొనసాగుతోందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన భీంరెడ్డి పరమేశ్ ఇటీవల ఆటా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఫోన్‌లో ఆయన్ను సంప్రదించిన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. వివాదంలో చిక్కుకున్న విద్యార్థులకు అండగా ఉంటామని ఆయన భరోసానిచ్చారు. ముఖాముఖి సారాంశం ఆయన మాటల్లోనే..

విద్యార్థులను పరామర్శించాం..

అమెరికా ఇమిగ్రేషన్ అధికారుల అదుపులో 180 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది మన తెలుగువారే. వారికి న్యాయ సలహాలు, సూచనలు ఇస్తూనే ఉన్నాం. అవసరమైన వారికి న్యాయసహాయం అందించే ఏర్పాట్లూ చేస్తున్నాం. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఆటా బృంద సభ్యులు.. వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న విద్యార్థులను పరామర్శించి వచ్చారు. అందరినీ ఒకే సెక్షన్‌పై అరెస్టు చేశారు. వారికి ఎలాంటి శిక్షా ఉండదు కానీ, తిరిగి స్వదేశానికి పంపిస్తారు. అమెరికాలో స్థిర పడాలనే ఆకాంక్షతో విద్యార్థులు మధ్యవర్తులను ఆశ్రయించారు. వారంతా విశ్వవిద్యాలయంలో చేరిన మరుసటి రోజే సీపీటీ (కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రైనింగ్) అనుమతులు పొందారనే అభియోగం ఉంది.

అవకాశాల్లేకే..

భారతదేశంలో అవకాశాలు లేకపోవడం, ఉన్నా.. వారికి దక్కకపోవడమే విద్యార్థులను ఇలాంటి చర్యకు ప్రేరేపించి ఉంటుందని చెప్పొచ్చు. బాగా చదివిన తమ పిల్లలు ఏదోరకంగా స్థిరపడాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ఎన్నికష్టాలెదురైనా అమెరికాకు పంపడమూ ఓ కారణమని చెప్పక తప్పదు. ఈ వివాదంతో సంబంధం లేని ఇతర తెలుగు విద్యార్థులు కూడా అప్రమత్తంగా ఉండాలి. భవిష్యత్తులో వారు ఎలా వ్యవహరించాలి? బాండ్‌బెయిల్ ఎలా స్వీకరించాలి? తదితర అంశాలను కూలంకషంగా వివరిస్తున్నాం. ఆటా ఆధ్వర్యంలో ప్రధానంగా భారతదేశం నుంచి వచ్చే యువతకు మార్గదర్శనం చేస్తాం. ఏం ఆశించి వచ్చారు? ఏం చేయాలనుకుంటున్నారు? ఏం చేస్తే ఫలితం ఉంటుంది? తదితర అంశాలను తెలుసుకునేలా సదస్సుల్ని ఏర్పాటు చేస్తాం.

బెయిల్ ఇప్పించేందుకు ఏపీఎన్‌ఆర్‌టీ చర్యలు

అమెరికాలో అరెస్టయిన విద్యార్థుల గురించి అధికారులతో సంప్రదింపులు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఫార్మింగ్టన్ నకిలీ విశ్వవిద్యాలయ వ్యవహారంలో అమెరికా పోలీసుల వలలో చిక్కిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను బెయిల్‌పై బయటకు తెచ్చేందుకు ఏపీఎన్‌ఆర్‌టీ చర్యలు చేపట్టింది. న్యాయసహాయం అందించడంతోపాటు ఇమిగ్రేషన్ అధికారులతో సంప్రదింపులు చేపట్టింది. అక్కడ క్రియాశీలకంగా ఉన్న తెలుగు సంఘాలు కూడా ఆర్థిక తోడ్పాటుతోపాటు తమవంతు సాయం అందించేందుకు ముందుకు వస్తున్నాయి. కాలిఫోర్నియా, టెక్సాస్ పరిధిలో డిటెన్షన్ కేంద్రాల్లో ఉన్న కొంతమంది విద్యార్థులను విడుదల చేసినట్లు ఏపీఎన్‌ఆర్‌టీ అధ్యక్షుడు వేమూరి రవి తెలిపారు. ఈ వ్యవహారంలో చిక్కుకున్న విద్యార్థులను మొత్తం నాలుగు విభాగాలుగా చేసి సహాయ చర్యలు అందిస్తున్నారు. నకిలీ వీసాలున్నట్లు భావిస్తున్న 600 మంది విద్యార్థులను ఒక విభాగంలోకి తీసుకున్నారు. అమెరికా ప్రభుత్వం నుంచి తాఖీదులు అందుకున్న వారు రెండో విభాగంగా గుర్తించారు. డిటెన్షన్ సెంటర్లలో ఉన్న వారిని మూడో విభాగంలో, విశ్వవిద్యాలయ కన్సల్టెంట్లుగా వ్యవహరించిన 8 మందిని నాలుగో విభాగంలో చేర్చారు. వీరికి సాయం చేసేందుకు ఏపీఎన్‌ఆర్‌టీ.. ఇతర సంఘాలతో కలిసి 10 మంది సభ్యుల బృందాన్ని ఏర్పాటు చేసింది.

డిటెన్షన్ కేంద్రాల్లోని వారికి మనోధైర్యం..

డిటెన్షన్ కేంద్రాల్లో 60 మంది విద్యార్థులున్నారు. వీరి వద్దకు భారత విదేశాంగశాఖ కార్యాలయ అధికారులు వెళ్లి మాట్లాడుతున్నారు. బెయిల్ మంజూరు చేయించడానికి ప్రత్యేక న్యాయవాదులను నియమించారు. వీరందరికి న్యాయసాయం అందించేందుకు ఏపీఎన్‌ఆర్‌టీ 3,500 డాలర్లు (రూ.3 లక్షలు) ఖర్చు చేసింది. మొత్తం 132 మంది విద్యార్థులు అమెరికా ప్రభుత్వం నుంచి తాఖీదులు అందుకున్నారు. వీరంతా భారత్‌కు తిరిగి రావాలంటే అక్కడి ప్రభుత్వ అనుమతి (వాలంటరీ డిపార్చర్) తీసుకోవాలి. దీని కోసం ఇమిగ్రేషన్ అధికారులతో ఏపీఎన్‌ఆర్‌టీ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. కన్సల్టెన్సీలకు చెందిన వారి తరపున వాదనలు వినిపించేందుకు నియమిస్తున్నారు. నేరం రుజువైతే వీరికి అయిదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం కూడా ఉండటంతో న్యాయసహాయం అందించాలని నిర్ణయించారు. ఉన్నత విద్య కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర దేశాలకు వెళ్లే విద్యార్థులకు అయా దేశాల విశ్వవిద్యాలయాల నుంచి వచ్చిన ధ్రువపత్రాలను పరిశీలించేందుకు ఏపీఎన్‌ఆర్‌టీ కౌన్సెలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.

అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం

అమెరికాలో చిక్కుకున్న తెలుగు విద్యార్థులను తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. ఎవరూ ఆందోళన చెందవద్దు. ఏడాదికి రూ.50 చెల్లించి 'ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకం'లో నమోదైతే ఇలాంటి సమస్యల్లో చిక్కుకున్న వారికి ఉచిత న్యాయసాయం, ఆర్థికసాయం అందించే వీలుంది. ఇతర దేశాలకు వెళ్లే వాళ్లంతా ఇందులో నమోదు చేసుకోవాలి.

– వేమూరి రవి, ఏపీఎన్‌ఆర్‌టీ అధ్యక్షుడు

గుండెకు ఇన్‌ఫెక్షన్ల పోటు!


మధుమేహం, అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటివి గుండెపోటు ముప్పు పెరిగేలా చేస్తాయన్నది తెలిసిందే. అయితే ఇందుకు ఇన్‌ఫెక్షన్లు కూడా దోహదం చేస్తాయంటే నమ్ముతారా? న్యుమోనియా, మూత్రకోశ ఇన్‌ఫెక్షన్ల వంటి సమస్యల బారినపడ్డ మూడు నెలల తర్వాత గుండెపోటు ముప్పు 37%, పక్షవాతం ముప్పు 30% పెరుగుతున్నట్టు మిన్నెసోటా మెడికల్ స్కూల్ అధ్యయనం పేర్కొంటోంది మరి. సాధారణంగా ఇన్‌ఫెక్షన్లు దాడిచేసినపుడు వాటిని ఎదుర్కోవటానికి రోగనిరోధకవ్యవస్థ పెద్దఎత్తున తెల్లరక్తకణాలను ఉత్పత్తి చేస్తుంది. ఫలితంగా ఒంట్లో వాపు ప్రక్రియ (ఇన్‌ఫ్లమేషన్) మొదలవుతుంది. గమనించాల్సిన విషయం ఏంటంటే- ఈ ప్రక్రియలో ప్లేట్‌లెట్ల సంఖ్య కూడా పెరగటం. ఇవి రక్తం గడ్డలు ఏర్పడటానికి దోహదం చేస్తున్నాయని, ఈ గడ్డలు గుండె లేదా మెదడు రక్తనాళాల్లో చిక్కుకొని అడ్డుపడితే గుండెపోటు, పక్షవాతం ముప్పు పెరిగే అవకాశముందని పరిశోధకులు చెబుతున్నారు. ఇన్‌ఫెక్షన్ల తీవ్రత పెరిగినకొద్దీ ముప్పులూ ఎక్కువవుతున్నాయనీ వివరిస్తున్నారు. అందువల్ల ఇన్‌ఫెక్షన్లను తేలికగా తీసుకోవటానికి వీల్లేదని.. ముఖ్యంగా గుండెజబ్బు ముప్పులు గలవారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



కుటుంబ బరువు బాధ్యతలు మోసే మనిషికి ఏదైనా అయితే? అది ఇంటిల్లిపాదినీ కుంగదీస్తుంది. మోకాళ్ల నొప్పులూ అంతే! ఒంటి బరువును భుజాన వేసుకొని మోస్తూ.. కదులుతూ కదిలిస్తూ మనల్ని ముందుకు నడిపించే మోకీళ్లకు ఏ చిన్న సమస్య వచ్చినా ఇబ్బందే. ఇక కీళ్ల స్వరూపాన్ని క్రమంగా మార్చేస్తూ.. చివరికి వాటిని కట్టిపడేసే అరుగుదల సమస్య (ఆస్టియో ఆర్థ్రయిటిస్) దాడి చేస్తే? మొత్తం శరీరమే కుదేలవుతుంది. నిజానికి వయసుతో పాటు మోకీళ్లు అరగటం అసహజమేమీ కాదు. కాకపోతే ఇప్పుడు 40, 50ల్లోనే ఎంతోమంది దీని బారినపడుతుండటం.. చిన్న చిన్న దూరాలకే నొప్పులతో విలవిల్లాడుతూ కూలబడిపోతుండటమే విషాదం. మారిపోతున్న జీవనశైలి, అధిక బరువు, ఊబకాయం వంటివన్నీ ఇందుకు తలో చేయి వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోకీళ్ల నొప్పులు- కారణాలు, చికిత్స, నివారణపై సమగ్ర కథనం ఈవారం మీకోసం.

వింటున్నారా..


మోకీళ్ల మొర!



కూచోవాలన్నా, నిలబడాలన్నా ఒకటే నొప్పి. నాలుగడుగులు వేయటమూ గగనమే. ఇలా మోకీళ్లనొప్పులతో తలెత్తే బాధలు అన్నీఇన్నీ కావు. మన శరీరాన్ని, జీవనగమాన్ని నడిపించే మోకీలు ఎందుకిలా మొరాయిస్తోంది? అసలేంటీ సమస్య? మన శరీరంలో అతి ముఖ్యమైన, అతి బలమైన కీళ్లలో మోకీలు ఒకటి. శరీర బరువును, ఒత్తిడిని భరిస్తూనే సున్నితంగా కదులుతుండటం దీని ప్రత్యేకత. మనం నడవటం, కాళ్లు ముడుచుకొని కూచోవటం వంటివి తేలికగా చేస్తున్నామంటే అంతా మోకీళ్ల చలవే. వీటి నిర్మాణం నిజంగా అద్భుతమే. పైనుంచి వచ్చే తుంటి ఎముక, పాదం నుంచి వచ్చే కింది ఎముక.. రెండూ మోకాలి దగ్గర కలుస్తాయి. ఇవి రెండూ ఒకదానికి మరోటి రుద్దుకోకుండా ఎముకల చివర్లోని మృదులాస్థి (కార్టిలేజ్).. ఎముకల మధ్యలోని మినిస్కస్ అనే మందమైన పొర తోడ్పడుతుంటాయి. శరీర బరువును, ఒత్తిడిని చాలావరకూ ఈ మృదులాస్థి, మినిస్కస్ పొరలే తీసుకుంటాయి. అయితే ఇవి ఎప్పటికీ అలాగే ఉండిపోవు. వయసు మీద పడుతున్నకొద్దీ అరిగిపోతుంటాయి. దీంతో మోకాలు కదిలినప్పుడల్లా ఎముకలు రెండూ ఒకదాంతో ఒకటి రుద్దుకుంటూ విపరీతమైన నొప్పి వేధిస్తుంటుంది. మోకీళ్ల నొప్పులకు (ఆస్టియో ఆర్థ్రయిటిస్) ఇదే మూలం. ఒకప్పుడు మోకాళ్ల నొప్పులంటే వృద్ధాప్య సమస్యే. ఇప్పుడు చిన్నవయసులోనే దాడిచేస్తోంది.




డా॥ కె. కృష్ణయ్య
సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్
కిమ్స్ హాస్పిటల్స్
సికింద్రాబాద్



సాధారణంగా అరవై ఏళ్లు దాటినవారిలో సుమారు 20% మందిలో మోకీళ్లు అరిగిపోతుంటాయి. ఆ తర్వాత వయసు పెరుగుతున్నకొద్దీ అరిగిపోవటమూ ఎక్కువవుతుంటుంది. కానీ ఇప్పుడు 45, 50 ఏళ్లలోనే ఎంతోమంది మోకీళ్ల నొప్పుల బారినపడుతుండటం గమనార్హం.

ఎందుకిలా?

చిన్నవయసులోనే మోకీళ్ల నొప్పులు దాడిచేస్తుండటానికి ప్రధాన కారణాలు మారిపోతున్న జీవనశైలి, ఊబకాయం. మన శరీరం చాలా అద్భుతమైంది. కండరాలు, ఎముకల మీద ఒత్తిడి పడుతున్నకొద్దీ దాన్ని తట్టుకోవటానికి అవసరమైన సామర్థ్యాన్ని సంతరించుకుంటాయి. ఒకప్పుడు శారీరక శ్రమ ఎక్కువ. తిని కూచోవటం తక్కువ. అందువల్ల సహజంగానే కండరాలు, ఎముకలు బలంగా ఉండేవి. మరిప్పుడో? శారీరక శ్రమ బాగా తగ్గిపోయింది. కూచొని చేసే పనులు పెరిగిపోయాయి. ఫలితంగా మోకాలి కండరాలు, కీళ్లను పట్టుకునే కండర బంధనాలు పట్టు కోల్పోతున్నాయి. ఒత్తిడిని తట్టుకునే సామర్థ్యం, బరువును మోసే శక్తి కొరవడుతున్నాయి. అంతేకాదు- ఊబకాయం, అధిక బరువు కూడా చిన్న వయసు నొప్పులకు దారితీస్తున్నాయి. సరైన శారీరక శ్రమ, వ్యాయామం లేకపోతే ఒళ్లు బరువెక్కుతుందనటంలో సందేహం లేదు. దీనికి తోడు కొవ్వు పదార్థాలు, జంక్ ఫుడ్ తినటమూ పెరిగిపోయింది. ఇలాంటివన్నీ అధిక బరువు, ఊబకాయానికి దోహదం చేస్తున్నాయి. బరువు పెరిగినకొద్దీ మోకీళ్ల మీదా ఒత్తిడి ఎక్కువవుతుంది. ఫలితంగా మృదులాస్థి కూడా త్వరగా అరగటం ఆరంభిస్తుంది. కొందరిలో వంశపారంపర్యంగానూ మోకీళ్లు అరిగిపోవచ్చు.



ప్రమాదాలు జరిగినప్పుడో, దెబ్బలు తగిలినప్పుడో సరైన చికిత్స తీసుకోకపోవటంతోనూ మోకాలి ఎముకల మధ్య సమతుల్యత దెబ్బతిని మృదులాస్థి అరిగే ప్రమాదముంది. కీళ్లవాతం, గౌట్ వంటి సమస్యలూ కొందరికి మోకీళ్ల నొప్పులకు దారితీయొచ్చు. అందువల్ల చిన్నవయసులో మోకీళ్ల నొప్పులు తలెత్తితే ఇతరత్రా సమస్యలేవీ లేవని నిర్ధరించుకోవటం చాలా అవసరం. **కారణమేదైనా మృదులాస్థి ఒకసారి క్షీణించిందంటే దానంతటదే తిరిగి మామూలు స్థాయికి రావటం అసాధ్యం.**

ఎప్పుడు సమస్యాత్మకం?

ఎప్పుడైనా కాస్త ఎక్కువదూరం నడవాల్సి వస్తే మోకీళ్ల నొప్పి పుట్టటం మామూలే. కండరాల మీద, ఎముకల మీద ఒత్తిడి పడటం మూలంగా వచ్చే ఇలాంటి నొప్పులు విశ్రాంతి తీసుకుంటే తగ్గిపోతాయి. వీటికి భయపడాల్సిన పనేమీ లేదు. కానీ తరచూగా, అదీ తక్కువ దూరానికే నొప్పి వస్తుంటే మాత్రం సందేహించాల్సిందే. నడవటం ఆపేస్తే నొప్పి తగ్గిపోతుండటం.. ఇంతకుముందు 2 కిలోమీటర్లు నడిస్తే వచ్చే నొప్పి ఇప్పుడు అర కిలోమీటరు దూరానికే రావటం.. రోజువారీ పనులు చేసుకుంటున్నప్పుడూ నొప్పి ఇబ్బంది పెడుతుండటం.. మోకీళ్లు పట్టేస్తుండటం.. వాపు వంటివి గమనిస్తే ఏమాత్రం తాత్సారం చేయరాదు.

లక్షణాలు- ఎన్నెన్నో

- **నొప్పి:** మొదట్లో ఎప్పుడైనా ఎక్కువ దూరం నడిచినప్పుడో, మెట్లు ఎక్కుతున్నప్పుడో, కింద కూచొని లేచినప్పుడో నొప్పి వస్తుంటుంది. తర్వాత కాస్త దూరం నడవగానే నొప్పి మొదలవుతుంది. మెట్లు ఎక్కటం, దిగటం కష్టమవుతుంది. చివరికి ఏం చేయకపోయినా, విశ్రాంతి తీసుకుంటున్నా నొప్పి బాధిస్తుంది. కొందరికి రాత్రి పూటా నొప్పి వేధిస్తుంటుంది. దీంతో నిద్ర కూడా దెబ్బతింటుంది. క్రమంగా నొప్పి మాత్రలు వేసుకుంటే తప్ప బయటకు రాలేని పరిస్థితి తలెత్తుతుంది.
- **వాపు:** సమస్య ఆరంభంలో అప్పుడప్పుడు వాపు వస్తుంది, కొద్దిరోజులకు తగ్గిపోతుంది. ముదురుతున్నకొద్దీ వాపు తగ్గకుండా అలాగే ఉండిపోతుంటుంది.
- **కిరకిర చప్పుడు:** కొందరికి కూచున్నప్పుడు, లేచినప్పుడు కిరకిరమంటూ చప్పుడు రావొచ్చు. మృదులాస్థి అరిగిపోయినప్పుడు అక్కడ ఎముక బయటపడుతుంది. దీంతో ఎముకలు రాసుకుపోయి చప్పుడు వస్తుంది. అయితే కిరకిరమని చప్పుడు ఉన్నంత మాత్రాన మోకీళ్ల అరుగుదలగా భావించాల్సిన పని లేదు. కొందరికి మామూలుగానే కూచున్నప్పుడు, లేచినప్పుడు మోకీళ్లు చప్పుడు చేస్తుంటాయి. చప్పుడుతో పాటు నొప్పి, వాపు కూడా ఉంటేనే సమస్యగా భావించాలి.
- **వంకర పోవటం:** మృదులాస్థి ఒకపక్క బాగా అరిగిపోతే కీలు వంకర పోవచ్చు. దీంతో బరువు సరిగా పడక ఒకవైపునకు ఒరిగి నడుస్తుంటారు.
- **బిగుసుకుపోవటం:** మొదట్లో నిద్రలేచిన వెంటనే మోకీళ్లు బిగుసుకుపోయినట్టు, పట్టుకుపోయినట్టు అనిపిస్తుంది. కాస్త అటూఇటూ కదిలించటం వంటివి చేస్తే తిరిగి కుదురుకుంటాయి. క్రమంగా కూచోవాలన్నా, లేవాలన్నా వంగకుండా తయారవుతాయి. దీంతో కుర్చీలో, కారులో కూచోవాలన్నా.. వంగాలన్నా ఇబ్బంది పడతారు.
- **వేడి:** సమస్య తీవ్రమైతే మోకీళ్లు వేడిగానూ ఉండొచ్చు.

చికిత్స — బరువు తగ్గటం, వ్యాయామం ప్రధానం

అధిక బరువు, ఊబకాయం తగ్గించుకోవటం చాలా కీలకం. ఒక కిలో బరువు తగ్గినా మోకీళ్ల మీద సుమారు 5 కిలోల భారాన్ని తగ్గించుకున్నట్టే. కాబట్టి సమతులాహారం తీసుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయటం అత్యవసరం. నడిస్తే నొప్పి పుడుతోందని భావిస్తే వ్యాయామ సైకిల్ తొక్కొచ్చు. ఈత కొడితే ఇంకా మంచిది. వీటితో పాటు డాక్టర్లు కొన్ని ప్రత్యేకమైన వ్యాయామాలు, ఫిజియోథెరపీ సూచిస్తారు. ఇవి మోకీళ్లకు దన్నుగా నిలిచే కండరాలను బలోపేతం చేస్తాయి. దీంతో కీళ్లపై భారం తగ్గుతుంది, కదలికలూ మెరుగవుతాయి. మృదులాస్థి అప్పుడప్పుడే అరగటం ఆరంభమైనవారికి కీళ్లు జారిపోకుండా చూసే పట్టీలు కూడా బాగా ఉపయోగపడతాయి.

- **నొప్పి మందులు:** ముందు మామూలు నొప్పి మందులతోనే ఫలితం కనబడుతుంది. వీటితో ఉపశమనం లభించకపోతే డైక్లోఫెనాక్ వంటి ఎన్‌ఎస్ఏఐడీ రకం మందులు ఇస్తారు. అయితే ఇవి ఛాతీలో మంట, అల్సర్ల వంటి దుష్ప్రభావాలకు దారితీయొచ్చు. కాబట్టి దీర్ఘకాలం వాడుకోవటం మంచిది కాదు. నిపుణుల సలహా మేరకే తీసుకోవాలి.
- **గ్లూకోజమైన్ మాత్రలు:** ఇవి మోకీళ్లలో జిగురుద్రవం ఉత్పత్తి పెరిగేలా చేస్తాయి. మృదులాస్థి బలోపేతమవుతుంది.
- **ఆర్థ్రోస్కోపీ క్లీనింగ్:** మాత్రలు వేసుకుంటున్నా, ఫిజియోథెరపీ చేస్తున్నా, పట్టీలు ధరిస్తున్నా ఫలితం కనబడకపోతే ఆర్థ్రోస్కోపీ ద్వారా మృదులాస్థి ఉపరితలాన్ని శుభ్రం చేస్తారు. పెచ్చులేవైనా లేస్తే తొలగిస్తారు. దీంతో కదలికలు మెరుగవుతాయి. నొప్పి, వాపు నుంచి తాత్కాలికంగా ఉపశమనం లభిస్తుంది.
- **జిగురుద్రవం:** కీళ్లలో హైలురోనిక్ యాసిడ్ అనే జిగురుద్రవం ఎముకలు రాసుకుపోకుండా కందెనలాగా ఉపయోగపడుతుంది. అందువల్ల అవసరమైతే దీన్ని ఇంజెక్షన్ రూపంలో నేరుగా కీళ్లలోకి ఇస్తారు.
- **ఎముకను సరిచేయటం:** దీన్నే ఆస్టియోటమీ అంటారు. దెబ్బతిన్న మృదులాస్థి మీద బరువు ఎక్కువగా పడకుండా ఎముక అమరిక సహజసిద్ధంగా ఉండేలా సరిచేయటం దీని ప్రత్యేకత. ఇందులో మోకాలి కింది ఎముకకు ఒకవైపున గాటు పెట్టి.. అవసరమైన మేరకు కత్తిరించటమో.. ఎముకను జోడించటమో చేస్తారు. తర్వాత ప్లేట్, స్క్రూలతో బిగిస్తారు. దీంతో దెబ్బతిన్న మృదులాస్థి మీద బరువు పడటం తగ్గి, నొప్పి తగ్గుతుంది. మున్ముందు మృదులాస్థి అరిగిపోకుండానూ ఉంటుంది. అరిగిపోయిన భాగం తిరిగి కోలుకోవటానికీ వీలుంటుంది. మోకీలు మార్పిడితో పోలిస్తే ఇది తేలికైంది. పెద్దగా ఇబ్బంది పెట్టేది కాదు. ఖర్చు కూడా తక్కువే. అందుకే చిన్న వయసులో మోకీలు మార్పిడికి ప్రత్యామ్నాయంగా దీన్ని సూచిస్తున్నారు. ఇటీవల ఇది ఎక్కువగానే ప్రాచుర్యం పొందుతోంది.
- **మోకీలు మార్పిడి:** ఇతరత్రా చికిత్సలతో ఫలితం కనబడపోతే.. చివరి ప్రయత్నంగానే మోకీలు మార్పిడి శస్త్రచికిత్స చేస్తారు. అయితే ఇది పెద్ద ఆపరేషన్. ఇన్‌ఫెక్షన్ల వంటి దుష్ప్రభావాలు తలెత్తొచ్చు. కృత్రిమ కీలు కొంతకాలానికి అరిగిపోతుంది కూడా. అందువల్ల వీలైనంత వరకు అరవై ఏళ్ల లోపువారికి దీన్ని చేయకపోవటమే మంచిది. 50 ఏళ్ల వయసులో శస్త్రచికిత్స చేయించుకున్నారనుకోండి. ఉద్యోగాలు, పనులతో చురుకుగా ఉంటారు. దీంతో కృత్రిమ కీలు అరిగిపోయి తిరిగి 70 ఏళ్ల వయసులో మళ్లీ మార్పిడి చేయాల్సి రావొచ్చు. అదే అరవై, డెబ్బై దాటితే అంత ఎక్కువ చురుకుగా ఉండరు. అప్పుడు మోకీలు మార్పిడి చేయించుకుంటే కీలు మీద అంత ఒత్తిడి పడదు. దీంతో ఎక్కువకాలం మన్నుతుంది. గతంతో పోలిస్తే ఇప్పుడు ఒత్తిడిని తట్టుకొని ఎక్కువకాలం మన్నే పరికరాలూ అందుబాటులోకి వచ్చాయి. కీలు ఫిక్సేషన్ పద్ధతులు, డిజైన్ కూడా మెరుగయ్యాయి. కాకపోతే అన్ని సదుపాయాలు గల ఆసుపత్రిలో, మంచి అనుభవం గల డాక్టర్లతోనే చేయించుకోవాలి. అరకొరగా ఆపరేషన్ చేస్తే ఇన్‌ఫెక్షన్ల వంటి దుష్ప్రభావాలు తలెత్తొచ్చు. అమరిక ఒక డిగ్రీ అటూఇటూ అయినా కీలు త్వరగా అరిగిపోతుంది.



కృత్రిమ మోకీలు

పునరుత్తేజిత చికిత్సలు

వీలైనంతవరకు సహజ కీలును అలాగే ఉంచి.. మృదులాస్థిని తిరిగి కోలుకునేలా చేయటంపై ఇప్పుడు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. అందుకే మృదులాస్థిని పునరుత్తేజితం చేసే (రీజనరేటివ్) చికిత్సలకు ప్రాధాన్యం పెరుగుతోంది.

ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా చికిత్స: ఇందులో నొప్పితో బాధపడుతున్న వారి నుంచి 30-40 మిల్లీలీటర్ల రక్తాన్ని సేకరించి దానిలోంచి ప్లేట్‌లెట్లు దండిగా ఉండే 3-4 మిల్లీలీటర్ల ప్లాస్మా ద్రవాన్ని వేరుచేస్తారు. దీన్ని సూది ద్వారా మోకీళ్లలోకి ప్రవేశపెడతారు. ప్లేట్‌లెట్లలో కణజాలాన్ని వృద్ధి చేసే కారకాలు (గ్రోత్ ఫ్యాక్టర్స్) దెబ్బతిన్న మృదులాస్థి పునరుత్తేజితమయ్యేలా ప్రేరేపిస్తాయి. అరుగుదల తొలిదశలో ఉన్నవారికిది బాగా ఉపయోగపడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

మూలకణ చికిత్స: మూలకణాలు మృదులాస్థి కణాలుగా మారిపోయి దెబ్బతిన్న భాగం మరమ్మతు కావటానికి తోడ్పడతాయి. ఈ చికిత్సపై పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్ని పద్ధతులు అందుబాటులోకీ వచ్చాయి. కటి ఎముక లోపలి నుంచి మజ్జను తీసి, మూలకణాలను వేరుచేసి నేరుగా మోకీలులోకి ఎక్కించటం ఒక పద్ధతి. అయితే దీంతో ఒనగూడే ఫలితాలకు శాస్త్రీయంగా నిరూపణ లేదు. మూలకణాలను ప్రయోగశాలలో పెద్దసంఖ్యలో వృద్ధి చేసి మోకీలులోకి ప్రవేశపెట్టటం మరో పద్ధతి. ఇది బాగా ఉపయోగపడుతుంది గానీ దీన్ని నిర్వహించటానికి మనకింకా అనుమతి లభించలేదు. మూలకణాలను పూతగా చేసి మృదులాస్థి పెచ్చులు ఊడినచోట పూయటం మరో పద్ధతి. దీంతో మరింత మంచి ఫలితం కనబడుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

నిర్ధరణ

ముందు ఆయా లక్షణాలను, ఇబ్బందులను నిశితంగా పరిశీలించటం చాలా అవసరం. నొప్పి ఒక కాలిలో ఉందా? రెండు కాళ్లలోనా? ఎంత దూరం నడిస్తే వస్తోంది? ఎన్నిరోజుల నుంచి వస్తోంది? ఎంత తీవ్రంగా ఉంది? రాత్రిపూట కూడా నొప్పి పుడుతోందా? విశ్రాంతి తీసుకుంటే తగ్గుతుందా? రోజువారీ పనులకు ఇబ్బంది కలుగుతోందా? మెట్లు ఎక్కటానికి వీలవుతోందా? కూచొని లేవగలుగుతున్నారా? చప్పుడు వస్తోందా? ఏవైనా మందులు వేసుకుంటున్నారా? ఎంత తరచుగా మందులు వేసుకుంటున్నారు? ఇలాంటి ప్రశ్నలతోనే సమస్య ఏంటనేది చాలావరకు తేలిపోతుంది. తర్వాత నడక ఎలా ఉంది? ఒకవైపునకు ఒరిగిపోతున్నారా? కుంటుతున్నారా? అనేది చూస్తారు. అలాగే మోకీళ్ల మీద చేయి పెట్టి కీలు ఎలా ఉంది? ఎలా కదులుతోంది? చప్పుడేమైనా వస్తోందా? వంకర పోయిందా? నొప్పి ఎక్కడెక్కడ్నుంచి మొదలవుతోంది? అనేది పరిశీలిస్తారు. ఇవన్నీ సమస్యపై ఒక అంచనాకు రావటానికి తోడ్పడతాయి.

- **ఎక్స్‌రే:** మోకీళ్లు అరిగిపోయినట్టు అనుమానిస్తే ఎక్స్‌రే తీస్తారు. ఇందులో ఎముక అరిగిపోవటం, వంకరపోవటం వంటివన్నీ బయటపడతాయి.
- **ఎంఆర్ఐ:** ఎక్స్‌రేలో ఎముకలకు సంబంధించిన అంశాలే తెలుస్తాయి. మృదులాస్థి, కండర బంధనాలు, మెనిస్కస్ ఎలా ఉన్నాయనేవి కచ్చితంగా తెలియవు. అందువల్ల అవసరమైతే కొందరికి ఎంఆర్ఐ కూడా చేయాల్సి ఉంటుంది.
- **రక్త పరీక్షలు:** ఇవి రుమటాయిడ్ ఆర్థ్రయిటిస్, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, గౌట్ వంటివి గుర్తించటానికి తోడ్పడతాయి.
- **ఆర్థ్రోస్కోపీ:** అరుదుగా ఆర్థ్రోస్కోపీ అవసరపడొచ్చు. ఇందులో మోకీలులోకి గొట్టం లాంటిది పంపించి ఎలా ఉందో చూస్తారు. మృదులాస్థి అరుగుదల తొలిదశలోనే ఉన్నా గుర్తించొచ్చు. కండర బంధనాలు బెణికినా ఇందులో బయటపడుతుంది.

నివారణ కీలకం

ఒకసారి మృదులాస్థి క్షీణించటం మొదలైతే తిరిగి మామూలు స్థాయికి రావటం కష్టం. కాబట్టి ముందు నుంచే తగు జాగ్రత్తలు తీసుకోవటం మంచిది.

- **బరువు అదుపు:** మోకీళ్లకు బరువు పెద్ద శత్రువు. బరువు పెరిగినకొద్దీ కీళ్ల మీద భారం ఎక్కువవుతుంది. ఫలితంగా మృదులాస్థి త్వరగా అరిగిపోయే ప్రమాదముంది. కాబట్టి ముందు నుంచే బరువు పెరగకుండా చూసుకుంటే మోకీళ్ల నొప్పులు తలెత్తకుండా చూసుకోవచ్చు. కాబట్టి సమతులాహారం తీసుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం మంచిది. వ్యాయామాలతో మరో ప్రయోజనం ఎముకలకు దన్నుగా నిలిచే కండరాలు, కండర బంధనాలు కూడా బలోపేతమవటం.
- **ఇతర సమస్యలకు చికిత్స:** కీళ్లవాతం, గౌట్ వంటి సమస్యలేవైనా ఉంటే ముందే గుర్తించి చికిత్స తీసుకోవటం మంచిది. ఎందుకంటే ఇలాంటి సమస్యలు ముదిరిపోయి ఒకసారి కీళ్లు దెబ్బతింటే తిరిగి కుదురుకోవటం అసాధ్యం. అవి శాశ్వతంగా అలాగే ఉండిపోతాయి. కీళ్లవాతం, గౌట్‌లకు ఇప్పుడు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. వీటిని క్రమం తప్పకుండా వాడుకుంటుంటే సమస్య ముదరకుండా చూసుకోవచ్చు.

సమస్య - సలహా

నాలుక పూత ఎందుకు?

సమస్య: నా వయసు 24 సంవత్సరాలు, నాలుగు నెలలుగా నాలుక పూతతో బాధపడుతున్నాను. మందులు వేసుకుంటున్నా మార్పు కనబడటం లేదు. దీనికి పరిష్కారం ఏదైనా ఉందా? లేకపోతే ఎల్లకాలం ఇలాగే వేధిస్తుందా?

– వెంకట్ చిలక (ఈ–మెయిల్ ద్వారా)

సలహా: మీరు సమస్యను వివరించారు గానీ లక్షణాలు తెలియజేయలేదు. నాలుక మంట పుడుతోందా? భోజనం చేస్తున్నప్పుడు మంట పెరుగుతోందా? కారం తగిలినప్పుడు మరింత మండుతోందా? అనేవి చెప్పలేదు. ఇలాంటి లక్షణాలేవీ లేకపోతే పెద్దగా బాధపడాల్సిన పనేమీ లేదు. నాలుక మధ్యలో కొంతభాగం ఎర్రగా అవటం (మీడియన్ రాంబాయిడ్ గ్లాసైటిస్).. అక్కడక్కడా తెల్లగా, ఎర్రగా అయ్యి నాలుక పటం మాదిరిగా కనబడటం (జాగ్రఫికల్ టంగ్) వంటి వాటిని చాలామంది నాలుక పూతగా భావిస్తుంటారు. ఇవి మామూలు సమస్యలే. మంట వంటి ఇబ్బందులేవీ ఉండవు. అయితే అన్నం తింటున్నప్పుడు, కారం తగిలినప్పుడు మంట పుట్టటం వంటి లక్షణాలు కనబడితే చాలావరకు బి విటమిన్ల లోపం కారణం కావొచ్చు. రైబోఫ్లావిన్, నియాసినమైడ్ తగ్గితే నాలుక బాగా ఎర్రగా పూసినట్టుగా.. అదే ఫోలిక్ యాసిడ్, బి12 తగ్గితే నాలుక నున్నగా కనబడుతుంది. మన నాలుక మీద రుచి మొగ్గలు ఉంటాయి. ఇవి తగ్గిపోతే నాలుక నున్నగా అవుతుంది (గ్లాసైటిస్). నాలుక ఎర్రగా పూసినట్టు కనబడుతుంది. బి విటమిన్ల లోపం మాత్రమే కాదు.. ఐరన్ లోపంతో తలెత్తే రక్తహీనత కూడా దీనికి దారితీయొచ్చు. దీర్ఘకాలం యాంటీబయోటిక్ మందులు వాడినపుడు పేగుల్లో మంచి బ్యాక్టీరియా చనిపోవటం మూలంగానూ నాలుక పూత రావొచ్చు. అలాగే విడవకుండా వేధించే విరేచనాలు, దీర్ఘకాల పోషణలోపం కూడా దీనికి కారణం కావొచ్చు. బాగా మంట పుట్టే కారం, మిరియాలు, అల్లం, మసాలాల వంటివి ఎక్కువగా తినేవారిలోనూ నాలుక నున్నగా అయ్యి ఎర్రగా కనబడొచ్చు. ఎన్ఎస్ఏఐడీ రకం నొప్పి మందులు వాడినప్పుడూ రావొచ్చు. సల్ఫామెథాక్జజోల్, టెట్రాసైక్లిన్ వంటి మందులు వికటించటం వల్ల కూడా కొందరికి నాలుక ఎర్రగా అవుతుంటుంది (స్టీవెన్స్ జాన్సన్స్ సిండ్రోమ్). అరుదుగా కొన్నిరకాల చర్మ సమస్యల్లోనూ నాలుక మీద గుల్లలు పడి నున్నగా అవ్వొచ్చు. కొందరికి నాలుక చివర్లోనూ నంజుపొక్కులు తలెత్తి ఎర్రగా కనబడొచ్చు. కాబట్టి మీరు ఒకసారి మంచి అనుభవమున్న డాక్టర్‌ను సంప్రతించటం మంచిది. సమస్య చిన్నదే అయినా కచ్చితమైన కారణాన్ని గుర్తించి చికిత్స తీసుకోవటం ముఖ్యం. మీ సమస్య బి విటమిన్లతోనే చాలావరకు నయమయ్యే అవకాశముంది. రక్తంలో హిమోగ్లోబిన్ తగ్గినట్టు తేలితే ఐరన్ మాత్రలు తీసుకోవాల్సి ఉంటుంది. తరచుగా పూత వస్తోందనీ అంటున్నారంటే ఒత్తిడితో బాధపడుతున్నారేమో చూసుకోవాలి. అలాంటిదేదైనా ఉంటే కౌన్సెలింగ్ తీసుకుంటే మంచి ఫలితం కనబడుతుంది. అలాగే కారం, మసాలాలు తగ్గించటం.. తాజా ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవటం మంచిది.





– డా॥ ఎ.అశ్వినీకుమార్
ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్

మీ ఆరోగ్య సమస్యలను సందేహాలను పంపాల్సిన చిరునామా
సమస్య – సలహా **సుఖీభవ**
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512
email: sukhi@eenadu.in

నిద్ర తగ్గితే నీరూ తగ్గుతుంది!

నిద్ర సరిగా పట్టకపోతే తెల్లారాక చికాకుగా అనిపిస్తుంది కదా. దీనికి కొంతవరకు ఒంట్లో నీటిశాతం తగ్గుతుండటమూ కారణమేనని అధ్యయనాలు చెబుతున్నాయి. రాత్రిపూట 6 గంటల కన్నా తక్కువసేపు నిద్రపోయే పెద్దవాళ్లకు ఒంట్లో నీటిశాతం తగ్గే (డీహైడ్రేషన్) ముప్పు 59% ఎక్కువగా ఉంటుండటమే దీనికి నిదర్శనం. నిద్రపోతున్నప్పుడు మెదడులోని పీయూషగ్రంథి వాసోప్రెసిన్ సాయంతో ఒంట్లో నీటిని పట్టి ఉంచాలంటూ మూత్రపిండాలకు సంకేతాలు అందిస్తుంది. దీంతో మూత్రం అంతగా తయారుకాదు. ఒకవేళ నిద్ర తగ్గితే సరైన సమయానికి ఈ హార్మోన్ మూత్రపిండాలకు చేరుకోదు. దీంతో మూత్రపిండాలు నీటిని పట్టి ఉంచటమూ తగ్గుతుంది. ఇది నీటిశాతం తగ్గటానికి దారితీస్తుందన్నమాట. కాబట్టి రాత్రిపూట కంటి నిండా నిద్రపట్టేలా చూసుకోవటం మంచిది. ఒకవేళ అది కుదరకపోతే నిద్ర లేవగానే ఒక గ్లాసు నీళ్లు తాగటం ఉత్తమం. దీంతో డీహైడ్రేషన్ దుష్ప్రభావాలను తప్పించుకోవచ్చు.

ఈనాడు సినిమా


కీర్తి సురేష్


ప్రియా వారియర్


మేఘా ఆకాష్


నాని

ఆ ముగ్గురూ వీళ్లేనా?

నాని కథానాయకుడిగా మైత్రీ మూవీస్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. విక్రమ్ కె.కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అయిదుగురు కథానాయికలకు చోటుందని సమాచారం. అందులో ముగ్గురి ఎంపిక దాదాపుగా ఖాయమైందని తెలుస్తోంది. నానితో 'నేను లోకల్'లో నటించిన కీర్తి సురేష్ ఓ కథానాయికగా ఎంపికైందని, మేఘా ఆకాష్, ప్రియా వారియర్‌లకూ స్థానం దక్కిందని తెలుస్తోంది. ఈ చిత్రంలో నాని రెండు రకాల పాత్రల్లో కనిపించబోతున్నాడట. ఓ హాలీవుడ్ చిత్రం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతోందని, ఈ నెలలోనే చిత్రీకరణ ప్రారంభిస్తారని, ఏడాది చివరికల్లా విడుదల చేస్తారని తెలుస్తోంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తారు.

నా కోసం కొన్ని


కాజల్

సినిమాలో పాత్ర కోరుకున్నట్టుగా కనిపించడమే మా పని అంటుంటారు నటులు. కథానాయిక కాజల్ మాత్రం సినిమానే కాదు, అప్పుడప్పుడు నేను కోరుకొన్నట్టుగా నటించే అవకాశాలు కూడా నాకు లభించాయి అంటోంది. "తొలినాళ్లలో వచ్చిన ప్రతి అవకాశం కీలకమే కాబట్టి వాటిని సద్వినియోగం చేసుకోవడంపైనే దృష్టి ఉంటుంది. ఆ తర్వాత కొన్నాళ్లకి అనుభవమున్న కథానాయిక అంటూ అందుకు తగ్గ బలమైన పాత్రల్ని కట్టబెడుతుంటారు. వాటికి న్యాయం చేయాలనే తపనతోనే కష్టపడుతుంటాం. ఈ ప్రయాణంలో నటుల ఇష్టాయిష్టాలు మరుగున పడిపోతుంటాయి. అదృష్టంకొద్దీ నా విషయంలో అలా జరగలేదు. 'ఫలానా తరహా పాత్రలో కనిపిస్తే బాగుంటుందేమో' అని ఒక ఆలోచన తట్టేలోపే, ఇంచుమించు దాన్ని పోలిన పాత్రలో నటించే అవకాశం వచ్చేది. అందుకే నా పాత్రల్ని పరిశీలిస్తే 'కొన్ని సినిమాల కోసం, కొన్ని నా కోసం' అన్నట్టుగా ఉంటాయి. కొన్ని వాణిజ్య ప్రధానమైన సినిమాలు ఎంతో తృప్తినిచ్చాయి. నటనకి ప్రాధాన్యమున్న పాత్రల్లోనే కాదు. పరిమితులున్న పాత్రల్లో కనిపించి మెప్పించడంలోనూ సవాళ్లుంటాయ"ని చెప్పింది కాజల్. ప్రస్తుతం ఆమె బెల్లంకొండ సాయిశ్రీనివాస్‌తో 'సీత', కమల్ హాసన్‌తో 'భారతీయుడు 2' చిత్రాల్లో నటిస్తోంది.



ఫోర్బ్స్ జాబితాలో విజయ్ దేవరకొండ

టాలీవుడ్ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ ఫోర్బ్స్ జాబితాలో స్థానం దక్కించుకొన్నారు. 2019కిగానూ ఫోర్బ్స్ ఇండియా '30 అండర్ 30' జాబితాను వెలువరించింది. భారత్‌లో వివిధ రంగాల్లో అద్భుత ప్రతిభ కనబరచినవారికి అందులో చోటిచ్చారు. వారిలో ఎంటర్‌టైన్‌మెంట్ అండ్ మ్యూజిక్ విభాగంలో విజయ్ దేవరకొండకు 29వ స్థానం దక్కింది. ఇదే విభాగంలో గాయని మేఘనా మిశ్రా, యూట్యూబ్ ఛానెల్ నిర్వాహకురాలు ప్రజాక్త కోలి ఉన్నారు. 2011లో 'నువ్విలా'తో నటుడిగా విజయ్ సినీ రంగ ప్రవేశం చేశారు. 2012లో 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'లో అతిథి పాత్రలో సందడి చేశారు. 'ఎవడే సుబ్రమణ్యం'తో ఆయనకు మంచి గుర్తింపు లభించింది. తర్వాత వచ్చిన 'పెళ్లిచూపులు', 'అర్జున్ రెడ్డి' విజయ్‌కు నటుడిగా గుర్తింపును తెచ్చాయి. గత ఏడాది ఆయన నటించిన 'మహానటి', 'గీత గోవిందం' సినిమాల విజయంతో అగ్ర కథానాయకుల సరసన చేరారు. ప్రస్తుతం ఆయన 'డియర్ కామ్రేడ్' చిత్రీకరణలో ఉన్నారు.

"నాకు 25 ఏళ్ల వయసున్నప్పుడు ఆంధ్రా బ్యాంక్ అకౌంట్‌లో కనీస మొత్తం రూ.500 కొనసాగించలేకపోయా. దాంతో నా అకౌంట్‌ని లాక్ చేశారు. 30 ఏళ్లలోపే స్థిరపడమని, నువ్వు వయసులో ఉన్నప్పుడు, తల్లిదండ్రులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే నీ విజయాన్ని ఆస్వాదించగలవని నాన్న చెప్పారు. నాలుగేళ్ల తర్వాత... ఫోర్బ్స్ సెలెబ్రిటీ 100లోనూ, ఫోర్బ్స్ 30 అండర్ 30 జాబితాలోనూ నేనున్నాను".

- ట్విటర్‌లో విజయ్ దేవరకొండ

టైటిల్ ఇలా మారింది


నిఖిల్

నిఖిల్ కథానాయకుడిగా సంతోష్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. లావణ్య త్రిపాఠి కథానాయిక. ఈ చిత్రానికి ఇంతకు ముందు 'ముద్ర' అనే పేరు పెట్టారు. ఇప్పుడు టైటిల్ మారింది. దీన్ని 'అర్జున్ సురవరం'గా మార్చారు. మార్చి 29న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. నిర్మాతలు కావ్య వేణుగోపాల్, రాజ్‌కుమార్ మాట్లాడుతూ "నిఖిల్ ఓ పాత్రికేయుడిగా కనిపించబోతున్నాడు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయ"న్నారు.

థాణా కహానీ


సాన్వీ మేఘన, మాగంటి శ్రీనాథ్

మాగంటి శ్రీనాథ్, సాన్వీ మేఘన జంటగా నటించిన చిత్రం 'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్'. గోరేటి వెంకన్న ఓ కీలక పాత్ర పోషించారు. నాగసాయి మాకం దర్శకుడు. మహంకాళి శ్రీనివాస్ నిర్మాత. మార్చి రెండో వారంలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "బిలాల్‌పూర్ అనే ఊళ్లోని పోలీస్ థాణా నేపథ్యంలో సాగే చిత్రమిది. అక్కడికొచ్చే విచిత్రమైన కేసులు, వాటి దర్యాప్తు విధానం ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది. సహజత్వంతో సాగే ఈ సినిమా చూస్తున్నంతసేపూ ప్రేక్షకులు తమ ఊళ్లలో జరిగే సంఘటనల్ని గుర్తు చేసుకొంటారు. అశ్లీలత, అసభ్యతకి చోటు లేకుండా కుటుంబమంతా కలసి చూసేలా ఉంటుందీ చిత్రం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "వినోదాత్మకంగా సాగుతూనే ఆలోచింపజేసే చిత్రమిది. సమాజం ఎదుర్కొంటున్న ఓ కీలక సమస్యని ఇందులో ప్రస్తావించాం. ఒక పెద్ద పంపిణీ సంస్థ ద్వారా చిత్రాన్ని ఎక్కువ థియేటర్లలో విడుదల చేస్తాం" అన్నారు. ప్రణవి, ఆర్.ఎస్.నందా, వెంకట్ గోవాడ, మల్లేష్, వైభవ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: తోట వి.రమణ, సంగీతం: సాబు వర్గీస్.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే



మనీష్‌బాబు, హసీన, బెల్లంకొండ సురేష్, రాజా వన్నెంరెడ్డి, సి.కల్యాణ్, సత్యారెడ్డి, కిరణ్ కుమార్, ప్రసన్న కుమార్

మనీష్‌బాబు కథానాయకుడిగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. అక్షిత, హసీన మస్తాన్ మీర్జా నాయికలు. రాజా వన్నెంరెడ్డి దర్శకత్వం వహించారు. సత్యారెడ్డి నిర్మాత. సోమవారం హైదరాబాద్‌లో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సి.కల్యాణ్ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మనీష్‌ను కథానాయకుడిగా పరిచయం చేయమని సత్యారెడ్డికి రెండేళ్ల కిందటే చెప్పా. అందం, ఆహార్యం కలిగిన మనీష్‌కి ఉజ్వల భవిష్యత్తు ఉంద"న్నారు. "సమాజంలో జరుగుతోన్న అన్యాయాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే విద్యార్థి నాయకుడి చుట్టూ నడిచే కథ. ప్రస్తుత ట్రెండ్‌కి తగ్గట్టుగా ఉంటుంది. త్వరలో విడుదల చేస్తామ"ని అన్నారు నిర్మాత. "అయిదు పాటలున్నాయి. యాక్షన్ దృశ్యాలు ఆకట్టుకుంటాయ"న్నారు దర్శకుడు. కథానాయకుడు మాట్లాడుతూ "నటుణ్నవ్వాలనే తపనతో శిక్షణ పొంది దర్శకుడి సూచనల మేరకు పాత్రోచితంగా నటించాన"న్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్, కిరణ్ కుమార్, ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.


శకుంతలమ్మ

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు మాతృవియోగం

ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మాతృమూర్తి శకుంతలమ్మ(89) సోమవారం నెల్లూరులో కన్నుమూశారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. తల్లి మరణ వార్తను తెలుసుకుని లండన్‌లో ఉన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం హుటాహుటిన నెల్లూరుకు బయలుదేరారు. మంగళవారం ఉదయం ఆయన నెల్లూరుకు చేరుకునే అవకాశం ఉందని ఆయన సోదరి శైలజ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం తమ తల్లి అంత్యక్రియలను నెల్లూరులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పలువురు ప్రముఖులు, సినీనటులు, గాయనీ గాయకులు మంగళవారం ఉదయం నెల్లూరుకు చేరుకొని నివాళి అర్పించనున్నారు. నెల్లూరులోని ప్రముఖులు, సంగీత విద్వాంసులు, కళాకారులు శంకుతలమ్మ పార్థివదేహానికి ఘనంగా నివాళి అర్పించారు. తెలుగు నాట హరికథకు తేజాన్ని, నూతనోత్తేజాన్ని ప్రసాదించి ఆ ప్రక్రియకు కొత్త వెలుగులందించిన మహనీయుడు శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి సతీమణి శకుంతలమ్మ. సాంబమూర్తి మొదటి భార్య మరణానంతరం శంకుతలమ్మను ఆయన వివాహం చేసుకున్నారు. అప్పటికే ఆయనకు ఇద్దరు సంతానం. సాంబమూర్తికి, శకుంతలమ్మకు జన్మించిన ప్రథమ సంతానమే ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. తెలుగు సినీ నేపథ్యగాయకుడిగా పేరు, ప్రఖ్యాతులను సంపాదించారు బాలసుబ్రహ్మణ్యం. ఆయన సోదరీమణులు శైలజ, వసంత కూడా గాయకురాళ్లుగా రాణిస్తున్నారు.

- న్యూస్‌టుడే, నెల్లూరు (సాంస్కృతికం)

అల్లరోడి రాజరికం


సాయికృష్ణ

శివకార్తికేయన్ కథానాయకుడిగా నటించిన అనువాద చిత్రం 'సీమరాజా'. సాయికృష్ణ పెండ్యాల నిర్మాత. సమంత, కీర్తిసురేష్ కథానాయికలు. సిమ్రాన్ కీలక పాత్రధారి. పొన్‌రామ్ దర్శకుడు. 8న విడుదల అవుతోంది. సోమవారం హైదరాబాద్‌లో సాయికృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ "ఇది ఓ అల్లరి కుర్రాడి చుట్టూ తిరిగే కథ. తన పూర్వీకులు రాజ వంశస్థులు. వాళ్లని ప్రేరణగా తీసుకుని ఓ రాజులాగా తన ఊరి కోసం పాటుపడిన విధానం ఆసక్తికరం. టీచర్‌గా సమంత, యువరాణి పాత్రలో కీర్తిసురేష్ నటించారు. సిమ్రాన్ ప్రతినాయకురాలిగా నటించింది. టీజర్, పాటలకు చక్కటి స్పందన లభించింది. 'దండుపాళ్యం 3', అర్జున్ 'కురుక్షేత్రం', 'మారి 2' చిత్రాలను విడుదల చేశాను. త్వరలోనే ఓ తెలుగు చిత్రాన్ని నిర్మించాలనే ప్రయత్నాల్లో ఉన్నాన"ని చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: బాలసుబ్రమణియన్, సంగీతం: డి.ఇమాన్


రణ్‌వీర్, దీపికా

దీపికకు భర్త అయినందుకు గర్విస్తున్నా

రణ్‌వీర్ సింగ్‌కు తన భార్య దీపికా పదుకొణె అంటే ఎంతో ప్రేమ. పలు సందర్భాల్లో ఆమెపై తనకున్న ప్రేమను వ్యక్తం చేశారు రణ్‌వీర్. తాజాగా ఆమె అభిమానుల కోసం ఓ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రణ్‌వీర్ సామాజిక మాధ్యమాల్లో దీపికపై తనకున్న ప్రేమను మరోసారి వ్యక్తం చేశారు. "దీపిక చాలా గొప్ప వ్యక్తి. ప్రపంచంలోని గొప్ప నటుల్లో ఆమె ఒకరు. తనను అతి దగ్గరగా చూస్తున్న వ్యక్తిని కాబట్టి ఆమె గురించిన చాలా విషయాలు నాకు తెలుసు. ప్రేమ, దయ, తెలివితేటలు, అందం ఇలాంటి గొప్ప లక్షణాలు మూర్తీభవించిన మహిళ ఆమె. దీపిక వ్యవహార శైలి చాలా ముక్కుసూటిగా ఉంటుంది. జీవితం పట్ల ఆమెకున్న క్రమశిక్షణ, నిబద్ధతే ఆమెను ఈ స్థాయిలో నిలబెట్టాయి. దీపికకు భర్త అయినందుకు గర్విస్తున్నాను. నేను ఓ గొప్ప మనిషిలా మసులుకోవడానికి ఆమే స్ఫూర్తి. ఆమె రాకతో నా జీవితానికి గొప్ప విలువ వచ్చింది. నా జీవితపు వెలుగు దీపిక" అంటూ భావోద్వేగంగా స్పందించారు రణ్‌వీర్.

హెలెన్‌తో పోల్చొద్దు


సోనాక్షి సిన్హా

"హెలెన్‌తో నన్ను పోల్చడమేంటి? ఆమె స్టెప్పులు, స్టైల్ ఎవ్వరికీ రావు" అంటోంది సోనాక్షి సిన్హా. ప్రస్తుతం అజయ్‌దేవగణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'టోటల్ ధమాల్'లో ప్రత్యేక గీతంలో నర్తించిందామె. అప్పట్లో హెలెన్ ఆడిపాడిన 'ముంగడా ముంగడా..' పాటను ఈ చిత్రంలో రీమేక్ చేశారు. ఆ పాటకు సోనాక్షి సిన్హా స్టెప్పులేసింది. మంగళవారం ఈ పాటను విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ట్విటర్‌లో పంచుకొంది సోనాక్షి. ఈ పాటలో తనను హెలెన్‌తో పోల్చడంపై ఆమె స్పందించింది. "హెలెన్‌తో నన్ను పోల్చడం సరైంది కాదు. ఆమెలా నేను ఎలా చేస్తాను? 'ముంగడా..' పాటకు ఆమె తన స్టెప్పులతో ప్రత్యేకత తీసుకొచ్చారు. అయినా ఈ రీమేక్ పాటలో స్టెప్పుల్ని కొత్తగా కంపోజ్ చేశారు. పాత పాటతో పోలిక ఉండదు" అని చెప్పింది సోనాక్షి. 'దబాంగ్ 3', 'కళంక్' లాంటి భారీ చిత్రాల్లో నటిస్తోందామె.

పెళ్లి, పుట్టినరోజు, పార్టీ... సందర్భం ఏదైనా అందరిలోనూ మనం మెరిసిపోవాలనుకుంటాం. అందుకోసం ముందు నుంచే రకరకాల ప్రయత్నాలు మొదలుపెడతాం. వాటిల్లో ముఖాన్ని మెరుగులు దిద్దుకునే ప్యాక్‌లు, ఫేషియల్స్ వంటివే ఎక్కువ ఉంటాయి తప్ప జుట్టుపై చూపించే శ్రద్ధ తక్కువే. కానీ ఈ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోగలిగితే మీ లుక్కే మారిపోతుంది. అందుకేం చేయాలంటే...

వేడుక రోజున జుట్టు పట్టుకుచ్చులా కనిపించేందుకు వారం ముందునుంచీ డ్రయ్యర్లు, గాఢత ఎక్కువ ఉన్న షాంపూలు వాడకూడదు. అలానే స్ట్రెయిటనింగ్, కర్లింగ్ చేయించుకోవడం, జెల్, స్ప్రేలు వాడటం మానేయాలి. వీటివల్ల జుట్టు ఎండుగడ్డిలా మారుతుంది. మాడు కూడా పొడిబారిపోతుంది. కాబట్టి కొన్ని ముందుజాగ్రత్తలు తీసుకోవాలి. స్టైలింగ్ టూల్స్ వినియోగించే విధానం తెలుసుకోవాలి.



జుట్టుకు స్పా చికిత్స... ఇంట్లోనే

రాత్రిపూట నాలుగు చెంచాల చొప్పున కొబ్బరి నూనె, ఆముదం తీసుకోవాలి. వేడి చేసి గోరువెచ్చగా అయ్యాక తలకు మర్దన చేయాలి. మర్నాడు గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి. రెండురోజుల తేడాలో ఇలా చేస్తే జుట్టు ఆరోగ్యంగా కనిపిస్తుంది. తెగే సమస్య తగ్గుతుంది. పైగా ఫొటోల్లాంటివి తీస్తున్నపుడు మీ జుట్టు సహజంగా మెరుస్తుంది.

సహజంగా స్పా

హెయిర్ స్పా వల్ల జుట్టుకి పోషణ అందుతుంది. మీ కుదుళ్లు బలంగా మారతాయి. నిర్జీవంగా ఉన్న జుట్టు తాజాగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. స్పాలో భాగంగా చేసే మర్దన వల్ల నరాలపై ఒత్తిడి తగ్గి మెదడుకి విశ్రాంతి అందుతుంది.

జిడ్డుగారే జుట్టుకు కలబంద స్పా

కావలసినవి:
కలబంద గుజ్జు- అరకప్పు
నిమ్మరసం- ఒక టేబుల్ స్పూను
పెరుగు- పావుకప్పు
ఉసిరిపొడి- రెండు టేబుల్ స్పూన్లు
వేడి నీళ్లు- ఓ గిన్నెడు
శుభ్రమైన టర్కీ టవల్- ఒకటి

ఇలా చేసుకోవాలి: కలబంద, పెరుగు, నిమ్మరసం, ఉసిరిపొడి కలిపి మెత్తని పేస్ట్‌లా చేసుకుని పెట్టుకోవాలి. ముందుగా టర్కీటవల్‌ని వేడినీళ్లలో ముంచి పిండి తలకు చుట్టుకోవాలి. లేదంటే ఆవిరి కూడా పట్టొచ్చు. పది నిమిషాలయ్యాక కలబంద మిశ్రమాన్ని తలకు పూతలా వేసుకుని షవర్‌క్యాప్ పెట్టుకోవాలి. ఇరవై నిమిషాల తరువాత సల్ఫేట్ లేని షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా కనీసం ప్రతి పదిహేను రోజులకోసారి చేస్తే జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. తలకు ఆవిరి పట్టడం వల్ల కుదుళ్లు దృఢంగా మారతాయి. జుట్టు రాలే సమస్య కూడా చాలామటుకూ తగ్గుతుంది. కలబంద జుట్టును మెరిపిస్తుంది. నిమ్మరసం అయితే చుండ్రుసమస్యను నివారిస్తుంది. ఉసిరి జుట్టుకు పోషణ అందిస్తుంది. నల్లగానూ మారుస్తుంది.



పొడిబారిన జుట్టుకి ఆలివ్‌నూనె - గుడ్డు చికిత్స

కావలసినవి:
గుడ్లు- రెండు
ఆలివ్‌నూనె- రెండు టేబుల్ స్పూన్లు
పెరుగు- పావుకప్పు
మెంతిపిండి- నానబెట్టినది (పావుకప్పు)
వేడివేడి నీళ్లు- ఓ గిన్నెడు
శుభ్రమైన టర్కీ టవల్- ఒకటి

తయారీ: పై పదార్థాలన్నీ బాగా కలిపి పక్కన పెట్టుకోవాలి. టవల్‌ని వేడినీళ్లల్లో ముంచి, గట్టిగా పిండి తలకు చుట్టుకోవాలి. తరువాత ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి షవర్ క్యాప్ పెట్టేయాలి. ఇరవై నిమిషాల తరువాత మృదువైన షాంపూతో తలస్నానం చేయాలి. ఇలా వారానికోసారి చేస్తుంటే జుట్టు ఆరోగ్యంగా, పట్టుకుచ్చులా కనిపిస్తుంది.

రంగు వేసుకోవాలంటే...

■ ప్రత్యేక సందర్భాలు ఉన్నప్పుడు కొత్త ఉత్పత్తులు ప్రయోగించడం, రకరకాల డైలు ప్రయత్నించడం మంచిది కాదు. కొన్నిసార్లు అవి పడక జుట్టు రాలిపోవచ్చు. రంగు వేసుకోవాలనుకుంటే నాణ్యమైనది, అమ్మోనియా లేనిది ఎంచుకోవాలి. దీన్ని వేసుకోవడానికి ముందు ఇతర రసాయన ఉత్పత్తులేవీ తలకు రాయకపోవడమే మంచిది. అలానే రంగు వేసుకోవడానికి రెండు మూడు రోజుల ముందు క్రమం తప్పకుండా తలస్నానం చేసి కండిషనర్ రాసుకోవాలి. దీనివల్ల జుట్టుకి రంగు సరిగా అంటుతుంది.

స్టైలింగ్ పరికరాలు వాడుతుంటే...

రకరకాల హెయిర్ స్టైల్స్‌ని ప్రయత్నించేందుకు బ్లో డ్రయ్యర్, కర్లర్, స్ట్రెయిటనర్ వంటివి వాడుతుంటాం.



■ బ్లో డ్రయ్యర్ తడి తలను ఆరబెట్టడమే కాదు జుట్టుని మృదువుగానూ మారుస్తుంది. నచ్చిన హెయిర్‌స్టైల్స్‌ని ప్రయత్నించడానికి అనువుగా మారుతుంది. అయితే దీన్ని సరైన దిశలో వాడకపోతే జుట్టు చిట్లడం, పొడిబారడం వంటి సమస్యలు ఎదురవుతాయి. చాలామంది తడి తలమీద బ్లో డ్రయ్యర్‌ని వాడేయొచ్చు అనుకుంటారు. కానీ కొంత గాలికి ఆరనిచ్చాకే దీన్ని వాడాలి. దీనివల్ల జుట్టుపై వేడి ప్రభావం ఎక్కువగా ఉండదు.

■ **స్ట్రెయిటనర్, కర్లర్:** జుట్టుని పాయలుగా విడదీసుకుని ఈ స్టైలింగ్ టూల్స్‌ని ఉపయోగించడం మంచిది. వీటిని కూడా జుట్టుకి కండిషనర్, హెయిర్ ప్రొటెక్షన్ సీరమ్‌ని ఉపయోగించాక వాడాలి. వాటిల్లోని గ్లిజరిన్, ప్రొప్లీన్, గ్లైకాల్ వంటివి జుట్టుకి రక్షణ అందిస్తాయి. కండిషనర్‌లోని సెట్రియమోనియం, క్లోరైడ్ జుట్టుని పాడవకుండా కాపాడతాయి. అలానే వేడుక పూర్తయ్యాక తప్పనిసరిగా కొబ్బరి నూనె వేడిచేసి దానిలో కొద్దిగా ఆలివ్ నూనె కలిపి తలకు మర్దన చేయాలి.





పెళ్లికి పిలిచి... మొక్క ఇచ్చారు!

ఈ రోజుల్లో పెళ్లంటే అత్యంత ఖరీదైన వ్యవహారమే. వధూవరులే కాదు... కుటుంబ సభ్యులు కూడా ఆడంబరాలకే పెద్ద పీట వేస్తున్నారు. రిటర్న్ బహుమతులు, అట్టహాసంగా భోజనాలు... ఇలా ఆలోచిస్తున్నారు. అయితే అసోంకి చెందిన ఓ జంట మాత్రం పేదలు, ప్రకృతి హితంగా ఆలోచించింది. అందుకే తమ వివాహ విందుకోసం వచ్చేవారిని వాడేసిన పాత దుస్తుల్ని కానుకగా తెమ్మని కోరారు. అలానే వాళ్లందరికీ మొక్కల్ని రిటర్న్ గిఫ్టులుగా ఇచ్చారు. ఆ జంటే అసోంకి చెందిన బొబిత బోరో, భూపేన్‌రభ. బొబిత ఓ ప్రయివేట్ స్కూల్‌లో టీచర్. ఆమె తరచూ పల్లెటూరి నుంచి ఓ నలభై కిలోమీటర్లు ప్రయాణం చేసి పట్టణానికి వెళుతుంది. ఈ క్రమంలో సరిగా దుస్తులు లేక చలిలోనే బతుకీడుస్తోన్న ఎందరినో చూసింది. అప్పుడే అనిపించింది వారికి ఏదైనా చేయాలని. ఇక భూపేన్ ఓ కాలేజీలో ఆంగ్ల అధ్యాపకుడు. రకరకాల సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటాడు. అయితే గతేడాది పెద్దలు వీరికి వివాహం నిశ్చయించారు. అలా ఈ ఏడాది జనవరి 30న ఈ జంటకి వివాహమైంది. ఫిబ్రవరి 1న వివాహ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగానే పాత దుస్తుల్ని కానుకగా ఇవ్వమని కోరిందీ జంట. వీళ్ల గురించి తెలిసిన ఓ ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ ఆ జంటకు ఉచితంగా మొక్కలు అందించాడు. అలా బొబిత, భూపేన్ దంపతుల వివాహ విందులో దాదాపు మూడొందల యాభై మంది పాత దుస్తుల్ని తీసుకొచ్చి ఇచ్చి... మొక్కల్ని కానుకగా అందుకున్నారు. అలానే ఈ నూతన వధూవరులు మరికొన్ని దుప్పట్లు కొనుగోలు చేశారు. ఆ దుస్తులు, దుప్పట్లని రోడ్డువారన ఉండే పేదలకు అందించి పెద్ద మనసు చాటుకున్నారు. అలాగే పుణెకి చెందిన సచిన్ ఆషా సుభాష్, షర్వారి సురేఖ అరుణ్‌లు కూడా గణతంత్ర దినోత్సవం రోజు ఒక్కటయ్యారు. ఆ సందర్భంగా తమ పేర్లకు ముందున్న ఇంటిపేరు, కుల మతాలను సూచించే పేర్లను తొలగించుకున్నారు. తమకు పుట్టబోయే పిల్లలకు కూడా ఇంటి పేరు, కులం ఉండకూడదని వారి అభిప్రాయం.

email:
vasundhara
@eenadu.net

ఆమె చదువుతోంది డిగ్రీ రెండో సంవత్సరం. ఆ ఊళ్లో ఓ సగటు విద్యార్థిని అయిన ఆమె... ఇప్పుడు సర్పంచిగా ఎన్నికైంది. ఆమే గుగులోత్ ప్రియాంక. ఆ ఊరే మహబూబాబాద్‌లోని చౌక్లాతండా. ఓ సర్పంచిగా ఏం చేయబోతోందో ఆమె మాటల్లోనే.

మా తండాను తీర్చిదిద్దుతా...

మాది మహబూబాబాద్ జిల్లాలోని చౌక్లాతండా. తల్లిదండ్రులు గుగులోతు మణి, వీరన్న. మా తండా ఒకప్పుడు పక్కనే ఉన్న మల్యాల గ్రామ పంచాయతీలో ఓ భాగం మాత్రమే. ఇప్పుడు మా తండాలో సుమారు వెయ్యిమంది జనాభా ఉండటంతో ఈ మధ్యే పంచాయతీగా ఏర్పాటు చేశారు. గత సర్పంచి ఎన్నికల్లో మా అమ్మ మణి పోటీ చేసింది. అయితే ఓడిపోయింది. ఈసారి ఎన్నికల్లో కూడా మహిళా రిజర్వేషన్ వచ్చింది. మా అమ్మ పోటీ చేయాలనుకున్నా అంగన్‌వాడీ టీచర్ కావడంతో ఆ అవకాశం లేదు. దీంతో నేను ఎన్నికల్లో పాల్గొంటే ఎలా ఉంటుందని అనిపించింది. ఇంట్లోవాళ్లు కూడా అంగీకరించడంతో నామినేషన్ వేశా. నాకు పోటీగా భూక్య శైల నామినేషన్ వేసింది.



చదువుకుంటున్నందుకే...

నేను బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్నా. కానీ భూక్య శైల అంతగా చదువుకోలేదు. దాంతో గ్రామస్థులందరూ కొత్త పంచాయతీలో విద్యావంతులకు అవకాశం ఇద్దామని నిర్ణయించుకున్నారు. శైల కూడా చదుకున్న వారైతేనే సర్పంచి బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించగలరనే ఉద్దేశంతో పోటీ నుంచి తప్పుకొంది. దీంతో నా ఎన్నిక ఏకగ్రీవమైంది.

మా ఊళ్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయో నాకు తెలుసు. సరైన రోడ్డు లేదు. మురికి కాలువ వ్యవస్థ కూడా సక్రమంగా లేదు. మరుగుదొడ్లు లేకపోవడం కూడా ఎంతోమందిని ఇబ్బంది పెడుతోంది. గుడుంబా సమస్య కూడా ఉంది. ఇవన్నీ ముందునుంచీ గమనిస్తూనే ఉన్నా కాబట్టి... ఇప్పుడు మా ఊరి సర్పంచిగా వీటన్నింటినీ సరిదిద్దాలనుకుంటున్నా. ముందు గుడుంబా నిషేధానికి పాటుపడాలనుకుంటున్నా. దానివల్ల మహిళలు వేధింపుల బారిన పడకుండా ఉంటారనేది నా ఉద్దేశం. ఓ వైపు చదువుకుంటూనే వీటన్నింటికోసం పనిచేస్తా. ప్రస్తుతం ఉన్న సమస్యల్లో వరకట్నం ఒకటి. ఇది మాలాంటి పేదలపై ఎంత ప్రభావం చూపిస్తుందో నాకు తెలుసు. అందుకే నా వంతుగా వరకట్న నిషేధానికి కృషి చేయాలని అనుకుంటున్నా. చూడాలి... ఎంతవరకూ చేయగలనో.

- బొల్లం శేఖర్,
ఈనాడు డిజిటల్ మహబూబాబాద్

అందరూ చదివేలా...

తండాలోని పిల్లలందరూ చదువుకునేలా కృషి చేస్తా. గుడి కట్టించే ఆలోచన కూడా ఉంది. చదువును కొనసాగిస్తూనే గ్రామ ప్రథమ పౌరురాలిగా నా బాధ్యతను నిర్వర్తిస్తా. భవిష్యత్తు రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించడమే నా లక్ష్యం.

నజరానా


గ్రేవీ లేదా టిక్కీలకోసం పనీర్‌ని ముక్కల్లా కోస్తుంటే... చాకు కన్నా దారాన్ని ఎంచుకోండి. ముక్కలన్నీ ఒకే ఆకృతిలో వస్తాయి.

బంగారం వెండి

4న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)

ఆర్నమెంట్ (గ్రా)	3,181	3,194
వెండి (గ్రా)	43.70	43.80



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	34,390	34,440	33,780	33,800	33,750	33,780	34,390	34,440	34,170	34,340
ఆర్నమెంట్	32,100	32,150	31,300	31,300	31,220	31,220	31,860	31,930	31,780	31,940
వెండి(కిలో)	41,400	41,600	41,700	41,800	41,500	41,500	41,400	41,700	41,500	41,500

జీతం పెరగట్లేదు... ఏం చేయను!

నేనో ప్రముఖ సంస్థలో కిందిస్థాయి ఉద్యోగినిగా చేరా. మూడేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నా. నా బాధ్యతల్ని పూర్తిస్థాయిలో నిర్వర్తిస్తా. మంచిపేరే తెచ్చుకున్నా. నా బాధ్యతలనే కాదు... సహోద్యోగులను కూడా గౌరవంగా చూస్తా. ఎంత బాగా పనిచేస్తున్నా కూడా జీతం మాత్రం పెరగడం లేదు. నేనీ ఉద్యోగంలో చేరినప్పుడు అధికారులు నాకు చెప్పినట్లుగా ఇప్పుడు నా జీతాన్ని పెంచడం లేదు. అడిగితే... తక్కువ మొత్తంలో పెంచుతామంటున్నారు. దాంతో చాలా అసంతృప్తికి గురవుతున్నా. ఏడాదికి కనీసం రెండు శాతం కూడా పెరగలేదు. సహోద్యోగులతో పోల్చుకుని నా సమస్యను ప్రస్తావించడం నాకు ఇష్టంలేదు. అలా మాట్లాడలేని పరిస్థితి కూడా. ఇప్పుడు నా జీతాన్ని పెంమని ఎలా అడగాలి.. నా సహోద్యోగులతో వాళ్ల ఆదాయం చర్చించకుండా, వాళ్ల జీతాల గురించి ప్రస్తావించకుండా ఈ సమస్యను పరిష్కరించుకునేదెలా?

– ఓ సోదరి

✔ జీవితంలో మొదట మీరు తెలుసుకోవాల్సిన విషయమేంటంటే... అడగందే అమ్మయినా పెట్టదు. అలాగే మీరు అడగనంత కాలం, ఏదీ మీకు దక్కదు. ఎప్పుడైనా సరే... ఉద్యోగంలో చేరిన ఏడాది తరువాత జీతం పెంచమని అడగడానికి అనువైన సమయం. అప్పటికి మీకు కాస్త ఉద్యోగానుభవం వచ్చి ఉంటుంది. ఎప్పుడైనా ఓ సంస్థ కొత్తగా ఉద్యోగులను చేర్చుకుందంటే ఆ ఉద్యోగి తన సామర్థ్యాన్ని చూపేంతవరకు, సదరు సంస్థ రిస్క్ తీసుకున్నట్లే. ఎప్పుడైతే మీకు అప్పగించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో మీరు నెరవేరుస్తారో... ఆ సంస్థ అప్పుడు ఆ రిస్క్ నుంచి బయటపడినట్లవుతుంది. అలాగే మీరు మీ జీతాన్ని పెంచమని అడిగే ముందు, ఇప్పటివరకూ మీరు చేపట్టిన విధులు, వాటి వల్ల సంస్థకు కలిగిన ప్రయోజనాలను పై అధికారి ముందుంచడం తప్పనిసరి. అంతేతప్ప ఇతరులతో పోల్చి జీతం పెంచమని అడగడం సరికాదు. కాబట్టి నేరుగా సమస్యనే వివరించండి. ఇప్పుడు కాకపోయినా మరో రెండుమూడు నెలల తరువాత అయినా ఆలోచిస్తుంది యాజమాన్యం. అలాగే అసంతృప్తికి గురికావడం వల్ల పనిపై దృష్టిపెట్టలేరు. అది మీ ఉత్పాదకతను తెలియజేస్తుందని మరవకండి. పనిచేస్తూనే మీ సమస్యను పరిష్కరించుకునేలా చూడాలి.

● మీరు ఎంత వేతనాన్ని కోరుకుంటున్నారు, ప్రస్తుతం మీకు సంస్థ చెల్లిస్తున్నది సరైనదేనా వంటి విషయాలు మీరు తెలుసుకోవాలంటే ఓ పనిచేయండి. మీరు ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి బయట మరో సంస్థ అయితే ఎంత వేతనాన్ని ఇస్తుందో తెలుసుకోవచ్చు. దానికోసం మీరు మరో సంస్థలో దరఖాస్తు చేసుకున్నా ఫరవాలేదు. అయితే ఇప్పుడు మీరు చేస్తున్న ఉద్యోగం నుంచి బయటకు వెళ్లాలనే ఆలోచన ఉంటేనే ఇలా చేయాలి. అలాగే కొత్తగా మీరు వెళ్లాలనుకుంటున్న సంస్థ కూడా మీరు ఎంత జీతం ఆశిస్తున్నారనేదీ తెలుసుకుంటుంది. ప్రస్తుతం మీరు ఎంత వేతనాన్ని తీసుకుంటున్నారో, దానిపై 10 శాతాన్ని అధికంగా డిమాండ్ చేయొచ్చు. మీరు అడిగినంత ఆ కొత్త సంస్థ మీకివ్వకపోవచ్చు. అయితే మీరు ఎంత ఆశిస్తున్నారనేది ముందుగానే చెప్పాలి.

డియర్ వసుంధర



డా॥ కవిత గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

– మీ సందేహాలను, సమస్యల్ని vasucareer@eenadu.net కు పంపించగలరు.

చదువు

నకిలీ యూనివర్సిటీలో ప్రవేశం పొందేందుకు కొందరు తెలుగు విద్యార్థులు ప్రయత్నించి యు.ఎస్. ఇమిగ్రేషన్ అధికారులకు పట్టుబడటం, తర్వాతి పరిణామాలు కలకలం కలిగించాయి. కారణాలు ఏవైనా కోటి కలలతో సుదూర దేశం వెళ్లి, ఇలాంటి అనూహ్య పరిస్థితుల్లో చిక్కుకోవటం దుర్భరం. మన విద్యార్థులు అమెరికా వెళ్లాలని చేస్తున్న ప్రయత్నాల్లో లోపాలేమిటి? ఎక్కడ పొరపాటు జరుగుతోంది? ఇలా జరగకుండా ఉండాలంటే.. ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?



● విదేశీవిద్య - అమెరికా

దాటొద్దు.. చట్టబద్ధమైన దారి!



అమెరికా వెళ్లాలని తపిస్తున్న యువతలో కొందరు అందుకు తగిన ప్రయత్నాలను నిజాయతీగా చేయటం లేదు. టోఫెల్, జీఆర్ఈ వంటివాటితో పని లేకుండానే ఫెర్మింగ్టన్ యూనివర్సిటీలో చేరవచ్చని ఇచ్చిన ప్రకటన వలలో 600 మందికి పైగా తెలుగు విద్యార్థులు, మొత్తంగా 1600 మంది చిక్కుకున్నారు. వారి సర్టిఫికెట్లు పరిశీలించిన ఇమిగ్రేషన్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఫలితంగా వీరందరి భవిష్యత్తు డోలాయమానంలో పడింది. విద్యావ్యవస్థపై తగిన అవగాహన లోపించటం వల్ల తప్పటడుగులు వేసి, వీరు సమస్యల్లో పడ్డారు.

పొరుగూరు వెళ్లడానికి గూగుల్ మ్యాప్‌లో లొకేషన్ చెక్ చేసుకునే నేటి యువత అమెరికా వెళ్లడానికి అక్కడి 'ప్రొటోకాల్'ను ఏమాత్రం పరికించడం లేదు. ఫలితమే నేడు తలెత్తిన పరిణామాలు. అసలు లోపం ఇక్కడి నుంచే మొదలు.

అమెరికా విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందాలంటే జీఆర్ఈ, టోఫెల్ లాంటి ప్రామాణిక పరీక్షల్లో మంచి స్కోరు సాధించాలి. ఇంగ్లిష్‌పై ఉండే సహజమైన భయమో, లేదా ఈ పరీక్షలను ఎలాగోలా గట్టెక్కిపోవాలనే ఆలోచనతోనో చాలామంది తెలుగు విద్యార్థులు ఈ పరీక్షల స్కోరుతో సంబంధం లేకుండా ప్రవేశం కల్పించే విద్యాసంస్థల్లో కళ్లు మూసుకుని చేరిపోతున్నారు. అమెరికాలో చిన్న గదిలో విద్యాసంస్థను ఆరంభించి అడ్మిషన్లకు ప్రకటనలు ఇచ్చే సంస్థలు చాలా ఉన్నాయి. ఇలాంటి సంస్థలకు జీఆర్ఈ, టోఫెల్ లాంటివాటితో పనిలేదు. వాటిలో కోర్సులు సరిగా ఉండవు. తరగతుల సంగతి చెప్పనే అక్కర్లేదు. మన విద్యార్థులు ఇలాంటి తక్కువ స్థాయి విద్యాసంస్థల వలలోనే పడుతూ... చివరకు ఇలా ఇమిగ్రేషన్ అధికారులకు పట్టుబడుతున్నారు.

జీఆర్ఈ, టోఫెల్ పరీక్షల గురించి భయపడాల్సిన అవసరం లేదు. వీటిని ఎదుర్కోవడం పెద్ద సమస్యా కాదు. అమెరికా వెళ్లాలన్న లక్ష్యం నిర్ణయించుకున్నప్పటి నుంచే స్వదేశంలోనే ఈ పరీక్షల్లో శిక్షణ పొందవచ్చు. తద్వారా మంచి స్కోరు సాధించడానికి అవకాశం ఉంది. కానీ అంత కష్టం ఎందుకనే చిన్న ఆలోచనాలోపం పెద్ద కష్టాల్లోకి నెట్టివేస్తోంది.

సీపీటీ సంగతేమిటి?

తప్పుడు ధ్రువీకరణలతో అమెరికాకు వచ్చి/ అమెరికా వచ్చాక తప్పుడు పత్రాలతో ఉంటున్న వందల మంది తెలుగు విద్యార్థులను పట్టుకున్న ఉదంతంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు- సీపీటీ. కరిక్యులర్ ప్రాక్టికల్ ట్రెయినింగ్‌కు ఇది సంక్షిప్త రూపం. అమెరికాలోని విద్యాసంస్థలు తమ విద్యార్థులకు ఈ ఇంటర్న్‌షిప్‌ను చేసుకునే అవకాశాన్ని అధికారికంగా ఇస్తాయి. సీపీటీ సమయంలో ఉపకార వేతనం తక్కువే లభిస్తుంది. సీపీటీ సాయంతో నిజానికి పెద్ద ఉద్యోగాలూ రావు. ఓపికతో ఈ ఇంటర్న్‌షిప్‌ను చట్టబద్ధంగా పూర్తిచేస్తే మంచి అవకాశాలు తలుపు తడతాయి. అయితే అంత ఓపిక లేని విద్యార్థులు సీపీటీ పేరుతో ఎంప్లాయిమెంట్ ఆథరైజేషన్‌ను అడ్డదారిలో పొందుతున్నారు. ఈ ఆథరైజేషన్ సాయంతో డూప్లికేట్ డాక్యుమెంట్లు తయారుచేసుకుని ఫుల్‌టైమ్ జాబ్స్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఉద్యోగాల ద్వారా అత్యధిక వేతనాలు పొందుతూ చదువులు సజావుగా సాగించాలనేది విద్యార్థుల ఆలోచన. అయితే ఇది సరైనదేనా? కాదా? అనే స్పృహ లోపించడం వల్ల ఇక్కట్లు ఎదురవుతున్నాయి. అమెరికన్ ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం ఓపిగ్గా సీపీటీ పూర్తి చేస్తే ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

ఏం చేయాలి?

విశ్వవిద్యాలయాలూ, అవి అందించే కోర్సుల్లో నాణ్యత, పరిశోధనలు లాంటివి క్షుణ్ణంగా తెలుసుకోవాలి. నాణ్యమైన వర్సిటీలను ఎంపిక చేసుకునేలా జాగ్రత్తపడాలి.

❑ అమెరికాకు విద్యార్థిని ఆహ్వానించేముందు యూనివర్సిటీలు ముఖ్యంగా మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుంటాయి. 1. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, లెటర్ ఆఫ్ రికమెండేషన్స్ 2. జి.పి.ఎ.; అదనపు సమాచారం 3. జీఆర్ఈ, టోఫెల్ లాంటి పరీక్షల స్కోరు. ఈ మూడింటి ఉద్దేశాలను సరిగా అవగాహన చేసుకుంటే అమెరికాలో చట్టబద్ధంగా చదువుకోవడం చాలా సులభం.

❑ జీఆర్ఈ, టోఫెల్ లాంటి ప్రామాణిక పరీక్షల స్కోరుతో పాటు ఎక్స్‌ట్రా కరిక్యులర్ కార్యకలాపాలు ముఖ్యం. ❑ ప్రామాణిక పరీక్షల కోసం ఇంజినీరింగ్‌లో చేరిన మొదటి ఏడాది నుంచే శ్రద్ధగా కృషి చేస్తే వీటిని



సులువుగా ఎదుర్కొనే సామర్థ్యం అలవడుతుంది. కనీసం మూడో ఏడాది నుంచైనా వీటికోసం సన్నద్ధత అవసరం. ఒక్క మాటలో చెప్పాలంటే.. అమెరికా రావాలనే ప్రయత్నాల ప్రారంభానికి ముందే ప్రామాణిక పరీక్షల ప్రిపరేషన్ మొదలుపెట్టాలి. ❑ ఉన్నతవిద్య కోసం అమెరికా వచ్చే విద్యార్థి 'సమాజం కోసం ఏం చేయగలడు?' అనేది యూనివర్సిటీల అధికారులు పరిశీలిస్తారు. చదివిన కోర్సుకు సంబంధించే కాకుండా అదనంగా ఏం చేశాడనేది కూడా ముఖ్యమే. ఒక ప్రాజెక్టు, సామాజిక సేవ, ఇంజినీరింగ్ ప్రాజెక్టు వర్క్, నచ్చిన క్రీడ, మెచ్చిన వ్యాపకం.. ఇలా ఎందులోనైనా ప్రావీణ్యం పెంచుకోవాలి. ఇంజినీరింగ్/ డిగ్రీ చేస్తూనే ఏదైనా ల్యాబ్‌లో పార్ట్‌టైమ్ పనిచేయడం ద్వారా ప్రాక్టికల్ నాలెడ్జి సంపాదించవచ్చు. ఇవన్నీ అమెరికాలో అడుగుపెట్టేందుకు సోపానాలవుతాయి. ❑ అమెరికా బయలుదేరేముందు అక్కడి స్థితిగతులు, చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలి.

ఉద్యోగాలతో మొదటికే మోసం

అమెరికాకు వస్తున్న విద్యార్థులు ఇక్కడి ఖరీదైన విద్యతాలూకు ఖర్చును భరించేందుకు పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్ ఉద్యోగాలకు ఆకర్షితులవుతున్నారు. నిబంధనల ప్రకారం ఇది తప్పు. చదువుకోడానికి వచ్చిన విద్యార్థి చదువుకోవడం మాత్రమే చేయాలి. సీపీటీ ఇంటర్న్‌షిప్‌ను వందశాతం చట్టబద్ధంగా పూర్తి చేయాలి. ఇలా చేయకుండా అడ్డదారిలో ఆథరైజేషన్ పత్రాలు పొంది ఫుల్‌టైమ్ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు చేయటం మొదటికే మోసం తెస్తోంది.

అమెరికా వర్సిటీల్లో చట్టబద్ధంగా ప్రవేశం పొందకుండా లేదా చట్టబద్ధంగా ప్రవేశం పొంది- వచ్చాక నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు కొందరు. ఇదే ఇబ్బందులను కలిగిస్తోంది. అమెరికా విద్యావిధానం పటిష్ఠమైనది. ఇక్కడ చదవాలంటే కొంత కష్టపడాలి. ఇందుకు ఇష్టంతో శ్రమించాలే కానీ షార్ట్‌కట్స్‌లో వెళ్తే... దీర్ఘకాలంలో అగచాట్లు తప్పవు. అమెరికాకు చదువుకోడానికి వచ్చి... కోర్సు పూర్తి కాగానే స్వదేశం తిరిగి వెళ్లే ఉద్దేశం ఉండాలి. అయితే చాలామంది కోర్సు పూర్తి కాగానే అమెరికాలోనే ఏదైనా ఉద్యోగం వెతుక్కుని ఉండిపోవాలని చూస్తున్నారు.

ఉన్నత స్థాయి సంస్థలెన్నో!

అమెరికాలో ఉన్న దాదాపు 4,800 ఉన్నతస్థాయి విశ్వవిద్యాలయాల్లో సుమారు 4వేల వర్సిటీల్లో నిరంతరం పరిశోధనలు సాగుతూనే ఉంటాయి. వీటన్నిటిలో పీహెచ్‌డీ అందుబాటులో ఉంటుంది. ఇందుకోసం మిలియన్స్ ఆఫ్ ఎండోమెంట్ అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతవిద్య పూర్తిచేస్తే అలాంటివారు అక్కడే ఉండిపోవాలని అమెరికాయే ఆహ్వానం పలుకుతుంది. కానీ ఏదోలా అమెరికా వచ్చి, చిన్నాచితకా ఉద్యోగాలు చేసి సెటిలైపోదామనుకుంటే మాత్రం కుదరదు. అమెరికాలోని విశ్వవిద్యాలయాలకు అధికారిక ర్యాంకింగులుండవు. ఏది మంచి వర్సిటీయో అమెరికా ప్రభుత్వం చెప్పదు. ఆయా వర్సిటీల్లోని డిపార్ట్‌మెంట్లకు ప్రైవేటు ఏజెన్సీలు ఇచ్చే ర్యాంకింగ్ వేరు. అందులో పనిచేసే ప్రొఫెసర్లకు ఇచ్చే ర్యాంకింగ్ వేరు. ఏ విషయాన్ని అయినా ఇంటర్నెట్ ద్వారా స్వేచ్ఛగా తెలుసుకోగల వీలుంది. ఆ రకంగా ప్రామాణిక విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందడానికి ప్రయత్నించాలి.

- **డాక్టర్ కుమార్ అన్నవరపు,** డైరెక్టర్, ఇండో అమెరికన్ స్టూడెంట్ కౌన్సిల్

వ్యవసాయం అంటే పొలంలో పని. వ్యవసాయ డిగ్రీ పూర్తిచేస్తే గ్రామాల్లో వ్యవసాయాధికారి ఉద్యోగం... ఇంతే కదా అనుకుంటున్నారా. అక్కడితో అయిపోలేదు. వ్యవసాయం, దాని అనుబంధ కోర్సుల్లో డిగ్రీ ఉత్తీర్ణులైనవారికి జాతీయస్థాయి గుర్తింపున్న పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (అగ్రికల్చర్) కోర్సు అందుబాటులో ఉంది. వ్యవసాయంలో అద్భుతాలు చేయడానికి, వ్యవసాయ ఉత్పత్తులకు వాణిజ్య విలువలు జోడించడానికి ఈ కోర్సు ఉపయోగపడుతుంది. ఉపాధి అవకాశాలకు ఢోకాలేని ఈ పీజీడీఎంఏలో ప్రవేశానికి ప్రసిద్ధ సంస్థ నుంచి ప్రకటన వెలువడింది. ఆ వివరాలు తెలుసుకుందాం...

అగ్రి బిజినెస్ నైపుణ్యాలకో కోర్సు

ఎక్కడ: 'జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ అకాడమీ' (నార్మ్) హైదరాబాద్

ఎవరికోసం: అగ్రికల్చర్, అనుబంధ కోర్సుల్లో గ్రాడ్యుయేట్లకు

ఏమిటా కోర్సు: పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (అగ్రికల్చర్)

ఎంపిక ఎలా: క్యాట్ లేదా సీమ్యాట్ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తారు. గ్రూప్ డిస్కషన్‌కు 25, మౌఖిక పరీక్షకు 20, ప్రెసీ రైటింగ్‌కు 15, వర్క్ ఎక్స్‌పీరియన్స్‌కు మరో 10 మార్కులు ఇస్తారు. వీటన్నింటిని కలిపి మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

ఎన్ని సీట్లు: 30

కోర్సు వ్యవధి: రెండేళ్లు

ప్రయోజనం ఏమిటి: వ్యవసాయ ఉత్పత్తులకు వాణిజ్య విలువను పెంచడమెలాగో నేర్పుతారు. దీంతో వ్యవసాయ వాణిజ్యవేత్తలుగా మారవచ్చు లేదా వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులు తయారు చేసే సంస్థల్లో ఉన్నత స్థాయి ఉద్యోగం పొందవచ్చు.

దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: https://naarm.org.in/pgdma/

ఎందుకు చేరాలి?

మనదేశంలో ఇప్పటికీ 60 శాతం జనాభా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పండిన పంటలకే కాకుండా పంటల సాగుకు అవసరమైన సామగ్రి, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, నీటి పరికరాలు ఇలా అనేక పరిశ్రమలకు నైపుణ్యమున్న మానవ వనరుల కొరత బాగా ఉంది. స్వాతంత్ర్యం

ప్రాజెక్టుల ద్వారా అనుభవం

వ్యవసాయంలో అద్భుతాలు ఎలా చేయాలో పీజీడీఎంఏ కోర్సు చెపుతుంది. పంటలు ఎలా పండించాలనే సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఏజీ బీఎస్సీ వంటి డిగ్రీ కోర్సులో చదువుతారు. కానీ పంటలు పండాక వాటి నిర్వహణ, వ్యవసాయాన్ని వాణిజ్యంగా ఎలా మార్చాలనేది ఈ కోర్సులో నేర్పుతాం. అగ్రి బిజినెస్ ఓరియేంటేషన్ ఎక్కువ. పంటల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, విక్రయాలు, వ్యాపారం పెంపుపై శిక్షణ, అవగాహన తరగతులుంటాయి. కోర్సులో భాగంగా ప్రతి విద్యార్థికీ శీతాకాలం, వేసవి కాలాల్లో వేర్వేరు ప్రాజెక్టులుంటాయి. వీటిలో భాగంగా విద్యార్థులు పెద్ద కంపెనీలకు వెళ్లి అక్కడ పనిచేసి నైపుణ్యం పొందుతారు. కంపెనీల నిర్వహణలో లోపాలను గుర్తించి, నివారణకు ప్రాజెక్టులు తయారుచేస్తారు. దీనివల్ల నేరుగా వ్యవసాయ వాణిజ్యంపై అవగాహన ఏర్పడుతుంది. నాణ్యమైన ఉత్పత్తులు ఎలా పెంచాలి, లాభాలు ఎలా ఆర్జించాలి అనే కోణంలో ఆలోచిస్తూ చదువుకోవడం వల్ల వీరు భవిష్యత్తులో వ్యవసాయ వాణిజ్యవేత్తలుగా ఎదగడానికి అవకాశముంటుంది.

- **సీహెచ్. శ్రీనివాసరావు,** డైరెక్టర్, నార్మ్, రాజేంద్రనగర్



వచ్చినప్పటి నుంచి వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ కోర్సులున్నాయి గానీ, వ్యవసాయ వాణిజ్య, వ్యవసాయ రంగంలో ఆంత్రప్రెన్యూర్‌షిప్ పెంచే కోర్సులు పెద్దగా లేవు. అగ్రి బిజినెస్ అంటే రైతులు పండించే పంటల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసి లాభాలార్జించడం. దీనివల్ల ఆయా పరిశ్రమలు పెట్టిన వారికే కాకుండా ఆ పంటలు పండించే రైతులకు కూడా మంచి ధరలు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. ఈ తెలివితేటలు నేర్పడానికే పీజీడీఎంఏ కోర్సు ఉపయోగపడుతుంది. వ్యవసాయ డిగ్రీ చేసిన విద్యార్థిని పెద్ద కంపెనీలో పనిచేసే ఉన్నత ఉద్యోగిగా లేదా అగ్రి బిజినెస్ చేసే వ్యాపారవేత్తలా మార్చే నైపుణ్యం కల్పించడమే ఈ కోర్సు ప్రధాన లక్ష్యం. దేశం నలుమూలల నుంచి ఏటా ఈ కోర్సులో చేరేందుకు విద్యార్థులు పోటీపడుతున్నారు.

కోర్సు పూర్తవడానికి 6 నెలల ముందు నుంచే క్యాంపస్ ప్లేస్‌మెంట్లు మొదలవుతాయి. 2017లో ఈ కోర్సులో చేరిన వారికి వచ్చే మే నెలతో రెండేళ్ల కోర్సు పూర్తవుతోంది. వీరిని ఇప్పటికే టీసీఎస్, ఐటీసీ, ర్యాలీస్ ఇండియా, మహీంద్ర రైస్, టఫే, రాశి, నాగార్జున, నెటాఫిం, ఈఫ్రెష్, భారత్ ఇన్‌సెక్టిసైడ్స్ వంటి కంపెనీలు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా చేర్చుకున్నాయి. మేలో కోర్సు పూర్తవగానే ఉద్యోగంలో వచ్చి చేరండని ఆఫర్ లెటర్లు ఇచ్చాయి. గరిష్ఠంగా రూ.10 లక్షల వరకూ తొలి ఏడాది వేతనాన్ని ఇవ్వడానికి చాలా కంపెనీలు ముందుకొచ్చాయి.

ప్రాంగణ నియామకాల ద్వారా ఏదైనా ప్రముఖ కంపెనీలో చేరి 2, 3 ఏళ్లు జాబ్ చేస్తే ఆ అనుభవంతో సొంతంగా కంపెనీలు పెట్టుకోవచ్చు. ఉదాహరణకు ప్రస్తుతం దేశవ్యాప్తంగా బిందు, తుంపర్ల సేద్యం విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాగా ప్రోత్సహిస్తున్నాయి. ఈ పరికరాల తయారీ పరిశ్రమలకు డిమాండు ఉంది. వీటి తయారీ కంపెనీలో ఉద్యోగంలో చేరారనుకోండి. నీటి వినియోగంపై పరిశోధన, నిర్వహణ బాగా చేయగలరు. మేనేజ్‌మెంట్, వ్యాపార నైపుణ్యం వీరికి ఉంటుంది. ఆ తరవాత లభించే అనుభవంతో రైతులకు ఇంకా సులభంగా ఈ పరికరాలు అందించే సంస్థనే సొంతంగా ప్రారంభించి వ్యాపారవేత్తలా ఎదగవచ్చు. ఇలాంటి స్థైర్యాన్ని ఈ కోర్సు ఇస్తుంది.

ఇతర రాష్ట్రాల నుంచీ..

హైదరాబాద్‌లోనే నార్మ్ క్యాంపస్ ఉన్నా తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఈ కోర్సులో పెద్దగా చేరడంలేదు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల వారు ఎక్కువగా ఈ కోర్సులో చేరుతున్నారు. యూపీ, బిహార్ వంటి సుదూర రాష్ట్రాల వారూ వస్తున్నారు. తెలుగు విద్యార్థుల్లో వ్యవసాయ డిగ్రీ కాగానే ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలని ఎదురుచూసేవారు ఎక్కువగా ఉంటున్నారు. వాస్తవానికి తెలంగాణకు చెందిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలోనే నార్మ్ క్యాంపస్ కూడా ఉంది. అక్కడే తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం కూడా ఉంది. రాష్ట్ర విభజనకు ముందే ఇదే క్యాంపస్‌లో ఉమ్మడి ఏపీకి చెందిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉంది. అయినా ఇక్కడ వ్యవసాయ డిగ్రీలు చదివిన తెలుగు విద్యార్థులు ఈ పీజీడీఎంఏలో పెద్దగా చేరడం లేదు. ఈ కోర్సులో చేరాలంటే జాతీయ స్థాయి పరీక్షల ద్వారా పోటీ పడాల్సి రావడం కూడా ఇందుకొక కారణం. నార్మ్ కోర్సు ద్వారా లభించే ఉద్యోగాలు, మెరుగైన వేతనాలపై అవగాహన అంతగా లేకపోవడం మరో కారణం. ఈ సమస్యను అధిగమించేందుకు తెలుగు రాష్ట్రాల్లోని వ్యవసాయ కాలేజీలకు వెళ్లి ఈ కోర్సుపై అవగాహన పెంచటానికి నార్మ్ ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల బాపట్ల వ్యవసాయ కాలేజీలో దీన్ని నిర్వహించింది.

- **మంగమూరి శ్రీనివాస్,** ఈనాడు, హైదరాబాద్

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

ఏపీ వైద్యారోగ్య శాఖలో 1,900 పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఏఎన్ఎం/ ఎంపీహెచ్ఏ (ఫిమేల్)

ఖాళీలు: 1,900 **అర్హత:** పదోతరగతితోపాటు 18/24 నెలల ఎంపీహెచ్ఏ(ఎఫ్) కోర్సు లేదా రెండేళ్ల ఇంటర్మీడియట్ వొకేషనల్ ఎంపీహెచ్ఏ (ఎఫ్) కోర్సు ఉత్తీర్ణత. ప్రభుత్వాసుపత్రుల్లో ఏడాది క్లినికల్ శిక్షణ పూర్తి చేసుండాలి. **వయసు:** 01.02.2019 నాటికి 42 ఏళ్లు మించకూడదు. కాంట్రాక్టు ఎంపీహెచ్ఏగా పనిచేస్తున్నవారికి సడలింపు ఇవ్వనున్నారు. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయానికి పంపాలి. **చివరితేది:** ఫిబ్రవరి 20

వెబ్‌సైట్: http://cfw.ap.nic.in/

దిల్లీ హైకోర్టు

హైకోర్ట్ ఆఫ్ దిల్లీ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టులు-ఖాళీలు: సీనియర్ పర్సనల్ అసిస్టెంట్-57, సీనియర్ జ్యుడీషియల్ ట్రాన్స్‌లేటర్-02, జ్యుడీషియల్ ట్రాన్స్‌లేటర్-14.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఏ ఆనర్స్, గ్రాడ్యుయేషన్, ట్రాన్స్‌లేషన్‌లో డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత. ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్, టైప్‌రైటింగ్, కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి.

వయసు: పర్సనల్ అసిస్టెంట్ పోస్టులకు 18-32 మధ్య, మిగిలినవాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్ **చివరితేది:** మార్చి 7 **వెబ్‌సైట్:** http://delhihighcourt.nic.in/

అప్రెంటిస్‌షిప్

ఆర్ఆర్‌క్యాట్, ఇండోర్

ఇండోర్‌లోని భారత అణుశక్తి విభాగానికి చెందిన రాజా రామన్నసెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ (ఆర్ఆర్‌క్యాట్) కింది ట్రేడుల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. **మొత్తం ఖాళీలు:** 40 **ట్రేడులు:** ఫిట్టర్, మెషినిస్ట్, టర్నర్, డ్రాఫ్ట్స్‌మన్ (మెకానికల్), వెల్డర్ తదితరాలు. **అర్హత:** పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణత. **వయసు:** 18 - 22 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** విద్యార్హత మార్కులు, వైద్యపరీక్షల ఆధారంగా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** ఫిబ్రవరి 28

వెబ్‌సైట్: http://www.rrcat.gov.in/

వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

ఎన్ఐఆర్‌టీ, చెన్నై

చెన్నైలోని ఐసీఎంఆర్ - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రిసెర్చ్ ఇన్ ట్యుబర్క్యులోసిస్ (ఎన్ఐఆర్‌టీ) కింది కాంట్రాక్టు పోస్టుల భర్తీకి వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది. **పోస్టులు:** సైంటిస్ట్, ప్రాజెక్ట్ టెక్నికల్ ఆఫీసర్, ప్రాజెక్ట్ టెక్నీషియన్ తదితరాలు.

ఖాళీలు: 575

అర్హత: పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, టైపింగ్ సామర్థ్యం, డ్రైవింగ్ లైసెన్స్.

ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా. **వాక్‌ఇన్ తేది:** ఫిబ్రవరి 13 నుంచి 27 వరకు. **వేదిక:** ఐసీఎంఆర్-ఎన్ఐఆర్‌టీ, చెన్నై- 600031. http://nirt.res.in/

పల్లెకు ఊతం.. పేదలకు ఉపాధి

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం తీరు	
ఈ ఆర్థిక సంవత్సరం చేపట్టిన పనుల విలువ (రూ.లలో)	: 2,819 కోట్లు
వచ్చే ఆర్థిక సంవత్సరం(2019-20) చేపట్టనున్న పనుల విలువ	: 4 వేల కోట్లు
రాష్ట్రంలో పేర్లను నమోదు చేయించుకొన్నవారి సంఖ్య	: 1.16 కోట్లు
వారిలో పనుల్లో పాల్గొంటున్నవారు	: 59 లక్షలు
పనిచేసేవారిలో ఎస్సీలు	: 16 శాతం
పనిచేసేవారిలో ఎస్టీలు	: 12 శాతం



- గ్రామాలకు కీలకం- ఉపాధి హామీ పథకం
- సక్రమంగా వినియోగించుకుంటే పలు మౌలిక సదుపాయాలు
- పనుల ఎంపిక, పర్యవేక్షణ బాధ్యతలు పంచాయతీలవే
- 2019-20లో రూ.4 వేల కోట్లు ఖర్చుపెట్టాలనే యోచన

పంచాయతీల కొత్త పాలకవర్గాలు బాగా దృష్టి సారించగలిగితే ఉపాధి హామీ పథకం.. పల్లెలకు పెద్ద అండగా నిలవనుంది. గ్రామానికి అవసరమని భావించిన వివిధ రకాల మౌలిక వసతులను ఈ పథకం ద్వారా కల్పించవచ్చు. పనుల ఎంపిక, లబ్ధిదారులకు ఉపాధిని చూపించే బాధ్యతలు గ్రామ పంచాయతీకే ఉంటాయి. రాష్ట్రంలో 2019-20లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4 వేల కోట్ల మేర ఖర్చుపెట్టాలనే ప్రతిపాదనలు ప్రస్తుతం గ్రామీణాభివృద్ధి శాఖ పరిశీలనలో ఉన్నాయి. ప్రస్తుత (2018-19) ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకు చేపట్టిన పనుల విలువ రూ.2,819 కోట్ల మేర ఉండగా రూ. 2,795 కోట్లు కేంద్రం నుంచి అందాయి. పథకం అమలులో కేంద్రం మరికొన్ని సంస్కరణలను తీసుకురావొచ్చని తెలుస్తోంది. ఉపాధి హామీని వ్యవసాయానికి, పారిశుద్ధ్యానికి అనుసంధానం చేయాలని, ఏడాదిలో పని కల్పించే దినాల సంఖ్యను 100 నుంచి 150కు పెంచాలనే విజ్ఞప్తులను రాష్ట్ర సర్కారు చాలా కాలంగా చేస్తూనే ఉంది. రాష్ట్రంలో ఇప్పుడు పలు కొత్త పంచాయతీలు ఏర్పడినందున మరింతమంది బడుగు వర్గాల వారికి పనులు లభించనున్నాయి. పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వివిధ పథకాల్లో కేంద్రానికి చెందిన ఉపాధి హామీ పథకం కీలకమైనది. బడుగు జీవులు బతుకు తెరువుకోసం ఎక్కడికీ వెళ్లనక్కరలేకుండా.. గ్రామ పరిధిలోనే ఏటా వంద రోజుల పాటు పనులను కల్పించటం ఈ పథకం లక్ష్యం. పనులు కావలసిన వారు పంచాయతీ కార్యాలయంలో తమ దరఖాస్తులను అందజేస్తే సరిపోతుంది. సరైన పర్యవేక్షణ లేకపోవటంతో పనులు కూడా నాసిరకంగానూ ఉంటున్నాయి. అవకతవకల పాళ్లు ఎక్కువేనని సామాజిక తనిఖీల్లో బయటపడుతోంది. 2017-18లో రూ.2 వేల కోట్లు ఖర్చు చూపించిన పనులకు సామాజిక తనిఖీ చేయగా.. అందులో రూ.244 కోట్ల (12 శాతం) మేర నిధులు దుర్వినియోగం అయినట్లు బయటపడింది.

ఇవీ సమస్యలు

ఏడాదికి వంద రోజుల పనులను కల్పించాలని చట్టం చెబుతున్నప్పటికీ దాన్ని కచ్చితంగా అమలు చేసే యంత్రాంగం కొరవడింది. పంచాయతీల పాలకవర్గాల ఉదాసీనతా ఒక కారణం. దీంతో ఏటా రాష్ట్రంలో ఒక్కో కుటుంబానికి సగటున 42 రోజుల పాటు మాత్రమే పని లభిస్తోంది. పనులు లేకపోతుండటంతో చట్టం లక్ష్యం నీరుగారి.. కొన్ని ప్రాంతాల వారు వలసదారి పట్టక తప్పటం లేదు. పని దినాలు తక్కువ కావటంవల్ల రోజువారి వేతనం ఒక్కొక్కరికి 2017-18లో కేవలం రూ.139 చొప్పున మాత్రమే అందింది. కోరిన వారందరికీ 15 రోజుల్లోగా ఉపాధిని చూపించకపోతే వారికి నిరుద్యోగ భృతిని ఇవ్వాలని, పనిచేసిన 15 రోజుల్లోగా వేతనాన్ని ఇవ్వకుంటే ఆలస్యమైన రోజులకు వడ్డీని చెల్లించాలని నిబంధనలున్నాయి. కానీ ఆచరణలో అవేమీ అమలు కావడం లేదు.

కొత్త పాలకవర్గాల కృషి కీలకం

పంచాయతీ పాలకవర్గాలు సమర్థంగా వ్యవహరిస్తే ఉపాధి హామీ పథకం ఊళ్లకు ఎంతో మేలు చేస్తుంది. పంచాయతీల సంఖ్య 8,684 నుంచి 12,734కు చేరినందున మునుపటి కంటే ఎక్కువ మందికి చేయూతను ఇచ్చేందుకు వీలవుతుంది. క్షేత్ర స్థాయి సహాయకులను, ఇతర సిబ్బందిని కొత్త పంచాయతీల వారీగా నియమించాల్సిన అవసరం ఉంది.

పథకం అమలులో ఎవరి బాధ్యతలు ఏవనేది వివరిస్తూ కేంద్రం వెలువరించే మార్గదర్శకాలను తెలుగులోకి అనువదించి అన్ని పంచాయతీల్లో అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక నేతలు అంటున్నారు.

- ఈనాడు, హైదరాబాద్

యూపీ ఘటనపై టీపీసీసీ నిరసన

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉత్తర్‌ప్రదేశ్‌లో హిందూ మహాసభ కార్యకర్తలు మహాత్మాగాంధీ బొమ్మపై కాల్పులు జరిపిన ఘటనను తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ఖండించారు. ఏఐసీసీ పిలుపు మేరకు సోమవారం గాంధీభవన్ ఆవరణలోని గాంధీ విగ్రహం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు పొన్నం ప్రభాకర్, కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి, నేతలు అంజన్‌కుమార్ యాదవ్, జి.నిరంజన్, ప్రేమ్‌లాల్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మమతా బెనర్జీ చర్య భేష్: వీహెచ్

ఒక ఐపీఎస్ అధికారి అరెస్టుకు ప్రయత్నించిన సీబీఐని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అడ్డుకోవడం అభినందనీయమని ఏఐసీసీ కార్యదర్శి వి.హనుమంతరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై మోదీ, అమిత్‌షా దాడి చేయిస్తోందే.. మమత ఆ చర్యలను అడ్డుకుని రాజ్యాంగాన్ని కాపాడారని కొనియాడారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని వీహెచ్ ప్రశ్నించారు.

పరిశ్రమలో ప్రమాదం

యంత్రంలో ఇరుక్కొని టర్కీ దేశస్థుడి మృతి

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఓ పరిశ్రమలో యంత్రాన్ని బిగించేందుకు వచ్చి ప్రమాదవశాత్తు టర్కీ దేశస్థుడు మృతిచెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. టర్కీ దేశానికి చెందిన హరుణ్(42)తో పాటు మరో ఎనిమిది మంది నూతనంగా స్థాపిస్తున్న ఎస్ఏఎల్ పరిశ్రమలో యంత్రాలను బిగించేందుకు వచ్చారు. సోమవారం ఆ పరిశ్రమలో హైడ్రాలిక్ యంత్రాన్ని బిగించగా అందులో సాంకేతిక లోపం వచ్చింది. దాని లోపలికి ప్రవేశించి పరిశీలిస్తుండగా ఆకస్మాత్తుగా యంత్రం పనిచేయడంతో హరుణ్ అందులో ఇరుక్కుపోయాడు. గమనించిన తోటి కార్మికులు యంత్రాన్ని ఆపివేసి అతని బయటకి లాగారు. గాయపడిన హరుణ్‌ను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పరీక్ష నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పరిశ్రమ మేనేజర్ రమేశ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.



హరుణ్ మృతదేహం

ఉపాధ్యాయ పదోన్నతులకు మార్గం సుగమం

- ఇక రాష్ట్రప్రభుత్వ నిర్ణయమే ఆలస్యం
- వెంటనే పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

ఈనాడు, హైదరాబాద్: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలపై రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులను కొట్టివేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే జారీ చేస్తూ మధ్యంతర తీర్పు వెలువరించిన నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు మార్గం సుగమమైంది. మళ్లీ సుప్రీంలో కేసు విచారణకు రెండు నెలల పాటు గడువు ఉన్నందున ఆ లోపు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే.. పదోన్నతులు ఇచ్చుకోవచ్చని అధికార వర్గాలు కూడా స్పష్టంచేస్తున్నాయి. ఏకీకృత సర్వీసు నిబంధనలపై రాష్ట్రపతి సవరణ ఉత్తర్వులు చెల్లవని 2018 ఆగస్టులో హైకోర్టు తీర్పునిచ్చింది. తాజాగా సోమవారం సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పుపై స్టే విధించడంతో పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు ఇప్పుడు ప్రభుత్వం వేగంగా స్పందించకుంటే దాదాపు రెండు దశాబ్దాలుగా సంక్షోభంలో కూరుకుపోయిన పాఠశాల విద్యావ్యవస్థ ఇక బయటపడే అవకాశం లేదని, వెంటనే పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాలు ఒత్తిడి తెచ్చేందుకు సమాయత్తమవుతున్నాయి. ఏకీకృత సర్వీసు నిబంధనల కేసు న్యాయస్థానాల్లో ఉండటంతో, రెండు దశాబ్దాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు లేవు. ముఖ్యంగా ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, డైట్ అధ్యాపకులు తదితర ఖాళీలను భర్తీ చేయడం లేదు. దీనివల్ల పాఠశాలలపై పర్యవేక్షణ లోపించింది. ప్రభుత్వమే హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినందున పదోన్నతులను పెండింగ్‌లో పెట్టకపోవచ్చని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు అంచనా వేస్తున్నాయి. మార్చిలో రెండు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నందున సమస్యను నాన్చేందుకు సాహసించకపోవచ్చని భావిస్తున్నారు.

హైకోర్టు ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే

ఈనాడు, దిల్లీ: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు నిబంధనలపై గత ఏడాది ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారం స్టే ఇచ్చింది. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు విధానాలపై రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ గతేడాది తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉమ్మడి హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు చెల్లవని ఉమ్మడి హైకోర్టు ఆదేశాలు ఇవ్వగా.. వాటిని సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సోమవారం జస్టిస్ ఆర్.భానుమతి, జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వ ఉపాధ్యాయుల తరఫు న్యాయవాది కేవియట్ దాఖలు చేయడంతో కౌంటరు దాఖలు చేయడానికి తెలంగాణ ప్రభుత్వానికి తదుపరి విచారణ వరకు ధర్మాసనం సమయం ఇచ్చింది. విచారణను మార్చి25కు వాయిదా వేసింది.

6 వేలమందికి పదోన్నతులు

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.10 వేల మంది ఉపాధ్యాయులున్నారు. పదోన్నతులు ఇస్తే 503 ఎంఈఓ, 56 డిప్యూటీ డీఈఓలు, సుమారు 200 మంది డైట్, బీఈడీ కళాశాల అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయవచ్చు. ఇక సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ)కు స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ)గా, ఎస్ఏలకు ప్రధానోపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలుగా పదోన్నతులు దక్కుతాయి. దాదాపు 6 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించనున్నాయి. 'ఉపాధ్యాయులకు పదోన్నతులు తర్వాత.. సంక్షోభంలో ఉన్న పాఠశాల విద్యా వ్యవస్థ గాడిన పడుతుందన్నది మా ఆశ' అని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి చెప్పారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవ తీసుకొని వెంటనే పదోన్నతులు కల్పించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ(యూఎస్‌పీసీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇంకా పీఆర్‌టీయూ టీఎస్, పీఆర్‌టీయూ తెలంగాణ, ఎస్‌టీయూ, టీఎస్‌టీయూ, డీటీఎఫ్, టీటీయూ, బీసీ టీచర్స్ అసోసియేషన్, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయసంఘం తదితర సంఘాలు పదోన్నతులు కల్పించాలని ముఖ్యమంత్రిని కోరాయి. వేగంగా స్పందించేలా ఒత్తిడి తీసుకోవాలని పలు సంఘాలు నిర్ణయించినట్లు సమాచారం.

గురుకుల పాఠశాలలో బాలికలకు అస్వస్థత

20 రోజుల్లో రెండోసారి

చిట్యాల, న్యూస్‌టుడే: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని వెలుగు గురుకుల పాఠశాల బాలికలు మరోసారి అస్వస్థతకు గురయ్యారు. 20 రోజుల కిందట ఇదే పాఠశాలలో కలుషితాహారం తిని 200 మంది విద్యార్థినులు అనారోగ్యం పాలవడం తెలిసిందే. సోమవారం ఉదయం అల్పాహారం తిన్న తర్వాత 25 మంది బాలికలు వాంతులు చేసుకోవడంతో ప్రిన్సిపల్ గురుకులంలో ఉండే నర్సుతో ప్రథమ చికిత్స చేయించారు. నలుగురు తీవ్రంగా ఇబ్బంది పడుతుండడంతో స్థానిక సామాజిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నేత పెరుమాండ్ల సమ్మయ్య పాఠశాలకు వెళ్లగా ప్రిన్సిపల్ లోపలికి రానివ్వలేదు. ఆయనే 108 వాహనాన్ని పిలిపించడంతో విద్యార్థినులను సామాజిక ఆసుపత్రికి తరలించారు. కడుపు నొప్పి భరించలేకపోతున్నామంటూ బాలికలు విలవిలలాడిపోయారు. పాఠశాలలో సరైన ఆహారం పెట్టడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మొహియుద్దీన్, సీఐ శ్రీనివాస్, సర్పంచి మాసు రాజయ్య బాలికలను పరామర్శించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ విషయంపై ప్రిన్సిపల్ జయశ్రీని 'న్యూస్‌టుడే' ఫోన్లో వివరణ కోరగా.. బాలికలు తరచు ఎందుకు అస్వస్థతకు గురవుతున్నారో అర్థం కావడంలేదని.. విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు.



పొరుడిగా ప్రథమం.. మర్యాదలో అధమం

ఈ చిత్రంలో కింద కూర్చున్న వ్యక్తి (తెల్లచొక్కా) గ్రామ నూతన సర్పంచి! మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం పెదిరిపాడు నుంచి ఎన్నికైన ఈయన పేరు బాలప్ప. ఇక్కడి ఎస్సీ జనరల్ స్థానంలో ప్రజాప్రతినిధిగా గెలుపొందారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం కొందరు పెద్దలు కుర్చీలపై కూర్చొని 'పంచాయితీ' చెబుతుంటే, ఊరి ప్రథమ పౌరుడి స్థానం ఇదిగో ఇలా ఉంది!

– మద్దూరు, న్యూస్‌టుడే



భద్రాచల రామాలయంలో వివిధ దేశాల భక్తులు

ఈ సన్నిధి.. మా పెన్నిధి

భద్రాచలం, న్యూస్‌టుడే: భారత సంప్రదాయ కట్టూబొట్టూతో సోమవారం భద్రాచల రామాలయాన్ని దర్శించుకున్న వీరంతా.. అమెరికా, రష్యా, చైనా, జర్మనీ, ఇంగ్లండ్, కెనడా, అర్జెంటీనా, పోర్చుగల్, దక్షిణాఫ్రికా దేశీయులు. భక్తిమార్గం పేరిట బృందావన ఆశ్రమం తరఫున పరమహంస విశ్వానందస్వామీజీతో కలిసి గత 31న తమిళనాడులో పర్యటన ప్రారంభించారు. హిందూధర్మ విశిష్టత చాటే ఈ యాత్ర ఈనెల 9 వరకు సాగుతుందని, దేశంలోని ఇతర ప్రముఖ ఆలయాలనూ సందర్శిస్తామని నిర్వాహక సంస్థ బియాండ్ బౌండరీస్ (చెన్నై) ప్రతినిధి సుదర్శన్ తెలిపారు. ఇప్పటికే విజయవాడ కనకదుర్గమ్మను దర్శించిన 95మంది సభ్యులున్న బృందం ఇక ఏపీలోని విశాఖతో పాటు ఇతర క్షేత్రాలకూ వెళ్తుందన్నారు.

రాజుకుంటున్న అసైన్డ్ భూ వివాదం

- చేతులు మారిన భూముల వ్యవహారం
- సాగుదారులకు హక్కుల కల్పన ప్రక్రియలో తలనొప్పి
- 2.41 లక్షల ఎకరాల అసైన్డ్ పట్టాదారులకు నోటీసులు

కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలోని కొన్ని గ్రామాల్లో పదిహేనేళ్ల క్రితం అసైన్డ్ భూములు విక్రయించినవారు ఇప్పుడు ఆ భూములు తమవేనంటున్నారు. దీంతో భూమి సాగుదారులకు నిద్ర పట్టడం లేదు. ప్రభుత్వం సాగుదారులకు పట్టాలు ఇస్తామని ప్రకటించగా ప్రస్తుత సమస్య తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల్లోనూ రైతులు కలవరపాటుకు గురవుతున్నారు.

ఈనాడు, హైదరాబాద్: నిరుపేదలు కొనుగోలు చేసిన అసైన్డ్ భూములపై వారికే హక్కులు కల్పించేందుకు రెవెన్యూ యంత్రాంగం చేపట్టిన చర్యలతో పలు అంశాలు వెలుగు చూస్తున్నాయి. మండలాల వారీగా కబ్జాలు, కొనుగోళ్లు జరిగిన భూముల వివరాలను గుర్తిస్తున్న కలెక్టర్లు అసైన్డ్ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేస్తున్నారు. సాగు చేసుకుంటున్న వారు ఆ భూములను కొనక ముందు హక్కుదారులు ఎవరన్న దానిని గుర్తిస్తున్నారు. అసైన్డ్ భూములను కొనుక్కుని సాగు చేసుకుంటున్న పేదలకు వాటిపై హక్కులు కల్పించేందుకు గతేడాది ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లకు బాధ్యతలు కట్టబెట్టింది. ఈనేపథ్యంలో కొన్ని జిల్లాల్లో పాత పట్టాదారులు అడ్డం తిరుగుతుండటం కొత్త వివాదాలకు దారి తీస్తోంది. కలెక్టర్లు అసైన్డ్ చట్టం ప్రకారం ఆ భూముల అసలు పట్టాదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. వారి నుంచి సంజాయిషీ తీసుకుని ప్రస్తుత సాగుదారులకు పట్టాలివ్వాలని నిర్ణయించారు. చాలా జిల్లాల్లో గతంలో భూములు విక్రయించిన రైతులు ఇప్పుడు అడ్డం తిరుగుతున్నట్లు రెవెన్యూ సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల విక్రయాలు చేయలేదని కొందరు, మరికొన్ని జిల్లాల్లో తమకు సమాచారం ఇవ్వకుండా తమ తల్లిదండ్రులు విక్రయించారని వారి పిల్లలు నోటీసులకు సమాధానాలు ఇస్తున్నారు. సాగు చేసుకుంటున్న రైతులతో వాదనలు పెట్టుకుంటున్నారు. భూముల విలువ భారీగా పెరగడంతో పాటు దస్త్రాల్లో నేటికీ అసలు పట్టాదారుల పేర్లే ఉండటం వారు తిరకాసు పెట్టడానికి కారణమని తెలుస్తోంది. కొందరు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. తమ విచారణలో భూ విక్రయాలు నిర్ధరణ అయితే నోటీసుల అనంతరం రద్దు చేసి సాగులో ఉన్నవారు అర్హులైతే వారికే హక్కులు కల్పిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

అసైన్డ్ భూముల్లో పేదలెవరు?

గతంలో రాష్ట్రంలో 22.42 లక్షల ఎకరాలను ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేసింది. అసైన్డ్ పట్టాలు జారీ చేసింది. అసైన్డ్ భూచట్టం ప్రకారం పేదలు ఈ భూములను విక్రయాలు, దానాలు చేయరాదు. పేదలైన అసైన్డ్‌దారులు కొందరు భూములను విక్రయించారు. మరికొన్నిచోట్ల కబ్జాలకు గురయ్యాయి. 2017లో రాష్ట్రంలో నిర్వహించిన భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమంలో 30 జిల్లాల్లో 2.41 లక్షల ఎకరాల భూములు చేతులు మారినట్లు తేలింది. భూ బదిలీ నిషేధ చట్టం ప్రకారం అసైన్డ్ భూముల బదిలీ చెల్లదు. ప్రభుత్వం స్వాధీనం చేసుకునే హక్కు ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న నిరుపేదలకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా రెవెన్యూ శాఖ అసైన్డ్ భూములు ఆధీనంలో ఉన్న వారి వివరాలను పరిశీలిస్తోంది.

వాగుల పునరుజ్జీవానికి చెక్‌డ్యాములే ఆధారం

- జలవనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి.ప్రకాశ్

ఈనాడు, హైదరాబాద్: నదులు.. వాగుల పునరుజ్జీవానికి చెక్‌డ్యాములే ఆధారమని తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వి.ప్రకాశ్ అన్నారు. "సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతం గొట్టిగానిపల్లె గ్రామంలో వాగుపై 12 చెక్‌డ్యాములు నిర్మించారు. దీనివల్ల నీటివనరుల లభ్యత పెరిగి ఏటా రెండు పంటలు పండిస్తున్నారు. రాష్ట్రమంతటా ఇలాంటి పల్లెలు ఏర్పడాలి" అని పేర్కొన్నారు. రాష్ట్రంలో చెక్‌డ్యాముల నిర్మాణాలపై సోమవారం జలసౌధలో నిర్వహించిన సమావేశంలో వి.ప్రకాశ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని నదులు, వాగుల పునరుజ్జీవానికి చెక్‌డ్యాములు నిర్మించేందుకు ఉన్న అవకాశాలపై విశ్రాంత ఇంజినీరు విజయ్ ప్రకాశ్ నేతృత్వంలో ఇంజినీర్ల బృందం అధ్యయనం పూర్తి చేసింది. ఛైర్మన్ వి.ప్రకాశ్ మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటకలు ఏళ్ల క్రితమే నదులు వాటి ఉపనదులపై ఆనకట్టలు నిర్మించాయన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో మంజీరా నదిపై ఆ రాష్ట్రాలు కట్టిన నిర్మాణాలను తాను పరిశీలన చేసినట్లు వివరించారు. ఇదే పరిస్థితి తెలంగాణలోనూ రావాలన్న సీఎం ఆశయం ఇప్పుడు నిజం కాబోతోందన్నారు.

పెద్ద వాగులపై నిర్మించొచ్చు: రాష్ట్రంలో గోదావరి పరివాహకంలో 6,500 పొడవునా ఉన్న వాగులపై 319 చెక్‌డ్యాములు ఉన్నట్లు విశ్రాంత ఇంజినీరు విజయ్ ప్రకాశ్ తెలిపారు. విషయాలను ఇంజినీర్లకు వివరించారు. కృష్ణా పరివాహకంలో 3,700 కిలోమీటర్ల పొడవునా ఉన్న వాగులపై 466 డ్యాములు ఉన్నట్లు తెలిపారు. నిర్మించిన చెరువులు, జలాశయాలకు నష్టం వాటిల్లకుండా పెద్దవాగులపై మరిన్ని చెక్‌డ్యాంలు నిర్మించవచ్చని వివరించారు. ఈఎన్‌సీ మురళీధర్, సీఎం కార్యాలయ ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, భూగర్భ జలవనరుల శాఖ సంచాలకుడు డాక్టర్ పండిత్, చిన్ననీటి పారుదల శాఖ సీఈ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▲ 113 **36583** | నిఫ్టీ ▲ 19 **10912** | డోజోన్స్ 25083 ▲ 20 | నాస్‌డాక్ 7327 ▲ 63 | రూపాయి 71.80 ▼ 55 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 62.47 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).



ఘనం (+)

నిఫ్టీ	4న	మార్పు%
TITAN COMPANY	1025.75	3.45
RELIANCE IND	1290.90	3.28
ONGC	146.25	3.14
EICHER MOTORS	20128.30	2.36
BAJAJ AUTO	2642.50	1.53
KOTAK MAHI BANK	1272.20	1.31
TCS	2050.25	1.00

గ్రహణం (-)

నిఫ్టీ	4న	మార్పు%
INDIABULLS HSG	650.75	-4.11
HINDALCO	204.20	-3.41
HPCL	226.50	-3.21
YES BANK	179.80	-3.13
POWER GRID CORP.	184.60	-2.94
CIPLA	509.60	-2.25
NTPC	137.25	-2.07


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	65.16	75.55
పౌండ్ స్టెర్లింగ్	85.20	98.82
యూరో	74.60	86.53
జపనీస్ యెన్/100	59.46	68.97
ఆస్ట్రేలియా డాలరు	47.13	54.55
సింగపూర్ డాలరు	48.16	57.06
థాయ్ బాత్/100	207.90	248.57
బహ్రెయిన్ దీనార్	176.35	201.77
కువైట్ దీనార్	195.33	243.23
ఒమన్ రియాల్	172.56	197.68
సౌదీ రియాల్	17.32	20.53
యూఏఈ దిర్హమ్	17.73	20.72
మలేషియా రింగిట్	15.58	19.17
చైనీస్ యువాన్	7.51	12.19

సోమవారం నిఫ్టీ కదలికలు



ఐటీ ఎగుమతుల్లో 10 శాతం వృద్ధి

- దేశీయ సంస్థలకు ప్రపంచ స్థాయి ఆదరణ
- 2021 నాటికి కృత్రిమ మేధకు జీడీపీలో 60శాతం వాటా
- కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి అనూప్ వధావన్

ఈనాడు - హైదరాబాద్

అంతర్జాతీయంగా పలు సవాళ్లు ఎదురైనా దేశీయ వాణిజ్య ఎగుమతుల్లో గత ఆర్థిక సంవత్సరంలో 5.79శాతం వృద్ధి కనిపించిందని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి అనూప్ వధావన్ అన్నారు. 2013-14లో ఎగుమతుల విలువ గరిష్ఠంగా 314 బిలియన్ డాలర్లు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఇది ఇంతకు మించి ఉంటుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్లుగా ఎగుమతుల విషయంలో నిలకడగా వృద్ధి సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. 2008-09లో ఆర్థిక మందగమనం నుంచి కోలుకొని, 2013-14 కల్లా ఎగుమతుల్లో కీలక స్థానానికి చేరిన సంగతి గుర్తు చేశారు. ప్రస్తుతం దేశీయ ఫార్మా, ఇంజినీరింగ్, పెట్రోలియం, ఆభరణాలు, చర్మ సంబంధిత ఉత్పత్తులతోపాటు, వస్త్ర పరిశ్రమ కూడా ఎగుమతుల్లో పాలుపంచుకుంటోందని ఆయన తెలిపారు. అమెరికా, చైనాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధం మన దేశానికి మేలే చేస్తోందని అన్నారు. ఎగుమతులు పెరుగుతుండటం, చమురు ధర తక్కువగా ఉన్న నేపథ్యంలో కరెంటు ఖాతాలోటు నియంత్రణలోనే ఉందన్నారు. ఎగుమతిదారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (ఈఎస్‌సీ) ఆధ్వర్యంలో జరిగిన 19వ ఇండియాసాఫ్ట్ అంతర్జాతీయ ప్రదర్శన, సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండు రోజులపాటు నిర్వహిస్తోన్న ఈ ప్రదర్శనకు దాదాపు 60 దేశాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 250 వరకూ దేశీయ ఐటీ సంస్థలు, 22 విదేశీ సంస్థలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో అనూప్ వధావన్ మాట్లాడుతూ.. ఐటీ, ఐటీ ఆధారిత ఉత్పత్తుల ఎగుమతుల్లో 10శాతం వృద్ధి సాధించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం దేశీయ ఐటీ ఉత్పత్తులకు ప్రపంచస్థాయిలో ఆదరణ లభిస్తోందని, ముందుముందు ఇది ఇంకా కొనసాగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ తదితర విభాగాల్లో భారత ఐటీ పరిశ్రమ మంచి వృద్ధిని సాధిస్తోందని తెలిపారు. 2021 నాటికి కృత్రిమ మేధ సంబంధిత రంగాలకు జీడీపీలో 60శాతం వరకూ వాటా ఉండే అవకాశం ఉందన్నారు. 2030కల్లా భారత్‌లో పెద్ద ఎత్తున అనేక మంది పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలు ఐటీ ఆధారిత రంగాల్లో తమ సత్తా చాటే అవకాశం ఉందన్నారు. అందరికీ అందుబాటులో ఉండే ధరలో అన్ని రకాల ఐటీ సేవలను అందించే విషయంలో భారత పారిశ్రామికవేత్తలే ప్రపంచంలో ముందున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. దేశీయ కంపెనీల సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులను 125 దేశాలు వినియోగించుకుంటున్నాయని పేర్కొన్నారు. స్థానిక సంస్థలు అభివృద్ధి చేసిన సాంకేతికతను ప్రభుత్వం అవసరాన్ని బట్టి వాడుకుంటోందని తెలిపారు. ఇండియా సాఫ్ట్-గ్లోబల్ సాఫ్ట్ 2019 ఛైర్మన్ నళిన్ కోహ్లీ మాట్లాడుతూ.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఐటీ ఎగుమతుల విలువ 120 బిలియన్ డాలర్ల వరకూ ఉందన్నారు.



ఈఎస్‌సీ వార్షిక గణాంక నివేదిక విడుదల సందర్భంగా.. తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, ఈఎస్‌సీ ఛైర్మన్ మన్‌దీప్ సింగ్ పూరీ, కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి అనూప్ వధావన్, ఇండియా సాఫ్ట్ ఛైర్మన్ నళిన్ కోహ్లీ.

రూ.7 లక్షల కోట్లు

- ఏప్రిల్- డిసెంబరులో ద్రవ్యలోటు
- పూర్తి సంవత్సరం బడ్జెట్ అంచనాకు 12% ఎక్కువ

దిల్లీ: గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు చివరి నాటికి ద్రవ్యలోటు రూ.7.01 లక్షల కోట్లకు చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాలో ఇది 112.4 శాతం. ఏడాదిక్రితం ఇదే సమయంలో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాలో 113.6 శాతంగా ఉండటం గమనార్హం. 2018-19 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యలోటు రూ.6.24 లక్షల కోట్లుగా నమోదుకావచ్చని గతేడాది ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంచనా వేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రకారం చూస్తే 2018 డిసెంబరు చివరినాటికే ఆ అంచనాను మించిపోవడమే కాకుండా.. 12 శాతం అధికంగా ద్రవ్యలోటు నమోదైంది. పన్నుల వసూళ్లు తగ్గడం ద్రవ్యలోటు పెరగడానికి కారణమైంది. కాగా.. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ద్రవ్యలోటును జీడీపీలో 3.4 శాతం లేదంటే రూ.6.34 లక్షల కోట్లకు సవరించారు. చిన్న, సన్నకారు రైతులకు పెట్టుబడి సాయం అందించే నిమిత్తం అదనంగా రూ.20,000 కోట్లను కేటాయించడం ఇందుకు కారణం. కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ గణాంకాల ప్రకారం.. డిసెంబరు చివరినాటికి మొత్తం ఆదాయం రూ.10.84 లక్షల కోట్లు (బడ్జెట్ అంచనాలో 62.8%)గా నమోదైంది. ఏడాదిక్రితం ఇదే సమయంలో పన్ను వసూళ్లు బడ్జెట్ అంచనాలో 66.9 శాతంగా ఉండటం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.17.25 లక్షల కోట్ల ఆదాయాన్ని అంచనా వేసింది. అయితే దీనిని ఇటీవలి తాత్కాలిక బడ్జెట్‌లో రూ.17.29 లక్షల కోట్లకు సవరించింది. పన్నుల ఆదాయం బడ్జెట్ అంచనాల్లో 63.2 శాతంగా ఉంది. ఏడాదిక్రితం నమోదైన 73.4 శాతంతో పోలిస్తే తగ్గింది. మొత్తం వ్యయాలు రూ.18.32 లక్షల కోట్లుగా (బడ్జెట్ అంచనాలో 75%) ఉన్నాయి.

ఐడీబీఐ బ్యాంక్ నష్టాల మోత

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఐడీబీఐ బ్యాంక్ రూ.4,185.48 కోట్ల నికర నష్టాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో బ్యాంకు రూ.1,524.31 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. మొత్తం ఆదాయం రూ.7,125.20 కోట్ల నుంచి రూ.6,190.94 కోట్లకు పరిమితమైంది.

ఆస్తుల నాణ్యత: బ్యాంకు అందజేసిన రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు) 24.72 శాతం నుంచి 29.67 శాతానికి ఎగబాకాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 16.02 శాతం నుంచి 14.01 శాతానికి తగ్గాయి. మొండి బకాయిలకు కేటాయింపులు రూ.3,649.82 కోట్ల నుంచి రూ.5,074.80 కోట్లకు పెరిగాయి. నికర ఎన్‌పీఏల రికవరీ రూ.537 కోట్ల నుంచి రూ.3,440 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం బ్యాంకు పేరును మార్చేందుకు చూస్తున్నారు. తొలి ప్రాధాన్యం ఎల్ఐసీ ఐడీబీఐ బ్యాంక్ పేరు పెట్టేందుకు ఇస్తున్నట్లు సమాచారం. ఇది కాకపోతే ఎల్ఐసీ బ్యాంక్‌గా మార్చనున్నట్లు తెలుస్తోంది.

బీఎస్ఈలో షేరు 4.07% నష్టంతో రూ.50.65 వద్ద ముగిసింది.

ఏపీజీవీబీ ఛైర్మన్‌గా ప్రవీణ్ కుమార్



ఈనాడు, హైదరాబాద్: వరంగల్ కేంద్రంగా పనిచేస్తోన్న ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) నూతన ఛైర్మన్‌గా కె. ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకూ ఈ పదవిలో ఉన్న వి.నరసి రెడ్డి పదవీ కాలం ఈ నెల 2తో ముగిసింది. ఈ నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అమరావతి సర్కిల్ డీజీఎం (అగ్రి బ్యాంకింగ్)గా బాధ్యతలు నిర్వహిస్తోన్న ప్రవీణ్ కుమార్‌ను ఏపీజీవీబీ ఛైర్మన్‌గా నియమించారు. ఈయన ఐదేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు.

డీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో ప్రమోటర్ల వాటాకు కత్తెర

- వ్యూహాత్మక భాగస్వామి కోసం వాద్వాన్ గ్రూపు అన్వేషణ

ముంబయి: ఐఎల్అండ్ఎఫ్ఎస్ సహా ఇటీవల చోటుచేసుకున్న కొన్ని పరిణామాల నేపథ్యంలో ప్రమోటర్ల వాటాను తగ్గించుకోవాలని భావిస్తున్నామని డీహెచ్‌ఎఫ్‌ఎల్ వెల్లడించింది. ఇందుకుగాను వ్యూహాత్మక భాగస్వామి కోసం చూస్తున్నామని పేర్కొంది. అలాగే తమకు సంబంధమున్న సంస్థలు భాజపాకు రూ.19.5 కోట్ల మేర విరాళమిచ్చిన విషయాన్ని డీహెచ్‌ఎఫ్‌ఎల్ ప్రమోటర్లైన వాద్వాన్ కుటుంబం ధ్రువీకరించింది. అయితే నియంత్రణ పరమైన ఆంక్షల కారణంగా కోబ్రా పోస్ట్ చేసిన ఆరోపణలపై స్పందించేందుకు నిరాకరించింది. కొత్త ఈక్విటీ, మూలధనాన్ని తీసుకొచ్చే, మార్కెట్ ఆందోళనలు తగ్గించే బలమైన వ్యూహాత్మక భాగస్వామి కోసం చూస్తున్నామని విశ్లేషకులకు కాన్ఫరెన్స్ కాల్‌లో డీహెచ్‌ఎఫ్‌ఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కపిల్ వాద్వాన్ చెప్పారు. వచ్చే 90 రోజుల్లో ఈ అన్వేషణ ప్రక్రియ పూర్తవుతుందని, గతేడాది సెప్టెంబరు నుంచే దీనిని మొదలుపెట్టామని తెలిపారు. వాటా విక్రయ ప్రక్రియలో భాగంగా పలు ఆస్తులను విక్రయించనున్నారు. ఇప్పటికే డీహెచ్‌ఎఫ్‌ఎల్ లేదా వాద్వాన్ గ్లోబల్ కేపిటల్‌లు ప్రారంభించాయి. చౌక గృహాల రుణ సంస్థ ఆధార్ నుంచి కూడా వాద్వాన్ గ్రూపు వైదొలగనుంది. రూ.27,000 కోట్లకు ఆధార్‌లో మెజార్టీ వాటాను వాద్వాన్ గ్రూపు విక్రయించనుంది. అలాగే ఓ దేశీయ భాగస్వామి సంస్థకు జీవిత బీమా కంపెనీలో వాటా విక్రయానికి కూడా వాద్వాన్ చర్చలు జరుపుతోంది.

ఆస్తుల విక్రయం ఆపండి

- ఆర్‌కామ్‌కు ఎన్‌సీఎల్ఏటీ ఆదేశం
- దివాలాపై అభ్యంతరం తెలపాల్సిందిగా ఎరిక్‌సన్‌కు సూచన

దిల్లీ: ఈ నెల 12 వరకు ఆస్తుల విక్రయం లేదా బదిలీ చేపట్టరాదని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్)ను జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) ఆదేశించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కంపెనీ ఇచ్చిన బ్యాంక్ గ్యారెంటీలను థర్డ్ పార్టీలు వినియోగించకూడదని వెల్లడించింది. ఆర్‌కామ్ దివాలా ప్రక్రియను వ్యతిరేకిస్తూ.. ఎరిక్‌సన్ ఇండియా దాఖలు చేసిన పిటిషన్‌ను ఎన్‌సీఎల్ఏటీ సోమవారం విచారించింది. శుక్రవారం (8వ తేదీ) లోపు ఆర్‌కామ్ దివాలా పిటిషన్‌పై అభ్యంతరం తెలియజేయాల్సిందిగా ఎరిక్‌సన్ ఇండియాకు ఎన్‌సీఎల్ఏటీ అనుమతించింది. ఛైర్మన్ జస్టిస్ ఎస్‌జే ముఖోపాధ్యాయ నేతృత్వంలోని ఇద్దరు సభ్యుల బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈ వివాదంపై ఎరిక్‌సన్ సుప్రీం కోర్టును సైతం ఆశ్రయించింది. తదుపరి వాయిదా 11న జరగనుంది.

స్పెక్ట్రమ్ ఛార్జీల నుంచి మినహాయింపు

ఆర్‌కామ్‌కు అదనపు స్పెక్ట్రమ్ కేటాయించినందుకు వసూలు చేసిన రూ.2,000 కోట్లు వాపసు ఇవ్వాలని టెలికాం విభాగాన్ని టెలికాం ట్రైబ్యునల్ టీడీశాట్ ఆదేశించింది. ఒకసారి విధించే స్పెక్ట్రమ్ ఛార్జీల నుంచి సీడీఎంఏ విభాగంలో 5 మెగాహెర్ట్జ్ వరకు, జీఎస్ఎంలో 6.2 మెగాహెర్ట్జ్ వరకు మినహాయింపు ఉంది. అందుకనుగుణంగా ఆర్‌కామ్ ఇచ్చిన బ్యాంక్ గ్యారెంటీ రూ.2,000 కోట్లు వాపసు ఇవ్వాలని టీడీ శాట్ ఆదేశాలిచ్చింది.

కుప్పకూలిన షేర్లు: దివాలా పరిష్కార ప్రక్రియకు వెళ్లేందుకు కంపెనీ నిర్ణయించడంతో ఆర్‌కామ్ షేర్లు కుప్పకూలాయి. ఇంట్రాడేలో 48.27 శాతం కోల్పోయిన షేరు రూ.6 వద్ద రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 34.91 శాతం నష్టంతో రూ.7.55 వద్ద ముగిసింది. ఈ నేపథ్యంలో ఇతర గ్రూప్ షేర్లకు సైతం భారీగా అమ్మకాలు వెల్లువెత్తాయి. రిలయన్స్ పవర్ 35.10 శాతం, రిలయన్స్ క్యాపిటల్ 19.80 శాతం, రిలయన్స్ ఇన్‌ఫ్రా 14.87 శాతం, రిలయన్స్ నేవల్ 14.72 శాతం చొప్పున నష్టాలు చవిచూశాయి. ఈ 5 సంస్థల మొత్తం మార్కెట్ విలువ రూ.5,830.72 కోట్లు ఆవిరైంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2018-19	2017-18	2018-19	2017-18
సుందరమ్ ఫాజనర్స్	111.18	91.66	1021.46	853.25
టీఐ ఫైనాన్షియల్	2.05	1.25	3.63	2.80
ఇన్‌సెక్టిసైడ్స్	16.89	9.64	216.59	175.78
టెక్స్‌మాకో రైల్	18.84	4.07	415.21	239.15
కెపాసిటీ ఇన్‌ఫ్రా	23.89	22.68	458.55	374.51
వర్ల్‌పూల్ ఇండియా	60.62	53.14	1238.41	979.26
ఆదిత్యా బిర్లా ఫ్యాషన్	70.00	35.00	2282.00	1855.00
శాటిన్ క్రెడిట్‌కేర్	71.00	47.00	402.00	260.00
బలరామ్‌పుర్ చీనీ	120.32	61.42	962.68	1007.50
ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా	219.00	207.00	1835.00	1342.00
ఎక్సైడ్ ఇండస్ట్రీస్	155.04	154.27	2504.83	2289.34
నొవార్టిస్ ఇండియా	12.87	18.74	135.62	156.10
లక్ష్మీ విలాస్ బ్యాంక్	(373.48)	(39.23)	762.47	817.57
గ్లాక్సోస్మిత్‌క్లైన్ ఫార్మా	112.97	89.69	825.00	703.91

నేటి బోర్డు సమావేశాలు

టెక్ మహీంద్రా, గెయిల్, హెచ్‌పీసీఎల్, ఏసీసీ, టొరెంట్ ఫార్మా, మారికో, పీఎన్‌బీ, రిలయన్స్ ఇన్‌ఫ్రా, టాటా కెమికల్స్, టాటా గ్లోబల్ బెవరేజెస్, ఎంఆర్‌పీఎల్, సీఈఎస్‌సీ, ఏబీ క్యాపిటల్, డిష్ టీవీ, అపోలో టైర్స్, భెల్, బ్లూస్టార్, బోంబే డైయింగ్, కామత్ హోటల్, యునైటెడ్ బ్యాంక్, వీమార్ట్

చివర్లో పరుగులు

- మూడో రోజూ సూచీల జోరు
- దన్నుగా నిలిచిన ఆర్ఐఎల్

రోజులో ఎక్కువ భాగం నష్టాల్లోనే కదలాడిన సూచీలు.. ఆఖర్లో అదరగొట్టాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేర్లు దన్నుగా నిలవడంతో వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. 3.45 శాతం పెరిగిన ఆర్ఐఎల్ షేరు.. రూ.1291.15 వద్ద ముగిసింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష ప్రారంభం కానుండటంతో కొంత అప్రమత్తత కనిపించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం, ముడి చమురు ధరలు పెరగడం ప్రతికూల ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా చూస్తే.. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా, ఐరోపా షేర్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 36,456.22 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. అమ్మకాలు స్థిరంగా కొనసాగడంతో ఇంట్రాడేలో 36,225.48 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. అయితే మధ్యాహ్నం తర్వాత బలంగా పుంజుకుని లాభాల్లోకి వచ్చిన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 36,622.77 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 113.31 పాయింట్ల లాభంతో 36,582.74 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సైతం 18.60 పాయింట్లు పెరిగి 10,912.25 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,814.15- 10,927.90 పాయింట్ల మధ్య కదలాడింది.



✦ డీహెచ్‌ఎఫ్‌ఎల్ షేరు వరుస నష్టాలకు అడ్డుకట్ట పడింది. కంపెనీ సానుకూల వ్యాఖ్యలు చేయడం కలిసొచ్చింది. ఇంట్రాడేలో 12.96 శాతం కోల్పోయిన షేరు రూ.97 వద్ద తాజా 52 వారాల కనిష్ఠానికి చేరింది. అయితే మళ్లీ బలంగా పుంజుకుని చివరకు 4.17 శాతం లాభంతో రూ.116.10 దగ్గర స్థిరపడింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 12 లాభాలతో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.52%, ఓఎన్‌జీసీ 3.03%, బజాజ్ ఆటో 1.67%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.17%, హెచ్‌డీఎఫ్‌సీ 0.87%, టీసీఎస్ 0.81% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. పవర్‌గ్రిడ్ 3.13%, యెస్ బ్యాంక్ 3.10%, సన్‌ఫార్మా 2.10%, ఎన్‌టీపీసీ 2.07%, ఎం అండ్ ఎం 2.01%, భారతీ ఎయిర్‌టెల్ 1.51%, ఐటీసీ 1.39%, ఎల్ అండ్ టీ 1.31%, బజాజ్ ఫైనాన్స్ 1.27%, ఇండస్ఇండ్ బ్యాంక్ 1.13% మేర నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో మన్నికైన వినిమయ వస్తువులు, ఇంధన, చమురు- గ్యాస్, బ్యాంకింగ్ షేర్లు రాణించాయి.

మార్కెట్ కబుర్లు

✦ గ్రామీణ నీటి సరఫరా కోసం 5,828 కి.మీ పొడవైన పంపిణీ వ్యవస్థ, 3 నీటి శుద్ధి ప్లాంట్లు, పంపింగ్ స్టేషన్లు, నీటి నిల్వ నిర్మాణాల కోసం ఒడిశా ప్రభుత్వం నుంచి **ఎల్అండ్‌టీ** ప్రాజెక్టులు దక్కించుకున్నట్లు తెలిపింది.

✦ **ఎంఎస్‌టీసీ** పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి దరఖాస్తు చేసుకుంది.


✦ ఐఐఎఫ్ఎల్ హోల్డింగ్స్ అనుబంధ సంస్థ అయిన ఇండియా ఇన్ఫోలైన్ ఫైనాన్స్ (ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్)కు చెందిన వాణిజ్య వాహన ఫైనాన్స్ విభాగాన్ని **ఇండోస్టార్ క్యాపిటల్ ఫైనాన్స్** కొనుగోలు చేయబోతోంది.

✦ అరిస్టా లైఫ్‌సైన్స్ సంస్థను 4.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.30,000 కోట్లు) వెచ్చించి కొనుగోలు చేసినట్లు **యూపీఎల్** వెల్లడించింది.

✦ **అల్లైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిలరీస్ (ఏబీడీ)** సంస్థ రూ.700-800 కోట్ల నిధుల్ని సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

✦ **కోల్ ఇండియా** 4.46 కోట్ల షేర్లను (0.72 శాతం) తిరిగి కొనుగోలు (బైబ్యాక్) చేయబోతున్నట్లు ప్రకటించింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.235 చెల్లించబోతోంది.

✦ విద్యుత్ పరికరాల తయారీ సంస్థ **హావెల్స్ ఇండియా** త్వరలో ఫ్రిడ్జ్‌లను తయారు చేసేందుకు సన్నద్ధమవుతోంది.



4న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్) — కోడిగుడ్లు

(100కు రూపాయలలో)

హైదరాబాద్	400	వరంగల్	402
చిల్లరగా(ఒక గుడ్డు)	4.60	విశాఖపట్నం	405
బెంగళూరు	430	చెన్నై	445
5వ తేదీకి...		చిత్తూరు	438
విజయవాడ/గోదావరి	399	నమక్కల్	430

ఎన్‌ఎస్‌ఈ

సోమవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 335.65 (338.45) 4517829
ASIAN PAINTS 1446.35 (1457.20) 735159
AXIS BANK LT 720.50 (717.25) 8195956
BAJAJ AUTO L 2642.50 (2602.75) 817279
BAJAJ FINANC 2594.45 (2628.40) 942113
BAJAJ FINSER 6009.20 (6096.95) 128108
BHARTI AIRTE 306.55 (311.85) 3511129
BHARTI INFRA 295.05 (296.20) 2318471
BPCL 338.55 (341.00) 2154768
CIPLA 509.60 (521.35) 1480952
COAL INDIA L 222.10 (223.20) 3417620
DR. REDDYS 2735.20 (2791.25) 2149582
EICHER MOTOR 20128.30 (19663.40) 162129
GAIL 329.75 (333.50) 1682947
GRASIM IND 706.75 (718.95) 1007710
HCL TECH 1044.80 (1043.85) 2066972
HDFC 1978.50 (1961.25) 1421635
HDFC BANK 2104.90 (2090.45) 1984572
HERO MOTOCOR 2780.15 (2807.25) 991486
HINDALCO IND 204.20 (211.40) 6196724
HINDUSTAN UN 1802.60 (1799.30) 1116390
HPCL 226.50 (234.00) 6437470
ICICI BANK 354.55 (354.65) 17039321
INDIABULLS H 650.75 (678.65) 15121938
INDIAN OIL 135.90 (137.20) 4992704
INDUSINDBANK 1504.65 (1515.15) 2054061
INFOSYS LTD 755.90 (757.05) 3945391
ITC 277.10 (280.85) 6056619
JSW STEEL LT 273.50 (274.95) 4804512
KOTAK MAHIND 1272.20 (1255.70) 1379319
LARSEN & TOU 1307.40 (1324.60) 2308931
M&M 674.45 (688.40) 2652101
MARUTI SUZIK 6988.20 (6962.30) 658776
NTPC LTD 137.25 (140.15) 5596920
ONGC 146.25 (141.80) 9532350
POWER GRID C 184.60 (190.20) 2069251
RELIANCE IND 1290.90 (1249.95) 11670570
SBI 283.95 (284.40) 20642919
SUN PHARMA 414.80 (423.25) 3679517
TATA CONSULT 2050.25 (2029.95) 1590764
TATA MOTORS 180.25 (181.65) 11854351
TATA STEEL L 476.05 (474.70) 10972029
TECH MAHINDR 749.15 (746.60) 1518373
TITAN IND 1025.75 (991.55) 9556052
ULTRATECH 3447.50 (3483.65) 320227
UPL LIMITED 770.90 (779.85) 1254011
VEDANTA LIMI 161.35 (162.15) 24578563
WIPRO 371.25 (371.55) 3143722
YES BANK LTD 179.80 (185.60) 60771732
ZEE ENTERTAI 347.75 (354.40) 25098014

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1273.30 (1272.20) 93140
ACC 1406.10 (1415.55) 531657
ADITYA BIRLA 82.50 (80.50) 2691815
AMBUJA CEMEN 212.50 (212.50) 816759
ASHOK LEYLAN 82.30 (83.55) 17072907
AUROBIND PHA 763.95 (797.80) 2659793
AVENUE SUPER 1473.90 (1442.95) 785219
BANDHAN BANK 403.80 (404.85) 454495
BANK OFBAROD 110.30 (111.10) 15219147
BEL 82.80 (84.60) 3762635
BHEL 64.95 (64.35) 6807730
BIOCON LTD 652.45 (666.25) 931368
BOSCH LTD 19048.10 (19316.15) 9148
BRITANNIA 3266.00 (3251.00) 140277
CADILA HEALT 318.90 (323.60) 994074
COLGATE PALM 1289.45 (1293.45) 255403
CONTAINER 518.60 (658.70) 927229
DABUR INDIA 447.45 (451.85) 2210541
DLF LIMITED 163.60 (165.70) 5652935
GENERAL INS 252.80 (249.45) 46010
GODREJ CONSU 699.75 (710.65) 652170
HAVELLS INDI 735.55 (737.15) 2228722
HDFC STAND L 376.20 (375.45) 572950
HINDUSTAN ZI 254.70 (254.70) 906406
ICICI LOMBAR 883.60 (880.10) 131064
IDEA CELLULR 30.05 (30.90) 18195808
INTERGLOBE A 1160.85 (1174.10) 521714
L&TFIN.HOLD 127.55 (130.30) 6905425
LIC HOUS.FIN 455.90 (460.15) 1894538
LUPIN 855.90 (883.10) 1352120
MARICO LIMIT 367.75 (376.45) 2084615
MCDOWELL 556.45 (544.40) 1317498
MOTHERSON 138.30 (139.30) 5279832
MRF 59906.55 (61275.70) 7858
NHPC LTD 25.20 (25.40) 2799812
NMDC LTD 95.35 (95.35) 5323370
OIL INDIA 171.10 (171.55) 947598
ORACLE FIN S 3796.20 (3794.80) 27244
P&G HYG&HEAL 9877.10 (9898.60) 2467
PETRONET LNG 210.00 (221.10) 7360609
PIDILITE IND 1121.20 (1122.80) 740899
PIRAMAL ENTE 2107.90 (2155.30) 549669
SAIL 45.75 (46.25) 9813307
SBI LIFE INS 589.75 (590.95) 146249
SHREE CEMENT 15906.90 (15782.00) 13365
SHRIRAM TRAN 1024.75 (1047.10) 775225
SIEMENS 1023.30 (1031.10) 284828
SUN TV LTD 524.10 (532.15) 1014065
THE NEW INDI 180.20 (175.60) 32804

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 4.73 (4.97) 12785
AISHWARYA TE 2.50 (2.50) 1971
ALPHAGEO 459.35 (449.65) 629
AMAR RAJA BA 771.30 (767.30) 16129
ANDHRA BANK 24.90 (25.50) 79748
ANDHRA CEMEN 4.51 (4.74) 3521
ANDHRA PAPER 453.45 (474.25) 17558
ANDHRA PETRO 56.40 (57.70) 42486
ANDHRA SUGAR 321.05 (309.40) 2420
ASTRA MICROW 77 (77.55) 4202
AUROBINDO PH 766.30 (798.55) 157791
AVANTEL SOFT 228.05 (221) 471
AVANTI FEEDS 332.15 (346.55) 38383
AVON ORG 6.89 (6.62) 50
BALAJI AMIN 398.15 (403.85) 3315
BARTRONICS 6.35 (6.51) 983
BHAGIRA CHEM 395.65 (420.50) 3088
BHAGYA NAG 34.40 (33.10) 100
BN RATHI SEC 24.50 (24) 348
BRILLIANT SE 0.79 (0.83) 147499
CAMBRIDGE TE 45.75 (45) 12
CIL SECURI 14.99 (14.99) 101
CONT COFFEE 267.60 (270.40) 2663
COROMAN FERT 457.55 (455.05) 3561
CYBERMATE 1.82 (1.80) 49350
CYIENT LIMIT 610.25 (608.55) 12600
DIVI'S LAB 1610.85 (1531.75) 129206
DIVYA GRANIT 91 (92.05) 30
DR REDDY 2742.20 (2786.90) 97819
FOUR SOFT 37.50 (38.25) 1752
GATI CORPN 70.65 (72.70) 53777
GAYATRI PROJ 168.85 (170.80) 689
GMR INFRASTR 15 (15.05) 1223068
GOLDST INFRA 205.75 (219.05) 11614
GOLDSTONE EN 14.23 (13.91) 15775
GRANULES (I) 85.20 (89.10) 129938
GSS AMERICA 107.95 (119.25) 35332
GVK POWER 5.99 (6.55) 355315
HBL NIFE POW 25.55 (26.60) 8968
HERITAGE FOO 492.35 (491.75) 307
HIL LTD 1919.45 (1905.40) 586
HIND FLUROCA 13.95 (14.65) 1190
IDL INDUSTRS 236.60 (241.45) 85
IKF SOFT 0.27 (0.28) 600
ILFS ENGINEE 10.72 (11.28) 6974
INCAP 36.15 (38) 75
INNAREDY COM 1.79 (1.79) 100
IVRCL INFRAS 0.90 (0.90) 70169
JEEVAN SCIEN 35.30 (35.50) 2539
KAKATIYA CEM 169.70 (172.05) 1507
KALLAM SPG 17.10 (16.80) 247
KAVERI SEED 577.85 (595.80) 21437
KCP LTD 86.45 (85.80) 203
KERNEX MICRO 23.45 (24) 1209
KNR CONSTRUC 209.20 (206.85) 2905
KREBS BIO 93.80 (101.75) 453
LANCO INDUS 167.40 (176.20) 3676
LAURUS LABS 354.05 (352.45) 4737
LOKESH MACH 40.40 (41.60) 728
MADHUCON PRO 6.13 (5.71) 2012
MEDINOVA DIA 16.25 (17.10) 499
MEGA SOFT 7.10 (7.21) 9608
MIC ELECTRON 0.87 (0.91) 45521
MOLD-TEK.TEC 42.15 (43) 136
MOLDTK PLA 231.50 (223.05) 2620
MSR INDIA LT 9.53 (9.08) 2306
NAGARJAGRICH 27.25 (27.25) 1600
NATCO PHARMA 682.35 (693.20) 4490
NAVA BH VENT 107.15 (108.20) 5979
NCC 79 (79.25) 810306
NCL IND 116.60 (119.05) 540
NEHA INTER 4.08 (4.28) 1906
NETTLINX 41.95 (42.80) 102
NEULAND LAB 517.20 (538.25) 127
NIHAR INFO 11.26 (11.85) 831
NILE 306.85 (309.15) 1974
NORTHGATE TE 0.55 (0.57) 3632
OIL COUNTRY 13.06 (13.59) 4829
PANYAM CEMEN 9.97 (10.26) 9854
PENNER IND 35.15 (35.65) 11890
PHYTOCHEM I 40.60 (41.10) 670
PIONEER DIST 136.55 (148.35) 7418
PITTI LAMIN 55.85 (57.10) 1715
POKARNA 172.15 (172.75) 1633
PRAJAY ENGS 7.92 (8.17) 2003
PREMIER EXPL 222.75 (232.50) 3887
PRISM CEMENT 64.80 (67.40) 35294
PRUDENTL PHA 3.20 (3.19) 44759
RAASI REFRAC 18.05 (18.02) 221
RAGSAN PETRO 67.20 (64) 20
RAIN INDUSTR 108.60 (114.30) 39801
RAJ PACKAGIN 25.55 (27.50) 4
RAJVIR INDUS 17.80 (18.70) 20
RAM INFORMAT 41.50 (42) 2045
REG.CERAMIC 3.53 (3.71) 299
SAGAR CEM 595.30 (599.50) 81
SAMKRG PIST 173.25 (178.50) 1074
SAMPRE NUTRI 40.25 (42.35) 320
SATVAH. ISPA 9.09 (9.68) 3055
SMS PHARMA 68.45 (67.90) 475
SREE RAYAL A 33.30 (34.10) 40687
STARCHIK SP 30.15 (28.75) 200
STEEL EXCHAN 11.56 (10.56) 6309
SUJANA TOWER 1.47 (1.40) 750
SUJANA UNIVE 0.28 (0.29) 6525
SURANA STRIP 1.68 (1.62) 513
SURANA TELE 4.40 (4.44) 2005
SURYALATA SP 127.50 (127.50) 290
SUVEN PHARMA 199.90 (194.60) 40607
TAJ GVK HOTE 173.85 (177.65) 2327
TANLA 35.75 (37.60) 14132
TERA SOFTWAR 48.75 (49) 4167
TRANS BIOTEK 5.14 (5.24) 45303
TRENDY KNIT 0.19 (0.20) 184001
VAMSHI RUBB 27.95 (29) 1906
VBC FERRO 39.70 (38.30) 205
VICEROY HOTE 2.84 (2.98) 7250
VIMTA LABS 246.65 (253.55) 12501
VISAKA IND 366.35 (371.35) 671
VISTA PHARMA 25 (25.10) 7443
VIVIMED LABS 23.40 (23.90) 36898
VJIL CONSULT 33.80 (32.30) 584
YBRANT DIGIT 2.99 (3.08) 21274
ZENOTECH LAB 24.05 (24.45) 37326
ZENTECH 73.30 (75.10) 1740

టీవీ ఇక సినిమా చూపిస్తుంది

- కేబుల్ భారం 25% వరకు పెరగొచ్చు
- ఆపరేటర్ల మధ్య తేలని ఆదాయ పంపిణీ
- అందువల్లే కేబుల్‌లో యథావిధిగా పేచానళ్ల ప్రసారాలు
- దరఖాస్తు చేసుకోకపోతే రేపటి నుంచి నిలిచిపోయే అవకాశం
- డీటీహెచ్‌తో పాటు కేబుల్ కనెక్షన్లూ భారమే
- తెలుగు చానళ్లు చూడటానికే రూ.289-300



టీవీ చానల్ ప్రసారాలకు సంబంధించి, టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ నూతన నిబంధనలు ఈనెల 1 నుంచి అమల్లోకి వచ్చాయి. ఇందువల్ల నేరుగా ఇంటికే ప్రసారాలు (డీటీహెచ్)తో పాటు కేబుల్ కనెక్షన్ల ద్వారా టీవీ చానళ్ల ప్రసారాలు తిలకిస్తున్న వారికి బిల్లు భారం పెరుగుతోందనే చెబుతున్నారు. కేబుల్‌కు వచ్చేసరికి మాస్టర్ ఆపరేటర్, స్థానిక ఆపరేటర్ల మధ్య ఆదాయ పంపిణీ వ్యవహారం ఇంకా తేలకపోవడంతో, అన్ని చానళ్ల ప్రసారాలు ప్రస్తుతానికి యథావిధిగా నడుస్తున్నాయి.

డీటీహెచ్‌లో కోరుకున్న చానళ్లకు ముందస్తుగా డబ్బులు చెల్లిస్తేనే, తదుపరి నెలకు ప్రసారాలు తిలకించే వీలుంటుంది. కేబుల్‌లో మాత్రం అందుకు భిన్నమైన స్థితి. ప్రసారాలు అనలాగ్ నుంచి డిజిటల్‌కు మారి, సెట్ టాప్ బాక్స్ (ఎస్‌టీబీ)ల ద్వారా అందుతున్నా కూడా, గతంలో మాదిరే నెలవారీ రుసుము వసూలు చేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతాన్ని బట్టి రూ. 150-200-250 వరకు ఈ రుసుములున్నాయి. ఉచిత చానళ్లతో పాటు చెల్లింపుపై లభించే తెలుగు, హిందీ, ఆంగ్ల వార్తా, ఫైనాన్షియల్, సినిమా-వినోద భరిత చానళ్లతో పాటు క్రీడా ప్రసారాలు, పిల్లల కోసం యానిమేషన్ చానళ్లన్నీ ప్రసారమవుతున్నాయి. ఒక నెలలో తిలకించాక, మరుసటి నెల తొలి వారంలో చెల్లిస్తున్నారు. ప్రస్తుతం జనవరి నెల బిల్లులను కేబుల్ ఆపరేటర్లు వసూలు చేసుకుంటున్నారు. కొత్త నిబంధన ఈనెల 1 నుంచే అమల్లోకి వచ్చినా, వినియోగదారులు పేచానళ్లను ఎంపిక చేసుకునేందుకు ఈనెల 6 వరకు సమయం ఇచ్చారు. అయితే 15 వరకు సమయం ఇవ్వమని కేబుల్ స్థానిక ఆపరేటర్లు కోరుతున్నారు.

తేలని ఆదాయ పంపిణీ

ఇప్పటివరకు సిటికేబుల్ లేదా హాత్‌వే వంటి కేబుల్ ఆపరేటర్లు తమ మాస్టర్ ఆపరేటర్‌కు కనెక్షన్‌కు నెలకు రూ. 90 చొప్పున చెల్లిస్తూ వచ్చారు.

కొత్త విధానంలో..

- ✦ 100 ఉచిత చానళ్ల ప్రసారానికి ప్యాకేజీ రూ. 130+జీఎస్‌టీ 18 శాతం= రూ. 153
- ✦ 55 శాతం మాస్టర్ ఆపరేటర్‌కు.. రూ. 71.50
- ✦ 45 శాతం కేబుల్ ఆపరేటర్‌కు.. రూ. 58.50 ఇవ్వాలని ప్రతిపాదించారు.
- ✦ ఇళ్లకు కేబుల్ వేయడం, తెగినవి మార్చడం, యాంప్లిఫైయర్లు నిర్వహించడం, విద్యుత్తు బిల్లులు, నిర్వహణకు ఉద్యోగుల భారం మోసే తమకు ఇది ఏమాత్రం సరిపోదని ఉచిత చానళ్ల ప్యాకేజీ రూ. 130 తమకే ఇవ్వాలని కోరుతూ కేబుల్ ఆపరేటర్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఫలితంగా తమకు ఇచ్చే మొత్తాన్ని 60 శాతానికి పెంచేందుకు సూత్రప్రాయ అంగీకారం కుదిరిందని హైదరాబాద్ కూకట్‌పల్లిలోని పద్మావతి కేబుల్ నిర్వాహకుడు సైదేశ్వరరావు తెలిపారు.
- ✦ 60 శాతం కింద స్థానిక ఆపరేటర్‌కు రూ. 78 లభించనుంది.
- ✦ ఇదికాక పేచానళ్లకు సంబంధించి బ్రాడ్‌కాస్టర్‌కు 80 శాతం, 10 శాతం మాస్టర్ ఆపరేటర్, మిగిలిన 10 శాతం కేబుల్ ఆపరేటర్‌కు ఇవ్వాలన్నది ప్రతిపాదన.
- ✦ అంటే వినియోగదారులు కోరుకున్న చానళ్లకు బట్టి, ఇకపై కేబుల్ ఆపరేటర్లకు ఆదాయం లభించనుంది.
- ✦ తెలుగు పేచానళ్ల వరకే తీసుకున్నా, కేబుల్ సంస్థల ప్యాకేజీ రూ. 240 + 18 శాతం జీఎస్‌టీ = రూ. 283 అవుతుంది.
- ✦ బేసిక్‌చానళ్లకు రూ. 130లో రూ. 78, పేచానళ్లకు వసూలు చేస్తున్న రూ. 110లో రూ. 11 కలిపి నెలకు రూ. 89 స్థానిక ఆపరేటర్ వాటాగా లభిస్తుందని ఆపరేటర్లు చెబుతున్నారు.

డీటీహెచ్‌కు మారే అవకాశం

ప్రస్తుతం ప్రాంతాన్ని, అక్కడి ప్రజల ఆర్థిక స్థితితో పాటు ఇతర సంస్థల నుంచి పోటీ వల్ల రూ. 150 నుంచే కేబుల్ ప్రసారాలు అందుతున్నాయి. ఇకపై ఈ అవకాశం ఉండకపోవచ్చనే చెబుతున్నారు. దీంతోపాటు పేచానళ్లను యథేచ్ఛగా మార్చుకునే వీలు, డీటీహెచ్‌కు ఉన్నంతగా కేబుల్‌లో వీలవ్వదని భావిస్తున్నారు. కేబుల్ ఆపరేటర్‌కు చెప్పి, వారు మాస్టర్ ఆపరేటర్‌కు తెలిపి, మార్చే సరికి అధిక సమయం పడుతుంది.

అదే డీటీహెచ్‌లో అయితే, కోరుకున్న చానల్‌కు చెల్లింపు ఎప్పుడు జరిపితే, వెంటనే తిలకించే వీలుంటుంది.

డీటీహెచ్‌లోనూ ఛార్జీల మోతే

ఇప్పటివరకు ఉచిత చానళ్లతో పాటు తెలుగు పేమెంట్ చానళ్లన్నీ కలిపి రూ. 169కి లభిస్తున్నాయి. ఇకపై ఇదే ప్యాకేజీకి రూ. 289 అవుతుందని టాటా స్కై ధరల ప్యాక్ సూచిస్తోంది.

- ✦ ఉచిత చానళ్లతో పాటు అదనంగా 25 సాధారణ పేమెంట్ చానళ్లు కూడా జతచేర్చుకుంటే, ఆ చానళ్ల ధరతో పాటు, రూ. 23 నెట్‌వర్క్ సామర్థ్య రుసుం (ఎన్‌సీఎఫ్) కింద తప్పనిసరిగా చెల్లించాల్సిందే.
- ✦ అదే హెచ్‌డీ చానళ్లయితే, ప్రతి 13 చానళ్లకు రూ. 23 చొప్పున ఎన్‌సీఎఫ్‌గా చెల్లించాల్సిందే. ఇది మరింత అదనపు భారం కలిగించేదే.

క్రిసిల్ కూడా ఇదే అంటోంది

ట్రాయ్ కొత్త విధానంలో.. ఉచిత చానళ్లు కాక అగ్రశ్రేణి 10 పేమెంట్ చానళ్లు కావాలనుకుంటే, రూ. 300 వరకు చెల్లించాల్సి వస్తుందని రేటింగ్ సంస్థ క్రిసిల్ తెలిపింది. ప్రస్తుతం నెలకు రూ. 230-240 చెల్లిస్తున్న వారిపై 25 శాతం అదన భారం పడుతుందని వివరించింది.

- ✦ టీవీ చానల్ (బ్రాడ్‌కాస్టర్)కు ప్రస్తుతం ఒక చందాదారు నుంచి నెలకు రూ. 60-70 వస్తుండగా, ఇది రూ. 94కు చేరనుంది.
- ✦ గరిష్ఠంగా ఒక చానల్‌కు రూ. 19 చొప్పున లభిస్తుంది.

- ఈనాడు వాణిజ్య విభాగం

ఆర్‌బీఐ పరపతి సమీక్ష

గురువారం ఉదయం 11.45 గంటలకు

ముంబయి: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో రిజర్వు బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆరో ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశాలు నేడు ప్రారంభం కానున్నాయి. ఆర్‌బీఐ గవర్నరు శక్తికాంత దాస్ నేతృత్వంలోని పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) మూడు రోజుల పాటు సమావేశం కానుంది. గురువారం ఉదయం 11.45 గంటలకు విధాన నిర్ణయాలను ఆర్‌బీఐ ప్రకటించనుంది. 2016 సెప్టెంబరులో ఎంపీసీ కమిటీ ఏర్పాటైన తర్వాత ఆర్‌బీఐ నిర్ణయాలు మధ్యాహ్నం 2.30 గంటలకు వెలువడేవి. అయితే ఈసారి సమయం ఉదయం 11.45 గంటలకు మారింది.

వడ్డీ రేట్లలో పావు శాతం కోత!

ఎస్‌బీఐ నివేదిక

దిల్లీ: ఆర్‌బీఐ నేటి నుంచి చేపట్టబోయే ఆరో ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో పావు శాతం మేర వడ్డీ రేట్ల కోత విధించే అవకాశం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నివేదిక వెల్లడించింది. 'ఆర్‌బీఐ ప్రస్తుతం వడ్డీ రేట్ల విషయంలో తన వైఖరిని మార్చుకోవాలని ఆశిస్తున్నాం. అయితే ప్రస్తుతానికి వడ్డీ రేట్లలో మార్పులు చేయకపోవచ్చు. ఏప్రిల్ 2019లో తొలి రేట్ల కోత ఉంటుందని భావిస్తున్నాం. అయితే, ఈ నెల 7న ప్రకటించే పరపతి విధాన సమీక్షలో పావు శాతం మేర రేట్ల కోత నిర్ణయం వెలువడినా ఆశ్చర్యపోవల్సిన అవసరం లేద'ని ఎస్‌బీఐ తన నివేదికలో పేర్కొంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే చేపట్టిన 5 ద్రవ్య పరపతి విధాన సమీక్షల్లో ఆర్‌బీఐ రెండు సార్లు పావు శాతం చొప్పున వడ్డీ రేట్లు పెంచింది. గత మూడు ద్వైమాసిక పరపతి సమీక్షల్లో వడ్డీ రేట్ల మార్పు జోలికి వెళ్లలేదు.



రెనో కొత్త క్విడ్

ధర రూ.2.67- 4.63 లక్షలు

దిల్లీ: ఫ్రాన్స్ వాహన దిగ్గజం రెనో తమ చిన్న కారు క్విడ్ మోడల్‌లో కొత్త వెర్షన్‌ను భారత విపణిలో ప్రవేశపెట్టింది. దీని ధరల శ్రేణి రూ. 2.67- 4.63 లక్షలు (ఎక్స్-షోరూమ్ దిల్లీ)గా నిర్ణయించారు. కొత్త క్విడ్ కారు 0.8 లీటర్, 1 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌లతో మాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ సదుపాయాల్లో లభిస్తుందని రెనో ఇండియా వెల్లడించింది. పాదచారుల భద్రత, యాంటీ లాక్ బ్రేకింగ్ (ఏబీఎస్) వ్యవస్థ, ఎలక్ట్రానిక్ బ్రేక్‌ఫోర్స్ డిస్ట్రిబ్యూషన్ (ఈబీడీ) వంటి అధునాతన భద్రతా సదుపాయాలు ఇందులో ఉన్నాయి. అన్ని వేరియంట్లలో డ్రైవర్ ఎయిర్‌బ్యాగ్‌లు, డ్రైవర్, కో-డ్రైవర్ సీట్ బెల్ట్ రిమైండర్, స్పీడ్ అలర్ట్ వంటి ఫీచర్లను ప్రవేశపెట్టారు. 17.64 అంగుళాల టచ్‌స్క్రీన్ మీడియా, నేవిగేషన్ వ్యవస్థ, కెపాసిటివ్ టచ్‌స్క్రీన్, ఆండ్రాయిడ్, యాపిల్ కార్ ప్లే 'పుష్ టూ టాక్' వంటి వాటితో కొత్త క్విడ్ మరింత ఆకర్షణీయంగా మారింది. ఇప్పటి వరకు భారత్‌లో కంపెనీ 2.75 లక్షలకు పైగా క్విడ్ మోడళ్లను విక్రయించింది.

సర్వోమ్యాక్స్ మూసివేతకు ఎన్‌సీఎల్‌టీ ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: రూ. 700 కోట్లకు పైగా రుణాలను పొంది చెల్లింపుల్లో చేతులెత్తేసిన సర్వోమ్యాక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తులను అమ్మి అప్పులు తీర్చాలంటూ (లిక్విడేషన్)కు జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్ సోమవారం ఉత్తర్వులు వెలువరించింది. రుణ పరిష్కార ప్రణాళికలను రుణదాతల కమిటీ ఆమోదించకపోవడంతో లిక్విడేషన్‌కు అనుమతించాలంటూ పరిష్కార నిపుణుడు (ఆర్‌పీ) జి. మధుసూదన్‌రావు దరఖాస్తు దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఎన్‌సీఎల్‌టీ జ్యుడిషియల్ సభ్యులు రాటకొండ మురళి ఉత్తర్వులు జారీ చేస్తూ సర్వోమ్యాక్స్ ఇండియా లిక్విడేషన్‌కు అనుమతించారు. లిక్విడేటర్‌గా ప్రస్తుత ఆర్‌పీ జి. మధుసూదన్‌రావునే నియమించారు. ఎస్‌బీఐకి రూ. 537.25 కోట్లు, ఐడీబీఐకి రూ. 147.47 కోట్లు, కొటక్ బ్యాంకుకు రూ. 4.12 కోట్ల దాకా బకాయిలు రావాల్సి ఉంది. మురళి కృష్ణ పవర్ కంట్రోల్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన ఎన్‌సీఎల్‌టీ సర్వోమ్యాక్స్ దివాలా ప్రక్రియ ప్రారంభించాలంటూ 2018 ఫిబ్రవరి 22న ఉత్తర్వులు జారీ చేసింది. సర్వోమ్యాక్స్‌ను స్వాధీనం చేసుకోవడానికి ఆసక్తి ఉన్నవారిని ఆహ్వానిస్తూ ఆర్‌పీ ప్రకటన జారీ చేశారు. ఇందులో భాగంగా అయిదు రుణ పరిష్కార ప్రణాళికలు అందాయి. ఇందులో ఒకటి మాజీ డైరెక్టర్లు అవసరాల వెంకటేశ్వరరావు, హరీష్‌కుమార్‌లు దాఖలు చేశారు. ఇందులో రూ. 164 కోట్ల దాకా ప్రణాళికను సమర్పించారు. వీరితోపాటు జైన్‌కో ప్రాజెక్ట్ ఇండియా, గత ఏడాది చివరిలో శరత్‌చంద్ర రుణ పరిష్కార ప్రణాళికలను సమర్పించారు. రుణదాతల కమిటీ రుణ పరిష్కార ప్రణాళికలను తిరస్కరించడంతో ఆర్‌పీ లిక్విడేషన్‌కు అనుమతించాలని దరఖాస్తు చేశారు. దీనిపై సర్వోమ్యాక్స్ ఇండియా మాజీ డైరెక్టర్ ఎ. వెంకటేశ్వరరావు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ప్రస్తుతం బ్రాండ్ విలువ కాకుండా కేవలం రూ. 50 కోట్ల వరకే ఆస్తులున్నాయన్నారు. తాము రూ. 164 కోట్లదాకా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అయితే దీనిపై ఆర్‌పీ తరపు న్యాయవాది వి. కె. సాజిత్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇక్కడ రుణదాతల కమిటీ నిర్ణయమే అంతిమమని తెలిపారు. ఇదే విషయాన్ని ఎన్‌సీఎల్‌టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ స్పష్టం చేసిందన్నారు. ఈ వాదనతో ఏకీభవిస్తూ లిక్విడేషన్ దరఖాస్తును అనుమతిస్తూ ట్రైబ్యునల్ ఉత్తర్వులు జారీ చేసింది.



హైదరాబాద్ నుంచి జెడ్డాకు..

స్పైస్‌జెట్ విమానం



ఈనాడు, హైదరాబాద్: ప్రైవేటు విమానయాన సంస్థ స్పైస్‌జెట్ హైదరాబాద్ నుంచి జెడ్డాకు ప్రతిరోజూ విమాన సర్వీసును ప్రారంభించింది. మార్చి 25 నుంచి ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఈ విమానం ఇక్కడి నుంచి ఉదయం 7.10కి బయలుదేరి, జెడ్డాకు ఉదయం 11.05కు (అక్కడి కాలమానం ప్రకారం) చేరుకుంటుంది. జెడ్డా నుంచి తిరిగి మధ్యాహ్నం 12.05కు బయలుదేరి రాత్రి 8.25కు హైదరాబాద్ చేరుకుంటుంది. దీనికోసం బోయింగ్ 737 మ్యాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను కేటాయించినట్లు స్పైస్‌జెట్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా హైదరాబాద్ నుంచి జెడ్డాకు రూ. 13,499, అక్కడి నుంచి హైదరాబాద్‌కు రూ. 10,799గా టిక్కెట్ల ధరను నిర్ణయించినట్లు పేర్కొంది.

టిక్కెట్ల కమీషన్‌కు ఐటీసీ



- సతీష్ సరాఫ్, చార్టర్డ్ అకౌంటెంట్



? నేను ఓ ఖాళీ స్థలాన్ని కొన్నాను. అందులో అపార్ట్‌మెంట్ నిర్మించే బాధ్యతను ఓ నిర్మాణదారుకు అప్పగించాను. నిర్మాణదారు, స్థల యజమానికి 55:45 నిష్పత్తిలో వాటా వచ్చేలా మా మధ్య ఒప్పందం కుదిరింది. నేను జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోలేదు. స్థల యజమానికి జీఎస్‌టీ వర్తిస్తుందా? ఒకవేళ వర్తిస్తే.. మేం ఏవిధంగా చెల్లించాల్సి ఉంటుంది.

- శ్రీకాంత్ కాన్మంత్

సంయుక్త నిర్మాణ ఒప్పందం విషయంలో జీఎస్‌టీ వర్తించాలంటే నాలుగు అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. ఇందులో రెండు అంశాలు నిర్మాణదారుకు వర్తించేవి కాగా.. మిగిలిన రెండు స్థల యజమానికి సంబంధించినవి. నిర్మాణదారు విషయానికొస్తే.. ఆయన వాటా కిందకు వచ్చే ఫ్లాట్ల విక్రయం, స్థల యజమానికి నిర్మాణ సేవలు అందిస్తుండటం జీఎస్‌టీ వర్తించే అంశాలు అవుతాయి. స్థల యజమాని విషయంలో ఇక్కడ కూడా ఈయన వాటా కిందకు వచ్చే ఫ్లాట్ల విక్రయం, స్థల అభివృద్ధి బాధ్యతను నిర్మాణదారుకు అప్పగించడం జీఎస్‌టీ వర్తించే అంశాలు. జీఎస్‌టీ చట్టం, సాధారణ చట్టాలకు అనుగుణంగా ఈ నాలుగు అంశాలను పలు రకాలుగా అన్వయించుకునే అవకాశం ఉన్నందున.. స్థల యజమాని జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం ఉందా? లేదా? అనే విషయంపై వివిధ అభిప్రాయాలు ఉన్నాయి. అందువల్ల మీరు జీఎస్‌టీ నిపుణులను సంప్రదించి, దానికి తగ్గట్లుగా వ్యవహరించడం మంచిది.

? స్థల యజమాని వాటా కిందకు వచ్చిన ఫ్లాటును కొనుగోలు చేసినప్పుడు జీఎస్‌టీ రేటు ఎంతో తెలియజేయగలరు? నేను ఈ ఫ్లాటును రూ.29 లక్షలు పెట్టి కొనుగోలు చేశాను. దీనిపై 12 శాతం జీఎస్‌టీ చెల్లించమని అడుగుతున్నారు? ఇది సబబేనా.

- లోహిత్ పోపూరి

మీరు కొనుగోలు చేసిన ఫ్లాటుపై 12 శాతం జీఎస్‌టీ చెల్లించమనడం సరైనదే. అయితే స్థల యజమాని తన వాటా కిందకు వచ్చే ఫ్లాట్లను విక్రయించినప్పుడు జీఎస్‌టీ వర్తించొచ్చు లేదంటే వర్తించకపోవచ్చు కూడా. ఇది ఆయా సందర్భాలపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల మీ ప్రశ్నకు ఖచ్చితమైన సమాధానం ఇవ్వడం వీలుకాదు.

? మాకు తణుకులో 2స్టార్ హోటల్ ఉంది. గది అద్దె (రూ.1000-2000), రెస్టారెంట్ (ఆహారం, మద్యం, పానీయాలు), వివాహ వేడుకలకు అద్దెకు ఇవ్వడం, లాండ్రీ, టెలిఫోన్, ఇంటర్నెట్ లాంటి సేవలు అందిస్తున్నాం. పై వాటికన్నింటికీ కలిపి మా వార్షిక టర్నోవరు రూ. 4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉంటుంది. పై సేవలకు ఎంతెంత జీఎస్‌టీ రేటు వర్తిస్తుందో వివరంగా తెలియజేయగలరు.

-సీహెచ్.మదన్ మోహన్

మీరు వెల్లడించిన పై వివరాల ప్రకారం.. ఎంత పన్ను రేటు పడుతుందనే విషయాన్ని స్పష్టంగా చెప్పలేం. ఎందుకంటే మీరు విడిగా సేవలు అందిస్తున్నారా లేదంటే.. కాంపోజిట్ లేదంటే మిక్స్‌డ్ సరఫరా ఎంపిక చేసుకున్నారా? అనే విషయాన్ని వెల్లడించలేదు. అందువల్ల మీ సందేహంపై స్పష్టత ఇవ్వడం వీలుకాదు.

? పర్యాటక ఏజెన్సీ నిర్వాహకులు ఇన్‌కమ్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్ చేసుకునే విషయంపై నాకు చిన్న సందేహం ఉంది. మేం రెడ్ బస్, అభిబస్ లాంటి ఇ-కామర్స్ వెబ్‌సైట్‌ల ద్వారా బస్సు టికెట్లను అమ్ముతున్నాం. మాకు వచ్చే కమీషన్‌పై ఈ వెబ్‌సైట్‌లు 18 శాతం వరకు జీఎస్‌టీని వసూలు చేస్తున్నాయి. మేం చెల్లించే ఈ 18 శాతం జీఎస్‌టీని ఐటీసీగా తిరిగి పొందొచ్చా. ఇటీవలే ఏసీ, నాన్ ఏసీ బస్సులను కూడా కొనుగోలు చేశాం. వీటిపై కూడా మేం ఐటీసీని పొందే వీలుంటుందా

- బాల చంద్ర

టికెట్ల విక్రయం ద్వారా ఆర్జించే కమీషన్‌పై చెల్లించిన జీఎస్‌టీని ఐటీసీగా తిరిగొ పొందొచ్చు. అలాగే బస్సుల కొనుగోళ్లపై కూడా ఐటీసీని క్లెయిమ్ చేసుకోవచ్చు.

? నేను మూడు పడక గదుల ఫ్లాట్‌ను కొనుగోలు చేశాను. పదవీ విరమణ చేయగా వచ్చిన డబ్బుల నుంచి రూ.3 లక్షలను చెక్ ద్వారా 2018 జూన్‌లో అడ్వాన్స్‌గా ఇచ్చాను. అయితే ఈ ఏడాది 2019 ఏప్రిల్/మేలో ఓ వాణిజ్య స్థలాన్ని కొనుగోలు చేసే యోచనలో ఉన్నాను. 2019 ఏప్రిల్ వరకు ఫ్లాట్ కోసం చెల్లించాల్సిన వాయిదాల కోసం రూ.50 లక్షలను 2019 మేలో కడతాను. 2021 మార్చిలో ఫ్లాట్‌ను నాకు స్వాధీనం చేయనున్నారు. అడ్వాన్స్ చెల్లించిన తేదీ నుంచి ఫ్లాట్ స్వాధీనం చేయడానికి రెండేళ్ల తొమ్మిది నెలల సమయం పడుతోంది. స్థల విక్రయంపై మూలధన లాభం పన్నుకు గరిష్ఠంగా రెండేళ్ల వరకు మాత్రమే గడువు ఉంటుంది కదా? ఆ తర్వాత పడే పన్ను నుంచి తప్పించుకునేందుకు సలహా ఇవ్వగలరు

- సీహెచ్ హనుమంతరావు

ఆదాయపు పన్ను నిబంధనలు, జీఎస్‌టీ నిబంధనలతో సరిపోల్చకూడదు. మీరిచ్చిన తేదీల ప్రకారం.. మీ కొనుగోలుదారు అంగీకరిస్తే వాణిజ్య స్థిరాస్తి అమ్మకపు తేదీని వాయిదా వేసుకోవడం మంచిది. ఇంకో ప్రత్యామ్నాయ మార్గమేమిటంటే.. వాణిజ్య స్థిరాస్తి విక్రయం తేదీ నుంచి రెండేళ్ల సమయంలోగా చెల్లించేలా నిర్మాణదారుతో ఒప్పందం కుదుర్చుకోండి. ఆదాయపు పన్ను చట్టం స్థిరాస్తి కొనుగోళ్ల గురించి మాత్రమే చెబుతుంది. స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌ల గురించి కాదు.

? హవాయి చెప్పులు కటింగ్ వ్యాపారాన్ని చేయాలనుకుంటున్నాను. ఈ వ్యాపారానికి సంబంధించి జీఎస్‌టీ విధానం, నిర్వహించాల్సిన పద్దు పుస్తకాలేమిటో తెలియజేయండి.

- ఎస్.కె.బాజ్జీ, యలమంచిలి

ఏ వ్యాపారానికైనా టర్నోవరు రూ. 20 లక్షలు మించితే జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సంఖ్య వచ్చాక.. ప్రతి నెల రిటర్న్‌లు దాఖలు చేసి, నిర్ణీత గడువులోగా పన్ను బకాయిలు కట్టాల్సి ఉంటుంది. అలాగే సీజీఎస్‌టీ చట్టంలోని సెక్షన్ 35, నిబంధన 56 ప్రకారం పద్దు పుస్తకాలను కూడా నిర్వహించాల్సి ఉంటుంది.

? 2018 జనవరి నుంచి 2018 ఆగస్టు మధ్య కాలానికి నా జీఎస్‌టీ రిజిస్ట్రేషన్ సంఖ్యను సీటీఓ రద్దు చేశారు. అక్టోబరు 24న ఆలస్య రుసుంతో కలిపి మొత్తం పన్ను బకాయిలను చెల్లించాను. అలాగే అక్టోబరు 28న రిటర్న్‌లు కూడా దాఖలు చేశాను. నేను ఇప్పుడు జీఎస్‌టీ లైసెన్సు రద్దు పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకున్నాను. 2017 అక్టోబరు నుంచి జీఎస్‌టీపై 18 శాతం వడ్డీ కూడా చెల్లించాను. ఇదే కాకుండా జరిమానా రుసుం కూడా కట్టాల్సి ఉంటుందా? కట్టాల్సి ఉంటే.. వేటివేటిపై చెల్లించాలో తెలియజేయగలరు.

- రాకేశ్ కొమ్మలపాటి

రిటర్న్‌ల దాఖలు, పన్ను చెల్లింపును ఆలస్యం చేస్తే తప్పకుండా జరిమానా పడుతుంది. అయితే ఈ జరిమానాను పన్ను చెల్లింపు దారే నేరుగా చెల్లించడం కుదరదు. సంబంధిత అధికారి నుంచి నోటీసులు అందిన తర్వాతే జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్‌టీ లైసెన్సు రద్దు పునరుద్ధరణకు దరఖాస్తు చేసి సరైన నిర్ణయమే తీసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు సంబంధిత అధికారిని ఆశ్రయించండి.

? వ్యాట్ ఉన్నప్పుడు సంవత్సరానికి ఒకసారి వృత్తి పన్ను (ప్రొఫెషనల్ ట్యాక్స్) చెల్లించేవాళ్లం. జీఎస్‌టీ వచ్చాక కూడా ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుందా? తెలియజేయగలరు.

- గిరిధర్, రాయదుర్గం

ఉద్యోగులు, వ్యాపారులు, వృత్తి నిపుణులు ఇలా ప్రతి ఒక్కరు ప్రొఫెషనల్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. దీనికి వ్యాట్ లేదా జీఎస్‌టీతో ఎటువంటి సంబంధం లేదు. ప్రొఫెషనల్ ట్యాక్స్ స్వతంత్ర పన్ను చట్టం. అందువల్ల వ్యాట్, జీఎస్‌టీతో సంబంధం లేకుండా దీనిని చెల్లించాల్సి ఉంటుంది. వ్యాట్ ఉన్నప్పుడే కాదు జీఎస్‌టీ వచ్చాక కూడా ప్రొఫెషనల్ ట్యాక్స్ కొనసాగుతోంది.

మీ సందేహాలు పంపండి

జీఎస్‌టీకి సంబంధించి మీ సందేహాలు మాకు పంపించండి.. మీ సందేహాలు ఎలాంటివైనా సరే అవి క్లుప్తంగాను, సరళంగాను ఉండాలి.. మా చిరునామా
eenadubusinessdesk@gmail.com; businessdesk@eenadu.net



కుంభమేళాలో 5 కోట్ల మంది

ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమంలో సోమవారం పవిత్ర స్నానానికి పోటెత్తిన భక్తులు. అంతర చిత్రంలో త్రివేణి సంగమానికి యాత్రగా వస్తున్న నాగ సాధువులు

మంచుకు ఉష్ణ కష్టం!



భూతాపంతో హిమనీ నదాలు కరుగుతున్నాయ్ ● హిమాలయాలపై నిపుణుల హెచ్చరిక

కాఠ్‌మాండూ: మంచుకొండలకు భూతాపం పెద్ద శత్రువులా మారింది. ప్రపంచంలో తృతీయ ధ్రువంగా పిలుచుకునే హిమాలయాల్లోని హిమనీ నదాలు కరిగిపోతున్నాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రపంచ ఉద్గారాల్ని తగ్గించకపోతే 2100 నాటికి మూడింట రెండొంతులు కరిగిపోతాయని తాజా అధ్యయనం స్పష్టం చేసింది. భూతాపాన్ని 1.5 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గించాలన్న పారిస్ ఒప్పందం లక్ష్యాన్ని సాధించినా.. మూడింట ఒక వంతు హిమనీ నదాలు కరిగిపోక తప్పదని 'హిందూకుష్ హిమాలయా అసెస్‌మెంట్' అధ్యయనం పేర్కొంది. నేపాల్ కాఠ్‌మాండూలోని 'అంతర్జాతీయ సమీకృత పర్వత అభివృద్ధి కేంద్రం' ఈ అధ్యయన నివేదికను సోమవారం వెలువరించింది.

నివేదిక వివరాలిలా..

- ✦ హిందూకుష్ హిమాలయ ప్రాంతంలోని హిమనీ నదాలు పర్వత ప్రాంతాల్లోని 25 కోట్ల మందికి, ఇతర ప్రాంతాల్లోని 165 కోట్ల మందికి కీలకమైన నీటి వనరులు.
- ✦ గంగా, ఇండస్, ఎల్లో, మెకాంగ్ సహా ప్రపంచంలోని 10 అత్యంత ముఖ్యమైన నదీ వ్యవస్థలకు జలాలను అందిస్తున్నాయి.
- ✦ ప్రత్యక్షంగా, పరోక్షంగా కోట్ల మంది ప్రజలకు ఆహారం, ఇంధనం, శుద్ధ వాయువుతో పాటు ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి.
- ✦ ఇవి కరిగిపోవడం వల్ల వాయు కాలుష్యంతోపాటు, తీవ్రస్థాయి వాతావరణ సమస్యల దాకా ప్రజలపై పలురకాలుగా ప్రభావం చూపుతాయి.
- ✦ రుతుపవన ముందస్తు నదీ ప్రవాహాలు తక్కువగా ఉండటం వల్ల పట్టణ నీటి వ్యవస్థలు, ఆహార, ఇంధన ఉత్పత్తిపైనా ప్రభావం చూపుతాయి.
- ✦ మునుపెన్నడూ లేని వాతావరణ సంక్షోభం తలెత్తుతుంది.
- ✦ ఎవరెస్ట్, కే2 వంటి పర్వత పాదాల వద్ద ఉండే వందలకొద్దీ హిమనీ సరస్సుల విచ్ఛిన్నత వరదలకు దారితీస్తుంది.
- ✦ భూతాపం వందేళ్లకన్నా తక్కువ కాలంలోనే 8 దేశాల్లో హిమనీ నదాలతో కూడిన పర్వత శిఖరాల పరిస్థితులను మార్చివేస్తుందని అధ్యయన పరిశోధకులు ఫిలిప్పస్ వెస్టెర్ పేర్కొన్నారు.

భాజపాలో ఏకైక ధైర్యశాలి గడ్కరీ!

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ వ్యాఖ్య

దిల్లీ: భాజపాలో ధైర్యం ఉన్న ఒకే ఒక్కరు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. "ఇంటినే సరిదిద్దుకోలేని వ్యక్తి దేశాన్ని చక్కదిద్దలేడు." అంటూ మంత్రి గడ్కరీ చేసిన వ్యాఖ్యలను ఎత్తి చూపుతూ రాహుల్ ట్వీట్లు చేశారు. రఫేల్ ఒప్పందం, రైతుల దుస్థితి, వ్యవస్థల విధ్వంసంపై కూడా ఆయన మాట్లాడాలని రాహుల్‌తొలి ట్వీట్‌లో సూచించారు. అనంతరం "గడ్కరీజీ! చాలా ముఖ్యమైన విషయం మరిచిపోయాను.. మన్నించండి." అని ఎద్దేవా చేస్తూ ఉద్యోగాలపై కూడా మాట్లాడాలని సూచించారు. నాగ్‌పుర్‌లో ఏబీవీపీ పూర్వ కార్యకర్తలను ఉద్దేశించి గడ్కరీ శనివారం ఈ వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఓ మీడియా వార్తను రాహుల్ గాంధీ జతచేశారు. తనకున్న ధైర్యంపై రాహుల్‌ఇచ్చే 'సర్టిఫికెట్' అవసరం లేదంటూ గడ్కరీ తిప్పికొట్టారు.

★ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో టీవీ చర్చా కార్యక్రమాలు...ఇతరత్రా బహిరంగ వేదికలపై మూడు కీలక అంశాలపై మాట్లాడ వద్దంటూ కాంగ్రెస్ అధికార ప్రతినిధులకు పార్టీ నుంచి విస్పష్టమైన సూచనలు అందాయి. అయోధ్యలో రామమందిర వివాదం, శబరిమల అంశం, పౌరసత్వ సవరణ బిల్లు అంశాలపై చర్చావేదికల్లో అభిప్రాయాలు వ్యక్తం చేసినపుడు...అవి బెడిసికొట్టే ప్రమాదం ఉందన్నది కాంగ్రెస్ అభిప్రాయంగా ఉంది.

రాజకీయ పావుగా సీబీఐ

- పార్లమెంటులో దుయ్యబట్టిన విపక్షాలు
- చర్చల్లేకుండానే ఉభయ సభలు వాయిదా

దిల్లీ: సీబీఐ-కోల్‌కతా పోలీసుల వివాదం సోమవారం పార్లమెంటు ఉభయ సభలను కుదిపేసింది. ఇతర అంశాలపై ఎలాంటి చర్చలు లేకుండానే వాయిదా పడ్డాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం సీబీఐని రాజకీయ పావుగా వాడుకుంటోందంటూ ప్రతిపక్షాలు దుయ్యబట్టాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే పశ్చిమ బెంగాల్‌కు చెందిన తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ఆందోళనకు దిగారు. వారికి కాంగ్రెస్, బీజేడీ, ఎన్సీపీ, ఎస్పీ, ఆర్జేడీ సభ్యులు మద్దతు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. పలుమార్లు వాయిదా పడిన అనంతరం జరిగిన చర్చలో తృణమూల్ సభ్యుడు సౌగత్ రాయ్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌ను రాజకీయంగా వశపరచుకొనేందుకు కేంద్రం సీబీఐని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. దీనివల్లనే రాష్ట్రంలో సంక్షోభం నెలకొందని అన్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి సీబీఐని తరచూ ప్రయోగిస్తోందని, దీన్ని ఎదుర్కోవడానికి సర్వశక్తులూ ఒడ్డుతామని తెలిపారు. ఇది ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధమని చెప్పారు. బిజూ జనతాదళ్ సభ్యుడు భర్తృహరి మెహతాబ్ తన ప్రసంగంలో సీబీఐ నిజాయితీని ప్రశ్నించారు. సీబీఐ కేంద్ర ప్రభుత్వం చేతిలో రాజకీయ ఆయుధంగా, రాజకీయ తొత్తుగా మారిందని విమర్శించారు. తమ పార్టీకి చెడ్డపేరు తేవడానికి ఒడిశాలోనూ ఇలాగే చేస్తోందని చెప్పారు. ప్రతిపక్షాలను లేకుండా చేసి, నిరంకుశ పాలన కొనసాగించాలన్న ఉద్దేశంతోనే కేంద్రం సీబీఐని వాడుకుంటోందని కాంగ్రెస్ సభ్యుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఇలాంటి చర్యలకు ప్రజలు తలవంచబోరని అన్నారు. ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే మాట్లాడుతూ మహిళా ముఖ్యమంత్రిపై సీబీఐ కండబలం ప్రదర్శించిందని ఆరోపించారు. సీపీఎం సభ్యుడు బద్రుద్దౌజా ఖాన్ ప్రసంగిస్తూ కేంద్ర ప్రభుత్వం, తృణమూల్ కాంగ్రెస్ రెండింటినీ తప్పుపట్టారు. గత నాలుగేళ్లుగా సీబీఐ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

రాజ్యాంగ సంక్షోభమే: రాజ్‌నాథ్

సభ్యులు నినాదాల నడుమే ఈ సంఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరణ ఇచ్చారు. ఇది అసాధారణ సంఘటన అని అన్నారు. చట్టాలు అమలు చేసే విభాగాల మధ్య వివాదం తలెత్తడం సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తికి విరుద్ధమని, అరాచకానికి దారి తీస్తుందని తెలిపారు. శారదా కుంభకోణంలో దర్యాప్తునకు సహకరించని కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను చట్టబద్ధంగా విచారించడానికి ఆయన ఇంటికి వెళ్లిన సీబీఐని అడ్డుకున్నారని చెప్పారు. "పశ్చిమ బెంగాల్‌లో రాజ్యాంగ సంక్షోభం తలెత్తవచ్చు. దేశంలోని ఏ ప్రాంతంలోనయినా సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు రాజ్యాంగం ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి అధికారం ఉంది. ఆదివారం జరిగిన సంఘటనలు రాజ్యాంగ సంక్షోభాన్ని సూచిస్తున్నాయి" అని చెప్పారు. పోలీసులు, శాంతిభద్రతలు రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన అంశాలని, వాటిని కేంద్రం గౌరవిస్తుందని చెప్పారు. అదే సమయంలో నిబంధనల ప్రకారం పరిపాలన జరిగేటట్టు చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఈ కుంభకోణంలో ప్రభుత్వంలోని ప్రముఖులకు సంబంధం ఉందని చెప్పారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న రాజ్‌నాథ్

రాజ్యసభలో...

రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. సభ సమావేశం కాగానే తృణమూల్ సభ్యులు నినాదాలు చేశారు. సభను రెండు గంటలకు వాయిదా వేశారు. తిరిగి సమావేశమయినప్పుడూ పరిస్థితిలో మార్పు కనిపించలేదు. దీనిపై చర్చకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తృణమూల్ సభ్యుడు డెరెక్ ఒబ్రెయిన్ నోటీసు ఇవ్వగా ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు అంగీకరించలేదు. దీన్ని శూన్యగంటలోగానీ, ధన్యవాద తీర్మానం సందర్భంగాగానీ ప్రస్తావించాలని సూచించారు. ఇందుకు సమ్మతించని ఆ పార్టీ సభ్యులు నినాదాలు కొనసాగించడంతో సభను వాయిదా వేశారు.

బాధ్యతలు స్వీకరించిన శుక్లా



దిల్లీ: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నూతన డైరెక్టర్‌గా రిషి కుమార్ శుక్లా(58) సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన 1983 బ్యాచ్‌కు చెందిన మధ్యప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. సీబీఐ ప్రధాన కార్యాలయంలో సంస్థ తాత్కాలిక డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు నుంచి పూర్తిస్థాయి సారథ్య బాధ్యతలను శుక్లా స్వీకరించారు. సీబీఐ 28వ డైరెక్టర్‌గా ఆయన నియామకానికి కేంద్ర నియామకాల మంత్రివర్గ సంఘం శనివారమే ఆమోదముద్ర వేసింది. కోల్‌కతా పోలీసులు, సీబీఐ మధ్య ఘర్షణాత్మక వాతావరణం నెలకొన్న నేపథ్యంలో శుక్లా తన నియామకం జరిగిన 2 రోజుల్లోనే పగ్గాలు చేపట్టారు.

జైట్లీ-ఖర్గేల మధ్య మాటల యుద్ధం

దిల్లీ: సీబీఐ సంచాలకుని నియామకంపై కాంగ్రెస్ నేత ఖర్గే, కేంద్రమంత్రి జైట్లీ నడుమ మాటల యుద్ధం ముదురుతోంది. సీబీఐ సంచాలకుడి నియామకాన్ని ఖర్గే రాజకీయ జగడంలా చూస్తున్నారనీ, ఆయనెప్పుడూ భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తూనే ఉంటారంటూ జైట్లీ తన బ్లాగ్‌లో వ్యాఖ్యానించారు. డైరెక్టర్ ఎంపిక తీరును తప్పుపట్టనే తప్పు.. శుక్లా నైతిక నిష్ఠను శంకించలేదంటూ జైట్లీకి ఖర్గే లేఖ రాశారు.



కోల్‌కతాలో ధర్నాలో కూర్చున్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ

దేశ రక్షణకే ధర్నా

- రాజకీయాలకు సంబంధం లేదు
- మమత స్పష్టీకరణ
- మోదీ, అమిత్‌షాలపై ధ్వజం

కోల్‌కతా: సీబీఐ అధికారుల తీరుకు వ్యతిరేకంగా తాను చేస్తున్న ధర్నాను రాజకీయేతర నిరసనగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివర్ణించారు. తన నిరసనకు రాజకీయ పార్టీలు మద్దతు పలికితే మాత్రం స్వాగతిస్తానని స్పష్టం చేశారు. దేశం నలుమూలల నుంచి తనకు మద్దతు లభిస్తోందన్నారు. దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించేంత వరకు తన సత్యాగ్రహాన్ని కొనసాగిస్తానని తేల్చిచెప్పారు. కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించేందుకుగాను ఆయన నివాసానికి సీబీఐ అధికారులు ఆదివారం వెళ్లడంతో తీవ్ర ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడింది. వెంటనే రాజీవ్ నివాసానికి చేరుకున్న మమత.. సీబీఐ అధికారుల తీరుకు నిరసనగా ధర్నా ప్రారంభించిన సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్‌లో తిరుగుబాటు జరిపించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్ షా ప్రయత్నిస్తున్నారని మమత ఆరోపించారు. ప్రధాని ఆదేశాల మేరకు రాజకీయ ప్రత్యర్థులను వేధించేలా సీబీఐని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నడిపిస్తున్నారని కూడా ఆరోపణలు గుప్పించారు. తన ధర్నాపై మమత స్పందిస్తూ.. 'ఇది రాజకీయ కార్యక్రమం కాదు. కానీ మా నిరసనలో అన్ని రాజకీయ పార్టీలు పాల్గొనవచ్చు' అని పేర్కొన్నారు. ధర్నాలో పాల్గొనేందుకు ఎవరైనా వస్తే స్వాగతిస్తామన్నారు. దిల్లీ సీఎం కేజ్రీవాల్, గుజరాత్ ఎమ్మెల్యే-దళిత నేత మేవానీ తదితరులు తనకు ఫోన్ చేసినట్లు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ తదితరులు తన నిరసనకు సంఘీభావం ప్రకటించినట్లు ఆమె ఆదివారం వెల్లడించిన సంగతి తెలిసిందే.

★ కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా రైతులకు కునుకు లేకుండా చేసిందని మమత విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతులను మోసపుచ్చేందుకే బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించారంటూ ధ్వజమెత్తారు. స్థానిక నేతాజీ ఇండోర్ స్టేడియం వద్ద సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి రైతు సదస్సును ఉద్దేశించి మమత ఫోన్‌లో(ధర్నా వేదిక నుంచే) ప్రసంగించారు.

స్వీయ రక్షణకే మమత ధర్నా

- పశ్చిమ బెంగాల్‌లో అత్యయిక స్థితి వంటి పరిస్థితులు
- జావడేకర్ మండిపాటు

కోల్‌కతా, దిల్లీ: సీబీఐకి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిరసన చేపట్టడంపై కేంద్రమంత్రి, భాజపా సీనియర్ నేత ప్రకాశ్ జావడేకర్ ధ్వజమెత్తారు. సీబీఐ నుంచి తనను తాను రక్షించుకునేందుకే ఆమె ధర్నా ప్రారంభించారని విమర్శించారు. కోల్‌కతాలో జావడేకర్ సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో మమతా బెనర్జీ అత్యయిక స్థితి వంటి పరిస్థితులను సృష్టించారని ఆయన పేర్కొన్నారు. "గతంలో ఇందిరా గాంధీ అత్యయిక స్థితి విధించారు. మేం ఆమెపై పోరాడి విజయం సాధించాం. తృణమూల్‌ను కూడా ఓడిస్తాం" అని అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష నేతలు హత్యలకు గురవుతున్నారని.. సభలు చేపట్టకుండా విపక్షాలను ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. "అమిత్ షా, యోగి ఆదిత్యనాథ్, స్మృతి ఇరానీల హెలికాప్టర్లు రాష్ట్రంలో దిగేందుకు అనుమతించలేదు. ఇది ప్రజాస్వామ్యమా? ఇది అత్యయిక స్థితి కాదా?" అని జావడేకర్ ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తారా అని విలేకరులు అని అడిగిన ప్రశ్నకు.. "ప్రస్తుతానికి మేమేం చెప్పలేం" అని బదులిచ్చారు. కొందరు ఐపీఎస్ అధికారులు మమతతో కలిసి ధర్నాలో పాల్గొనడాన్ని జావడేకర్ తప్పుపట్టారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే గొలుసుకట్టు కుంభకోణాలపై సీబీఐ దర్యాప్తు జరుపుతోందని ఆయన తెలిపారు.



రాజీవ్‌కు చాలా రహస్యాలు తెలుసేమో!

కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌కు చాలా రహస్యాలు తెలుసునేమోనని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. అందుకే ఆయన్ను రక్షించేందుకు మమత స్వయంగా ధర్నాకు దిగారని పేర్కొన్నారు. దిల్లీలో రవిశంకర్ విలేకర్లతో మాట్లాడారు. సీబీఐ చర్యకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఏకతాటిపైకి వస్తుండటంపై ఆయన విమర్శలు గుప్పించారు. వారి ఐకమత్యాన్ని 'అవినీతి కూటమి'గా వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ సహా ఆయా పార్టీల నేతలు అవినీతి ఆరోపణలపై వివిధ కేసుల్లో దర్యాప్తు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వారంతా ఒకరినొకరు రక్షించుకునేందుకే ఏకమవుతున్నారని ఎద్దేవా చేశారు. తృణమూల్ ఎంపీలు, నేతలు అరెస్టయినప్పుడు కూడా నోరు మెదపని మమత ఓ పోలీసు అధికారి కోసం ధర్నా చేస్తున్నారంటే.. ఆయనకు చాలా రహస్యాలు తెలిసినట్లు కనిపిస్తోందని రవిశంకర్ పేర్కొన్నారు.



ఈసీ ప్రధాన కార్యాలయం నుంచి బయటకు వస్తున్న కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, నఖ్వీ, అహ్లువాలియా, భాజపా నాయకులు కైలాశ్, భూపేందర్ తదితరులు

మమత ప్రభుత్వంపై భాజపా ఫిర్యాదు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో తమ పార్టీ కార్యక్రమాలను తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని భాజపా ప్రతినిధుల బృందం ఆరోపించింది. లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరగడానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ ఎన్నికల సంఘాన్ని కలిసింది. మమతాబెనర్జీ నేతృత్వంలోని టీఎంసీకి ప్రజాస్వామ్యంపై నమ్మకంలేదంటూ ఇటీవల జరిగిన సంఘటనలతో కూడిన వినతిపత్రాన్ని భాజపా ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం.. ఎన్నికల సంఘానికి అందజేసింది. ఈ బృందంలో కేంద్ర మంత్రులు నిర్మల సీతారామన్, ముక్తార్ అబ్బాస్ నఖ్వీ, ఎస్.ఎస్. అహ్లూవాలియా, భాజపా సీనియర్ నాయకులు కైలాశ్ విజయ్‌వర్గీయ, భూపేందర్‌యాదవ్, అనిల్ బలూని, ముకుల్‌రాయ్ ఉన్నారు. ఎన్నికల సంఘాన్ని కలసిన అనంతరం సీతారామన్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో ఇతర పార్టీ కార్యక్రమాలు జరగకుండా రాష్ట్రప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. సభలకు అనుమతి ఇవ్వడం లేదని ఆరోపించారు.

● ఆతిథ్య రోబో



ఈ రోబోల పేర్లు సోఫీ, జేవియర్. హోటళ్లలో అతిథులు కోరిన ఆహారం, వస్తువులను చకాచకా అందించడం వీటి ప్రత్యేకత. ఎవరి సాయం లేకుండానే ఇవి లిఫ్టుల్లో ప్రయాణించగలవు. రిమోట్ సాయంతో వీటిని నియంత్రించే వీలుంది. టెక్‌మెటిక్స్ సంస్థ తయారు చేసిన ఈ రోబోలు సింగపూర్‌లోని సోఫిటెల్ సెంటర్‌లో సందడి చేస్తున్నాయి.

కేంద్రానికి ఆ అధికారం లేదు

- అయోధ్యలో భూసేకరణపై సుప్రీంలో పిటిషన్ దాఖలు

దిల్లీ: అయోధ్యలో రామజన్మభూమి, బాబ్రీమసీదు వివాదాస్పద స్థలం సమీపంలోని భూమిని సేకరించేందుకు 1993లో కేంద్రం చేసిన చట్టాన్ని సవాలు చేస్తూ సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. రాష్ట్రానికి చెందిన స్థలాన్ని సేకరించేందుకు పార్లమెంటుకు చట్టపరమైన అధికారం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. లఖ్‌నవూకు చెందిన ఇద్దరు న్యాయవాదులు సహా రాంలల్లా భక్తులుగా చెప్పుకొన్న ఏడుగురు వ్యక్తులు ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. రాష్ట్ర పరిధిలోని మతపరమైన వ్యవహారాల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను రూపొందించే సంపూర్ణ అధికారం రాష్ట్ర శాసనసభకే ఉందని పేర్కొన్నారు. 67.703 ఎకరాల భూమి పరిధిలో పూజలు, దర్శనాలు వంటివి జరిపే విషయంలో జోక్యం చేసుకోకుండా యూపీ, కేంద్రప్రభుత్వాలను నిరోధిస్తూ ఆదేశాలివ్వాలని, కేంద్ర చట్టాన్ని కొట్టేయాలని న్యాయస్థానాన్ని కోరారు. వివాదాస్పద స్థలం చుట్టూ ఉన్న సేకరించిన 67 ఎకరాల భూమిని ఆయా యజమానులకు వెనక్కి ఇచ్చేయాలంటూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపిన నేపథ్యంలో ఈ పిటిషన్ దాఖలైంది.

ప్రభుత్వ యంత్రాంగం కుళ్లిపోయింది

రాజస్థాన్‌లో మొత్తం ప్రభుత్వ యంత్రాంగం కుళ్లిపోయిందని సుప్రీంకోర్టు మండిపడింది. ఆరావళి ప్రాంతంలో అక్రమ గనుల తవ్వకందారులతో అధికారులు చేతులు కలిపారని పేర్కొంది. ఆ ప్రాంతంలో వృక్ష, జంతుజాలాన్ని నాశనం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. గనుల అక్రమ తవ్వకాలకు సంబంధించి ఆధారాల నిర్ధరణ ప్రక్రియ పనులు 31 శాతం పూర్తయినట్లు రాజస్థాన్ తరఫు న్యాయవాది ధర్మాసనానికి వెల్లడించారు. ఇటీవలి అసెంబ్లీ, వచ్చే లోక్‌సభ ఎన్నికల కారణంగా పనులు పూర్తిచేయలేదని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం తీవ్రస్థాయిలో మండిపడింది. ఇలాంటి వైఖరితో న్యాయస్థానానికి రావద్దని పేర్కొంది. ఎన్నికలు ఉంటే అక్రమ తవ్వకాలు కొనసాగాలా అని ప్రశ్నించింది. దీనిపై వివరణ ఇచ్చేందుకు ఫిబ్రవరి 8న హాజరవ్వాలంటూ జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ దీపక్‌గుప్తాలతో కూడిన ధర్మాసనం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.

'లోక్‌పాల్'పై భాజపా నేతలకు విముఖత: హజారే

రాలేగాణ్ సిద్ధి/ ముంబయి: అధికారంలోకి వచ్చిన తర్వాత భాజపా నేతలకు తన లోక్‌పాల్ డిమాండ్ పట్ల తీవ్ర అయిష్టత పెరిగిపోయిందని సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే అన్నారు. లోక్‌పాల్, లోకాయుక్తల ఏర్పాటుకు డిమాండ్ చేస్తూ ఆయన నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. గతంలో రామ్‌లీలా మైదానంలో ఉద్యమం చేపట్టినప్పుడు యావత్తు దేశం తన వెంట ఉందని.. అలాంటి పరిస్థితులతోనే భాజపా అధికారంలోకి వచ్చిందని అన్నా హజారే అన్నారు. తన డిమాండ్లలో చాలామేర నెరవేర్చినట్లు మహారాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలను ఆయన తోసిపుచ్చారు. హజారే 6 రోజులుగా 4.25 కేజీల బరువు తగ్గినట్లు వైద్యులు తెలిపారు. సోమవారం కేంద్రం తరఫున మంత్రి సుభాష్ భామ్రే రాలేగాణ్ సిద్ధికి వెళ్లి చర్చలు జరిపారు. నిరాహార దీక్షను విరమించాల్సిందిగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ విజ్ఞప్తి చేశారు. లోకాయుక్త, సంయుక్త కమిటీ ఏర్పాటు డిమాండ్లకు తమ ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిపారు.

చిన్నారిపై అత్యాచారం..

ఉపాధ్యాయుడికి ఉరి

- మార్చి 2న శిక్ష అమలు

జబల్‌పుర్: నాలుగేళ్ల చిన్నారిపై అత్యంత దారుణ అత్యాచారానికి పాల్పడి, ఆపై ఆమెను అటవీ ప్రాంతంలో వదిలేసిన పాఠశాల ఉపాధ్యాయునికి మధ్యప్రదేశ్ హైకోర్టు మరణదండన ఖరారు చేసింది. ఈ క్రమంలో వచ్చేనెల 2న శిక్షను అమలు చేయాలని జబల్‌పుర్ కేంద్ర కారాగారానికి సెషన్స్ న్యాయస్థానం సోమవారం ఆదేశాలు పంపింది. గతేడాది జూన్ 30న నాలుగేళ్ల చిన్నారిని మహేంద్రసింగ్ గోండ్ అనే పాఠశాల ఉపాధ్యాయుడు అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి, ఆమెపై దారుణంగా అత్యాచారం చేశాడు. బాలిక స్పృహ కోల్పోయి అచేతనంగా మారడంతో, చనిపోయిందని భావించి ఆమెను అక్కడే వదిలేసి వెళ్లిపోయాడు. కుమార్తె ఎంతకూ ఇల్లు చేరలేదని తల్లిదండ్రులు వెతకగా ఎట్టకేలకు చిన్నారి జాడ కనిపించింది. వెంటనే ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన తీవ్ర సంచలనం కావడంతో పోలీసులు వెంటనే నిందితుడిని పట్టుకున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకుని హెలికాప్టర్‌లో బాలికను దిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించింది. దారుణ అకృత్యానికి ఆమె పేగులు బాగా దెబ్బతినడంతో నెలల తరబడి ఆ చిన్నారి నరక యాతన అనుభవించింది. పలు శస్త్రచికిత్సలు చేస్తేగాని సాధారణ స్థితికి రాలేకపోయింది. ఈ ఘటనపై విచారణ చేపట్టిన నాగోద్ సెషన్స్ కోర్టు గత సెప్టెంబరులో నిందితుడికి మరణదండన విధించింది. హైకోర్టు కూడా గతనెల 25న ఈ శిక్షను ఖరారు చేసింది. ఈ క్రమంలో శాంతా జిల్లా సెషన్స్ కోర్టు గోండ్‌కు వ్యతిరేకంగా బ్లాక్ వారెంట్ జారీచేసింది. అతడిని వచ్చేనెల 2న ఉరి తీయాలంటూ జబల్‌పుర్ కేంద్ర కారాగారాన్ని ఆదేశిస్తూ ఈ-మెయిల్ పంపింది. సుప్రీంకోర్టు లేదా రాష్ట్రపతి నుంచి నిలుపుదల ఉత్తర్వులు రాకపోతే శిక్ష యథాతథంగా అమలవుతుంది. అదే జరిగితే- చిన్నారులపై అత్యాచార నిరోధానికి తీసుకొచ్చిన కొత్తచట్టం కింద అమలుచేసే తొలి మరణశిక్ష ఇదే కానుంది!

ఛాంపియన్



ఎట్టకేలకు ఓ సిరీస్

- రెండో టెస్టూ ఆస్ట్రేలియాదే
- లంకపై 2-0తో సిరీస్ కైవసం

కాన్‌బెరా: గత ఏడాది బాల్ టాంపరింగ్ ఉదంతం తర్వాత ఆస్ట్రేలియాకు అన్నీ పరాజయాలే. వరుసగా నాలుగు టెస్టు సిరీస్‌లు ఓడింది. తాజాగా భారత్ చేతిలో సొంతగడ్డపై పరాభవం చవిచూసిన ఆ జట్టు.. ఎట్టకేలకు ఓ టెస్టు సిరీస్ గెలిచింది. రెండు టెస్టుల సిరీస్‌లో బలహీన శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించిన ఆ జట్టు.. సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. సోమవారం ముగిసిన రెండో టెస్టులో ఆసీస్ 365 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. 516 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లంక.. రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 149 పరుగులకే కుప్పకూలింది. స్టార్క్ (5/46) రెండో ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లతో లంక పతనాన్ని శాసించాడు. అతడికి కమిన్స్ (3/15) కూడా తోడవడంతో ప్రత్యర్థి బ్యాట్స్‌మెన్ విలవిలలాడారు. తొలి ఇన్నింగ్స్‌ను ఆస్ట్రేలియా 534/5 వద్ద డిక్లేర్ చేయగా.. లంక 215 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌ను ఆసీస్ 196/3 వద్ద డిక్లేర్ చేసింది. స్టార్క్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా, కమిన్స్ 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా ఎంపికయ్యారు.



హోల్డర్‌కు అంత కఠిన శిక్షా?

దుబాయ్: వెస్టిండీస్ క్రికెట్ జట్టు కెప్టెన్ జేసన్ హోల్డర్‌పై ఐసీసీ కొరడా ఝుళిపించింది. అతడిపై ఒక టెస్టు మ్యాచ్ నిషేధం విధించింది. ఇంగ్లాండ్‌తో రెండో టెస్టులో వెస్టిండీస్ బౌలర్ల స్లో ఓవర్ రేటే ఇందుకు కారణం. గత ఏడాది జూన్‌లో శ్రీలంకతో టెస్టు మ్యాచ్‌లోనూ హోల్డర్ నాయకత్వంలోని విండీస్ జట్టు నెమ్మదిగా బౌలింగ్ చేసింది. దీంతో హోల్డర్‌ను ఐసీసీ రిఫరీ జెఫ్ క్రో అతడిపై ఒక టెస్టు మ్యాచ్ నిషేధం విధించాడు. ఐతే హోల్డర్ విషయంలో ఐసీసీ మరీ కఠినంగా వ్యవహరించిందంటూ మాజీలు విమర్శలు గుప్పించారు. ఇంగ్లాండ్ ఘోర పరాజయం పాలైన ఈ మ్యాచ్ మూడు రోజులే సాగిందని.. విండీస్ నలుగురు ఫాస్ట్‌బౌలర్లతో బౌలింగ్ చేయించిన విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని ఉండాల్సిందని స్పిన్ దిగ్గజ షేన్ వార్న్ అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్ మాజీ ఆటగాళ్లు అథర్టన్, మైకేల్ వాన్ సైతం ఐసీసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. ఇంగ్లాండ్‌పై వరుసగా రెండు టెస్టుల్లో ఘనవిజయం సాధించిన విండీస్.. మూడో టెస్టు ఫలితంతో సంబంధం లేకుండా ట్రోఫీని అందుకోబోతున్న సమయంలో హోల్డర్‌ను దూరం పెట్టడం అన్యాయమని వీరు అభిప్రాయపడ్డారు.



81 ఏళ్ల కింద ఫాగ్.. ఇప్పుడు పెరీరా

ఒకే ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో రెండు డబుల్ సెంచరీలు

కొలంబో: క్రికెట్ చరిత్రలో ఒకే ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో రెండు డబుల్ సెంచరీలు సాధించిన రెండో క్రికెటర్‌గా శ్రీలంకకు చెందిన ఏంజెలో పెరీరా రికార్డు సృష్టించాడు. మొదటిసారి 81 ఏళ్ల కింద ఈ రికార్డు నమోదైంది. తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 231 పరుగుల చేసిన పెరీరా అత్యంత అరుదైన ఈ డబుల్ డబుల్ ఘనత సాధించాడు. 1938లో కెంట్ (ఇంగ్లాండ్) బ్యాట్స్‌మన్ ఆర్థర్ ఫాగ్.. ఎసెక్స్‌తో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లో రెండు ద్విశతకాలు చేశాడు. అతడు తొలి ఇన్నింగ్స్‌లో 244, రెండో ఇన్నింగ్స్‌లో అజేయంగా 202 పరుగులు సాధించాడు. తాజాగా పెరీరా శ్రీలంక దేశావాళీ క్రికెట్లో డబుల్ మోత మోగించాడు. నాందేస్క్రిప్ట్స్ క్రికెట్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహించిన అతడు ఐదో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. సింహాళీస్ స్పోర్ట్స్ క్లబ్‌పై ఈ డబుల్ మోత మోగించాడు. 28 ఏళ్ల పెరీరా.. శ్రీలంక తరఫున నాలుగు వన్డేలు, రెండు టీ20 మ్యాచ్‌లు ఆడాడు.

ఆ నిర్ణయం.. కావాలనే!



వెల్లింగ్టన్

న్యూజిలాండ్‌తో ఆఖరి వన్డేలో పేసర్లకు అనుకూలించే పిచ్‌పై భారత తాత్కాలిక కెప్టెన్ రోహిత్ శర్మ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఐతే నాలుగో వన్డేలో 92కే కుప్పకూలిన నేపథ్యంలో మరోసారి తమను తాము పరీక్షించుకోవాలనే ఉద్దేశంతో బ్యాటింగ్ ఎంచుకున్నట్లు రోహిత్ చెప్పాడు. "టాస్‌కు ముందు పిచ్‌ను పరిశీలించా. ఆరంభంలో బౌలర్లకు అనుకూలిస్తుందని నాకు తెలుసు. కానీ మమ్మల్ని మేం పరీక్షించుకోవాలనుకున్నాం. ఎందుకంటే ప్రపంచకప్‌లో మాకు ఇలాంటి పరిస్థితులే ఎదురుకావొచ్చు. మేం త్వరత్వరగా నాలుగు వికెట్లు చేజార్చుకున్న మాట నిజమే. పరిస్థితులు కఠినంగా ఉన్నప్పుడు, బంతి స్వింగవుతున్నప్పుడు ఎలా బ్యాటింగ్ చేయాలో నేర్చుకున్నాం. మాకిప్పుడు అలాంటి స్థితిలో ఏం చేయాలో తెలుసు. మొదటి 30 ఓవర్లలో రన్‌రేట్ గొప్పగా లేదు. అయినా మేం 250 దాటాం. అది పెద్ద సానుకూలాంశం" అని ఐదో వన్డేలో విజయం అనంతరం రోహిత్ వ్యాఖ్యానించాడు.

అది గొప్ప ఘనత

న్యూజిలాండ్‌లో వన్డే సిరీస్‌ను 4-1తో గెలవడం గొప్ప విషయమని రోహిత్ అన్నాడు. "న్యూజిలాండ్ మంచి క్రికెట్ ఆడింది. కిందటిసారి మేం 0-4తో సిరీస్ కోల్పోయాం. అందుకే ఈసారి మంచి క్రికెట్ ఆడాలనుకున్నాం. న్యూజిలాండ్ జట్టు సమతూకంగా ఉంది. ఆ జట్టుకు లోతైన బ్యాటింగ్‌తో పాటు నాణ్యమైన బౌలింగ్ లైనప్ ఉంది. కాబట్టి 4-1తో సిరీస్ గెలవడం మాకు గొప్ప ఘనతే" అని చెప్పాడు.

టాప్-5లోకి చాహల్

- అగ్రస్థానాల్లో కోహ్లి, బుమ్రా
- ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్

ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ టాప్-5లో చోటు సంపాదించాడు. అతడు ఓ స్థానం మెరుగుపర్చుకుని ఐదో స్థానం సాధించాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో అతడు 5.34 ఎకానమీ రేట్‌తో 9 వికెట్లు పడగొట్టాడు. టాప్-5లో ముగ్గురు భారతీయులే కావడం విశేషం. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లతో సిరీస్‌లకు విశ్రాంతి తీసుకున్నప్పటికీ బుమ్రా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కుల్‌దీప్ యాదవ్ మూడు నుంచి నాలుగో స్థానానికి పడిపోయాడు. భారత్‌తో సిరీస్‌లో 12 వికెట్లు పడగొట్టిన న్యూజిలాండ్ ఫాస్ట్‌బౌలర్ బౌల్ట్ ఏడు స్థానాలు మెరుగుపర్చుకుని మూడో స్థానంలో నిలిచాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ తొలి రెండు స్థానాలను నిలబెట్టుకున్నారు. శిఖర్ ధావన్ పదో స్థానంలో ఉన్నాడు. ధోని మూడు స్థానాలు ఎగబాకి 17వ ర్యాంకు సాధించాడు. జట్టు ర్యాంకింగ్స్‌లో భారత్ రెండో స్థానంలో కొనసాగుతోంది. ఇంగ్లాండ్ అగ్రస్థానంలో ఉంది. న్యూజిలాండ్ ఓ స్థానం కోల్పోయి నాలుగో స్థానానికి చేరుకుంది.



ధోని ఎందుకలా పారిపోయాడు?

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో ఐదో వన్డేలో విజయంతో టీమ్‌ఇండియా సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకున్న అనంతరం బహుమతి ప్రదానోత్సవం పూర్తయింది. ఆటగాళ్లు ఉత్సాహంగా వ్యాఖ్యాతలతో సంభాషిస్తున్నారు. విజయ్ శంకర్, హార్దిక్ పాండ్య, కేదార్ జాదవ్ కలిసి ట్రోఫీతో ఫొటోలకు పోజులిస్తున్నారు. ఇంతలో వీరి పక్క నుంచి మహేంద్రసింగ్ ధోని వేగంగా పరుగులు పెడుతున్నాడు. వెనుకనే చాహల్ అతడిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ధోని వేగం గురించి చెప్పేదేముంది? చాహల్‌కు చిక్కకుండా డ్రెస్సింగ్ రూం వైపు వెళ్లిపోయాడు. ఈ వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ధోని అలా ఎందుకు పరుగెత్తాడన్నది నెటిజన్లకు అర్థం కాలేదు. విషయం ఏంటంటే.. చాహల్ ఆన్‌లైన్‌లో అభిమానులతో వీడియో చాట్ చేస్తూ.. ధోనీని అందులో భాగస్వామిని చేయాలని చూశాడట. కానీ ధోని అందుకు ఒప్పుకోకుండా, తన వెంట పడుతున్న చాహల్‌ను తప్పించుకుని పారిపోయాడని జట్టు వర్గాల సమాచారం.



స్మిత్, వార్నర్ వస్తే..

కాన్‌బెర్రా: బాల్ టాంపరింగ్ ఉదంతంలో దోషులుగా తేలి ఏడాది నిషేధానికి గురైన స్టీవెన్ స్మిత్, డేవిడ్ వార్నర్ త్వరలోనే పునరాగమనం చేయనుండటం తమ జట్టు రాత మారుస్తుందని ఆస్ట్రేలియా టెస్టు జట్టు కెప్టెన్ టిమ్ పైన్ ఆశాభావం వ్యక్తం చేశాడు. గత ఏడాది మార్చిలో స్మిత్, వార్నర్ నిషేధానికి గురయ్యాక ఆస్ట్రేలియా జట్టు ప్రదర్శన అమాంతం పడిపోయింది. తాజాగా శ్రీలంకపై ఆసీస్ టెస్టు సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసినప్పటికీ.. ప్రత్యర్థి బలహీనంగా ఉండటంతో ఈ విజయానికి విలువ లేకపోయింది. ఐతే స్మిత్, వార్నర్ వస్తే తమ ప్రదర్శన వేరుగా ఉంటుందని పైన్ చెప్పాడు. "వాళ్లెంత మెరుగైన ఆటగాళ్లో అందరికీ తెలుసు. రాబోయే యాషెస్ సిరీస్ విజయంలో వాళ్లిద్దరి పాత్ర కీలకం అవుతుంది. స్మిత్, వార్నర్‌లపై నిషేధం తొలగిపోగానే.. వారికి ఘన స్వాగతం పలుకుతాం. ఎప్పట్లాగే వారు మాకు టెస్టు విజయాలందిస్తారు" అని అతనన్నాడు.

గోపీ నుంచి ఇంకో అకాడమీ

ఈనాడు, హైదరాబాద్: తన పేరిట భాగ్యనగరంలో అకాడమీ పెట్టి భారత బ్యాడ్మింటన్ ముఖచిత్రాన్నే మార్చేసిన పుల్లెల గోపీచంద్.. ఇంకో అడుగు ముందుకేయనున్నాడు. గచ్చిబౌలిలో ప్రస్తుతం గోపీచంద్ అకాడమీ ఉన్న ప్రాంగణంలోనే ఇంకో అకాడమీ ఏర్పాటు చేస్తున్నాడు. కోటక్ మహీంద్రా సంస్థ భాగస్వామ్యంతో రూ.35 కోట్ల ఖర్చుతో నిర్మితమవనున్న ఈ ఎయిర్ కండిషన్డ్ అకాడమీలో ఆరు కోర్టులుంటాయట. ఇందులోనే కోచ్‌ల తయారీ, స్పోర్ట్స్ సైన్స్ విభాగాలు కూడా ఏర్పాటు చేయనున్నారు.

గప్తిల్ టీ20లకూ..



వెలింగ్టన్: వెన్ను గాయం కారణంగా భారత్‌తో వన్డే సిరీస్ నుంచి అర్ధంతరంగా తప్పుకున్న న్యూజిలాండ్ ఓపెనర్ మార్టిన్ గప్తిల్.. టీ20 సిరీస్‌కూ దూరమయ్యాడు. గప్తిల్ ఇంకా కోలుకోకపోవడంతో అతడి స్థానంలో ఆల్‌రౌండర్ జిమ్మీ నీషమ్‌ను న్యూజిలాండ్ జట్టులోకి తీసుకున్నారు. భారత్‌తో తొలి మూడు వన్డేల్లో పేలవ ప్రదర్శన చేసిన గప్తిల్.. గాయంతో చివరి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అతడి స్థానంలో రెండు మ్యాచ్‌లూ ఆడిన నీషమ్ పర్వాలేదనిపించడంతో టీ20ల్లోనూ అవకాశం దక్కించుకున్నాడు. మూడు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్ బుధవారం వెలింగ్టన్‌లో జరుగుతుంది.

విదర్భ పైచేయి

సౌరాష్ట్రతో రంజీ ఫైనల్



సర్వాతె (3/55)

నాగ్‌పుర్

విదర్భ, సౌరాష్ట్ర మధ్య రంజీ ఫైనల్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి రోజు వెనుకంజలో నిలిచిన డిఫెండింగ్ ఛాంపియన్ విదర్భ.. ఆదిత్య సర్వాతె, అక్షయ్ కర్నెవార్ రాణించడంతో రెండో రోజు పైచేయి సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 200/7తో సోమవారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ మెరుగైన స్కోరు సాధించింది. కర్నెవార్ (73 నాటౌట్; 160 బంతుల్లో 8×4, 2×6) పోరాటంతో 312 పరుగులు చేసింది. పట్టుదలగా నిలిచిన కర్నెవార్ (ఓవర్‌నైట్ స్కోరు 31).. లోయర్ ఆర్డర్‌తో కలిసి జట్టుకు విలువైన పరుగులు అందించాడు. అతడు.. అక్షయ్ వాఖరే (34)తో ఎనిమిదో వికెట్‌కు 78, ఉమేశ్ యాదవ్‌తో 9వ వికెట్‌కు 25 పరుగులు జోడించాడు. ఉనద్కత్ మూడు వికెట్లు పడగొట్టగా.. సకారియా, మక్వానా చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన సౌరాష్ట్ర తడబడింది. విదర్భ స్పిన్నర్లు సర్వాతె (3/55), అక్షయ్ వాఖరె (2/42) విజృంభించడంతో ఆట ముగిసే సమయానికి సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. మరోవైపు నుంచి వికెట్లు పోతున్నా.. ఓపెనర్ స్నెల్ పటేల్ (87 బ్యాటింగ్; 160 బంతుల్లో 14×4) పోరాడాడు. అతడితో పాటు ప్రేరక్ మన్కడ్ (16) క్రీజులో ఉన్నాడు. చెతేశ్వర్ పుజారా (1) విఫలమయ్యాడు. సర్వాతె బౌలింగ్‌లో అతడు ఔటయ్యాడు. సౌరాష్ట్ర ఇంకా 154 పరుగులు వెనుకబడి ఉంది.

విదర్భ తొలి ఇన్నింగ్స్: 312 (కర్నెవార్ 73 నాటౌట్, వాద్కర్ 45, కలే 35, వాఖరె 34, సతీష్ 32, జాఫర్ 23; ఉనద్కత్ 3/54, సకారియా 2/44, మక్వానా 2/58)

సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్: 158/5 (స్నెల్ పటేల్ 87 బ్యాటింగ్, విశ్వరాజ్ జడేజా 18, ప్రేరక్ మన్కడ్ 16 బ్యాటింగ్; సర్వాతె 3/55, వాఖరె 2/42)

అదిగో నంబర్‌వన్!

ప్రపంచకప్ ముంగిట టీమ్‌ఇండియాను ఊరిస్తున్న అగ్రస్థానం

దుబాయ్

ఇప్పుడు ప్రపంచ క్రికెట్లో టీమ్‌ఇండియా ఉన్న ఊపులో మరే జట్టూ లేదు. ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపై టెస్టు, వన్డే సిరీస్‌ల్లో ఓడించి.. ఆపై న్యూజిలాండ్‌పై వారి దేశంలో వన్డే సిరీస్ గెలిచి శభాష్ అనిపించుకుంది భారత జట్టు. ఇంకో నాలుగు నెలల్లోపే ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ ఆరంభం కాబోతుండగా.. ఇప్పుడు కోహ్లీ సేన ఇలాంటి ఊపులో కొనసాగుతుండటం అభిమానులకు ఉత్సాహాన్నిస్తోంది. ఈ మెగా టోర్నీకి ముందు జట్టులో ఉన్న చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం అవుతున్నాయి. జట్టు దుర్భేద్యంగా మారుతోంది. ఇదిలా ఉంటే.. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంతో టీమ్‌ఇండియా ప్రపంచకప్‌కు వెళ్లడానికి మంచి అవకాశం కనిపిస్తోంది. టెస్టుల్లో దాదాపు రెండేళ్లుగా అగ్రస్థానంలో కొనసాగుతున్న భారత్.. వన్డేల్లోనూ నంబర్‌వన్ అయింది కానీ, దాన్ని నిలబెట్టుకోలేకపోయింది. ఇప్పుడు రెండో స్థానంలో కొనసాగుతోంది. ప్రస్తుతం అగ్రస్థానంలో ఉన్న ఇంగ్లాండ్ ఖాతాలో 126 ర్యాంకింగ్ పాయింట్లుండగా.. భారత్ నాలుగు పాయింట్లు మాత్రమే తక్కువ ఉంది. టీమ్‌ఇండియా ప్రపంచకప్‌కు ముందు ఆడబోయే వన్డే సిరీస్ ఒక్కటే. త్వరలోనే ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కంటే ముందే భారత్ నంబర్‌వన్ కావడానికి అవకాశముంది. అందుకు వెస్టిండీస్ మంచి ప్రదర్శన చేయాలి. ఇప్పటికే ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్ గెలిచి ఊపుమీదున్న కరీబియన్ జట్టు.. దీని తర్వాత జరిగే వన్డే సిరీస్‌లోనూ విజయం సాధించాలి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-2తో గెలిచినా చాలు.. భారత్ నంబర్‌వన్ అవుతుంది. అప్పుడు టీమ్‌ఇండియా పాయింట్లు 122గానే ఉంటాయి కానీ.. ఇంగ్లాండ్ పాయింట్లు 121కి పడిపోతాయి. ఒకవేళ ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్ గెలిస్తే.. భారత్ కంగారూలతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయాల్సి ఉంటుంది. కాబట్టి టీమ్‌ఇండియా నంబర్‌వన్ అయ్యే అవకాశాన్ని కొట్టిపారేయలేం. భీకర ఫామ్‌లో ఉన్న భారత్.. నంబర్‌వన్‌గా ప్రపంచకప్‌లో అడుగుపెడితే అంచనాలు మరింత పెరుగుతాయనడంలో సందేహం లేదు.

రాయుడిని చూస్తే.. కపిల్ గుర్తొచ్చాడు

మొహిందర్ అమర్‌నాథ్

సమవుజ్జీ అయిన న్యూజిలాండ్‌పై వన్డే సిరీస్‌లో టీమ్‌ఇండియా అద్భుత విజయం సాధించింది. ఈ పర్యటన భారత జట్టుకు మంచి అనుభవం. న్యూజిలాండ్‌ను వారి సొంత గడ్డపై 4-1తో ఓడించడం చిన్న విషయం కాదు. ప్రపంచ అత్యుత్తమ జట్లలో అదొకటి. ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో కివీస్ ప్రాణం పెట్టి ఆడుతుంది. టోర్నీకి ముందు కివీస్‌ను అలవోకగా ఓడించడం టీమ్‌ఇండియా ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచుతుంది. చివరి రెండు వన్డేల్లో పరిస్థితులు ఇరు జట్లకూ కష్టంగానే కనిపించాయి. ఉదయం బ్యాటింగ్ చేయడం కష్టమైంది. ఐతే నాలుగో వన్డేలో ఓటమి తర్వాత భారత కుర్రాళ్లు పుంజుకున్న తీరు అమోఘం. ఆరంభంలోనే 4 వికెట్లు పడ్డా.. అంబటి రాయుడు గొప్ప ఇన్నింగ్స్ ఆడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. విజయ్ శంకర్, కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్య కూడా విలువైన పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో రాయుడి ఇన్నింగ్స్ చూస్తే 1983 ప్రపంచకప్‌లో జింబాబ్వేతో మ్యాచ్ గుర్తుకొచ్చింది. ఈ మ్యాచ్‌లోనూ భారత్ ఇలాంటి స్థితిలోనే ఉంటే కపిల్ దేవ్ 175 పరుగుల ఇన్నింగ్స్‌తో జట్టుకు 31 పరుగుల విజయాన్నందించాడు. ఇక మూడు టీ20ల సిరీస్ ఆరంభం కాబోతోంది. ఈ ఫార్మాట్లో మ్యాచ్ రోజు ఎవరు మెరుగ్గా ఉంటారన్నదే కీలకం. ఫేవరెట్ అంటూ ఎవరూ లేరు. వన్డేల్లో చాలా ఓవర్లుంటాయి కాబట్టి అప్పటికప్పుడు ప్రణాళికలు రచించవచ్చు. కానీ టీ20ల్లో ఆ అవకాశముండదు. ఈ ఫార్మాట్లో భారత ఆటగాళ్లకు మంచి అనుభవం ఉండటం కలిసొస్తుంది. ఐతే టీ20ల్లో కివీస్ కూడా సమవుజ్జీలా కనిపిస్తోంది కాబట్టి సిరీస్ హోరాహోరీగా సాగొచ్చు. ఒక మెరుపు ప్రదర్శనతో మ్యాచ్ ఫలితాన్ని మార్చే ఆటగాళ్లే సిరీస్‌లో కీలకం.

సగం వీవీప్యాట్‌లను లెక్కించాలి

- కేంద్ర ఎన్నికల సంఘానికి 23 రాజకీయ పార్టీల డిమాండ్

ఈనాడు – దిల్లీ

ప్రస్తుతం దేశంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియపై సామాన్యుడికి అనుమానాలున్నందున వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తప్పనిసరిగా 50% మేర ఓటు రసీదు యంత్రాలను (వీవీప్యాట్‌లను) లెక్కించి, వాటిని ఈవీఎంలలో నమోదైన ఓట్లతో సరిపోల్చేలా నిబంధనలు తీసుకురావాలని 23 రాజకీయ పార్టీలు కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశాయి. ఇలా లెక్కించినప్పుడు గెలుపు-ఓటముల మధ్య ఓట్ల తేడా 5%లోపు ఉంటే మొత్తం అన్ని వీవీప్యాట్‌లను లెక్కించేలా చూడాలని కోరాయి. వీవీప్యాట్, ఈవీఎంల మధ్య తేడా ఉంటే వీవీప్యాట్ ఓట్లనే అంతిమంగా పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్‌పవార్, రాజ్యసభలో ప్రధాన ప్రతిపక్షనేత గులాంనబీ ఆజాద్, జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎస్పీ, బీఎస్పీ ఎంపీలు రాంగోపాల్‌యాదవ్, సతీష్ చంద్ర మిశ్రల నేతృత్వంలో 23 పార్టీల నేతలు సోమవారం సాయంత్రం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోడా, కమిషనర్ అశోక్ లవాసాలను కలిసి సార్వత్రిక ఎన్నికల్లో చేయాల్సిన మార్పుల గురించి 5 పేజీల వినతిపత్రం సమర్పించారు.

విశ్వసనీయతపై అపనమ్మకం కలుగుతోంది

'ప్రతి పౌరుడి అభిప్రాయానికి సమాన విలువ ఇవ్వాలని రాజ్యాంగ నిర్మాతలు విస్పష్టంగా చెప్పారు. ప్రతి ఓటుకూ సమాన విలువ ఉంది. ప్రతిదాన్నీ తప్పనిసరిగా లెక్కించాల్సిందే. ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు స్వేచ్ఛాయుత ఎన్నికలపై తీవ్రమైన అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. ఈవీఎంలు అందుకు ప్రధాన కారణమవుతున్నాయి. మధ్యప్రదేశ్, తెలంగాణలాంటి చోట్ల ఈవీఎంలో లెక్కించిన ఓట్లకు... వీవీప్యాట్‌లలో లెక్కించిన ఓట్లకు మధ్య తేడా వచ్చింది. స్ట్రాంగ్ రూముల్లోకి ఎవరైనా చొరబడి ఈవీఎంలలో మార్పులు చేర్పులు చేసేంత దుర్బల పరిస్థితులు నెలకొన్నాయని కూడా వార్తలు వచ్చాయి. ఓ పార్టీకి ఓటువేసినా అవి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకే వెళ్లేలా ఈవీఎంలను ముందుగా ప్రోగ్రాం చేసిపెట్టారన్న వార్తలు సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున ప్రచారంలోకి వచ్చాయి. ఇలాంటి అనుమానాస్పద సంఘటనలు ఈవీఎంల విశ్వసనీయతతోపాటు, ఎన్నికల నిర్వహణ తీరుపై పూర్తి అపనమ్మకాన్ని కల్గిస్తున్నాయి. ప్రజల విధిరాతను తేల్చే ఎన్నికలను అనుమానాస్పద వాతావరణంలో చేపట్టకూడదు. 2019 ఎన్నికలను సాధారణ పేపర్ బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించడం మంచిది. వాస్తవానికి మేమంతా పేపర్ బ్యాలెట్ పునఃప్రవేశపెట్టాలన్న ఉద్దేశంతో ఉన్నాం. కానీ తక్కువ సమయంలో అది సాధ్యం కాదు కాబట్టి అన్ని ఈవీఎంలలో నమోదైన ఓటర్లను వీవీప్యాట్‌లతో సరిపోల్చి చూడాలి. అవసరమైన విధివిధానాలపై తక్షణం నిర్ణయం తీసుకోండి' అని డిమాండ్ చేశారు. సమావేశానంతరం చంద్రబాబునాయుడు విలేకర్లతో మాట్లాడుతూ- గతంలో ఎన్నోసార్లు తాము ఈవీఎంల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేశామని, తమ పోరాటంవల్లే వీవీప్యాట్‌లు వచ్చాయని పేర్కొన్నారు. 100% వీవీప్యాట్‌లు లెక్కించినా అదనంగా పడే ఆర్థిక భారమేమీ ఉండదని చెప్పారు. ఈసీ సానుకూల నిర్ణయం తీసుకుంటుందని నమ్ముతున్నామన్నారు. విపక్షాల వినతిపై ఈసీ స్పందిస్తూ- క్షేత్రస్థాయి సాధ్యాసాధ్యాల ఆధారంగా దీనిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది. ఈవీఎంల గురించి చెప్పిన అన్ని అంశాలను క్షుణ్నంగా పరిశీలిస్తామని పేర్కొంది.



శరద్ పవార్ నివాసంలో సోమవారం భేటీ అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్సీపీ అధినేత శరద్ పవార్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా, దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్

వినతిపత్రంపై సంతకం చేసింది వీరే

రాహుల్‌గాంధీ	కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు
శరద్‌పవార్	ఎన్సీపీ అధ్యక్షుడు
చంద్రబాబునాయుడు	తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు
డెరెక్ ఒబ్రెయిన్	తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ
శరద్ యాదవ్	ఎల్‌జేడీ అధ్యక్షుడు
రామ్‌గోపాల్ యాదవ్	ఎస్పీ
సతీష్‌చంద్రమిశ్ర	బీఎస్పీ
కనిమొళి	డీఎంకె
టీకే రంగరాజన్	సీపీఎం
మనోజ్ ఝా	ఆర్‌జేడీ
సంజయ్‌సింగ్	ఆప్
ఒమర్ అబ్దుల్లా	నేషనల్ కాన్ఫరెన్స్
డి.రాజా	సీపీఐ
డానిష్ అలీ	జేడీఎస్
ఎన్‌కే ప్రేమచంద్రన్	ఆర్‌ఎస్‌పీ
జితిన్‌రామ్ మాంఝీ	హెచ్ఏఎం
బద్రుద్దీన్ అజ్మల్	ఏఐయూడీఎఫ్
అశోక్‌కుమార్ సింగ్	జేవీఎం
కోదండరాం	టీజేఎస్
ఖొర్రుమ్ ఒమెర్	ఐయూఎంఎల్
కేజీకెన్యే	ఎన్‌పీఎఫ్
జయంత్ చౌదరి	ఆర్ఎల్‌డీ
మజీద్ మెమన్	ఎన్‌సీపీ

ఇది గదిలో కూర్చొని తీసుకొనే నిర్ణయం కాదు

వీవీప్యాట్‌లపై ఎన్నికల సంఘం నిర్ణయం నిర్ణయం తీసుకోవాలి తప్పితే సాంకేతిక కమిటీకి వదిలిపెట్టడం మంచిది కాదు. సాంకేతిక కమిటీ గదిలో కూర్చొని కేవలం సాంకేతికాంశాలను చూస్తుంది. క్షేత్ర స్థాయి విషయాలు రాజకీయ పార్టీలకు తెలుస్తాయి తప్పితే సాంకేతిక కమిటీలకు కాదు.

– గులాంనబీ ఆజాద్, కాంగ్రెస్

లెక్కిస్తేనే పారదర్శకత

వీవీప్యాట్‌లను కనీసం 50%మేర లెక్కించి వాటిని ఈవీఎంలలో నమోదైన ఓట్లతో పోల్చిచూడాలి. అప్పుడే ఎంతోకొంత పారదర్శకత సాధ్యమవుతుంది.

– రాంగోపాల్ యాదవ్, రాజ్యసభలో సమాజ్‌వాదీ పార్టీ నేత

– డి.రాజా, సీపీఐ ఎంపీ

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తప్పనిసరిగా లెక్కించాలి

వీవీప్యాట్‌లు కూడా లెక్కిస్తామని, అది ఎంత శాతం అన్నది చూసి ఒక హేతుబద్ధమైన శాతాన్ని మీకు చెబుతామని పేర్కొంటూ ఎన్నికల సంఘం దాఖలు చేసిన ప్రమాణ పత్రాన్ని పరిగణనలోకి తీసుకొని కేసు విచారణను సుప్రీంకోర్టు ముగించింది. అందువల్ల తప్పనిసరిగా వీవీప్యాట్‌లు లెక్కించాల్సిందేనని చెప్పాం. ఎక్కువ సమయం లేనందున కనీసం 50% వీవీప్యాట్‌లు లెక్కించి తీరాల్సిందేనని చెప్పాం.

– సతీష్‌చంద్ర మిశ్ర, బీఎస్పీ, ప్రధాన కార్యదర్శి

నిర్దేశిత లక్ష్యాలు సాధించాలి

పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్

ధాన్యం కొనుగోలు ప్రణాళికలపై అధికారులకు శిక్షణ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: నిర్ణీత కాలంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ సూచించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి వచ్చే ఏడాది, ముఖ్యంగా ధాన్యం కొనుగోలులో అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవడంపై అధికారులు, ఉద్యోగులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం (ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ)లో నిర్వహించిన శిక్షణ తరగతులను అకున్ సబర్వాల్ ప్రారంభించి మాట్లాడారు. పెరుగుతున్న ధాన్యం దిగుబడికి అనుగుణంగా కొనుగోలు ప్రణాళికలు రూపొందించుకొని, రైతులకు కనీస మద్దతు ధరలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సాగునీటి ప్రాజెక్టులు, రైతుబంధు, 24 గంటల విద్యుత్ సరఫరాతో సాగు విస్తీర్ణంతోపాటు, ఏటేటా ధాన్యం దిగుబడి పెరుగుతోందన్నారు. గతేడాది వానాకాలం, యాసంగి సీజన్లలో 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, ఈ ఏడాది వానాకాలంలోనే 40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి పౌరసరఫరాల శాఖ రికార్డు సృష్టించిందన్నారు. ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్, గోదాముల్లో బియ్యం నాణ్యత, గన్నీ సంచుల వినియోగం, బియ్యం రవాణా, పంపిణీ, ఇతర ఆర్థిక పరమైన అంశాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నిఘా, కొత్త సాంకేతిక పరిజ్ఞానం మొదలైన అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. కేంద్ర కార్యాలయ అధికారులు సహా జిల్లా స్థాయిలో పనిచేసే డీసీఎస్‌వోలు, ఏసీఎస్‌వోలు, జిల్లా మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

జీశాట్-31 ఉపగ్రహ ప్రయోగానికి సన్నద్ధం

నేడు నింగిలోకి..

15 ఏళ్ల పాటు నిరంతర సమాచార సేవ

ఈనాడు డిజిటల్, బెంగళూరు: భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇస్రో 40వ సమాచార ఉపగ్రహంగా తయారైన జీశాట్-31 బుధవారం నింగిలో ప్రవేశించనుంది. ఫ్రెంచ్ గయానాలోని అంతరిక్ష కేంద్రం కౌరో నుంచి ఏరియేన్-5 (వీఏ247) వాహక నౌక ద్వారా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు ఇస్రో అధికారులు సోమవారం బెంగళూరులో వెల్లడించారు. 15 ఏళ్ల పాటు నిరాటంకంగా సమాచార సేవలందించే సామర్థ్యమున్న ఈ ఉపగ్రహం బరువు 2,535 కిలోలు. అత్యంత సమర్థమంతమైన కేయూ బ్యాండ్ ప్రసార వ్యవస్థ ఉన్న ఈ ఉపగ్రహం ఇస్రో సంప్రదాయ ఉపగ్రహాలైన ఇన్‌శాట్, జీశాట్‌లకు ఆధునిక రూపమని నిపుణులు వివరించారు. భారతీయ భూభాగాలు, ద్వీపాలతో పాటు అరేబియా సముద్రం, బంగాళాఖాతం పరిసరాల సమాచారాన్ని ఇది అందిస్తుంది. ఈ ఉపగ్రహం వీశాట్ నెట్‌వర్క్స్, టెలివిజన్ అప్‌లింక్స్, డిజిటల్ శాటిలైట్, డీటీహెచ్ టెలివిజన్, సెల్యులార్ బ్యాకప్‌లకు అనుకూలమైన సాంకేతికత సొంతం చేసుకున్నట్లు ఇస్రో పేర్కొంది. ఇప్పటికే భూస్థిర కక్ష్యలో ఉన్న ఇతర సమాచార ఉపగ్రహాలతో చేరి ఇది అదనపు సేవలు అందిస్తుంది.

మోదీ హయాంలో రాజ్యాంగ సంస్థల విధ్వంసం

సీపీఐ తీవ్ర నిరసన

ఈనాడు, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో దేశంలోని అన్ని రాజ్యాంగ సంస్థలూ ధ్వంసమయ్యాయని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి తీవ్రంగా విమర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో సోమవారం ఏర్పాటైన రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన ప్రసంగించారు. సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, రిజర్వుబ్యాంకు వంటి సంస్థలను కేంద్రం రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని ఆరోపించారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మోదీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దె దించాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో ఇటీవలి వర్షాలకు రూ.2వేల కోట్ల విలువైన మిర్చి, కందులు, పత్తి దెబ్బతిన్నాయన్నారు. నష్టపరిహారం చెల్లించడం ద్వారా రైతాంగాన్ని ప్రభుత్వం ఇకనైనా ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్‌పాషా, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశ్, ఈర్ల నర్సింహ, పశ్య పద్మ పాల్గొన్నారు.

పౌరసత్వ చట్ట సవరణ బిల్లు వద్దు

కవాడిగూడ, న్యూస్‌టుడే: పౌరసత్వ చట్ట సవరణ బిల్లును ప్రభుత్వం ఇకనైనా ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ధర్నాచౌక్‌లో సోమవారం ఆందోళన సందర్భంగా మాట్లాడుతూ, ఇతర దేశాల నుంచి వచ్చిన హిందువులు భారత్‌లో స్థిరపడాలనుకుంటే పౌరసత్వం ఇవ్వాలన్న బిల్లు లోక్‌సభలో మునుపే ఆమోదం పొందిందన్నారు. రాజ్యసభలోనైనా తిరస్కరించాలని, అందుకే 'మతాల ఆధారంగా పౌరసత్వం' బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్రాల్లోనూ ఆందోళనలు సాగుతున్నాయని అన్నారు.

షర్మిలపై దుష్ప్రచారం కేసులో ముమ్మర దర్యాప్తు

ఈనాడు, హైదరాబాద్: సామాజిక మాధ్యమాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోదరి షర్మిలపై దుష్ప్రచారానికి సంబంధించి నమోదైన కేసులో.. సైబర్‌క్రైమ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టుచేసిన నిందితుల్ని తమ కస్టడీకి అప్పగించాలంటూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలుచేశారు. యూ ట్యూబ్‌లో ఆమెపై దుష్ప్రచారం సాగిన నేపథ్యంలో, గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పెద్దిశెట్టి వెంకటేశ్వర్లు, మంచిర్యాల ప్రాంత వాసి అద్దూరి నవీన్‌ను పోలీసులు అరెస్టుచేయడం విదితమే. ఇద్దరినీ తమ కస్టడీలోకి తీసుకొని మరిన్ని వివరాలు రాబట్టాలని సైబర్‌క్రైమ్ విభాగం భావిస్తోంది. అందుకే వారంరోజుల కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టును అభ్యర్థించింది.

వంచించి.. వజ్రాలు కొట్టేశాడు

- రూ.3 కోట్ల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- బంగారు దుకాణంలో పనిచేస్తున్న యువకుడి అరెస్ట్

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: పక్కాగా మోసం చేశాడు. . నకిలీ బిల్లులు సృష్టించాడు.. నగల దుకాణం యజమానిని నమ్మించాడు.. దాదాపు రూ.3 కోట్ల విలువైన 4 కిలోల బంగారు, వజ్రాభరణాలను వెనకేసుకున్నాడు. అనుమానం వచ్చిన యజమాని బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు ఈ వ్యవహారానికి దుకాణంలో పనిచేసే సేల్స్‌మేన్ సూత్రధారిగా గుర్తించి అరెస్టుచేశారు. పశ్చిమ మండల డీసీపీ ఏఆర్ శ్రీనివాసరావు, బంజారాహిల్స్ ఏసీపీ కేఎస్‌రావు, ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి, ఎస్సై శ్రీనివాస్‌తో కలిసి సోమవారం బంజారాహిల్స్ ఠాణాలోవిలేకరులకు వివరించారు.

నకిలీ బిల్లులతో మోసం

హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నం.12లో రైసన్ పేరుతో బంగారు, వజ్రాభరణాల దుకాణం ఉంది. మలక్‌పేటలోని ఆనంద్‌నగర్‌లో ఉంటున్న గోడావత్ వివేక్ (29) అలియాస్ వివేక్ జైన్ 4నెలల క్రితం ఈ దుకాణంలో సేల్స్‌మేన్‌గా చేరాడు. యజమాని వద్ద నమ్మకంగా వ్యవహరించాడు. వివిధ దుకాణాలకు పంపాల్సిన వజ్రాభరణాలకు సంబంధించి నకిలీ బిల్లులు సృష్టించాడు. ఆయా ఆభరణాలను దుకాణాలలో ఇవ్వకుండా దాచిపెట్టాడు. కిలో బంగారాన్ని మలక్‌పేటలోని మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్‌లో రూ.16 లక్షలకు తాకట్టుపెట్టాడు. 130 క్యారెట్ల వజ్రాలను వివేక్ తన తండ్రికి, మరో కిలో బంగారాన్ని సోదరుడు విజయేంద్ర జైన్‌కు ఇచ్చాడు. మరికొన్ని వజ్రాలను ఇంట్లో దాచాడు. గతంలో టూర్స్ అండ్ ట్రావెల్స్‌లో పనిచేసిన వివేక్ అక్కడ మోసానికి పాల్పడటంతో ఆ కేసులో నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో దుకాణ యజమాని అనూప్ కుమార్ అప్రమత్తమై దుకాణంలో 4 కిలోల బంగారు ఆభరణాలు మాయమైనట్లు గుర్తించారు. వివేక్‌పై బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు 1,538 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,468 గ్రాముల బంగారు బిస్కెట్లను, 20 క్యారెట్ల వజ్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3 కోట్లు ఉంటుందని డీసీపీ స్పష్టం చేశారు. వివేక్‌పై 5 కేసులున్నాయని డీసీపీ తెలిపారు. వివేక్ సోదరుడు పరారీలో ఉన్నాడన్నారు.



పట్టుబడిన బంగారు ఆభరణాలు. అంతర చిత్రంలో నిందితుడు గోడావత్ వివేక్

మమతకు మిత్రపక్షాల సంఘీభావం

- మోదీ సర్కారు సీబీఐని ఉసిగొల్పుతోందంటూ ధ్వజం
- బడ్జెట్ తర్వాత కోల్‌కతాకు వెళ్లి సంఘీభావం ప్రకటిస్తానన్న చంద్రబాబు
- శరద్‌పవార్ నివాసంలో సమావేశమైన పలు పార్టీల నేతలు

ఈనాడు, దిల్లీ: ఎన్నికలకు నెల రోజుల ముందు సీబీఐని ఉసిగొల్పడం ద్వారా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని భయాందోళనలకు గురిచేసేందుకు మోదీ సర్కారు కుట్ర పన్నిందని ఎన్డీయేయేతర పక్షాల నేతలు ధ్వజమెత్తారు. సోమవారం శరద్‌పవార్ నివాసంలో ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కేజ్రీవాల్, జమ్ము-కశ్మీర్ మాజీ సీఎం ఫరూఖ్ అబ్దుల్లా, సీపీఐ నేత డి.రాజా, తృణమూల్ ఎంపీ డెరెక్ ఒబ్రెయిన్, జేడీఎస్ ప్రధాన కార్యదర్శి డానిష్ అలీ, ఫార్వర్డ్‌బ్లాక్, ఐయూ ఎంపీలు సమావేశమయ్యారు. పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. అంతకుముందు పార్లమెంటులో రాజ్యసభలో విపక్ష నేత గులాంనబీ ఆజాద్ గదిలో 23 పార్టీల నేతలు వివిధ అంశాలపై చర్చించారు. భవిష్యత్తు కార్యాచరణ గురించి ఒక అభిప్రాయానికి వచ్చారు. అనంతరం శరద్‌పవార్ ఈ వివరాలను విలేకరులకు వెల్లడించారు. మిత్రపక్షాల సమావేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలపై దాడులు, కోల్‌కతాలో పరిణామాల గురించి చర్చించినట్లు తెలిపారు. నిర్దిష్టమైన కార్యాచరణను ఖరారు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి మద్దతు తెలిపారు. మంగళ, బుధవారాల్లో మళ్లీ అందరూ చర్చించుకొని కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

బెదిరిస్తే తిరుగుబాటే: చంద్రబాబు

బడ్జెట్ తర్వాత తాను కోల్‌కతా వెళ్లి మమతా బెనర్జీకి సంఘీభావం ప్రకటిస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఎలా ముందుకెళ్లాలన్న దానిపై ఒకట్రెండు రోజుల్లో కలిసి కూర్చొని నిర్ణయం తీసుకుంటామన్నారు. "ఎన్నికలు సమీపిస్తున్న వేళ పదేళ్ల కిందటి కేసులను తీసుకుని, ప్రతి ఒక్కరికీ నోటీసులిచ్చి అరెస్టు వారెంటులతో బెదిరిస్తున్నారు. ఇది తప్పుడు విధానం. ఎక్కడికక్కడ తిరుగుబాటుచేస్తే తప్ప వీరు నియంత్రణలోకిరారు. భయభ్రాంతులకు గురిచేస్తే ఎవ్వరూ భయపడరు" అని చంద్రబాబు ఆవేశంగా అన్నారు.

చౌహాన్‌ను ఎందుకు ఉపేక్షించారు?: కేజ్రీవాల్

సీఎం కేజ్రీవాల్ మాట్లాడుతూ- ప్రస్తుతం కోల్‌కతాలో జరుగుతున్న ఘటనలు దిల్లీలో నాలుగేళ్లుగా జరుగుతున్నవేనని అన్నారు. "అందరం మమతకు మద్దతిస్తున్నాం. వ్యాపం కుంభకోణంలో చిక్కుకున్న మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌పై సీబీఐ ఎన్నిసార్లు దాడులు చేసింది? రఫేల్‌పై ఎందుకు విచారణ చేయలేదు?" అని నిలదీశారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టే వారికే మద్దతు: ఆర్.కృష్ణయ్య

బషీర్‌బాగ్, న్యూస్‌టుడే: అగ్ర కులాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఒక్క రోజులోనే బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం అనేక ఏళ్లుగా ఉద్యమిస్తున్నా బీసీలను మాత్రం విస్మరిస్తోందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలోనే బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిల్లు ప్రవేశపెట్టే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో కృష్ణయ్య విలేకరులతో మాట్లాడారు. చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ నిర్వహించిన 'చలో దిల్లీ' కార్యక్రమం సందర్భంగా 36 రాజకీయ పార్టీలను కలిశామని, అన్ని పార్టీలు దీనికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయని గుర్తు చేశారు. కేంద్రం రూ.28 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టినప్పటికీ బీసీలకు మాత్రం కేవలం రూ.వెయ్యి కోట్లే కేటాయించిందని విమర్శించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

తూ.గో.లో చిరుత బీభత్సం

- నలుగురు వ్యక్తులపై దాడి
- ప్రజల దాడితో కొబ్బరి చెట్టు ఎక్కిన వైనం



రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెంలో ఓ చిరుత పులి సోమవారం సాయంత్రం బీభత్సం సృష్టించింది. ఆ గ్రామానికి చెందిన రైతు మెర్ల సూరిబాబు తన పొలంలో పురుగు మందు చల్లుతుండగా చిరుత పులి కనిపించింది. దీంతో అతను భయంతో పరుగులు తీశాడు. ఈ సమాచారం బయటకు పొక్కడంతో గ్రామస్థులు పెద్దఎత్తున అక్కడకు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో నలుగురు వ్యక్తులపై చిరుత దాడిచేసింది. వారికి రక్తపు గాయాలయ్యాయి. చివరకు ప్రజలు కర్రలతో దాడికి దిగడంతో భయంతో ఆ చిరుత మామిడి చెట్టు ఎక్కింది. దానిపై నుంచి నెమ్మదిగా చెంతనున్న కొబ్బరి చెట్టుపైకి ఎక్కి రాత్రి వరకు కిందకు దిగకుండా ఉండిపోయింది. అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.





హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో నటుడు తారకరత్న భాగస్వామిగా ఉన్న 'డౌన్ టౌన్ డ్రైవ్ ఇన్' వ్యాపార సముదాయాన్ని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది ★ పోలీసు అధికారులతో మాట్లాడుతున్న తారకరత్న

వ్యాపార సముదాయం కూల్చివేత

- బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో ఉద్రిక్తత
- 'డౌన్‌టౌన్ డ్రైవ్ ఇన్'కు భాగస్వామిగా ఉన్న నటుడు తారకరత్న

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: అనుమతులు లేకుండా నివాస ప్రాంతాల మధ్య ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాన్ని హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కూల్చివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. బంజారాహిల్స్ రోడ్ నం.12లోని ఎమ్మెల్యే కాలనీలో 'డౌన్ టౌన్ డ్రైవ్ ఇన్' పేరుతో పలు దుకాణాలు ఒకేచోట కొలువుదీరి ఉన్నాయి. దీనికి సినీ నటుడు తారకరత్న భాగస్వామిగా ఉన్నారు. ఈ వ్యాపార సముదాయం వల్ల తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు పలుమార్లు జీహెచ్ఎంసీ, పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ మద్యం సరఫరా చేస్తున్నారని, అర్ధరాత్రి వేళ శబ్దాలు వస్తున్నాయని, నివాస ప్రాంతాల్లో రాత్రి వేళ అలజడి సృష్టిస్తున్నారని ఫిర్యాదులు చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది ఏసీపీ కృష్ణకుమారి నేతృత్వంలో అక్కడకు చేరుకుని అక్రమంగా ఏర్పాటుచేసిన డౌన్ టౌన్ డ్రైవ్ ఇన్‌ను ఖాళీ చేయాలని సూచించారు. రెస్టారెంట్లు, ఐస్‌క్రీమ్ పార్లర్లలోని సామాన్లను బయటకు తీసుకొచ్చారు. పక్కన ఉన్న కొన్ని నిర్మాణాలను కూల్చివేసేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో డౌన్‌టౌన్ డ్రైవ్ ఇన్‌లో తాను భాగస్వామినంటూ సినీ నటుడు తారకరత్న కొందరు యువకులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. కూల్చివేతకు పాల్పడుతున్న అధికారులు, సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పనులు నిలిపివేయాలంటూ అడ్డుకున్నారు. వారికితోడు మరికొందరు వ్యాపారులు మద్దతుగా నిలిచి ఆందోళనను ఉధృతం చేయడంతో బంజారాహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి వారిని దూరంగా పంపారు. డౌన్‌టౌన్ డ్రైవ్ ఇన్‌లోని కొంత భాగాన్ని కూల్చివేశారు. స్టీల్ కట్టడాన్ని సీజ్ చేశారు. మిగిలిన నిర్మాణాలను తాము తొలగించుకుంటామని నిర్వాహకులు చెప్పడంతో అధికారులు, సిబ్బంది వెనుదిరిగారు.

'సీసీఎల్ఏలో పాలనపై దృష్టి సారించండి'

ఈనాడు, హైదరాబాద్: భూ పరిపాలన ప్రధాన కమిషనర్(సీసీఎల్ఏ) కార్యాలయంలో పాలనాసంబంధ అంశాలపరంగా నిర్లక్ష్యంపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని సంబంధిత టీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు నజీబ్‌ఖాన్, కార్యదర్శి సురేష్‌కుమార్ కోరారు. రెవెన్యూశాఖకు ప్రధాన కార్యాలయమైన సీసీఎల్ఏలో నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటీ కలెక్టర్ నుంచి దిగువ స్థాయి సిబ్బంది నియామకాల వరకు పలు పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయని సోమవారం ప్రకటనలో వారు తెలిపారు. పలు జిల్లాల నుంచి అదనపు విధులపై వచ్చి ఇక్కడ పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించడం లేదన్నారు. డిప్యుటేషన్లు, పదోన్నతుల జాబితాల తయారీ, రాష్ట్ర విభజన అనంతరం నియామకాల విషయంలోనూ నిబంధనలు పాటించడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే అనేకసార్లు ఈ విషయమై సీసీఎల్ఏతో పాటు ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ప్రభుత్వం దృష్టిసారించి, విచారణ నిర్వహించి, బాధ్యులపై చర్యలు చేపట్టకుంటే త్వరలోనే పోరాటానికి సిద్ధమవుతామని ప్రకటించారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92,
Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00